సత్యమేవ జయతే
సాక్షి
WWW.SAKSHI.COM
పేజీలు: 14 వెల: ₹ 6.50
సంపుటి: 15
సంచిక: 219
సోమవారం 24-4-2023
SIMULTANEOUSLY PRINTED AT CHENNAI | DELHI | VIJAYAWADA | BANGALORE | HYDERABAD | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VISAKHAPATNAM | WARANGAL


'జాతికి జల సౌభాగ్యం కల్పించిన రోజే నాకు అసలైన పండగ రోజు'


ధీరజ్ గురి అదిరె..
ప్రపంచకప్ ఆర్చరీ టోర్నీలో రెండు పతకాలు నెగ్గిన ఏపీ ప్లేయర్ - 12లో


రిటర్నులు సరే.. ఆ తర్వాత?
ఐటీ రిటర్నుల దాఖలు తర్వాత చేయాల్సిన పనులపై కథనం - 13లో


ఎట్టకేలకు అమృత్‌పాల్ అరెస్ట్
ఖలిస్తాన్ నాయకుడు అమృత్‌పాల్ ఎట్టకేలకు పంజాబ్ పోలీసులకు చిక్కాడు. ఖలిస్తాన్ ఉగ్రవాది జర్నైల్‌సింగ్ బింద్రన్‌వాలే స్వగ్రామమైన రోడేలో అమృత్‌పాల్‌ను అరెస్టు చేశారు.
వివరాలు 6లో ▸



నేడు కేరళకు ప్రధాని మోదీ
ప్రధాని మోదీ 2 రోజులపాటు కేరళలో పర్యటించనున్నారు. మరోవైపు ప్రధాని మోదీని చంపేస్తామంటూ బెదిరింపు లేఖ రాసిన వ్యక్తిని పోలీసులు అరెస్ట్ చేశారు.
వివరాలు 6లో ▸


అధికారంలోకి రాగానే ముస్లిం రిజర్వేషన్లు రద్దు
- వాటి ఫలాలు ఎస్సీ, ఎస్టీ, ఓబీసీలకు అందేలా చర్యలు
- తెలంగాణలోని చేవెళ్ల సభలో కేంద్ర హోం మంత్రి అమిత్‌షా
- మళ్లీ వస్తా.. ప్రతిదానికి లెక్కాపత్రం అడుగుతా
- హామీల అమలు ఏమైందని ప్రశ్నిస్తా.. టీఎస్‌పీఎస్సీ పేపర్ లీకేజీతో యువత జీవితం నాశనం

10 లో

'హౌస్' ఫుల్
ఏపీలో పేదల ఇళ్ల కోసం ఏకంగా 68,677 ఎకరాలు పంపిణీ
కేంద్ర హౌసింగ్-పట్టణ వ్యవహారాల శాఖ ప్రశంసలు
- దేశంలో ఇంత పెద్ద ఎత్తున మరే రాష్ట్రం లోనూ ఇళ్ల స్థలాలివ్వలేదు.. 30 లక్షలకు పైగా మహిళా లబ్ధిదారుల పేరుతో పట్టాలు
- ఇళ్ల నిర్మాణంలోనూ ఉత్తమ విధానాలు
- కొత్తగా 17,005 జగనన్న కాలనీలు
- ఇప్పటికే 21.25 లక్షలకు పైగా ఇళ్ల నిర్మాణం.. తద్వారా ఆర్థిక వ్యవస్థకు భారీ ప్రోత్సాహం
- కోవిడ్ అనంతర ఆర్థిక పునరుద్ధరణకు దోహదం.. తాపీ, వడ్రంగి వంటి 30 వృత్తిపర వర్గాలకు భారీగా ఉపాధి
- కాలనీల్లో మౌలిక వసతులకు పెద్ద పీట
- సబ్సిడీపై స్టీలు, సిమెంట్, ఉచితంగా ఇసుక
- ట్రాన్స్‌జెండర్లకు కూడా ఇళ్ల స్థలాలతో వివక్ష నుంచి విముక్తి

2 లో


బాపట్ల జిల్లా వెల్లటూరులోని జగనన్న కాలనీలో సిద్ధమైన ఇళ్లు

> దేశంలో ఏ రాష్ట్రంలో లేని విధంగా ఆంధ్రప్రదేశ్‌లో పేదలకు ఇళ్ల పట్టాల పంపిణీ జరిగింది. రాష్ట్ర ప్రభుత్వం చక్కటి ప్రణాళికతో ఇళ్ల నిర్మాణం చేపట్టింది. ఆయా కాలనీల్లో అవసరమైన రోడ్లు, కాలువలు, నీరు, విద్యుత్, ఇతర మౌలిక సదుపాయాల కల్పనపై ప్రత్యేకంగా దృష్టి సారించింది. లబ్ధిదారులకు ఎక్కడా ఇబ్బందులు తలెత్తకుండా ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ, సమీక్షిస్తూ ముందుకు సాగుతోంది.
> - కేంద్ర హౌసింగ్, పట్టణ వ్యవహారాల మంత్రిత్వ శాఖ

వర్షాలు.. పిడుగులు
- కృష్ణా, గుంటూరు జిల్లాల్లో ఆరుగురు మృతి
- ద్రోణి ప్రభావంతో వచ్చే 3 రోజులు కూడా వర్షాలు.. తగ్గిన ఉష్ణోగ్రతలు

- వివరాలు 3లో

27 ఉత్తమ పంచాయతీలకు రాష్ట్రస్థాయి అవార్డులు
- తొమ్మిది విభాగాల్లో మూడేసి పురస్కారాలు
- జాతీయ పంచాయతీరాజ్ దినోత్సవం సందర్భంగా నేడు పంపిణీ
- ప్రతి జిల్లాలోను 27 పంచాయతీలకు జిల్లాస్థాయి పురస్కారాలు

- వివరాలు 14లో

తప్పు ఒప్పుకున్నా ఇంకా సమర్థిస్తారా?
- రామోజీ నిర్వాకాలపై నిలదీసిన న్యాయ కోవిదులు, ప్రముఖులు
- డిపాజిట్‌దారుల ప్రయోజనాల పరిరక్షణే లక్ష్యంగా 'మార్గదర్శి'పై ప్రభుత్వం చర్యలు
- నాడు మార్గదర్శి ఫైనాన్సియర్స్ పేరిట అక్రమ డిపాజిట్లు
- నేడు మార్గదర్శి చిట్‌ఫండ్స్ ముసుగులో ఆర్థిక అక్రమాలు
- 60 ఏళ్లుగా ఎవరూ పట్టించుకోలేదు కాబట్టి ఇప్పుడూ అడగొద్దా?
- అవకతవకలను ప్రశ్నించడం కక్ష గట్టడమా?
- ఈనాడును అడ్డం పెట్టుకుని అక్రమాలకు పాల్పడుతుంటే చూస్తూ ఊరుకోవాలా?
- రామోజీ ఆగ్రహిస్తే ఏదో అయిపోతుందనే రోజులు పోయాయి
- మార్గదర్శి అక్రమాలు-నిజానిజాలపై విజయవాడలో సదస్సు

2 లో

55,000 వరకు నేషనల్ లెవల్
త్వరలో జేఈఈ మెయిన్ ర్యాంకులు విడుదల

అంతలోపు ర్యాంకు వస్తేనే జాతీయ స్థాయి ఇంజనీరింగ్ కాలేజీలో ప్రవేశం

ఈసారి దేశవ్యాప్తంగా 10 వేల సీట్లు పెరిగే అవకాశం



సాక్షి, హైదరాబాద్: జాతీయస్థాయి ఇంజనీరింగ్ కాలేజీల్లో ప్రవేశాలకు కోసం ఈ నెల 15 వరకు జరిగిన జేఈఈ మెయిన్ ఎంట్రన్స్ ఫలితాలు వెల్లడికానున్న నేపథ్యంలో తమకు ఏ ర్యాంకు వస్తుంది? ఎక్కడ, ఏ బ్రాంచీలో సీటు వస్తుందనే ఉత్సుకత విద్యార్థుల్లో నెలకొంది. గతేడాది జేఈఈ అంచనాలు, ఈసారి పేపర్ విధానాన్ని పరిశీలిస్తే జేఈఈ మెయిన్‌లో 55 వేల వరకు ర్యాంకు వచ్చిన వాళ్లకు కూడా జాతీయస్థాయి ఇంజనీరింగ్ కాలేజీల్లో ఏదో ఒక కోర్సులో, ఎక్కడో ఒకచోట సీటు ఖాయమని తెలుస్తోంది. ఈడబ్ల్యూఎస్‌కు 60 వేలు, ఓబీసీలకు 65 వేలు, ఎస్సీలకు 1.20 లక్షలు, ఎస్టీలకు 3 లక్షలు, పీడబ్ల్యూడీలకు 8 లక్షల ర్యాంకు వచ్చినా జాతీయ స్థాయి ఇంజనీరింగ్ కాలేజీల్లో సీటు పొందే వీలుంది. అయితే కంప్యూటర్ సైన్స్, నచ్చిన కాలేజీలో సీటు కోసం మాత్రం పోటీ ఎక్కువే ఉంటుందని నిపుణులు చెబుతున్నారు. వరంగల్, సూర్తాల్, తిరుచాపల్లి వంటి ఎన్‌ఐటీ కాలేజీల్లో సీటు రావాలంటే జేఈఈ మెయిన్‌లో 5 వేలలోపు ర్యాంకు వరకే ఆశలు పెట్టుకోవాలని సూచిస్తున్నారు.

30 నుంచి దరఖాస్తులకు అవకాశం
ఈ నెల 30 నుంచి జాతీయ ఇంజనీరింగ్ కాలేజీల్లో సీట్ల కోసం దరఖాస్తు చేసుకోవచ్చని, ఉమ్మడి ప్రవేశాల అథారిటీ (జోసా) కౌన్సెలింగ్ నిర్వహిస్తుందని నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ (ఎన్‌టీఏ) తెలిపింది. ఈసారి జేఈఈ మెయిన్ ప్రవేశపరీక్షను దేశవ్యాప్తంగా దాదాపు 10 లక్షల మంది రాశారు. వారిలో 2.5 లక్షల మంది జేఈఈ అడ్వాన్స్‌డ్‌కు అర్హత సాధించనున్నారు. జేఈఈ మెయిన్‌లో అర్హత సాధించిన వారు ఎన్‌ఐటీలు, ట్రిపుల్ ఐటీలు, కేంద్ర ప్రభుత్వ నిధులతో నడిచే కాలేజీలతోపాటు రాష్ట్ర ఇంజనీరింగ్ కాలేజీల్లో బీ-కేటగిరీ సీట్లలో ప్రాధాన్యం పొందుతారు. దేశవ్యాప్తంగా ఈసారి 10 వేల ఇంజనీరింగ్ సీట్లు పెరిగే వీలుంది. కొత్త కోర్సులకు అనుమతించడం, కొన్ని కాలేజీల్లో సీట్లు పెంచడమే దీనికి కారణం. ఐఐటీల్లో 16,053 సీట్లు, ఎన్‌ఐటీల్లో 24 వేలు, ట్రిపుల్ ఐటీల్లో 16 వేలు, కేంద్ర ప్రభుత్వ నిధులతో నడిచే సంస్థల్లో 6,078 సీట్లున్నాయి. గతేడాది పర్సంటైల్‌ను పరిశీలిస్తే జనరల్ కేటగిరీలో 88.41 పర్సంటైల్ వస్తే జేఈఈ అడ్వాన్స్‌డ్‌కు ఎంపికయ్యారు. ఓబీసీ ఎన్‌సీఎల్‌కు 67.00, ఈడబ్ల్యూఎస్‌కు 63.11, ఎస్సీలకు 43.08, ఎస్టీలకు 26.77, పీడబ్ల్యూడీలకు 0.003 పర్సంటైల్‌తో అడ్వాన్స్‌డ్ కటాఫ్ ఖరారైంది. ఈసారి కూడా పోటీని బట్టి కటాఫ్ గతేడాదికి కొంచెం అటుఇటుగా ఉండొచ్చని నిపుణులు అంచనా వేస్తున్నారు.

నిర్ణయాత్మక శక్తి ఏపీ మహిళ
- రాష్ట్రంలో 43.4 శాతం వారిదే నాయకత్వం
- దేశం మొత్తంలో అది 22.2 శాతమే
- సీనియర్ అధికారులు, మేనేజర్లు, ఎమ్మెల్యేలు వంటి నిర్ణయాత్మక పదవుల్లో ఏపీలో మహిళలదే హవా
- దేశ సగటుతో పాటు పెద్ద రాష్ట్రాల్లో కన్నా ఏపీలో వారిదే పైచేయి

10 లో

బాలుడి అవయవదానం.. ఇద్దరికి ప్రాణదానం
- టెన్త్ పరీక్ష చివరి రోజు విద్యార్థికి తలలోని నరాలు చిట్లిపోయి అస్వస్థత.. బతికే అవకాశాల్లేవని తేల్చి చెప్పిన వైద్యులు
- తమ బిడ్డ అవయవాలను దానం చేసిన తల్లిదండ్రులు
- శ్రీకాకుళం జిల్లాలో మొట్టమొదటి సారిగా ఆర్గాన్ డొనేషన్
- వాటితో ఓ చిన్నారికి గుండె మార్పిడి, మరో యువకుడికి కిడ్నీ, లివర్ మార్పిడి

2 లో

స్కిల్ కాలేజీలు ప్రారంభం

- 25 కాలేజీల్లో శిక్షణ తీసుకుంటున్న 1,118 మంది
- కోర్సు పూర్తికాగానే ఉపాధి లభించేలా కార్పొరేట్ సంస్థలతో ఒప్పందం

సాక్షి, అమరావతి: రాష్ట్రంలోని స్కిల్ కాలేజీల్లో శిక్షణ కార్యక్రమాలు ప్రారంభమయ్యాయి. విద్యార్థులకు ప్రపంచ స్థాయి నైపుణ్య శిక్షణ అందించడం ద్వారా స్థానిక కంపెనీల్లో ఉపాధి అవకాశాలను కల్పించడమే లక్ష్యంగా వీటిని ఏర్పాటు చేశారు. ప్రతి పార్లమెంట్ పరిధితో పాటు పులివెందులలో కలిపి మొత్తం 26 స్కిల్ కాలేజీలను ఏర్పాటు చేయాలని లక్ష్యంగా పెట్టుకోగా.. ఇప్పటి వరకు 25 అందుబాటులోకొచ్చినట్టు ఏపీ నైపుణ్యాభివృద్ధి సంస్థ అధికారులు వెల్లడించారు. మొత్తం 25 కాలేజీల్లో 56 కోర్సుల్లో 1,118 మంది విద్యార్థులు శిక్షణ తీసుకుంటున్నారు. తొలి దశలో విశాఖ సెమ్స్, గుంటూరు నాగార్జున విశ్వవిద్యాలయం, టీటీడీసీ శ్రీకాకుళం, టీటీడీసీ విజయనగరం, ఒంగోలు బొల్లినేని మెడిస్కిల్స్‌లో విద్యార్థులు శిక్షణ పూర్తి చేసుకున్నట్లు తెలిపారు. స్థానిక కంపెనీలకు ఉన్న డిమాండ్‌ను దృష్టిలో పెట్టుకుని ఒక్కో కాలేజీకి ఒక్కో కోర్సును డిజైన్ చేసినట్టు అధికారులు వెల్లడించారు. మొత్తం 13 రంగాలకు సంబంధించి 56 కోర్సులను డిజైన్ చేశారు. శిక్షణ పూర్తికాగానే ఉపాధి కల్పించేలా ఆయా సంస్థలతో ఒప్పందం కుదుర్చుకున్నారు. ఇప్పటికే 180 మంది విద్యార్థులు శిక్షణ పూర్తి చేసుకుంటే.. వారిలో 116 మందికి ఉపాధి లభించిందని, మిగతావారివి ఎంపిక దశలో ఉన్నట్లు తెలిపారు. ఎంపిక చేసిన విద్యార్థులకు పూర్తి ఉచితంగా నైపుణ్య శిక్షణ ఇస్తున్నారు. కోర్సును బట్టి విద్యార్థిపై సగటున కనిష్టంగా రూ.20,000 నుంచి గరిష్టంగా రూ.55,000 వరకు ప్రభుత్వం వ్యయం చేస్తోంది.

ఈనాడు రాతలు ఇంత దుర్మార్గమా!?

- కుటుంబ సమస్యలు, అనారోగ్యంతో చనిపోతే దుష్ప్రచారమా!?
- కాంట్రాక్టర్ కుటుంబ సభ్యుల మండిపాటు

కావలి: శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా కావలి రూరల్ మండలం గౌరవరం గ్రామానికి చెందిన సీహెచ్ జనార్ధనరెడ్డి (42) నెల్లూరులోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో అనారోగ్యంతో చికిత్స పొందుతూ శనివారం రాత్రి మరణించిన ఉదంతంపై ఈనాడు వక్రభాష్యం ఇస్తూ దుష్ప్రచారం చేయడంపై మృతుని కుటుంబ సభ్యులు తీవ్ర అభ్యంతరం వ్యక్తంచేశారు. కుటుంబ, ఆరోగ్యపరమైన సమస్యలు ఈ ఘటనకు కారణమైతే ఈనాడు పత్రిక మాత్రం ప్రభుత్వం నుంచి బిల్లులు రాక అతను ఆత్మహత్య చేసుకున్నాడని ప్రచురించడం ఏమిటని వారు ప్రశ్నిస్తున్నారు. ఘటనకు సంబంధించి కుటుంబ సభ్యులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. జనార్ధనరెడ్డి గ్రామంలో సచివాలయన్ని నిర్మించాడు. దాని తాలూకా రూ.27 లక్షలు అతనికి ప్రభుత్వం చెల్లించేసింది. ఇంకా రూ.6 లక్షలు మాత్రమే బకాయి ఉంది. అయితే, అతనికి మద్యం తాగే అలవాటు ఉంది. భార్య దూరమైంది. పైగా అతనికి ఆరోగ్యపరమైన సమస్యలున్నాయి. ఈ నేపథ్యంలో.. తండ్రితోపాటు ఉంటున్న జనార్ధనరెడ్డి ఈనెల 16వ తేదీన మద్యం తాగి ఇంటికి రాగా తండ్రి మందలించాడు. దీంతో మేడపై ఉన్న తన గదిలోకి వెళ్లి పురుగుమందు తాగి బయటకు వెళ్లాడు. అతను పురుగుమందు తాగినట్లు గ్రామస్తులు కుటుంబసభ్యులకు చెప్పడంతో వారు హుటాహుటిన కావలిలోని ఒక ఆస్పత్రికి తరలించారు. రెండ్రోజులు ఆస్పత్రిలో ఉండి ఇంటికొచ్చిన జనార్ధనరెడ్డికి చాలా ఏళ్లుగా ఉన్న ఇతర ఆరోగ్య సమస్యలు ఒక్కసారిగా తీవ్రమయ్యాయి. దీంతో అతనిని నెల్లూరులోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తీసుకెళ్లి చికిత్స అందించినప్పటికీ జనార్ధన్‌రెడ్డి శనివారం మరణించాడు. వాస్తవం ఇలాగుంటే.. 'ఈనాడు' మాత్రం సచివాలయం భవనం బిల్లులు రాకపోవడంతో మథనపడుతూ పురుగు మందు తాగినట్లుగా రాయడంపై మృతుడి కుటుంబసభ్యులు, గ్రామస్తులు మండిపడుతున్నారు. జరుగుబాటు లేని కుటుంబంగా తమని చూపెట్టి.. బిల్లులు ఇస్తేనే బతికే దుస్థితిలో ఉన్నట్లుగా దిగజారుడు రాతలు రాయడం దుర్మార్గమని వారు ఆగ్రహం వ్యక్తంచేశారు.

నేడు గుంటూరులో బీజేపీ రాష్ట్ర స్థాయి సమావేశం

సాక్షి, అమరావతి: బీజేపీ రాష్ట్ర స్థాయి సమావేశం సోమవారం గుంటూరులో నిర్వహించనున్నారు. రాష్ట్ర అధ్యక్షుడు సోము వీర్రాజు అధ్యక్షతన జరిగే ఈ సమావేశానికి ఆ పార్టీ జాతీయ సంస్థాగత సహ ప్రధాన కార్యదర్శి శివప్రకాష్ ముఖ్య అతిథిగా హాజరుకానున్నారు. పార్టీ రాష్ట్ర పదాధికారులు, జిల్లా అధ్యక్షులు, జిల్లాల ఇన్‌చార్జిలు, అసెంబ్లీ నియోజకవర్గ కన్వీనర్లు తదితరులు పాల్గొంటారని పార్టీ వర్గాలు తెలిపాయి.

బాలుడి అవయవదానం..

ఇద్దరికి ప్రాణదానం

- టెన్త్ పరీక్షల చివరి రోజు విద్యార్థికి తలలోని నరాలు చిట్లిపోయి అస్వస్థత
- బతికే అవకాశాల్లేవని తేల్చి చెప్పిన వైద్యులు
- తమ బిడ్డ అవయవాలను దానం చేసిన తల్లిదండ్రులు
- శ్రీకాకుళం జిల్లాలో తొలిసారిగా ఆర్గాన్ డొనేషన్
- వాటితో ఓ చిన్నారికి గుండె మార్పిడి, మరో యువకుడికి కిడ్నీ, లివర్ మార్పిడి



బాలుడి అవయవాలను తరలిస్తున్న దృశ్యం

శ్రీకాకుళం రూరల్/అక్కిరెడ్డిపాలెం/తిరుపతి తుడా(తిరుపతి జిల్లా)/గోపాలపట్నం(విశాఖ పశ్చిమ): శ్రీకాకుళం జిల్లాలో మొట్టమొదటిసారిగా ఓ బ్రెయిన్ డెడ్ విద్యార్థి నుంచి అవయవాలు సేకరించారు. జిల్లా కేంద్రంలోని రాగోలు జెమ్స్ ఆస్పత్రిలో అవయవదానం కార్యక్రమం ఆదివారం జరిగింది. సోంపేట మండలం గీతామందిర్ కాలనీకి చెందిన విద్యార్థి మళ్లారెడ్డి కిరణ్‌చంద్(16)కు బ్రెయిన్ డెడ్ కావడంతో మెదడులోని నరాలు చిట్లి అపస్మారక స్థితికి వెళ్లిపోయాడు. విద్యార్థి తల్లిదండ్రులు మోహన్, గిరిజాకల్యాణిల అంగీకారంతో అవయవాలు సేకరించారు. కిరణ్‌చంద్ ఈ నెలలో పదో తరగతి పరీక్షలకు హాజరయ్యాడు. చివరి పరీక్ష ముందు రోజు రాత్రి తీవ్ర జ్వరం, తలనొప్పితో మంచానపడ్డాడు. వెంటనే తల్లిదండ్రులు స్థానికంగా ఉన్న ఓ ప్రైవేటు ఆస్పత్రికి తీసుకెళ్లారు. అక్కడ సీటీ స్కాన్ చేసిన వైద్యులు మెదడులోని నరాలు ఉబ్బినట్లు గుర్తించారు. వెంటనే విశాఖలోని ప్రైవేటు ఆస్పత్రికి తీసుకెళ్లారు. అయితే కిరణ్‌చంద్ మెదడులోని నరాలు చిట్లిపోయాయని, ఎక్కడకు తీసుకెళ్లిన బతికే అవకాశాలు చాలా తక్కువని వైద్యులు తేల్చి చెప్పేశారు. దీంతో కిరణ్‌చంద్ తల్లిదండ్రులు శ్రీకాకుళంలోని రాగోలు జెమ్స్ ఆస్పత్రికి వారం రోజుల కిందట తమ కుమారుడిని తీసుకొచ్చారు. మోహన్, గిరిజాకల్యాణి దంపతులకు కిరణ్ ఒక్కడే కుమారుడు. అలాంటిది బిడ్డకు ఈ పరిస్థితి రావడంతో వారు చూసి తట్టుకోలేకపోయారు.



కిరణ్‌చంద్ (ఫైల్), తల్లిదండ్రులు

యువకుడికి కిడ్నీ, లివర్

కిరణ్‌చంద్ అవయవాలను గ్రీన్ చానల్ ద్వారా అంబులెన్స్‌లో విశాఖకు చేర్చారు. ఎయిర్‌పోర్టుకు సాయంత్రం 4.20 గంటలకు చేరుకోగా.. వెంటనే విశాఖలోని కిమ్స్ ఐకాన్ ఆస్పత్రిలోని ఓ యువకుడికి కిడ్నీ, లివర్‌ను అమర్చి ప్రాణం పోశారు.

ఏపీ జీవన్‌దాన్ సంస్థ ఆధ్వర్యంలో అవయవాలు దానం చేయొచ్చని, అవి వేరే వారికి ఉపయోగపడతాయని తెలుసుకున్నారు. గుండె, కిడ్నీలు, లివర్, కళ్లను మరో ఐదుగురికి అందిస్తే వారిలో తమ కుమారుడిని సజీవంగా చూసుకుంటామని వైద్యులకు చెప్పడంతో.. ఆదివారం రాగోలు జెమ్స్ ఆస్పత్రి వైద్యులంతా కలిసి అవయవాల తరలింపునకు శ్రీకారం చుట్టారు. గ్రీన్ చానెల్ ఏర్పాటు చేసి ఒక పైలెట్, ఎస్కార్ట్ ద్వారా అవయవాల తరలింపునకు జెమ్స్ ఆస్పత్రి వైద్యులు ఏర్పాట్లు చేశారు. గుండె, కిడ్నీలు, లివర్, కళ్లను ఆపరేషన్ చేసి తీశాక, ముందుగా గుండెను తిరుపతిలోని పద్మావతి ఆస్పత్రికి తరలించారు. మిగిలిన అవయవాలను విశాఖలోని ఇతరత్రా ఆస్పత్రులకు పంపిస్తామని జెమ్స్ సూపరింటెండెంట్ శ్రీనివాస్ చెప్పారు.

దిగ్విజయంగా చిన్నారికి గుండె మార్పిడి




విశాఖ నుంచి తిరుపతికి గుండెను తీసుకొచ్చిన వైద్య బృందం

వైద్య రంగంలో మరో అరుదైన ఘటన చోటుచేసుకుంది. ఐదేళ్ల బాలికకు తిరుపతి శ్రీ పద్మావతి కార్డియాక్ కేర్ సెంటర్‌లోని వైద్యులు గుండె మార్పిడిని విజయవంతంగా పూర్తిచేశారు. నాలుగు నెలల వ్యవధిలోనే ఆస్పత్రిలో వరుసగా ముగ్గురికి గుండె మార్పిడి చికిత్సను నిర్వహించారు. కిరణ్‌చంద్ నుంచి గుండెను వేరుచేసి గ్రీన్ చానల్ ద్వారా విశాఖ విమానాశ్రయానికి, అక్కడి నుంచి విమానంలో రేణిగుంట విమానాశ్రయానికి తీసుకొచ్చారు. అక్కడి నుంచి 27 నిమిషాల్లో శ్రీపద్మావతి కార్డియాక్ కేర్ సెంటర్‌కు ప్రత్యేక అంబులెన్స్ ద్వారా తరలించారు. ఆస్పత్రి డైరెక్టర్ డాక్టర్ శ్రీనాథ్‌రెడ్డి, డాక్టర్ గణపతి బృందం ఐదేళ్ల చిన్నారికి గుండె మార్పిడి చికిత్సను విజయవంతంగా నిర్వహించారు. సుమారు నాలుగు గంటల పాటు శ్రమించి బాలికకు గుండెను అమర్చారు. తిరుపతి జిల్లా, తడ మండలం, రామాపురంలో నివసిస్తున్న అన్నరసు, గోమతి దంపతులకు ఇద్దరు పిల్లలు. మొదట జన్మించిన చిన్నారి రీతిశ్రీ పుట్టుకతోనే గుండె బలహీనతతో జన్మించింది. వైద్య పరీక్షలు నిర్వహించి గుండె మార్పిడి అనివార్యమని వైద్యులు నిర్ధారించారు. చెన్నై ఎగ్మోర్ ఆస్పత్రిలో సంప్రదించగా, కొన్ని రోజుల చికిత్స అనంతరం తిరుపతిలోని టీటీడీ శ్రీ పద్మావతి కార్డియాక్ కేర్ సెంటర్‌కు వెళ్లాలని వైద్యులు సూచించడంతో నాలుగు నెలల కిందట ఇక్కడ చేరారు.

వేగంగా స్పందించిన సీఎంవో కార్యాలయం

గుండె మార్పిడి అనివార్యం కావడంతో రీతిశ్రీ తల్లిదండ్రులు ఇటీవల సీఎంవో కార్యాలయంలో సీఎస్ జవహర్‌రెడ్డిని కలిశారు. తమ బిడ్డ పరిస్థితిని, మెడికల్ రిపోర్టులను అందజేశారు. పరిశీలించిన ప్రత్యేక ప్రధాన కార్యదర్శి.. గంటల వ్యవధిలోనే ఆరోగ్యశ్రీ నుంచి రూ.10 లక్షలు మంజూరు చేయించారు. గుండె మార్పిడి చికిత్సకు రూ.20 లక్షలు ఖర్చవుతుండటంతో మరో రూ.10 లక్షలను టీటీడీ సమకూర్చింది. మొత్తం రూ.20 లక్షలతో చిన్నారి కుటుంబానికి ఎలాంటి ఖర్చు లేకుండా ఉచితంగానే ఖరీదైన వైద్యాన్ని అందించారు. ఆరోగ్యశ్రీనే తమ బిడ్డను కాపాడిందని, సీఎం జగనన్నకు తాము రుణపడి ఉంటామని రీతిశ్రీ తల్లిదండ్రులు అన్నరసు, గోమతిలు కన్నీళ్లపర్యంతమయ్యారు.

'హౌస్' ఫుల్



- పేదల ఇళ్ల కోసం ఏకంగా 68,677 ఎకరాలు పంపిణీ
- కేంద్ర హౌసింగ్ – పట్టణ వ్యవహారాల మంత్రిత్వ శాఖ ప్రశంసలు

సాక్షి, అమరావతి: పేదలకు పక్కా ఇళ్లు నిర్మించేందుకు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం విశేషంగా కృషి చేస్తోందని కేంద్ర గృహ నిర్మాణ–పట్టణ వ్యవహారాల మంత్రిత్వ శాఖ ప్రశంసించింది. ఇందులో భాగంగా రాష్ట్ర వ్యాప్తంగా అర్హులైన 30 లక్షల మందికిపైగా పేదలకు ఇళ్ల స్థలాల కోసం ప్రభుత్వ, ప్రైవేట్ భూములను సేకరించి.. ఏకంగా 68,677 ఎకరాలు పంపిణీ చేసిందని కొనియాడింది. ఇళ్ల స్థలాల పట్టాలన్నీ మహిళల పేరుపై మంజూరు చేయడం ద్వారా వారి సాధికారతకు తోడ్పడుతోందని మెచ్చుకుంది. అర్హులైన పేదలందరికీ ఇళ్ల స్థలాలు పంపిణీ చేయాలన్న బృహత్తర లక్ష్య సాధన కోసం ప్రత్యేక డ్రైవ్ చేపట్టి, విజయవంతంగా పూర్తి చేసిందని తెలిపింది. దేశంలోని మరే ఇతర రాష్ట్రాల్లోనూ ఇంత పెద్ద ఎత్తున పేదలకు ఇళ్ల స్థలాల పంపిణీ జరగలేదని, వారందరికీ ఇళ్ల నిర్మాణం కోసం కొత్తగా ఏకంగా 17,005 జగనన్న కాలనీలను నిర్మిస్తోందని వివరించింది. దేశంలోని ఉత్తరప్రదేశ్, మధ్యప్రదేశ్, ఆంధ్రప్రదేశ్, కేరళ, జార్ఖండ్, ఒడిశా, ఛత్తీస్‌గఢ్, గుజరాత్, తమిళనాడు రాష్ట్రాల్లో 'సరసమైన గృహాలు–ఉత్తమ పద్ధతులు' అంశంపై అధ్యయనం చేసిన కేంద్ర గృహ నిర్మాణ – పట్టణ వ్యవహారాల మంత్రిత్వ శాఖ.. ఇటీవల నివేదికను విడుదల చేసింది. దీనిని హౌసింగ్– పట్టణ వ్యవహారాల మంత్రిత్వ శాఖకు చెందిన హౌసింగ్ మిషన్ డైరెక్టరేట్ ఇతర రాష్ట్రాలకు అందజేసింది. ఆంధ్రప్రదేశ్‌లో గృహ నిర్మాణ కార్యక్రమాలకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల పథకాలను అనుసంధానం చేసి, లబ్ధిదారులకు ప్రయోజనాలు అందిస్తోందని ఆ నివేదికలో పేర్కొంది. ప్రధాన మంత్రి ఉజ్వల యోజనతో గృహాలకు ఎల్‌పీజీని, ప్రధానమంత్రి సహజ బిజిలీ హర్ ఘర్ యోజన కింద విద్యుత్, జలజీవన్ మిషన్ కింద తాగునీరు, జన్ ధన్ యోజన కింద బ్యాంకు ఖాతాలు ప్రారంభించడం ద్వారా రాష్ట్ర ప్రభుత్వం లబ్ధిదారులకు అండగా నిలిచిందని వెల్లడించింది. వీటితో పాటు మహిళా సాధికారతలో భాగంగా అమ్మ ఒడి కార్యక్రమం ద్వారా ఆర్థిక సాయం చేస్తూ.. పిల్లలను చదివించేందుకు తల్లులకు అధికారం కల్పించే పథకాన్ని అమలు చేస్తోందని కేంద్ర మంత్రిత్వ శాఖ తెలిపింది. ఆ నివేదికలో ఇంకా ఏముందంటే..

భారీ ఉపాధి, ఆర్థిక ప్రగతికి దోహదం

- రెండు దశల్లో 30 లక్షలకు పైగా ఇళ్ల నిర్మాణాలు చేపట్టడంలో భాగంగా రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికే తొలి దశలో 15 లక్షలకు పైగా (ప్రస్తుతం టిడ్కో ఇళ్లతో కలిపి 21.25 లక్షలకు పైగా) ఇళ్ల నిర్మాణాలు చేపట్టింది. ఇంత పెద్ద ఎత్తున గృహాల నిర్మాణంతో ఆర్థిక వ్యవస్థకు భారీ ప్రోత్సాహం ఇస్తోంది.
- తాపీ పని, వడ్రంగి వంటి 30 వృత్తిపరమైన వర్గాలకు చెందిన వ్యక్తులకు భారీగా ఉపాధి కలుగుతుంది. ప్లంబింగ్, ఇతర తక్కువ ఆదాయ వర్గాలు, రోజువారీ వేతనాలు, అనధికారిక రంగ వలస కార్మికులకు ఉపాధి లభిస్తుంది.

ఉత్తమ విధానాలతో నిర్మాణంలో వేగం

- ఇళ్ల నిర్మాణం వేగంగా సాగడానికి ఏపీ ప్రభుత్వం ఉత్తమ విధానాలను అమలు చేస్తోంది. అర్హులైన లబ్ధిదారులందరికీ సబ్సిడీ ధరలపై స్టీలు, సిమెంట్‌ను సరఫరా చేయడంతో పాటు ఇసుకను ఉచితంగా అందజేస్తోంది.
- బ్యాంకులతో లబ్ధిదారులను అనుసంధానం చేయడం ద్వారా వారికి ఆర్థిక వెసులుబాటు కల్పించింది. పట్టణ ప్రాంతాల్లో 1 సెంటు, గ్రామీణ ప్రాంతాల్లో 1.5 సెంట్లు ఇచ్చేలా జగనన్న కాలనీల లే–అవుట్‌లను రూపొందించింది.
- ఇళ్ల లబ్ధిదారులకు అవసరమైన నాణ్యమైన గృహోపకరణాలను తయారీ దారుల నుంచి రాష్ట్ర ప్రభుత్వమే రివర్స్ టెండరింగ్ ద్వారా మార్కెట్ ధర కంటే తక్కువ ధరకు అందిస్తోంది. స్థానిక ప్రజాప్రతినిధుల నుంచి ఇళ్ల నిర్మాణాలకు పూర్తి సహకారం ఉండటంతో ఏపీలో ఇళ్ల నిర్మాణాలు వేగంగా సాగుతున్నాయి.

తాటి ఆకుల గుడిసెల్లో ఉండే వారికి పక్కా ఇళ్లు

- గుంటూరు జిల్లా భట్టిప్రోలు మండలం వెల్లటూరు పంచాయతీ ఎస్సీ, ఎస్టీ కాలనీలో 111 మందికి రాష్ట్ర ప్రభుత్వం పక్కా ఇళ్లు మంజూరు చేసింది. వీరందరూ మట్టి, వెదురు కర్రలు, తాటి ఆకులతో రూపొందించిన గుడిసె తరహా ఇళ్లలో నివసించే వారు. వారికి ఇళ్లు మంజూరు చేయడంతో కొత్త ఇంటి స్థలంలో ఇళ్లు నిర్మిస్తున్నారు.
- ఇళ్ల నిర్మాణ పనుల కోసం స్థానిక పంచాయతీ 15 నీటి కనెక్షన్లు ఇచ్చింది. కొత్త ఇళ్ల నిర్మాణం పూర్తయ్యాక శాశ్వత విద్యుత్ కనెక్షన్లతో పాటు వీధి లైట్ల ఏర్పాటుకు సర్వం సిద్ధం చేశారు.
- నెల్లూరు మున్సిపల్ కార్పొరేషన్‌లో తొలి దశలో 27,888 నివాస యూనిట్లు చేపట్టారు. ఇందులో వెంకటేశ్వరపురంలో 4,800 యూనిట్లు పూర్తయ్యాయి. 3,000 యూనిట్లను లబ్ధిదారులకు అందజేశారు. రెండవ దశ కింద 18,864 యూనిట్లతో 70 శాతం పూర్తయ్యాయి. కనీస మౌలిక సదుపాయాల పనులు ప్రారంభించారు. మూడవ దశ కింద 5,464 యూనిట్లు నిర్మిస్తున్నారు.

ట్రాన్స్‌జెండర్లకు కూడా ఇళ్లు

- చిత్తూరు నగరంలో వీధి వ్యాపారాలు చేస్తున్న 17 మంది ట్రాన్స్‌జెండర్లకు గృహాలను మంజూరు చేసింది. తద్వారా వారి సామాజిక, ఆర్థిక స్థితిగతుల్లో ఇబ్బందిని అధిగమించేలా చేసి.. వివక్ష నుంచి విముక్తి కలిగించింది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సహకారంతో అన్ని సౌకర్యాలతో వారు సొంత ఇళ్లు నిర్మించుకుంటున్నారు.
- సొంత ఇంటి రూపంలో ఆస్తి సమకూరడంతో స్వయం సహాయక సంఘాల్లోని సభ్యులు మరింత మెరుగైన జీవనోపాధి పొందేందుకు అవకాశం లభించింది. వీరిలో కొందరు ప్రభుత్వ సహాయంతో చిన్న చిన్న దుకాణాలు, టైలరింగ్ నిర్వహిస్తున్నారు.

తప్పు ఒప్పుకున్నా ఇంకా సమర్థిస్తారా?

రామోజీ నిర్వాకాలపై నిలదీసిన న్యాయ కోవిదులు, ప్రముఖులు

- డిపాజిట్‌దారుల ప్రయోజనాల పరిరక్షణే లక్ష్యంగా 'మార్గదర్శి'పై ప్రభుత్వం చర్యలు
- నాడు మార్గదర్శి ఫైనాన్సియర్స్ పేరిట అక్రమ డిపాజిట్లు
- నేడు మార్గదర్శి చిట్‌ఫండ్స్ ముసుగులో ఆర్థిక అక్రమాలు
- 60 ఏళ్లుగా ఎవరూ పట్టించుకోలేదు కాబట్టి ఇప్పుడూ అడగొద్దా?
- అవకతవకలను ప్రశ్నించడం కక్ష గట్టడమా?
- ఈనాడును అడ్డం పెట్టుకుని అక్రమాలకు పాల్పడుతుంటే చూస్తూ ఊరుకోవాలా?.. రామోజీ ఆగ్రహిస్తే ఏదో అయిపోతుందనే రోజులు పోయాయి
- మార్గదర్శి అక్రమాలు – నిజానిజాలపై విజయవాడలో స్వర్ణాంధ్ర పత్రిక సదస్సు



మాట్లాడుతున్న ఉండవల్లి

సాక్షి, అమరావతి: మార్గదర్శి సంస్థ వ్యవహారాల విషయంలో చట్టాన్ని ఉల్లంఘించినట్లు విచారణలో రామోజీరావే అంగీకరించాక కొందరు ఇంకా ఆయన్ను సమర్థించేందుకు ప్రయత్నించడం అసంబద్ధమని న్యాయ నిపుణులు స్పష్టం చేశారు. మార్గదర్శి చిట్‌ఫండ్స్ సంస్థ చట్ట విరుద్ధంగా చందాదారుల సొమ్మును జాతీయ బ్యాంకుల్లో కాకుండా తమ అనుబంధ సంస్థలు, ఇతర చోట్ల పెట్టుబడిగా పెట్టినట్లు రామోజీనే అంగీకరించిన విషయాన్ని గుర్తు చేస్తున్నారు. ఈనాడు పత్రికను అడ్డం పెట్టుకుని మార్గదర్శి ఫైనాన్సియర్స్, మార్గదర్శి చిట్‌ఫండ్స్ పేరుతో అక్రమాలకు పాల్పడుతుంటే చట్టం కళ్లు మూసుకుని చూస్తూ ఊరుకోదని తేల్చి చెబుతున్నారు. మార్గదర్శి మరో అగ్రిగోల్డ్ కాకముందే డిపాజిట్‌దారులు, చందాదారుల ప్రయోజనాల పరిరక్షణే ధ్యేయంగా రాష్ట్ర ప్రభుత్వం సకాలంలో స్పందించి చర్యలు తీసుకుందని పేర్కొంటున్నారు. 'రామోజీరావు మార్గదర్శి అక్రమాలు – నిజానిజాలు' అనే అంశంపై ఆదివారం విజయవాడలో స్వర్ణాంధ్ర పత్రిక నిర్వహించిన సదస్సులో పలువురు ప్రముఖులు, న్యాయ కోవిదులు పాల్గొని మాట్లాడారు.

ఉపేక్షిస్తే మాఫియా సామ్రాజ్యమే

– మాజీ ఎంపీ ఉండవల్లి

రామోజీరావు ఆగ్రహిస్తేనో, ఈనాడు పత్రికల్లో వ్యతిరేకంగా రాస్తేనో ఏదో జరిగిపోయే రోజులు పోయాయని మాజీ ఎంపీ ఉండవల్లి అరుణ్‌కుమార్ పేర్కొన్నారు. గతంలో రాజమండ్రిలో తనను ఓడించేందుకు రామోజీ ఎంతో ప్రయత్నించినా తాను గెలిచానని గుర్తు చేశారు. ఇప్పుడు సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ప్రభుత్వం పట్ల కూడా ఈనాడు అలాగే వ్యవహరిస్తోందన్నారు. అయితే అప్పుడు జరిగిందే రేపు కూడా జరుగుతుందని వ్యాఖ్యానించారు. 'రామోజీరావు తాను చట్టాలను పట్టించుకోనంటారు. చట్టాలకు అతీతమన్నట్లుగా వ్యవహరిస్తారు. తనను ఎవరూ ప్రశ్నించడానికి వీల్లేదని వాదిస్తారు. తాను ఆర్థిక అక్రమాలకు పాల్పడినా అడగకూడదని వితండవాదం చేస్తారు. 60 ఏళ్లుగా తన అక్రమాలను ఎవరూ ప్రశ్నించలేదు కాబట్టి ఇప్పుడూ అడగడానికి వీల్లేదని చెబుతారు. రామోజీరావు లాంటి వారిని వదిలేస్తే దేశంలో అతిపెద్ద మాఫియా సామ్రాజ్యం తయారవుతుంది' అని ఉండవల్లి అరుణ్‌కుమార్ ఆందోళన వ్యక్తం చేశారు.

నాడు మార్గదర్శి ఫైనాన్సియర్స్ అక్రమ డిపాజిట్లు

'మార్గదర్శి ఫైనాన్సియర్స్ విషయంలోనూ 2006లో రామోజీరావు అడ్డగోలుగా వాదించారు. హిందూ అవిభక్త కుటుంబం (హెచ్‌యూఎఫ్) కాబట్టి ప్రజల నుంచి డిపాజిట్లు వసూలు చేయవచ్చన్న రామోజీ వాదనను ఆర్బీఐ సమ్మతించలేదు. ప్రజల నుంచి డిపాజిట్లు వసూలు చేయకూడదని స్పష్టం చేసింది. దీంతో తాము ప్రజల నుంచి రూ.2,600 కోట్లు డిపాజిట్లు సేకరించడం తప్పని రామోజీరావు ఆర్బీఐ వద్ద అంగీకరించారు. ఆ డిపాజిట్లను వెనక్కి ఇచ్చేస్తున్నట్లు లిఖితపూర్వకంగా పేర్కొన్నారు. కానీ ఎవరెవరి నుంచి డిపాజిట్లు వసూలు చేశారో చెప్పమంటే వెల్లడించలేదు. ఆ డిపాజిట్‌దారుల వివరాలు తెలియచేయాలని ఇటీవలే సుప్రీం కోర్టు ఆదేశించింది.

హాయిగా మంచంపై పడుకుని..

మార్గదర్శి చిట్‌ఫండ్స్‌ను నిర్వహిస్తున్న రామోజీరావు అసలు తాను కేంద్ర చిట్‌ఫండ్ చట్టాన్ని పట్టించుకోనని సీఐడీ విచారణలో వాదించడం బరితెగింపే. చిట్‌ఫండ్ సంస్థలు తమ చందాదారుల నుంచి వసూలు చేసే సొమ్మును జాతీయ బ్యాంకులో డిపాజిట్ చేయాలని చట్టంలో ఉంది. కానీ ఆ నిధులను రామోజీరావు తన సొంత సంస్థల్లో పెట్టుబడిగా పెట్టారు. మార్గదర్శి చిట్‌ఫండ్స్ అక్రమాలపై రామోజీరావు, ఆయన కోడలిని విచారించేందుకు సీఐడీ అధికారులు వారి ఇంటికే వెళ్లాల్సి వచ్చింది. రామోజీరావు హాయిగా మంచంపై పడుకుని ఉంటే సీఐడీ అధికారులు ఏవో ప్రశ్నలు అడిగి వచ్చారు. దేశంలో ఇతరులకు అలా సాధ్యం అవుతుందా? పోలీస్ స్టేషన్‌కు పిలిపిస్తారు. రామోజీరావు కాబట్టి ఏదైనా చెల్లుతుంది.

బాబు – రామోజీ క్విడ్ ప్రోకో

మార్గదర్శి చిట్‌ఫండ్స్ చట్టాన్ని ఉల్లంఘించినా, అక్రమాలకు పాల్పడినా సరే అన్ని పార్టీలు రామోజీరావును కీర్తిస్తూ పోటీలు పడి మరీ ప్రకటనలు ఇస్తున్నాయి. చంద్రబాబు – రామోజీరావుకు మధ్య క్విడ్ ప్రోకో ఉంది. తన మాట వినలేదు కాబట్టే ఎన్టీ రామారావును ఈనాడు దించేసింది. ప్రస్తుతం చంద్రబాబు రామోజీరావు చెప్పినట్లే నడుస్తున్నారు. వచ్చే ఎన్నికల్లో టీడీపీ టికెట్ కోసం ప్రయత్నిస్తున్న వారంతా పోటీలు పడి మరీ రామోజీరావును సమర్థిస్తూ మాట్లాడుతున్నారు. కమ్యూనిస్టులు, జనసేన పార్టీలు కూడా రామోజీపై కేసు పెట్టడం తప్పని మాట్లాడుతున్నాయి.

సహకార వ్యవస్థను దెబ్బతీసి అక్రమాలు

సహకార బ్యాంకింగ్ వ్యవస్థను రామోజీరావే దెబ్బతీశారు. సహకార బ్యాంకులు చట్ట విరుద్ధంగా వ్యవహరిస్తూ అక్రమాలకు పాల్పడుతున్నాయని ఈనాడులో



సదస్సులో ప్రముఖులు, న్యాయ కోవిదులు

పెద్ద వార్తలు రాసి మూతబడేలా చేశారు. కానీ అవే చట్టాలు తనకుగానీ, మార్గదర్శి సంస్థకు గానీ వర్తించవని చెబుతున్నారు. ఇదెక్కడి విడ్డూరం?

అక్రమాలను ప్రశ్నిస్తే కక్ష గట్టడమా?

మార్గదర్శి ఫైనాన్సియర్స్ ప్రజల నుంచి రూ.2,600 కోట్ల మేర డిపాజిట్లు వసూలు చేస్తే రామోజీరావు గ్రూపు సంస్థలు రూ.1,850 కోట్లు నష్టం చూపించాయి. మరి రామోజీరావు బోర్డు తిప్పేస్తే డిపాజిట్‌దారుల పరిస్థితి ఏమిటని నేను అడగడం తప్పా? మార్గదర్శి చిట్‌ఫండ్స్‌లో అక్రమాలను నేను ప్రశ్నిస్తే రామోజీపై కక్ష గట్టానని కొందరు ఆడిటర్లు, న్యాయవాదులు వాదిస్తుండటం విడ్డూరం. రామోజీరావుకు, మార్గదర్శి ఫైనాన్సియర్స్‌కు అసలు సంబంధం లేదంటూ రాజాజీ అనే వ్యక్తితో నాపై పరువు నష్టం దావా వేయించారు. అప్పుడు ఈ ఆడిటర్లు, న్యాయవాదులు ఒక్కరైనా మాట్లాడారా?

రాష్ట్ర ప్రయోజనాల కోసం జగన్ స్పందించారు

ఏపీ విభజన చట్టమే తప్పు. రాష్ట్రానికి అన్యాయం జరిగిందని నేను సుప్రీంకోర్టులో కేసు వేశా. దానిపై ఏపీ ప్రభుత్వం తరఫున ఇంప్లీడ్ కావాలని చంద్రబాబు ముఖ్యమంత్రిగా ఉండగా ఆయన్ను కలసి మరీ అభ్యర్థిస్తే పట్టించుకోలేదు. వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత రాష్ట్ర ప్రయోజనాల కోసం ఆ కేసులో రాష్ట్ర ప్రభుత్వం ఇంప్లీడ్ కావాలని ఓ ప్రెస్‌మీట్‌లో కోరా. వెంటనే వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం ఆ కేసులో ఇంప్లీడ్ అవుతూ సుప్రీంకోర్టులో పిటిషన్ వేసింది. రాష్ట్ర ప్రయోజనాల కోసం వైఎస్ జగన్ స్పందించారు. మార్గదర్శి ఫైనాన్సియర్స్ అక్రమాల కేసులో సుప్రీంకోర్టులో నేను వేసిన కేసులో ఏపీ ప్రభుత్వం ఇంప్లీడ్ అయ్యింది. టీఆర్ఎస్ ప్రభుత్వం మాత్రం ఇంప్లీడ్ కాలేదు. ఎక్కడ కేసీఆర్ ప్రభుత్వం ఇంప్లీడ్ అవుతుందో అనే భయంతో రామోజీరావు ఈనాడులో టీఆర్ఎస్‌కు భజన చేస్తున్నారు. సచివాలయాన్ని నిర్మిస్తే మయసభ నిర్మించినట్టుగా పెద్ద పెద్ద వార్తలు వేసి కేసీఆర్‌ను ఖుషీ చేయడానికి ప్రయత్నించారు. కానీ రామోజీరావు కంటే కేసీఆర్ మహా జాదూ. అది త్వరలోనే తెలుస్తుంది.

అక్రమాలను అడ్డుకోవడం జగన్ బాధ్యత

మార్గదర్శి చిట్‌ఫండ్స్ అక్రమ వ్యవహారాల కేసులో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం సక్రమంగా వ్యవహరిస్తోంది. మార్గదర్శి అక్రమాల కేసును సమగ్రంగా విచారించి సరైన పరిష్కారం చూపించాల్సిన బాధ్యత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిపై ఉంది. మార్గదర్శి సంస్థ అక్రమాలకు అడ్డుకట్ట వేసి ప్రజలకు న్యాయం చేయడం వైఎస్ రాజశేఖరరెడ్డి ఆశయాల్లో అతి ముఖ్యమైంది. దాన్ని నిర్వర్తించాల్సిన బాధ్యత సీఎం జగన్‌పై ఉంది.

టీడీపీతో చర్చకు సిద్ధంగా ఉన్నా

చంద్రబాబు, మార్గదర్శి వ్యవహారాలపై చర్చకు నేను సిద్ధంగా ఉన్నా. టీడీపీ అధికార ప్రతినిధి హోదాలో చంద్రబాబు ఎవరినైనా చర్చకు పంపాలి. సింగపూర్, దుబాయిలో చంద్రబాబు ఆస్తులు లాంటి కష్టమైన ప్రశ్నలు ఏవీ నేను అడగను. టీడీపీ ప్రభుత్వంలో వ్యవహారాలపైనే అడుగుతా. పోలవరం ప్రాజెక్ట్‌ను తామే కడతామని చంద్రబాబు ప్రభుత్వం అడిగి తీసుకుందా? లేక మీరే కట్టమని కేంద్రమే ఇచ్చిందా? దానికి సమాధానం చెబితే చాలు. కేంద్రం ఇస్తేనే తాము నిర్మాణ బాధ్యత తీసుకున్నానని చంద్రబాబు శాసనసభలో చెప్పారు. అది నిజం కాదని, చంద్రబాబు ప్రభుత్వం అడిగితేనే సమ్మతించామని నీతి ఆయోగ్ చెబుతోంది' అని మాజీ ఎంపీ ఉండవల్లి పేర్కొన్నారు.

చట్టాన్ని ఉల్లంఘించామని అంగీకరించిన రామోజీ

మార్గదర్శి వ్యవహారాల విషయంలో చట్టాన్ని ఉల్లంఘించినట్టు రామోజీరావే అంగీకరించాక ఆయన తప్పు చేయలేదని ఇతరులు ఎవరో మాట్లాడటం అసంబద్ధమని సుప్రీంకోర్టు న్యాయవాది ఎస్.సత్యనారాయణ ప్రసాద్ పేర్కొన్నారు. మార్గదర్శి చిట్‌ఫండ్స్ సంస్థ చట్టాన్ని ఉల్లంఘించి చందాదారుల సొమ్మును జాతీయ బ్యాంకుల్లో కాకుండా ఇతర సంస్థల్లో పెట్టుబడి పెట్టినట్టు రామోజీరావే అంగీకరించిన విషయాన్ని ఆయన గుర్తు చేశారు. మార్గదర్శి చిట్‌ఫండ్స్ కేసు దర్యాప్తులో భాగంగా సీఐడీ అధికారులు సెక్షన్ 160 కింద నోటీసులివ్వడాన్ని కొందరు ఆడిటర్లు, న్యాయవాదులు ప్రశ్నించడం సరికాదని సత్యనారాయణ ప్రసాద్ స్పష్టం చేశారు. తమకు ఎవిడెన్స్ చట్టం 126 కింద మాత్రమే నోటీసులివ్వాలన్న వారి వాదన సత్యదూరమన్నారు. సెక్షన్ 126 అన్నది కేవలం ఒక అర్జీదారు, అతడి న్యాయవాదికి సంబంధించిన వ్యవహారాలకే వర్తిస్తుందన్నారు. కేసు అంశాలపై మాట్లాడినవారికి సెక్షన్ 160 కింద నోటీసులు ఇచ్చి విచారణకు పిలిచే అధికారం దర్యాప్తు సంస్థలకు ఉంటుందని సోదాహరణంగా వివరించారు. ఈనాడు పత్రికను అడ్డం పెట్టుకుని మార్గదర్శి ఫైనాన్సియర్స్, మార్గదర్శి చిట్ ఫండ్స్ అక్రమాలకు పాల్పడతామంటే ఎలా? అని సదస్సు నిర్వాహకుడు, ప్రముఖ పాత్రికేయుడు కేజీబీ తిలక్ ప్రశ్నించారు. చట్టాలు సక్రమంగా అమలయ్యేలా వాచ్‌డాగ్‌గా ఉండాల్సిన మీడియా కొందరి పెంపుడు కుక్కగా మారుతుండటం విషాదకరమన్నారు. సమాచార హక్కు చట్టం పూర్వపు కమిషనర్ అంబటి సుబ్బారావు, రాష్ట్ర ఉన్నత విద్యా మండలి పూర్వ కార్యదర్శి రాజశేఖర్ రెడ్డితోపాటు వివిధ రంగాలకు చెందిన ప్రముఖులు సదస్సుకు హాజరయ్యారు.

క్లుప్తంగా...

కెనడాలో మరణించిన వ్యక్తి కుటుంబానికి ప్రభుత్వం అండ

ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి రూ.5 లక్షలు అందజేత



సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి

కొత్తపట్నం: కెనడాలో జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతిచెందిన వ్యక్తి కుటుంబానికి రాష్ట్ర ప్రభుత్వం అండగా నిలిచింది. ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి రూ.5 లక్షల నగదు విడుదల చేసింది. ప్రకాశం జిల్లా కొత్తపట్నం మండలం అల్లూరుకు చెందిన పిరటాల రామ కృష్ణారెడ్డి కెనడాలో ఎస్ఆర్‌టీఎస్ రీజనల్ కో–ఆర్డినేటర్‌గా పనిచేసేవారు. గతేడాది జూన్ 26న జరిగిన రోడ్డు ప్రమాదంలో ఆయన మరణించారు. అతని కుటుంబాన్ని ఆదుకోవాలనే ఉద్దేశంతో అల్లూరు వైఎస్సార్‌సీపీ నాయకుడు వీరేపల్లి రామచంద్రారెడ్డి ముఖ్యమంత్రి సహాయ నిధి కోసం అభ్యర్థించారు. మాజీ మంత్రి, ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి రిఫర్ చేయగా సీఎం కార్యాలయం రూ.5 లక్షలు విడుదల చేసింది. ఈ మేరకు సంబంధిత చెక్కును ఆదివారం ఒంగోలులో రామకృష్ణారెడ్డి తండ్రి బసివిరెడ్డికి బాలినేని శ్రీనివాసరెడ్డి అందించారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకుడు వి.రామచంద్రారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

'ప్రకాశం' విద్యార్థులకు తీవ్ర అస్వస్థత

- ఫుడ్‌పాయిజన్‌తో ఆస్పత్రి పాలైన ఇంజనీరింగ్ విద్యార్థులు
- విషయం బయటకు పొక్కకుండా జాగ్రత్తలు.. విద్యార్థులకు వార్నింగ్
- టీడీపీ ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్ కాలేజీ నిర్వాకం

కందుకూరు: నెల్లూరు జిల్లా కందుకూరులో టీడీపీ ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్‌కు చెందిన ప్రకాశం ఇంజనీరింగ్ కాలేజీ విద్యార్థులు పలువురు ఫుడ్‌పాయిజన్‌తో తీవ్ర అస్వస్థతకు గురయ్యారు. తీవ్రమైన రక్తపు విరేచనాలు, వాంతులు, జ్వరం, కడుపునొప్పి సమస్యలతో ఆస్పత్రి పాలయ్యారు. మూడు రోజులుగా విద్యార్థులు అస్వస్థతతో బాధపడుతున్నా విషయం బయటకు పొక్కకుండా కాలేజీ యాజమాన్యం జాగ్రత్తపడింది. విషయం బయటకు చెబితే తీవ్ర పరిణామాలుంటాయని యాజమాన్యం హెచ్చరించడంతో విద్యార్థులు వణికిపోతున్నారు. అయితే, ఈ విషయం ఆదివారం మీడియాకు లీక్ అయింది.

హాస్టల్‌లో తిన్న ఆహారంవల్లే..

ప్రకాశం ఇంజనీరింగ్ కాలేజీ ఆవరణలోనే ఉన్న బాలుర, బాలికల హాస్టల్స్‌లో దూర ప్రాంతాల నుంచి వచ్చిన విద్యార్థులు ఉంటున్నారు. ఈ హాస్టల్స్‌కు చెందిన పలువురు విద్యార్థులు మూడ్రోజుల నుంచి రక్తపు విరేచనాలు, వాంతులు, జ్వరం వంటి సమస్యలతో పట్టణంలోని రెండు ప్రైవేట్ ఆస్పత్రుల్లో చేరుతున్నారు. మూడ్రోజులుగా దాదాపు 20 మందికి పైగానే చికిత్స పొందినట్లు ఆస్పత్రి వర్గాలు చెబుతున్నాయి. ఆదివారం కూడా పలువురు విద్యార్థులు ఈ రెండు ఆస్పత్రుల్లో చేరి చికిత్స పొందుతున్నారు. కొందరు విద్యార్థుల తల్లిదండ్రులు వచ్చి దగ్గరుండి తమ పిల్లలకు చికిత్స చేయించుకుంటున్నారు. హాస్టల్‌లో తీసుకున్న ఆహారంవల్లే ఇలా జరిగిందని బాధిత విద్యార్థులు చెబుతున్నారు. అన్నంతో పాటు పెట్టిన కూరలు తినేటప్పుడు బాగోలేవని, అందుకే అస్వస్థతకు గురయ్యామన్నారు. నిల్వ ఉంచిన కూరలు పెట్టినట్లు అనుమానంగా ఉందన్నారు. అయితే, కాలేజీ యాజమాన్యం బెదిరింపులవల్ల విషయాన్ని చెప్పేందుకు విద్యార్థులు భయపడుతున్నారు. కాలేజీ యాజమాన్యం మాత్రం వారంతా బయట ప్రాంతాల్లో ఆహారం తీసుకోవడంవల్లే అలా జరిగిందని చెబుతోంది.

కాలేజీలు, వర్సిటీల్లో.. చదువు... సంపాదన

విద్యార్థులకు పార్ట్‌టైమ్ ఉద్యోగాలు.. గంటల ప్రాతిపదికన వేతనం

- గరిష్టంగా వారానికి 20 గంటలు, నెలకు 20 రోజులు పని
- 'చదువుతూనే సంపాదన' పథకంపై కాలేజీలు, వర్సిటీలకు యూజీసీ ప్రతిపాదన
- చదువుల్లో ఆర్థిక కష్టాలు తీరడంతో పాటు సామర్థ్యాల పెంపునకు అవకాశం
- కాలేజీల్లో అసిస్టెంట్‌షిప్, లైబ్రరీ అసైన్‌మెంట్‌ల నిర్వహణ, కంప్యూటర్ సర్వీసెస్, డేటాఎంట్రీ, ల్యాబ్ అసిస్టెంట్లుగా పని అప్పగింత
- పరిశోధన ప్రాజెక్టుల్లోనూ ఉపాధి కల్పన
- ఈ పథకం అమలుకు విద్యా సంస్థల్లో ప్రత్యేక సెల్‌లు



సాక్షి, అమరావతి: యూనివర్సిటీలు, కాలేజీలు, ఉన్నత విద్యాసంస్థల్లో 'ఎర్న్ వైల్ లెర్న్' (చదువుతూ సంపాదన–ఈడబ్ల్యూఎల్) పథకాన్ని త్వరలో ప్రవేశపెట్టాలని యూనివర్సిటీ గ్రాంట్స్ కమిషన్ (యూజీసీ) నిర్ణయించింది. దీనికి సంబంధించిన ముసాయిదా ప్రతిపాదనలను సెంట్రల్ యూనివర్సిటీలు, ఇతర ఉన్నత విద్యాసంస్థలకు పంపింది. సామాజికంగా, ఆర్థికంగా వెనుకబడిన వర్గాల విద్యార్థులను చదువుల్లో ముందుకు తీసుకెళ్లడంతోపాటు వారికి ఆర్థికంగా వెన్నుదన్నుగా నిలిచేందుకు ఈ పథకాన్ని యూజీసీ రూపొందించింది. ఈ వర్గాల విద్యార్థులు తమ విద్యను కొనసాగిస్తూనే కొంత సంపాదించుకునేందుకు వీలుగా 'చదువుతూనే సంపాదన' అనే కార్యక్రమానికి శ్రీకారం చుడుతోంది. దీనిని విజయవంతంగా అమలుచేయడం ద్వారా సామాజికంగా, ఆర్థికంగా వెనుకబడిన వర్గాల విద్యార్థులకు పార్ట్‌టైమ్ ఎంగేజ్‌మెంట్ అవకాశాలను అందించాలని అన్ని ఉన్నత విద్యా సంస్థలకు యూజీసీ ప్రతిపాదించింది. ప్రతి గంటకు నిర్ణీత మొత్తాన్ని చెల్లించాలని, గరిష్టంగా వారానికి 20 గంటలపాటు నెలలో 20 రోజులు ఈ పార్ట్‌టైమ్ వర్క్‌లు వారికి అప్పగించాలని యూజీసీ పేర్కొంది. రోజూ తరగతిలో బోధనాభ్యసన ప్రక్రియలు పూర్తయిన తర్వాతే ఈ పార్ట్‌టైమ్ సేవలను విద్యార్థులకు కల్పించాలని తెలిపింది. 'చదువుతూ సంపాదన' అనే ఈ పథకం ద్వారా ఈ వర్గాల విద్యార్థులు వారి చదువులకు అవసరమైన ఆర్థిక వనరులను సమకూర్చుకోవడానికి వీలవుతుందని, అదే సమయంలో వారు ఉపాధి మార్గాలను మెరుగుపర్చుకునేలా నైపుణ్యాలు, సామర్థ్యాలను పెంపొందించుకోగలుగుతారని యూజీసీ అభిప్రాయపడింది. ఈ 'ఎర్న్ వైల్ లెర్న్' పథకం బలహీనవర్గాలకు చెందిన విద్యార్థుల చదువుల్లో ఆర్థిక కష్టాలను తగ్గించడంతో పాటు విద్యార్థుల్లో కష్టపడి సంపాదించే తత్వాన్ని పెంపొందిస్తుంది. చదువుల్లో విద్యార్థులను మరింత మెరుగుపరుస్తుంది. విద్య నాణ్యత పెరగడంతోపాటు వారిలో సానుకూల దృక్పథాన్ని అభివృద్ధి చేస్తుంది'.. అని యూజీసీ తన ముసాయిదా ప్రతిపాదనల్లో పేర్కొంది. అంతేకాక.. వ్యక్తిత్వాన్ని పెంచుకోవడానికి, సాంకేతిక నైపుణ్యాల మెరుగుకు తోడ్పాటునందిస్తుందని, తద్వారా ఈ వర్గాల విద్యార్థుల్లో సామర్థ్యాలు గణనీయంగా పెరుగుతాయని యూజీసీ అభిప్రాయపడింది. 'విద్యార్థులు వృత్తిపరమైన పనులను త్వరగా చేపట్టడంలో ఈ కార్యక్రమం సహాయపడుతుంది.

బ్రిడ్జి కోర్సుల నిర్వహణ

ఇక ఉన్నత విద్యాసంస్థల్లో చేరే ఈ విద్యార్థులకు తొలి ఏడాదిలోనే బ్రిడ్జి కోర్సులను నిర్వహించాలని యూజీసీ పేర్కొంది. సామాజికంగా, ఆర్థికంగా వెనుకబడిన ఈ విద్యార్థులు సంబంధిత కోర్సుల్లోని అంశాలకు సంబంధించి పూర్వపు పరిజ్ఞానాన్ని పూర్తిగా నేర్చుకునే పరిస్థితుల్లేక వెనుకబడి ఉంటారని, ఆ లోపాన్ని పూరించేందుకు ఈ కోర్సులు ఎంతగానో తోడ్పడతాయని తెలిపింది. ఇతర విద్యార్థులతో సమాన స్థాయికి వీరు చేరుకునేందుకు ఇవి అవకాశం కల్పిస్తాయని తెలిపింది. సెమిస్టర్ ప్రోగ్రామ్ ప్రారంభానికి ముందు ఏటా వీటిని నిర్వహించాలని సూచించింది.

పార్ట్‌టైమ్ పనుల కేటాయింపు ఇలా..

సామాజికంగా, ఆర్థికంగా బలహీన వర్గాల విద్యార్థులకు విద్యాసంస్థల్లో ఎలాంటి పార్ట్ టైమ్ ఉపాధి కార్యక్రమాలు కల్పించాలో కూడా యూజీసీ సూచించింది. ఇందుకు సంబంధించిన జాబితాను రూపొందించింది. ఇందులో..

- రీసెర్చ్ ప్రాజెక్టులతో కూడిన అసిస్టెంట్‌షిప్, లైబ్రరీ అసైన్‌మెంట్లు, కంప్యూటర్ సర్వీసెస్, డేటాఎంట్రీ, లేబొరేటరీ అసిస్టెంట్లు తదితరాలతో పాటు ఆయా సంస్థలు ఇతర అంశాల్లోనూ పార్ట్‌టైమ్ జాబ్‌లను కల్పించాలని యూజీసీ పేర్కొంది.
- ఇందుకు సంబంధించి ఆయా ఉన్నత విద్యాసంస్థల్లో ప్రత్యేక సెల్‌లను ఏర్పాటు చేయాలని తెలిపింది.
- సంస్థ డీన్ లేదా డిపార్ట్‌మెంటల్ హెడ్ తదితరులతో చర్చించి అర్హులైన విద్యార్థులను గుర్తించిన అనంతరం ఉన్నతాధికారుల ఆమోదంతో విద్యార్థులకు తగ్గ పనులను అప్పగించాలని వివరించింది.
- ప్రతి అకడమిక్ సెషన్‌లోనూ ఈ విద్యార్థులను గుర్తించి పూల్‌గా ఏర్పరచి వీసీ, లేదా ప్రిన్సిపాళ్ల ఆమోదంతో పార్ట్‌టైమ్ పనులు కేటాయించాలని మార్గదర్శకాల్లో పేర్కొంది.
- జాతీయ విద్యా విధానం–2020కి అనుగుణంగా ఈ మార్గదర్శకాలు రూపొందించారు.
- సామాజిక–ఆర్థికంగా వెనుకబడిన వర్గాల విద్యార్థుల సమస్యలను పరిష్కరించడానికి ఇది ఎంతో ఉత్తమమైన కార్యక్రమమని యూజీసీ వివరించింది.
- మహిళలు, ఎస్సీ, ఎస్టీ, ఓబీసీ, మైనార్టీ వర్గాల విద్యార్థులు, గ్రామీణ ప్రాంత విద్యార్థులు, చిన్నచిన్న పట్టణాల నుంచి వచ్చిన పిల్లలు, దివ్యాంగులు, ఆర్థికంగా వెనుకబడ్డ వారికి ఈ కార్యక్రమం ద్వారా ప్రాధాన్యమివ్వాలని తెలిపింది.

ఎస్సీల పురోగతికి మరింత కృషి

- మూడు కేంద్ర ప్రాయోజిత పథకాలు పటిష్టంగా అమలుకు కార్యాచరణ
- ఉపాధి, సదుపాయాలు, విద్యావకాశాలపై ప్రధాన దృష్టి
- ఈ ఏడాది రూ.149.55కోట్లు కేటాయించిన రాష్ట్ర ప్రభుత్వం

సాక్షి, అమరావతి: రాష్ట్రంలోని ఎస్సీలకు ఆర్థిక, సామాజిక, రాజకీయ రంగాల్లో అత్యంత ప్రాధాన్యత ఇస్తున్న ప్రభుత్వం... వారి సమగ్ర అభివృద్ధి కోసం ప్రత్యేక కార్యాచరణ రూపొందించింది. రాష్ట్రంలోని ఎస్సీలకు ఉపాధి, సదుపాయాలు, విద్యావకాశాలు కల్పించడమే లక్ష్యంగా మూడు కేంద్ర ప్రాయోజిత పథకాలను ఎస్సీ కాంపొనెంట్ స్కీమ్‌లుగా విలీనం చేసి అమలు చేయాలని నిర్ణయించింది. ఇందుకోసం ఈ ఏడాది బడ్జెట్‌లో రూ.149.55కోట్లను రాష్ట్ర ప్రభుత్వం కేటాయించింది.

ఇవీ ప్రభుత్వ లక్ష్యాలు...

- షెడ్యూల్ కులాల ఉప ప్రణాళికకు ప్రత్యేక కేంద్ర సహాయం (ఎస్‌సీఎస్‌పీ) పథకం ద్వారా ఎస్సీలకు నైపుణ్యాభివృద్ధి శిక్షణ ఇచ్చి ఆదాయాలను పెంచుకునేందుకు అవకాశాలను మెరుగుపరుస్తారు. అదనపు ఉపాధి అవకాశాలు కల్పించడం ద్వారా ఎస్సీల్లో పేదరికాన్ని తగ్గించేలా కృషి చేస్తారు.
- ప్రధానమంత్రి ఆదర్శ్ గ్రామ యోజన (పీఎంఏజీవీ) ద్వారా ఎస్సీ జనాభా ఉన్న గ్రామాల్లో తగిన మౌలిక సదుపాయాలు కల్పించడంతోపాటు అవసరమైన ఇతర సేవలను అందిస్తారు. తద్వారా వారి సామాజిక, ఆర్థిక అభివృద్ధి సూచికలను మెరుగుపరచడానికి చర్యలు తీసుకుంటారు.
- బాబూ జగ్జీవన్‌రామ్ ఛత్రవాస్ యోజన (బీజేఆర్‌సీవై)ను ఉపయోగించుకుని అక్షరాస్యతను పెంపొందించేలా చర్యలు చేపడతారు. పాఠశాలలు, ఉన్నత విద్యాసంస్థల్లో ఎస్సీల హాజరు పెంచేలా ప్రోత్సహిస్తారు. ఎస్సీ నివాసిత ప్రాంతాల్లోని విద్యాసంస్థల్లో తగిన సౌకర్యాలు కల్పిస్తారు. అవసరమైన చోట్ల రెసిడెన్షియల్ పాఠశాలలు అందుబాటులోకి తీసుకువస్తారు. తద్వారా ప్రతి ఒక్కరూ మెరుగైన విద్యను అభ్యసించే అవకాశం కల్పిస్తారు.
- ప్రధానమంత్రి అనుసూచిత్ జాతి అభ్యుదయ్ యోజన(పీఎంఏజేఏవై) ద్వారా అందిస్తున్న ఈ మూడు ప్రాయోజిత పథకాలను రాష్ట్రంలో ఎస్సీ కాంపొనెంట్ స్కీమ్‌లుగా విలీనం చేసి అమలు చేస్తున్నట్లు సాంఘిక సంక్షేమశాఖ మంత్రి మేరుగు నాగార్జున తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధతో తగిన నిధులు సమకూర్చి ఈ పథకాలను అమలు చేస్తుందని ఆయన చెప్పారు.

వర్షాలు.. పిడుగులు



మృతిచెందిన వెంకటరామయ్య, కొరివి కృపానందం, చాట్ల శ్యామ్‌బాబు

సాక్షి, అమరావతి/పాతమల్లాయపాలెం (ప్రత్తిపాడు)/అవనిగడ్డ/చల్లపల్లి/ఎటపాక: తీవ్ర ఎండలతో అల్లాడుతున్న రాష్ట్రంలో ఆదివారం పలుచోట్ల వర్షాలు కురిశాయి. పిడుగులు పడి కృష్ణా, గుంటూరు జిల్లాల్లో ఐదుగురు మరణించారు. వర్షాలతో ఆదివారం రాష్ట్ర వ్యాప్తంగా ఉష్ణోగ్రతలు తగ్గి వాతావరణం చల్లగా మారడంతో ప్రజలు సేదతీరారు. కృష్ణాజిల్లా బంటుమిల్లిలో 10.1 సెంటీమీటర్ల వర్షం పడింది. శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా చినపవనిలో 9.3 సెంటీమీటర్లు, శ్రీకాకుళం జిల్లా సోంపేట మండలం బాతుపురం, గుంటూరు జిల్లా ప్రత్తిపాడుల్లో 8 సెంటీమీటర్ల వర్షం కురిసింది. పలుచోట్ల 3 నుంచి 7 సెంటీమీటర్ల వర్షం పడింది. అల్లూరి సీతారామరాజు జిల్లా ఎటపాక మండలంలో ఉరుములు, మెరుపులతో వడగళ్ల వాన కురిసింది. వచ్చే మూడురోజులు ఇలాగే రాష్ట్ర వ్యాప్తంగా వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ తెలిపింది. పలుచోట్ల భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని పేర్కొంది. దక్షిణ ఛత్తీస్‌గఢ్ నుంచి దక్షిణ తమిళనాడు వరకు విదర్భ, తెలంగాణ, అంతర్గత కర్ణాటక మీదుగా ఒక ద్రోణి సగటు సముద్ర మట్టానికి 0.9 కిలోమీటర్ల ఎత్తు వద్ద కొనసాగుతున్నట్లు వాతావరణశాఖ అధికారులు తెలిపారు. ఏపీ, యానాం మీదుగా దిగువ ట్రోపోస్ఫిరిక్ ఆవరణలో దక్షిణ, ఈశాన్య గాలులు వీస్తున్నట్లు చెప్పారు. వీటి ప్రభావంతో వచ్చే మూడురోజులు రాష్ట్రవ్యాప్తంగా తేలికపాటి నుంచి ఓ మోస్తరు వర్షాలు, అక్కడక్కడ ఉరుములతో జల్లులు పడతాయని పేర్కొన్నారు. ఒకటి రెండుచోట్ల భారీవర్షాలు, కొన్ని ప్రాంతాల్లో వడగళ్ల వాన పడే అవకాశం ఉందని, గంటకు 40 నుంచి 50 కిలోమీటర్ల వేగంతో ఈదురు గాలులు వీచే అవకాశం ఉందని తెలిపారు.

పిడుగుపాటుకు ఆగిన గుండెలు

కృష్ణాజిల్లా దివిసీమలో పిడుగులు పడి ముగ్గురు మరణించారు. అవనిగడ్డ మండలం రామచంద్రపురంలో మొక్కజొన్న పంట తడవకుండా పట్టాలు కప్పుతుండగా సమీపంలో పిడుగుపడటంతో రైతు మత్తి వెంకటరామయ్య (53) అలియాస్ చిన్నా అక్కడికక్కడే మరణించాడు. చల్లపల్లి మండలం రామానగరం క్లబ్‌రోడ్‌లో పిడుగుపాటు శబ్దానికి కె.నాంచారమ్మ (90), కమలా థియేటర్ దగ్గర సైకిల్‌షాపు మస్తాన్ గుండె ఆగి చనిపోయారు. కోడూరు మండలం పిట్టల్లంక, బడేవారిపాలెం, మోపిదేవి మండలం పెదకళ్లేపల్లిలో, కోడూరు మండలం పిట్టల్లంక శివారు బావిశెట్టివారిపాలెంలో పిడుగులు పడి నాలుగు వరి కుప్పలు కాలిపోయాయి. కోడూరు మండలం లింగారెడ్డిపాలెం శివారు నక్కవానిదారి, ఉల్లిపాలెంలో పిడుగులు పడి రెండు పాడిగేదెలు మృత్యువాతపడ్డాయి.

మిర్చిని రక్షించుకునేందుకు వెళ్లి..

గుంటూరు జిల్లా ప్రత్తిపాడు మండలం పాత మల్లాయపాలెంలో పిడుగుపాటుకు ఇద్దరు మరణించారు. ఉరుములు, మెరుపులు, భారీ ఈదురుగాలులతో అకాల వర్షం మొదలవడంతో కల్లాల్లో ఉన్న మిర్చిపై పట్టాలు కప్పేందుకు స్థానిక దళితవాడకు చెందిన చాట్ల శ్యామ్‌బాబు (50), కొరివి కృపానందం (55) వెళ్లారు. కల్లంలో పట్టాలు కప్పుతున్న సమయంలో వారికి సమీపంలో పిడుగుపడింది. స్పృహ కోల్పోయిన వారిని స్థానికులు ప్రత్తిపాడులోని సామాజిక ఆరోగ్య కేంద్రానికి తీసుకురాగా సిబ్బంది పరీక్షించి అప్పటికే మృతిచెందినట్లు నిర్ధారించారు. మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం గుంటూరు జీజీహెచ్‌కి తరలించారు.

టెన్త్ 'స్పాట్' కేంద్రాల్లో సదుపాయాల కల్పన

- సీఎం ఆదేశాలతో వాల్యూయేషన్ కేంద్రాలను పరిశీలించిన ప్రవీణ్‌ప్రకాష్
- వాల్యూయేషన్ కేంద్రాలపై కొత్త పాలసీ రూపొందిస్తాం: మంత్రి బొత్స



నరసరావుపేటలో ఉపాధ్యాయులతో మాట్లాడుతున్న ప్రవీణ్‌ప్రకాష్

సాక్షి అమరావతి/నరసరావుపేట ఈస్ట్/గుంటూరుఎడ్యుకేషన్: పదో తరగతి పరీక్షాపత్రాల స్పాట్ వాల్యూయేషన్ కేంద్రాల్లో మెరుగైన సదుపాయాలు కల్పించాలని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశించడంతో విద్యాశాఖ ముఖ్య కార్యదర్శి ప్రవీణ్ ప్రకాష్ ఆదివారం గుంటూరు, పల్నాడు జిల్లాల్లోని కేంద్రాలను పరిశీలించారు. పదో తరగతి పరీక్షలకు 6,64,000 మంది విద్యార్థులు హాజరయ్యారు. వారు రాసిన 45 లక్షల జవాబు పత్రాలను వివిధ కేంద్రాల్లో 25,000 మంది ఉపాధ్యాయులు వాల్యూయేషన్ చేస్తున్నారు. స్పాట్ వాల్యూయేషన్ ప్రక్రియ ఈ నెల 19న ప్రారంభం కాగా, 26 వరకు కొనసాగుతుంది. వాల్యూయేషన్ కేంద్రాల్లో సదుపాయాల కల్పనపై సీఎం వైఎస్ జగన్ ప్రత్యేకంగా దృష్టిసారించారు. తక్షణమే ఆయా కేంద్రాలను పరిశీలించి తగిన ఏర్పాట్లు చేయాలని ప్రిన్సిపల్ సెక్రటరీ ప్రవీణ్ ప్రకాష్, ఇతర సీనియర్ అధికారులను ముఖ్యమంత్రి ఆదేశించారు. ఈ మేరకు ప్రవీణ్ ప్రకాష్ గుంటూరులోని నగరంపాలెం స్టాల్ గరల్స్ హైస్కూల్, పల్నాడు జిల్లా నగరసరావుపేటలోని సెయింట్ ఆన్స్ హైస్కూల్‌లో కొనసాగుతున్న స్పాట్ వాల్యూయేషన్ కేంద్రాలను పరిశీలించి ఉపాధ్యాయులతో మాట్లాడారు. సౌకర్యాలను పరిశీలించి సంతృప్తి వ్యక్తంచేశారు. నరసరావుపేటలోని స్పాట్ వాల్యూయేషన్ కేంద్రంలో వైద్య సిబ్బంది, అంబులెన్స్‌ను అందుబాటులో ఉంచడంపై డీఈవో కె.శామ్యూల్‌ను ప్రవీణ్ ప్రకాష్ అభినందించారు. ఇతర సీనియర్ అధికారులు కూడా వివిధ జిల్లాల్లోని కేంద్రాలను పరిశీలించాలని ఆయన సూచించారు. ప్రభుత్వ పరీక్షల డైరెక్టర్ దేవానందరెడ్డి, పల్నాడు జిల్లా కలెక్టర్ ఎల్.శివశంకర్ తదితరులు పాల్గొన్నారు.

మంత్రి బొత్స పరిశీలన

విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణ విశాఖపట్నం, విజయనగరంలోని కొన్ని స్పాట్ వాల్యూయేషన్ కేంద్రాలను పరిశీలించారు. వాటిలో చాలా కేంద్రాలు కొన్ని దశాబ్దాలుగా కొనసాగుతున్నాయని, ఇవి ప్రస్తుత అవసరాల మేరకు స్పాట్ వాల్యూయేషన్ కేంద్రాలుగా ఎంపిక చేయడానికి ఉత్తమమైనవి కావని ఆయన గుర్తించారు. స్పాట్ వాల్యూయేషన్ కేంద్రాల ఏర్పాటుపై కొత్త పాలసీని రూపొందించేందుకు చర్యలు తీసుకుంటామని మంత్రి తెలిపారు.

ఎలక్ట్రిక్ వాహనాల్లో ఇక మంటలు రావు

విద్యుత్ వాహనాల్లో ఇంధనం కోసం లిథియం అయాన్ బ్యాటరీల వినియోగం



- ఇవి పేలడం వల్ల కాలిపోతున్న ఎలక్ట్రిక్ వాహనాలు
- ఈ సమస్యకు పరిష్కారంగా వస్తున్న ఆల్ సాలిడ్ స్టేట్ బ్యాటరీలు
- భద్రత, అధిక శక్తి సాంద్రత సాలిడ్ బ్యాటరీల ప్రత్యేకత
- లిథియం బ్యాటరీల కంటే 39 శాతం పర్యావరణ అనుకూలం

సాక్షి, అమరావతి: ఎలక్ట్రిక్ వాహనాల (ఈవీల)పై ప్రజల్లో అంతకంతకూ మోజు పెరుగుతోంది. అంతే భయం కూడా వారిలో ఉంది. ఇంధన ఖర్చులు తగ్గడం ఆదరణకు కారణమైతే.. తరచుగా ప్రమాదాలు జరుగుతుండటం భయాలకు కారణం. ఈవీల్లో ప్రస్తుతం లిథియం అయాన్ బ్యాటరీలను వినియోగిస్తున్నారు. ఇవి పేలిపోవడం, కాలిపోవడం వంటి దుర్ఘటనలు తరచుగా జరుగుతున్నాయి. గడచిన 6 నెలల్లో దేశవ్యాప్తంగా ఈ తరహా దుర్ఘటనలు 24 నమోదయ్యాయి. ప్రఖ్యాత సంస్థలకు చెందిన ఈవీ కార్లు, స్కూటర్లలోనూ మంటలు చెలరేగడం కొనుగోలుదారులను భద్రత విషయంలో ఆందోళనకు గురి చేస్తోంది. ఈ నేపథ్యంలో లిథియం అయాన్ బ్యాటరీలకు ప్రత్యామ్నాయంగా.. సురక్షితంగా, సమర్థవంతంగా పనిచేసే ఆల్ సాలిడ్ స్టేట్ బ్యాటరీ (ఏఎస్ఎస్‌బీ)లు అందుబాటులోకి వస్తున్నాయి.

లిథియంతో ఈవీ సమస్యలు

లిథియం బ్యాటరీల తయారీలో ద్రవ ఎలక్ట్రోలైట్‌ను ఉపయోగిస్తారు. ఇది రసాయన ప్రతి చర్యలకు కారణమయ్యే అవకాశం ఉంది. షార్ట్ సర్క్యూట్‌కు కారణమయ్యే కాథోడ్, యానోడ్ మధ్యలో తప్పనిసరిగా సెపరేటర్ ఉంచాలి. సెపరేటర్ దెబ్బతినే అవకాశం ఉంది. చార్జింగ్ సమయం కూడా ఎక్కువగా ఉంటోంది. అలాగే లిథియం ఖర్చులు ఎక్కువ. ఈ బ్యాటరీలు లోపలి భాగంలో బాగా మండే అవకాశం ఉంటుంది. కరెంట్ పెరిగినప్పుడు బ్యాటరీ వేడెక్కుతుంది. ఒత్తిడి వల్ల పేలిపోయే ప్రమాదం ఉంది. లిథియం అయాన్ బ్యాటరీ వ్యర్థాలు భవిష్యత్‌లో పర్యావరణానికి భారీ సవాల్ విసిరే అవకాశం ఉంది. బ్యాటరీ జీవితకాలం పూర్తయిన తర్వాత దానిని ఎక్కడ పడెయ్యాలనేది ప్రశ్నగానే మిగిలింది. ఎందుకంటే ఎక్కడ పడేసినా అది పాడవ్వదు. మట్టిలో కలిసిపోదు. లిథియం బ్యాటరీల్లో విషపూరితమైన నికెల్, రాగి, సీసం పర్యావరణానికి హాని కలిగిస్తాయి. జాగ్రత్తలు తీసుకోకుండా నిల్వ చేస్తే అవి పేలుడు పదార్థంగా మారతాయి.

సాలిడ్ బ్యాటరీలతో పరిష్కారం

2011లో ఘన ఎలక్ట్రోలైట్‌ను కనుగొన్నారు. దాంతో ఆల్ సాలిడ్ స్టేట్ బ్యాటరీలపై పరిశోధన ప్రారంభమైంది. ద్రవ ఎలక్ట్రోలైట్‌లతో పోలిస్తే.. ఘన ఎలక్ట్రోలైట్‌లు రసాయనికంగా మరింత స్థిరంగా ఉంటాయి. సైడ్ రియాక్షన్లకు అవకాశం తక్కువ. లీకేజీ ప్రమాదం లేదు. ఘన ఎలక్ట్రోలైట్‌లో కాథోడ్, యానోడ్‌లు కలిసే అవకాశం లేదు. బ్యాటరీ అధిక ఉష్ణోగ్రతల వద్ద కూడా పనిచేయగలదు. సోడియం వంటి అత్యంత సాధారణమైన, తక్కువ విషపూరితమైన మూలకాలను ఉపయోగించి ఘన స్థితిలో వీటిని తయారు చేస్తారు. ఈ బ్యాటరీల కోసం తక్కువ ఖర్చు ఉండే పదార్థాలను ఉపయోగించడం వల్ల బ్యాటరీ ధర కూడా తగ్గుతుంది. ఇవి అత్యంత సురక్షితంగా ఉండటమే కాకుండా.. లిథియం అయాన్ బ్యాటరీల కంటే దాదాపు రెండు రెట్లు ఎక్కువ శక్తితో పనిచేస్తాయి. బ్యాటరీ నెమ్మదిగా డిశ్చార్జ్ అవ్వడంతో పాటు వేగంగా చార్జ్ అవుతుంది. సాలిడ్ స్టేట్ బ్యాటరీల్లో ఉండే సిరామిక్ ఎలక్ట్రోలైట్‌కు మండే అవకాశం చాలా తక్కువ. ఇది పర్యావరణానికి కూడా హాని చేయదు. లిథియం అయాన్ బ్యాటరీలతో పోలిస్తే సాలిడ్ బ్యాటరీలు వాతావరణంపై వ్యర్థ బ్యాటరీ ప్రభావాన్ని 39 శాతం తగ్గించగలవు. ఈ కారణాలతో సాలిడ్ స్టేట్ బ్యాటరీలతో ఎలక్ట్రిక్ వాహనాల తయారీని మొదలుపెట్టడానికి దిగ్గజ కంపెనీలు ఇప్పటికే ప్రణాళికలు సిద్ధం చేశాయి. 2025 నాటికి ఈ వాహనాలను మార్కెట్‌లోకి తీసుకురానున్నాయి.



ఇలాగైతే 'నీళ్లు నమలాల్సిందే'

- దేశంలో పెరుగుతున్న జనాభాకు అనుగుణంగా పెరగని నీటి లభ్యత
- 2001లో తలసరి నీటి లభ్యత 1,816 క్యూబిక్ మీటర్లు
- 2021లో ఆ మొత్తం 1,486 క్యూబిక్ మీటర్లకు తగ్గుదల
- 2051 నాటికి 1,228 క్యూబిక్ మీటర్లకు తగ్గనున్న తలసరి నీటి లభ్యత
- ఇదే పరిస్థితి కొనసాగితే సాగునీటికే కాదు.. తాగునీటికి కూడా కటకట

కేంద్ర జల సంఘం తాజా అధ్యయనంలో వెల్లడి

సాక్షి, అమరావతి: వరద జలాలను ఒడిసిపట్టడం.. భూగర్భ జలాలను పెంపొందించడం వంటి జల సంరక్షణ చర్యలు చేపట్టకపోతే దేశంలో తీవ్ర జల సంక్షోభం తలెత్తే అవకాశం ఉందని కేంద్ర జల సంఘం (సీడబ్ల్యూసీ) ఆందోళన వ్యక్తం చేసింది. దేశంలో పెరుగుతున్న జనాభాకు అనుగుణంగా తలసరి నీటి లభ్యత పెరగడం లేదనే అంశాన్ని స్పష్టంచేసింది. తలసరి నీటి లభ్యత 2001లో 1,816 క్యూబిక్ మీటర్లు (ఒక క్యూబిక్ మీటర్ వెయ్యి లీటర్లకు సమానం) ఉంటే.. 2021 నాటికి 1,486 క్యూబిక్ మీటర్లకు తగ్గిపోవడాన్ని గుర్తు చేసింది. నీటి లభ్యతను పెంచే చర్యలు చేపట్టకపోతే.. 2031 నాటికి 1,367 క్యూబిక్ మీటర్లకు, 2041 నాటికి 1,282 క్యూబిక్ మీటర్లకు, 2051 నాటికి 1,228 క్యూబిక్ మీటర్లకు తగ్గిపోతుందని అంచనా వేసింది.

ఇలాగైతే.. కష్టమే!

పరిస్థితి ఇలానే కొనసాగితే భవిష్యత్‌లో సాగునీటికే కాదు.. తాగునీటికి కూడా తీవ్ర ఇబ్బందులు తప్పవని కేంద్ర జలసంఘం ఆందోళన వ్యక్తం చేసింది. సాగునీటి సమస్య పంటల సాగుపై ప్రభావం చూపుతుందని.. ఇది ఆహార సంక్షోభానికి దారి తీస్తుందని పేర్కొంది. నీటి లభ్యతను పెంచేలా వరద నీటిని ఒడిసిపట్టి జలాశయాల్లో నిల్వ చేయడం, జల సంరక్షణ చర్యలు చేపట్టడం ద్వారా జల సంక్షోభాన్ని నివారించవచ్చునని కేంద్రానికి సూచించింది. పెరుగుతున్న జనాభాకు అనుగుణంగా దేశంలో మరిన్ని రిజర్వాయర్లు నిర్మించి.. నదీ జలాలను మళ్లించి వాటిని నింపడం ద్వారా నీటి లభ్యతను పెంచుకోవాలని స్పష్టం చేసింది. నీటి పారుదల సౌకర్యాలను మెరుగుపర్చుకోకుంటే ఆహార ధాన్యాల దిగుబడి పెరగదని తేల్చింది. జనాభా పెరుగుతున్న నేపథ్యంలో ఆహార ధాన్యాల ఉత్పత్తి పెరగకుంటే ఆహార సంక్షోభానికి దారి తీస్తుందని హెచ్చరించింది.

సీడబ్ల్యూసీ అధ్యయనంలో ఏం తేలిందంటే

- దేశంలో ఏటా సగటున 1,298.60 మి.మీ. వర్షపాతం కురుస్తోంది. తద్వారా 1,37,002.08 టీఎంసీల నీరు లభ్యమవుతోంది.
- వర్షపాతం వల్ల గంగ, బ్రహ్మపుత్ర, గోదావరి, కృష్ణా నదుల్లో ప్రవాహం రూపంలో 70,591.75 టీఎంసీలు లభిస్తుండగా.. ప్రస్తుతం జలాశయాల ద్వారా 24,367.43 టీఎంసీలను మాత్రమే ఉపయోగించుకుంటున్నాం.
- ఏటా 46,224.32 టీఎంసీలు కడలిలో కలిసిపోతున్నాయి. అంటే వాడుకుంటున్న నీటి కంటే దాదాపు రెండు రెట్లు అధికంగా నదీ జలాలు కడలిలో కలుస్తున్నట్టు వెల్లడవుతోంది.
- దేశవ్యాప్తంగా వివిధ నదులపై నిర్మించిన 5,745 డ్యామ్‌ల నీటి నిల్వ సామర్థ్యం 9,103.34 టీఎంసీలు. ఈ డ్యామ్‌లలో నీటిని నిల్వ చేస్తూ సాగు, తాగునీటి అవసరాల కోసం 24,367.43 టీఎంసీలను మాత్రమే వాడుకుంటున్నాం.
- ఆంధ్రప్రదేశ్‌లో 166 డ్యామ్‌ల నిల్వ సామర్థ్యం 983.59 టీఎంసీలు. అన్ని జిల్లాల్లో కలిపి 1.05 కోట్ల ఎకరాలకు నీళ్లందించేలా ఆయకట్టును రాష్ట్ర ప్రభుత్వం అభివృద్ధి చేసింది.



స్నేహితుడంటే ఎవరు?
రెండు శరీరాల్లో నివసిస్తున్న ఒకే ఆత్మ.
– అరిస్టాటిల్

సాక్షి
సోమవారం, 24 ఏప్రిల్ 2023

ఆంగ్లంలోకి ఎత్తిపోయాలి!

అవార్డు వచ్చిందే అత్యుత్తమ రచన కాకపోవచ్చు. అత్యుత్తమ రచనలన్నింటికీ అవార్డులు రాకపోవచ్చు. కానీ అవార్డు వచ్చింది సాధారణంగా మంచి పుస్తకమే అయివుండొచ్చు. ఒకవేళ ఈ వాక్యాలతో ఏమైనా విభేదించే అవకాశం ఉన్నా, అవార్డు వచ్చిన పుస్తకం ఎంతోకొంత ఆసక్తి కలిగింపజేస్తుందనే విషయంలో మాత్రం ఏ విభేదం లేదు. అవార్డు ఎంత పెద్దదైతే, అంత ఆసక్తి. ఆ భారీతనం వరుస సంవత్సరాలుగా ఇస్తుండటం వల్ల వచ్చిన ప్రతిష్ఠరూపంలో ఉండొచ్చు, లేదా పారితోషికం రూపంలో ఉండొచ్చు. ఏమైనా ప్రస్తుతం, 'భారతదేశపు అత్యంత విలువైన సాహిత్య బహుమానం'గా 'జేసీబీ ప్రైజు'ను పేర్కొంటున్నారు. అక్షరాలా ఈ పురస్కార విలువ పాతిక లక్షల రూపాయలు. గొప్ప భారతీయ రచనలను ఉత్సవం చేయాలనే ఉద్దేశంతో నెలకొల్పిన 'ద జేసీబీ ప్రైజ్ ఫర్ లిటరేచర్' ప్రత్యేకతలు ఏమంటే, ఇంగ్లిష్ రచనలకే బహుమానం ఇస్తున్నప్పటికీ, ఇంగ్లిష్ అనువాదాలను కూడా పరిగణనలోకి తీసుకోవడం; ఇంకా ఆసక్తికరమైనది, ఒకవేళ అనువాద రచన బహుమానం గెలుచుకుంటే, అనువాదకులకు అదనంగా మరో పది లక్షలు ఇవ్వడం.

''గతంలో ఒక కొత్త ఉర్దూ నవల విడుదలయ్యిందంటే– విద్యార్థులు, అధ్యాపకులు దాని గురించి చర్చించుకునేవాళ్లు. ఇప్పుడు, దానికొక అవార్డు వచ్చి కొంత పాపులర్ అయితే తప్ప ఎవరూ పట్టించుకోవడం లేదు. అదొక ధోరణిలా మారిపోయింది. విశ్వవిద్యాలయాలు ఒకప్పుడు జ్ఞానాన్ని సృష్టించేవి. ఇప్పుడవి కేవలం పంపిణీ చేస్తున్నాయి,'' అంటారు ఉర్దూ నవలా రచయిత ఖాలిద్ జావేద్. 2022లో 'ద ప్యారడైజ్ ఆఫ్ ఫుడ్' నవలకుగానూ ఆయన 'జేసీబీ ప్రైజ్'ను స్వీకరించారు. 'నేమత్ ఖానా' పేరుతో వచ్చిన ఈ ఉర్దూ మూల నవలను బరన్ ఫారూఖీ ఇంగ్లిష్‌లోకి అనువదించారు. ఖాలిద్ ఆవేదన ఉర్దూ సాహిత్య రంగం గురించినదే అయినప్పటికీ అది దేశంలోని అన్ని భాషలకూ వర్తిస్తుంది. అందుకే అవార్డులు, పురస్కారాలు అనేవి సాహిత్యంలో ఎంతోకొంత ఊపును సృష్టించగలుగుతాయి. వాటి పరిమితులను మినహాయిస్తే, అదొక సానుకూలాంశం. అందువల్లే వంటిల్లు నేపథ్యంలో జరిగే అధికార క్రీడనూ... కత్తులు, మంట వంటి ప్రమాదకర ఆయుధాలను కలిగివుండే చోటునూ చిత్రించిన ఖాలిద్ ఉర్దూ నవల విస్తృత పాఠకలోకంలో చర్చనీయాంశంగా మారగలిగింది.

నిర్మాణ పనుల్లో; తవ్వకం, ఎత్తిపోత, కూల్చివేతల్లాంటి పనుల్లో వాడే 'జేసీబీ' గురించి మనకు తెలుసు. ఈ జేసీబీ అనేదే ఆ యంత్రానికి ఒక పేరులా స్థిరపడిపోయిందిగానీ అది ఒక సంస్థ పేరు. ఇంగ్లండ్ వ్యాపారవేత్త జోసెఫ్ సిరిల్ బామ్‌ఫోర్డ్ (జేసీబీ) తన పేరుతోనే నెలకొల్పిన కంపెనీ ఈ జేసీబీ. 2018 నుంచి ఈ సంస్థ భారతీయ రచనలకు బహుమానాలు ఇస్తోంది. మార్చ్ నెలలో ఎంట్రీలను ఆహ్వానిస్తారు. ఏప్రిల్ 30 ఈ యేటి ఎంట్రీలు పంపడానికి ఆఖరి తేది. వారి వెబ్‌సైట్‌లో అన్ని వివరాలూ లభిస్తాయి. కథలు, కవిత్వ సంపుటాలు కాకుండా 'యూనిఫైడ్ వర్క్' మాత్రమే దీనికి పంపాలి. సాధారణంగా సెప్టెంబర్‌లో లాంగ్ లిస్ట్ విడుదలవుతుంది. అంటే వచ్చిన రచనల్లో తొలి వడపోతలో మిగిలిన పదింటిని ప్రకటిస్తారు. అక్టోబర్‌లో షార్ట్ లిస్ట్ వస్తుంది. అప్పటికి ఐదు నవలలు తుది పోటీలో ఉంటాయి. నవంబర్‌లో విజేతను ప్రకటిస్తారు. దీనికిగానూ ప్రతి యేటా ఒక స్వతంత్ర జ్యూరీ ఏర్పాటు అవుతుంది.

ఇప్పటికి మూడు సంవత్సరాలు ముగ్గురు మలయాళ రచయితలు ఈ బహుమానం గెలుచుకోవడం విశేషం. మలయాళ చిత్ర పరిశ్రమలాగే, మలయాళ సాహిత్యం కూడా వర్ధిల్లుతోందని చెప్పడానికి ఇదొక సాక్ష్యం. కాదు, మలయాళ సాహిత్యం వర్ధిల్లుతున్నందుకే మలయాళ చిత్రసీమ వర్ధిల్లుతున్నదని అనాలేమో! తన 'జాస్మిన్ డేస్' నవలకుగానూ బెన్యామిన్ 2018లో 'జేసీబీ' తొలి బహుమానాన్ని గెలుచుకున్నారు. దీన్ని షెహనాజ్ హబీబ్ ఆంగ్లంలోకి అనువదించారు. 2020 సంవత్సరానికి 'ముస్టాష్' నవలకుగానూ ప్రైజ్ గెలుచుకున్న ఎస్.హరీశ్ ఇటీవలి మలయాళ కళాఖండం అనదగిన సినిమా 'నన్ పగల్ నేరత్తు మయక్కమ్'(పగటి వేళ మైకం)కు రచయిత కావడం విశేషం. హరీశ్ తన నవలను 'మీస' పేరుతో తన మాతృభాషలోనే రాశారు. అది ఆయన తొలి నవల కూడా. 2021లో మరో మలయాళ నవల 'ఢిల్లీ: ఎ సొలిలాక్వీ'ని కూడా ఈ ప్రైజ్ వరించింది. రచయిత ఎం.ముకుందన్. 2019లో 'ద ఫార్ ఫీల్డ్' నవలకుగానూ మాధురీ విజయ్ గెలుచుకున్నారు. ఈమె కర్ణాటకకు చెందినవారు. కానీ ఆంగ్లంలో రాస్తారు.

పేరుకు రెండు తెలుగు రాష్ట్రాలు ఉన్నాయిగానీ ఈ ఐదేళ్లలో ఏ ఒక్క తెలుగు పుస్తకం షార్ట్‌లిస్టు అటుండనీ, లాంగ్‌లిస్టులోకి కూడా రాలేదు. అసలు ఏ ఒక్కటైనా పోటీకి పంపారా అన్నదీ అనుమానమే. అంతకంటేముందు అసలు ఏ పుస్తకాలైనా ఇంగ్లిష్‌లోకి వెళ్తున్నాయా? పోనీ, వెళ్లాల్సినంతగా వెళ్తున్నాయా? అసలు మొత్తంగానే తెలుగు నవల భారతీయ పాఠకుల మనస్సులు గెలుచుకునేంత కళాత్మకంగా ఉంటోందా? ఉంటే, దాన్ని ఇంగ్లిష్‌లోకి చేర్చడంలో ఉన్న అడ్డంకులేమిటి? ఈ బహుమానం అనే కాదు, మన విలువను కట్టడానికి మరొకటైనా పరమ ప్రమాణం కాకపోవచ్చు. కానీ ఆ 'గేమ్'లో మనం అసలంటూ ఎందుకు లేము? దక్షిణాది వరకే పరిమితం అయితే– కన్నడ, తమిళం, మలయాళం అనగానే కొందరు రచయితల పేర్లయినా జాతీయ స్థాయిలో తెలుస్తాయి. అలా తెలిసే తెలుగు రచయితలు ఎవరున్నారు, ఎందరున్నారు? ఇలాంటివి జరగాలంటే ఎలాంటి సంస్థలు, వ్యవస్థలు చొరవ చూపాలి? ఇవన్నీ మనకు మనం వేసుకోవాల్సిన ప్రశ్నలు. సావధానంగా జవాబులు వెతుక్కోవాల్సిన ప్రశ్నలు!

ఈ హత్యల వెనుక ప్రశ్నలు ఎన్నో!

కామెంట్



కరణ్ థాపర్

అతీక్ అహ్మద్, అతడి సోదరుడు అష్రాఫ్‌ల హత్య కేసులో విచారణ ముందుకు సాగితే కనుక... ఆ విచారణ వార్తలను రానున్న కొద్ది వారాల్లో మీడియాలో చదువుతున్నప్పుడు, లేదా చూస్తున్నప్పుడు కొన్ని ప్రశ్నల్ని మీ మదిలో మెదలనివ్వండి. జరిగింది ఏమిటన్న దానికి మనం దగ్గరవుతున్నామా లేక తప్పుదారి పడుతున్నామా అనే విషయాన్ని ఆ ప్రశ్నలు మీకు తెలియజేస్తాయి. సమాధానాలతో ప్రమేయం లేకుండా ప్రశ్నలకుండే ప్రాధాన్యం ప్రశ్నలకు ఎప్పుడూ ఉంటుంది. ఏం జరిగిందన్న విషయమై వాస్తవాన్ని రాబట్టేందుకు అదనంగా... ఎందుకు, ఎలా జరిగిందన్నది తెలుసుకునేందుకు మాత్రమే ముఖ్యం అయిన ప్రశ్నలు కాకపోవచ్చువి. రెండవ ముఖ్యమైన కారణం కూడా ఉంటుంది. జస్టిస్ లోకూర్ అన్నట్లు... "మునుపు ఎన్‌కౌంటర్ మరణాలు ఉంటుండగా... పోలీసు కస్టడీలో జరిగిన అతీక్, అష్రాఫ్‌ల హత్యలు బహుశా మొదటిసారి బయటి వ్యక్తులు చేసినవి.'' అందుకే అనేక ప్రశ్నలు మనల్ని చుట్టుముడతాయి.

బహుశా ఇది సందేహాస్పదమైన ప్రామాణికత గల కథోపాఖ్యానం వంటిది కావచ్చు. తాత్వికురాలు గెర్‌ట్రూడ్ స్టెయిన్స్ మరణశయ్యపై ఉండినప్పుడు... ''సమాధానాలు ఏమిటి?'' అని (ఆమె భర్త) ఆమెను అడిగారట. అప్పుడు ఆమె తీవ్ర ప్రయత్నంతో తనను తాను కూడదీసుకుని, ''మొదట ప్రశ్నలేమిటో అడగండి!'' అన్నారట! ఆమె ప్రశ్న స్పష్టమైనది, సరళమైనది. మీరు అడగడమే తప్పుగా ప్రశ్నలు అడిగితే మీరు ఎన్నటికీ నిజం ఏమిటన్న దానిని పొందలేరు. పోలీసు కస్టడీలో అత్యంత భయానకంగా, నిర్దాక్షిణ్యంగా, వ్యవస్థకే తలవంపుగా జరిగిన అతీక్ అహ్మద్, అతడి సోదరుడు అష్రాఫ్‌ల హత్య కేసు విచారణలో కూడా ఇదే రకమైన ప్రశ్నల ఆలోచనా విధానం ప్రధానంగా ఉండాలి.

సుప్రీంకోర్టు న్యాయమూర్తులుగా ప్రఖ్యాతి గాంచి, పదవీ విరమణ పొందిన వారిలో ఒకరైన జస్టిస్ మదన్ లోకూర్‌తో నేను జరిపిన సంభాషణలో ఆయన లేవనెత్తిన అనేక చిక్కుముడి ప్రశ్నలను ఇప్పుడు మీతో పంచుకోవాలని అనుకుంటున్నాను. చాలా విషయాల్లో జరిగిన తప్పులను ఎత్తిచూపిన ప్రశ్నలవి. అందుకే అవి సత్యానికి తోవ చూపే జాడలు. అతీక్, అష్రాఫ్‌ల హత్య కేసు విచారణ, విచారణ ఫలితాల వెల్లడింపు వార్తలను రానున్న కొద్ది వారాల్లో మీరు చదివేటప్పుడు ఈ ప్రశ్నలను మదిలో ఉంచుకోండి. జరిగింది ఏమిటన్న దానికి మనం దగ్గరవుతున్నామా లేక తప్పుదారి పడుతున్నామా అనే విషయాన్ని ఆ ప్రశ్నలు మీకు తెలియజేస్తాయి.

మొదటి ప్రశ్న. రాత్రి గం.10.30 సమయంలో అతీక్, అష్రాఫ్ సోదరులను వైద్య పరీక్షల కోసం తీసుకెళ్లాల్సిన అవసరం ఏమిటి? 'ఇండియన్ ఎక్స్‌ప్రెస్' చెబుతున్న దానిని బట్టి అతీక్, అష్రాఫ్‌లను ఉంచిన నైనీ జైలు తలుపులను విధిగా సాయంత్రం 6 గంటలకు మూసివేస్తారు. వైద్య చికిత్స అందించవలసిన అత్యవసర పరిస్థితి లేనప్పుడు జైలు వేళల్ని ఉల్లంఘించి మరీ ఎందుకు వారిద్దరినీ బయటికి తీసుకువచ్చారు? వారి పోలీసు కస్టడీ ముగియడానికి మర్నాడు ఆదివారం సాయంత్రం 5 గంటల వరకు సమయం ఉన్నప్పుడు, వారిని ఆదివారం ఉదయం వైద్య పరీక్షలకు తీసుకెళ్లి ఉండవచ్చు కదా! అంతవరకు ఎందుకు ఆగలేదు?



హత్యకు కొద్ది క్షణాల ముందు అతీక్ అహ్మద్ (కుడి), అష్రాఫ్ (ఎడమ)

రెండవది. వాళ్ళిద్దర్ని తీసుకెళుతున్న పోలీస్ జీపు ఆసుపత్రి ప్రాంగణంలోకి ప్రవేశించకుండా ఆసుపత్రి బయట ఉన్న మైదానంలోనే ఎందుకు ఆగిపోయింది? ఆసుపత్రి లోపల పార్కింగ్‌కి చోటు ఉన్నప్పుడు వాళ్లను బయటే దింపి, లోపలికి నడిపించుకుని వెళ్లవలసిన అవసరం ఏముంది? నిజానికి అలా చేయడం అనవసరంగా ప్రమాదానికి తావు కల్పించడమే!

మూడవది. ఆ ఇద్దర్నీ చుట్టుముట్టి ప్రశ్నలు అడిగేందుకు మీడియాను ఎందుకు అనుమతించారు? అయినా రాత్రి 10.30కి వారిని వైద్య పరీక్షలకు తీసుకెళుతున్నట్లు మీడియాకు ఎలా తెలిసింది? ఏ ఆసుపత్రికి తీసుకెళుతున్నారో వాళ్లెలా తెలుసుకోగలిగారు? ఎవరైనా సమాచారం అందించారా? అయితే ఆ అందించిన వారెవరు?

నాల్గవది. రాత్రి పూట అతీక్, అష్రాఫ్‌లను వైద్య పరీలకు తీసుకెళుతున్నట్లు హంతకులకు ఎలా తెలుసు? ఏ ఆసుపత్రికి తీసుకెళుతున్నారో వాళ్లెలా కనిపెట్టగలిగారు? హంతకులు న్యూస్ కెమెరామన్‌ల వేషంలో వచ్చారంటే మీడియా అక్కడికి వస్తుందని ముందే వారికి ఎలా తెలిసింది? ఎవరైనా ఉప్పందించారా? అందిస్తే ఎవరు?

ఐదవది, 'టైమ్స్ ఆఫ్ ఇండియా' చెబుతున్న ప్రకారం 22 సెకన్ల పాటు కాల్పులు కొనసాగాయి. ఆ వ్యవధిలో 14 రౌండ్ల కాల్పులు జరిగాయి. హత్యకు పాల్పడిన ముగ్గురూ వృత్తి ప్రావీణ్యం గలవారిలా కనిపించారని కూడా ఆ పత్రిక రాసింది. అంటే హంతకులు తుపాకీ కాల్చడంలో శిక్షణ పొందినవారా? 7 లక్షల రూపాయల ఖరీదైన టర్కీ పిస్టల్ వారిలో ఒకరి చేతికి ఎలా వచ్చింది? ఈ ప్రశ్న మరింత ముఖ్యమైనది... టర్కీ పిస్టల్స్‌ని ఇండియా నిషేధించడం కనుక నిజమైతే!

ఆరవది. ఎస్కార్ట్ పోలీసులు ఆయుధాలు కలిగి ఉన్నారా? కలిగి ఉంటే, వాళ్లెందుకు తిరిగి కాల్పులు జరపలేదు? ఆయుధాలు లేకుంటే ఎందుకు లేవు? అతీక్‌ను చంపేస్తామనే బెదిరింపు కాల్స్ వస్తున్నాయనీ, అతడికి సాయుధ భద్రత అవసరం అనీ వారికి నిర్ధారణగా తెలిసి కూడా ఎందుకు భద్రతను కల్పించలేదు? భద్రతను అందించకపోవడం నేరపూరితమైన బాధ్యతారాహిత్యంతో సమానం కదా?

ఏడవ ప్రశ్న. హంతకులను పోలీసులు ఎందుకని పోలీస్ కస్టడీకి ఇవ్వమని అడగలేదు? బదులుగా జ్యుడీషియల్ రిమాండ్‌కు ఎందుకు సమ్మతించారు? హంతకులను ప్రశ్నించి, తదుపరి విచారణ జరపవలసిన అవసరం లేదా? అవసరం లేదనుకుంటే, పోలీసులకు ముందే అంతా తెలుసు కనుక... తెలుసుకోడానికి కస్టడీకి తీసుకోవలసిన అవసరం ఏముంది అనే సంకేతం రావడం లేదా? అదే నిజమైతే వారికి ప్రతిదీ ఎలా తెలుసు (ఎందుకు తెలుస్తోంది అని కూడా) అనే ప్రశ్న వస్తుంది.

ఏం జరిగిందన్న విషయమై వాస్తవాన్ని రాబట్టేందుకు అదనంగా... ఎందుకు, ఎలా జరిగిందన్నవి తెలుసుకునేందుకు మాత్రమే ఇవి ముఖ్యమైన ప్రశ్నలు కావు. రెండవ ముఖ్యమైన కారణం కూడా ఉంది. జస్టిస్ లోకూర్ అన్నట్లు... ''మునుపు ఎన్‌కౌంటర్ మరణాలు ఉంటుండగా... పోలీసు కస్టడీలో గత శనివారం రాత్రి (ఏప్రిల్ 15) అతీక్, అష్రాఫ్‌లపై జరిగినవి బహుశా మొదటిసారి బయటి వ్యక్తులు చేసిన హత్యలు.'' ఇలా జరగడమే భయానకం, కలవరపాటు, సిగ్గు చేటు.

ఇలా మళ్లీ జరగకుండా చూసుకోవాలి. లేదంటే ప్రపంచంలోనే అతి పెద్ద ప్రజాస్వామ్యం అని చాటుకునే మన ప్రగల్భాలు– 'ప్రజాస్వామ్యానికి తల్లి వంటిది' అనే తక్కువ సమర్థనీయమైన మాటనైతే పక్కన పెట్టేయండి – నకిలీలా, బోలుగా ధ్వనిస్తాయి. అందుకే జస్టిస్ లోకూర్ ప్రశ్నలు ముఖ్యమైనవి.

వ్యాసకర్త సీనియర్ జర్నలిస్ట్

సోషల్ నెట్ వర్కింగ్ వెబ్‌సైట్లు ఫేస్‌బుక్, ట్విట్టర్‌లలో సెలబ్రిటీల 'మనసులోని మాట'లు తాజాగా ఇలా...!



ఎండలు బాబోయ్!



వాతావరణం గురించి మాట్లాడి బోర్‌కొట్టించే వ్యక్తిగా ఉంటున్నందుకు సారీ. కానీ ఓ మై గాడ్! ముంబయిలో భరించలేనంత వేడిగా ఉంది. – నయోమీ దత్తా, రచయిత్రి

బాధగా ఉండదూ!



గత నాలుగేళ్లలో అమెరికాలోకి అక్రమంగా ప్రవేశిస్తూ 1,49,000 మంది భారతీయులు దొరికిపోయారు. వాళ్లను జో బైడెన్, కమలా హ్యారిస్ 'చెదలు' అని పిలిస్తే ఎలా ఉంటుంది? (రోహింగ్యాలపై విసుర్లను అన్యాపదేశంగా ప్రస్తావిస్తూ) – అశోక్ స్వైన్, ప్రొఫెసర్

అటూ పోయాయి!



క్రీ.పూ. 6,000–2,000 సంవత్సరాల మధ్య మూపురం ఉన్న ఎద్దు, ఎనుములు, ఏనుగులు, లంగూర్ కోతులు, కోళ్లు, నెమళ్లు, కుక్కలు, ఆఖరికి ఎలుకలు కూడా ఇండియా నుంచి 'బయటికి'– పశ్చిమాసియా, స్టెప్పీలకు వెళ్లాయి. అయినప్పటికీ ప్రపంచ మేధావులు, ఎంతోమంది భారతీయులు భారీ భాషా కుటుంబాలు, తెగలు కేవలం ఇండియా 'లోకి' మాత్రమే వచ్చాయని నమ్ముతారు. భవిష్యత్ చరిత్రకారులు నవ్వుతారు! – జోసెఫ్ టి. నూనీ, విశ్లేషకుడు

అవి యాపిల్స్ కాదా?



నాకు ఇప్పటిదాకా వేర్వేరు షాపింగ్ మాల్స్‌లో ఐప్యాడ్, ఐఫోన్, మ్యాక్‌బుక్ లాంటి యాపిల్ ఉత్పత్తులు అమ్ముతున్నవి యాపిల్ స్టోర్లు కాదని తెలీదు. జోక్ కాదు, నిజం చెబ్తున్నా. (కొత్తగా ప్రారంభమైనవి కంపెనీ సొంతంగా నడిపే స్టోర్లు.) – సంజుక్తా బసు, సంపాదకురాలు

ఇవ్వడమే మేలు



మధుమేహం ఉన్న తల్లులు పాలివ్వడం అనారోగ్యకరం అని చాలామంది అనుకుంటారు. నిజానికి, పాలివ్వడం వల్ల తల్లీ, నవజాత శిశువు – ఇద్దరికీ లాభకరం. పాలివ్వడం పిల్లల్ని స్థూలకాయం, టైప్ 2 మధుమేహం నుంచి కాపాడుతుందని దీర్ఘకాల అధ్యయనాలు వెల్లడిస్తున్నాయి. – వి. మోహన్, డయాబెటిస్ స్పెషలిస్ట్

ఏడ్చేశాం



చాలా ఏళ్లుగా కలవని ఒక స్నేహితుడు ఉన్నట్టుండి కనబడ్డాడు. మాటల్లో వాళ్ల నాన్న పోయారని చెప్పాడు. తల్లిదండ్రుల్ని కోల్పోయిన చాలామంది స్నేహితులు ఇంతకుముందూ తెలుసు. కానీ ఈసారి మాత్రం ఈ వార్త గట్టిగా తాకింది. మనందరికీ తెలుసు, ఇలాంటివి ఏదోరోజు ఎదుర్కోవాల్సి ఉంటుందని! కానీ ఎవరమూ సిద్ధంగా ఉండం. తనూ లేడు, నేనూ లేను. గుండె పగిలింది. – నతాషా ఫతాహ్, జర్నలిస్ట్

చారిత్రక జిత్తులు



ఏ జనాన్నయినా గెలవాలనుకుంటే– వాళ్ల జాతి, వాళ్ల వారసత్వం, వాళ్ల సంస్కృతి, ఆధ్యాత్మికతలను రాక్షసమైనవని ఒప్పించాలి. వాళ్ల ప్రాచీనులు అనాగరికులని చెప్పాలి. ఆఫ్రికా విషయంలో జరిగింది ఇదే. మన చదువులు మన మూలాలకు సంబంధించిన ప్రేమను నాశనం చేశాయి. – అడేమోలా, పాన్ ఆఫ్రికనిస్ట్

గ్రహం అనుగ్రహం

శ్రీ శోభకృత్ నామ సంవత్సరం, ఉత్తరాయణం, వసంత ఋతువు, వైశాఖ మాసం, **తిథి:** బ.చవితి ఉ.8.43 వరకు, తదుపరి పంచమి, **నక్షత్రం:** మృగశిర రా.2.30 వరకు, తదుపరి ఆరుద్ర, **వర్జ్యం:** ఉ.6.56 నుండి 8.37 వరకు, **దుర్ముహూర్తం:** ప.12.21 నుండి 1.11 వరకు, తదుపరి ప.2.53 నుండి 3.42 వరకు, **అమృతఘడియలు:** సా.5.08 నుండి 6.51 వరకు.
సూర్యోదయం : 5.43 ; **సూర్యాస్తమయం :** 6.13 ; **రాహుకాలం :** ఉ.7.30 నుండి 9.00 వరకు ; **యమగండం :** ఉ.10.30 నుండి 12.00 వరకు

ఇన్‌బాక్స్

'లింక్' కోసం డబ్బులా?

పాన్ కార్డును ఆధార్‌కు అనుసంధానం (లింక్) చేయనందుకు కేంద్ర ప్రభుత్వం జరిమానా విధించడం న్యాయం కాదు. ఈ ఏడాది ఏప్రిల్ నుంచీ జూన్ నెలాఖరు వరకు ఈ లింక్‌ను చేయించుకోవ డానికి అనుమతిస్తూ రూ. 1,000 జరిమానాగా కేంద్ర ప్రభుత్వం నిర్ణయించింది. దీనికితోడు... లింక్ చేయడానికి వంద, రెండు వందల రూపాయలు 'మీ సేవా' కేంద్రాలలో తీసుకొంటున్నారు. పాన్ కార్డు అంటేనే సామాన్యులలో అత్యధికులకు తెలియదు. పాన్ కార్డు ఆధార్‌కు లింకు చేయక పోతే జూలై నుంచి తమ బ్యాంకు ఖాతా రద్దవుతుందని ఇంకా ఎక్కువ మందికి తెలియదు. ఇన్‌కమ్ టాక్స్ పరిధిలోకి రానివారి పాన్ కార్డ్‌ను ఆధార్‌తో లింక్ చేయాల్సిన అవసరం ఏమిటని చాలామంది మధ్యతరగతివారు ప్రశ్నిస్తున్నారు. అనేక మంది సామాన్యుల దగ్గర ఈ విషయాలను ప్రస్తావిస్తే తమకు ఈ విషయాలేవీ తెలియవన్నారు. ఈ సంగతి సామాన్యులకే కాదు. నిత్యం పేపర్లు చదివేవారికి, టీవీ వార్తలు చూసేవారికి కూడా తెలియక పోవడం గమనార్హం.

అంటే ఆధార్‌కు పాన్‌ను లింక్ చేయాలనే విషయంపై తగిన ప్రచారం జరగలేదన్నమాట. విస్తృత ప్రచారం చేయకుండా జరిమానా వేయడాన్ని కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ సమర్థించుకోవడం గర్హనీయం. జీరో ఎకౌంట్ వల్ల, డ్వాక్రా గ్రూపుల వల్ల ప్రతి కుటుంబానికి కనీసం రెండు బ్యాంకు ఎకౌంట్లు ఉన్నాయి. బ్యాంకులలో జీరో ఎకౌంటు తెరిచి లావాదేవీలు జరిపితే పది వేల రూపాయల వరకు అప్పు ఇస్తామని గతంలో కేంద్ర ప్రభుత్వం ప్రకటించింది. అది అమలుకు నోచుకోలేదు.


జీరో ఎకౌంట్‌లో కూడా కనీస నగదు ఉంటేనే లావాదేవీలు జరుగుతాయని బ్యాంకు అధికారులు అనడంతో ఖాతాదారులు కనీస నగదును ఎకౌంట్‌లో ఉంచవలసి వచ్చింది. దీంతో బ్యాంకులకు కోట్లాది రూపాయలు చేరినట్లు వార్తలు వచ్చాయి. ఇదే సమయంలో కార్పొరేట్ కంపెనీలకు మాత్రం 10 లక్షల కోట్ల రూపాయల పైగా రుణమాఫీ చేశారు. కార్పొరేట్ పన్ను 30 శాతం నుంచీ 22 శాతానికి తగ్గించారు. కాకులను కొట్టి గద్దలకు వేయడమంటే ఇదే! సామాన్యుని పాన్ కార్డ్‌ను ఆధార్‌కు లింకు చేయాలనే నిబంధనను రద్దు చేయాలి. లేదా జరిమానా రద్దు చేయాలి.

– బి.బి. రామకృష్ణారావు; సామర్లకోట, కాకినాడ జిల్లా

సాక్షి ఎడిటోరియల్ పేజీకి వ్యాసాలను, అభిప్రాయాలను యూనికోడ్‌లో పంపాలి. ఎక్కడా పరిశీలనలో లేనట్టు హామీపత్రం జతచేయాలి. ఈ–మెయిల్: editpage@sakshi.com

ఇది పాక్ నుంచి మనం నేర్చుకోవాల్సిందే!

అభిప్రాయం



మంగారి రాజేందర్

పాకిస్తాన్ నుంచి భారతదేశం నేర్చుకునే విషయాలు చాలా తక్కువ. కానీ ఆ దేశం నుంచి కూడా మనం నేర్చుకునే విషయాలు ఉన్నాయని లాహోర్ హైకోర్టు ఈ మధ్య ఇచ్చిన 'రాజద్రోహం రద్దు' తీర్పు చూసిన తరువాత అనిపిస్తుంది. పాకిస్తాన్ పీనల్ కోడ్‌లో ఉన్న సెక్షన్ 124(ఏ) అనేది రాజ్యాంగ విరుద్ధమని కోర్టు తీర్పును ప్రకటించింది. ఆ నిబంధన దుర్వినియోగం అవుతోందనీ, అది వలసవాదులు వదిలిన అవశేషమనీ లాహోర్ హైకోర్టు పేర్కొంది. ప్రభుత్వాలు తమ ప్రత్యర్థులకి వ్యతిరేకంగా ఈ నిబంధనను ఉపయోగిస్తున్నాయని దాఖలైన బ్యాచ్ పిటిషన్లను విచారించిన హైకోర్టు న్యాయమూర్తి షాహిద్ కరీమ్ ఈ నిబంధనును రద్దు చేశారు.

పాకిస్తాన్ మాజీ నియంత జనరల్ పర్వేజ్ ముషారఫ్ 2007వ సంవత్సరంలో రాజ్యాంగాన్ని తారుమారు చేసినందుకు... 2019వ సంవత్సరంలో ఆయనను దోషిగా నిర్ధారించి, మరణశిక్షను విధించిన న్యాయమూర్తి జస్టిస్ కరీం. మన దేశం, పాకిస్తాన్ ఇరుదేశాలూ ఈ నిబంధనను బ్రిటిష్ వాళ్ళ దగ్గర నుంచి వారసత్వంగా పొందినవే. భారతీయులను అణచివేయడానికి బ్రిటిష్ ప్రభుత్వం తయారు చేసిన నిబంధన సెక్షన్ 124(ఏ). భిన్నాభిప్రాయాలు వ్యక్తపరిచిన వ్యక్తులనూ, అదే విధంగా అప్పుడు జరుగుతున్న అన్యాయాలకు వ్యతిరేకంగా గొంతెత్తిన వ్యక్తులనూ అణచి వేయడానికి తయారు చేసిన నిబంధన ఇది. మహాత్మాగాంధీ, బాలగంగాధర్ తిలక్ లాంటి వ్యక్తులు అందరూ ఈ నిబంధన బాధితులే.

సెక్షన్ 124 (ఏ) నిబంధనను సుప్రీంకోర్టు గత సంవత్సరం రద్దు చేసింది. అంటే కేంద్ర ప్రభుత్వం ఈ నిబంధనను పునఃపరిశీలించే వరకు ఈ నిబంధనను ఆపేసింది. సుప్రీంకోర్టు జారీ చేసిన మధ్యంతర ఉత్తర్వుల ప్రకారం ఈ నిబంధన కింద కేసులను నమోదు చేయకూడదు. దీని కింద అభియోగాలు ఉన్న అన్ని విచారణలనూ, అప్పీళ్లనూ, ఇతర ప్రొసీడింగ్స్‌నూ ఉపసంహరించుకోవాలని సుప్రీంకోర్టు త్రిసభ్య ధర్మాసనం భారత ప్రభుత్వాన్ని కోరింది. భారత ప్రభుత్వం దీనిని ఉపసంహరించడానికి ఎలాంటి ఆసక్తినీ కనబరచడం లేదు. సుప్రీంకోర్టు చెప్పినట్టు భారత ప్రభుత్వం పునఃపరిశీలన కూడా చేయలేదు. మన సుప్రీంకోర్టు భారత ప్రభుత్వాన్ని ఈ నిబంధనను తొలగించడానికి చర్యలు తీసుకోవాలని లేదా పరిశీలించాలని చెప్పింది. కానీ రద్దు చేయలేదు. కానీ పాకిస్తాన్ హైకోర్టు మన సుప్రీంకోర్టు కన్నా నాలుగు అడుగులు ముందుకు వేసి దీనిని రద్దు చేసింది. అది రాజ్యాంగ విరుద్ధమని కూడా ప్రకటించింది. అందుకని మనం ఈ విషయంలో పాకిస్తాన్ నుంచి నేర్చుకోవాల్సి ఉంది.

సెక్షన్ 124 (ఏ) అనేది మన దేశంలో, పాకిస్తాన్‌లో ఒకే విధంగా ఉంది. ఎవరైనా, మాటల ద్వారా, ద్వేషం వల్ల ధిక్కారాన్ని తీసుకొని రావడానికి ప్రయత్నం చేసినా, లేదా ప్రభుత్వం పట్ల అసంతృప్తిని ప్రేరేపించడానికి లేదా ప్రేరేపించ ప్రయత్నం చేసినా... వాళ్ళను ఈ నిబంధన కింద శిక్షించడానికి అవకాశం ఉంది. 1962వ సంవత్సరంలో 'కేదార్‌నాథ్' కేసులో ఈ నిబంధన చెల్లుబాటును సుప్రీంకోర్టు సమర్థించింది. కానీ దీని పరిధిని పరిమితం చేసింది.

అశాంతి సృష్టించే ఉద్దేశంతో లేదా హింసను



ప్రేరేపించే చర్యలకు మాత్రమే ఈ నిబంధనను పరిమితం చేయాలని కోర్టు నిర్దేశించింది. కానీ పాలకులు దీన్ని పట్టించుకోలేదు. నిబంధనలో ఉన్న అంశాలను అక్షరాలా అర్థం చేసుకున్నారు. ప్రభుత్వానికి, దేశానికి మధ్య ఉన్న వ్యత్యాసాన్ని గుర్తించలేదు. నినాదాలు చేసినందుకు, శాంతియుతంగా నిరసన తెలిపినా, ప్రభుత్వాన్ని విమర్శిస్తూ పోస్టులను పెట్టినా వారిపై తరచూ దేశద్రోహ కేసులను నమోదు చేస్తున్నారు.

ఈ మధ్యకాలంలో ఇలాంటి కేసుల సంఖ్య పెరిగిపోయింది. దేశ పౌరులను బెదిరించడం సర్వసాధారణమై పోయింది. పాకిస్తాన్‌లో నెలకొని ఉన్న ప్రస్తుత రాజకీయ గందరగోళంలో ఈ నిబంధనను రద్దు చేయడం చరిత్రాత్మకమైన విషయంగా పేర్కొనవచ్చు. మన దేశంలో అలాంటి పరిస్థితులు లేవు. భారత పౌరుల హక్కులను ఇది కాలరాస్తోంది. ప్రజాస్వామ్య వ్యవస్థలో ఇది ఉండటానికి వీల్లేదు. చాలా ప్రజాస్వామ్య దేశాలు దీన్ని రద్దు చేశాయి. పాకిస్తాన్ ప్రభుత్వం నుంచి ఈ నిబంధన రద్దు గురించి స్పందన కన్పించలేదు. కానీ ఆ దేశంలోని రాజకీయ పక్షాలు, పౌరులు, జర్నలిస్టులు, న్యాయవాదులు ఈ తీర్పును స్వాగతిస్తున్నారు. పాకిస్తాన్‌లోని మానవ హక్కుల కమిషన్ కూడా ఈ రద్దును స్వాగతించింది.

భారత ప్రభుత్వం బ్రిటిష్ వాళ్ల దగ్గర నుంచి మనకు సంక్రమించిన చాలా శాసనాలను పురాతనమైనవిగా భావించి రద్దు చేసింది. దాదాపుగా 1500 చట్టాలను తొలగించింది. కాని, ఈ నిబంధనను తొలగించడానికి ఉత్సుకత చూపించడం లేదు. భారతదేశ మొదటి ప్రధాని దీని బాధితుడే. కానీ – భారత రాజ్యాంగానికి చేసిన మొదటి సవరణ ప్రకారం భావ ప్రకటనా స్వేచ్ఛకు పరిమితులు ఏర్పడినాయి. ఇందిరాగాంధీ హయాంలో సెక్షన్ 124 (ఏ)ను కాగ్నిజబుల్ నేరంగా మార్చారు. అది 1974 నుంచి అమల్లోకి వచ్చింది.

ఈ నిబంధన దుర్వినియోగం జరుగుతున్నా పాలకులు దీనిని తొలగించడానికి ఇష్టపడడం లేదు. లాహోర్ హైకోర్టు తీర్పుతోనైనా మన దేశంలోనూ దీనిని త్వరగా తొలగిస్తే మన ప్రజాస్వామ్యానికి మేలు జరుగుతుంది.

వ్యాసకర్త మాజీ జిల్లా జడ్జి

దేశంలోనే మేటి.. కర్నూలు సీడ్

ఖరీఫ్ వస్తుందంటే సగానికి పైగా రాష్ట్రాల దృష్టి ఇక్కడే

- కర్నూలు నుంచి రూ.500 కోట్ల విలువైన విత్తనాల ఎగుమతి
- వ్యవసాయ సీజన్ దగ్గర పడుతుండటంతో ముమ్మరంగా విత్తన ప్రాసెసింగ్
- ఇటీవల ప్రాసెసింగ్‌ను పరిశీలించిన రాజస్థాన్ బృందం
- బీటీ పత్తి సహా అన్ని రకాల విత్తనోత్పత్తికి వేదిక



ముమ్మరంగా సాగుతున్న మొక్కజొన్న సీడ్ ప్రాసెసింగ్

కర్నూలు (అగ్రికల్చర్): కర్నూలు.. విత్తనాల సీజన్‌లో దేశంలోని రైతులకు.. ముఖ్యంగా ఉత్తరాది రైతులకు గుర్తుకు వచ్చే పేరిది. దేశంలోనే పెద్ద విత్తన కేంద్రంగా ఉమ్మడి కర్నూలు జిల్లా విరాజిల్లుతోంది. ఏటా రూ.500 కోట్ల విలువ చేసే విత్తనాలు ఇక్కడి నుంచి పలు రాష్ట్రాలకు ఎగుమతి అవుతున్నాయి. ఖరీఫ్ సీజన్ దగ్గర పడుతుండటంతో ప్రస్తుతం విత్తన ప్రాసెసింగ్ ముమ్మరంగా సాగుతోంది. ఆంధ్రప్రదేశ్ నుంచి ఇతర రాష్ట్రాలకు ఎగుమతి అయ్యే విత్తనాల్లో 50 శాతం కర్నూలు జిల్లా నుంచే ఉండటం విశేషం. రాష్ట్రం నుంచి ఏటా ఇతర రాష్ట్రాలకు రూ.1000 కోట్ల విలువైన విత్తనాలు వెళ్తుండగా.. ఇందులో సగం జిల్లా నుంచే ఎగుమతి అవుతున్నాయి. మహారాష్ట్ర, రాజస్థాన్, ఉత్తరప్రదేశ్, బిహార్, పశ్చిమ బెంగాల్, పంజాబ్, కర్ణాటక, హరియాణా, ఒడిశా, గుజరాత్ తదితర రాష్ట్రాలకు బీటీ పత్తి విత్తనాలతో పాటు మొక్కజొన్న, జొన్న, సజ్జల్లో హైబ్రిడ్ విత్తనాలు, వేరుశనగ, మినుము, పెసర, జనపనార, వరి తదితర విత్తనాలు ఎగుమతి అవుతున్నాయి.

వ్యవసాయ సీజన్ మొదలవుతుందంటే సగానికి పైగా రాష్ట్రాల అధికారులు విత్తనాల కోసం కర్నూలుకు క్యూ కడతారు. ఇప్పటికే రాజస్థాన్ రాష్ట్ర విత్తనాభివృద్ధి సంస్థ మేనేజింగ్ డైరెక్టర్, జనరల్ మేనేజర్ తదితరులు ఇక్కడికి వచ్చి మొక్కజొన్న, సజ్జ, జొన్న విత్తనాల నాణ్యత, ప్రాసెసింగ్‌ను రెండు రోజుల పాటు పరిశీలించారు. ఒక్క రాజస్థాన్‌కే దాదాపు రూ.50 కోట్ల విలువ చేసే విత్తనాలు ఎగుమతి అవుతున్నాయి. మహారాష్ట్ర విత్తన అవసరాలన్నీ కర్నూలు జిల్లా ద్వారానే తీరుతున్నాయి. మహారాష్ట్ర ప్రభుత్వం విత్తనాభివృద్ధి సంస్థ ప్రాంతీయ కార్యాలయాన్ని కూడా కర్నూలులోనే ఏర్పాటు చేసింది. వివిధ విత్తన కంపెనీలతో విత్తనోత్పత్తి చేయిస్తూ నాణ్యతా ప్రమాణాలను పర్యవేక్షిస్తోంది. కర్నూలు నుంచి అసోం, పశ్చిమ బెంగాల్ రాష్ట్రాలకు జనపనార విత్తనాలు, అసోం, బిహార్, ఉత్తరప్రదేశ్, రాజస్థాన్, పంజాబ్ రాష్ట్రాలకు హైబ్రిడ్ మొక్కజొన్న, సజ్జ విత్తనాలు ఎగుమతి అవుతున్నాయి. గుజరాత్, హరియాణాకు పత్తి, మొక్కజొన్న, వరి విత్తనాలు ఎగుమతి అవుతున్నాయి.

విత్తనోత్పత్తిలో బహుళజాతి కంపెనీలు

ఉమ్మడి కర్నూలు జిల్లాలో దేశీయ కంపెనీలతో పాటు బహుళ జాతి సంస్థలు కూడా విత్తనోత్పత్తి చేస్తున్నాయి. నూజివీడు, గంగా–కావేరి, సింజెంటా, కావేరి, బేయర్, పయనీర్, మహికో, అంకూర్, తులసీ సీడ్ కంపెనీలు జిల్లాలో బీటీ పత్తితో సహా వివిధ విత్తనాలను ఉత్పత్తి చేస్తున్నాయి. జాతీయస్థాయి విత్తన సంస్థలు కూడా ఇక్కడ ప్రధానా కార్యాలయాలను ఏర్పాటు చేసుకోవడం విశేషం. బహుళ జాతి కంపెనీలు కర్నూలు, నంద్యాల, ఆదోని, ఎమ్మిగనూరు కేంద్రాలుగా ఉన్న విత్తన కంపెనీల భాగస్వామ్యంతో విత్తనాలను ఉత్పత్తి చేస్తున్నాయి. నంద్యాల జిల్లాలోని వివిధ ప్రాంతాలు వరి, మొక్కజొన్న విత్తనోత్పత్తికి పెట్టింది పేరు.



కర్నూలు విత్తన ప్రాసెసింగ్‌ను పరిశీలిస్తున్న రాజస్థాన్ సీడ్ కార్పొరేషన్ ఎండీ, జీఎం తదితరులు

రైతులకు లాభసాటి

విత్తనోత్పత్తి ద్వారా రైతులకు రెట్టింపు లాభాలు వస్తాయి. జిల్లాలో దాదాపు 10 వేల మంది రైతులు 25 వేల నుంచి 30 వేల ఎకరాల్లో విత్తనోత్పత్తి చేస్తున్నారు. ఒక్కో రైతు 2 – 4 ఎకరాల వరకు విత్తనం సాగు చేస్తున్నారు. ఉదాహరణకు మొక్కజొన్నకు మార్కెట్‌లో క్వింటాకు నాణ్యతను బట్టి రూ.1,600 నుంచి రూ.2,000 వరకు ధర లభిస్తోంది. అదే విత్తనమైతే క్వింటాకు రూ.5 వేల నుంచి రూ.6 వేల వరకు ధర లభిస్తుంది. ఉత్పాదకతను బట్టి విత్తన కంపెనీలు ధరను ఇస్తాయి. దిగుబడి ఎక్కువగా ఉంటే ధర కొంచెం తక్కువగా, తక్కువగా ఉంటే ఎక్కువ ధర లభిస్తుంది. విత్తన కంపెనీలు యూనివర్సిటీలతో ఎంవోయూ చేసుకొని బ్రీడర్ సీడ్ తెప్పిస్తారు. ఆ సీడ్‌ను ఎంపిక చేసుకున్న కొంత మంది రైతులకు ఇచ్చి, దాని ద్వారా ఫౌండేషన్ సీడ్ ఉత్పత్తి చేయిస్తారు. తద్వారా సర్టిఫైడ్ సీడ్ ఉత్పత్తి అవుతుంది.. విత్తనోత్పత్తి ద్వారా రైతులు పండించిన పంటలకు 50 శాతం అధిక ధర లభిస్తోంది. ఏ కంపెనీ విత్తనోత్పత్తి చేయిస్తుందో.. అదే కంపెనీ రైతుల నుంచి సీడ్‌ను కొంటుంది.

ప్రభుత్వ ప్రోత్సాహం

వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చాక విత్తనోత్పత్తిని ప్రోత్సహిస్తోంది. కర్నూలు నగరానికి సమీపంలోని ఓర్వకల్లు ఇండస్ట్రియల్ హబ్‌లో విత్తన ప్రాసెసింగ్ యూనిట్లు, విత్తన పరిశ్రమలకు ప్రత్యేకంగా భూములు కేటాయిస్తోంది. ఇండస్ట్రియల్ హబ్‌లో సీడ్ ప్రాసెసింగ్ యూనిట్లు ఏర్పాటు చేసేందుకు ఇప్పటికే 80 కంపెనీలు ముందుకు రావడం విశేషం. ఈ కంపెనీలకు ప్రభుత్వం పలు రాయితీలు ఇచ్చేందుకు సిద్ధంగా ఉంది.

విత్తనోత్పత్తి మరింత వృద్ధి చెందాలంటే..

విత్తనోత్పత్తికి జిల్లా భూములు, వాతావరణం అనుకూలం. ఇక్కడ విత్తన ధ్రువీకరణ సంస్థ కూడా ఉంది. విత్తనోత్పత్తికి ముందుకు వచ్చే రైతులకు రాయితీలు ఇవ్వాల్సిన అవసరం ఉందని నిపుణులు చెబుతున్నారు. విత్తన సంస్థలు, ప్రాసెసింగ్ యూనిట్లకు కూడా పెట్టుబడి రాయితీ, సబ్సిడీ, విద్యుత్ రాయితీలు వంటివి ఇవ్వాల్సిన అవసరం ఉందని తెలిపారు. కర్నూలును పత్తి విత్తన కేంద్రంగా, నంద్యాల వరి విత్తన కేంద్రంగా, తంగెడంచ ఫారాన్ని కూరగాయల విత్తనాలు, ఇతర విత్తనాల ఉత్పత్తి కేంద్రంగా అభివృద్ధి చేయవచ్చని, దేశవాళీ విత్తనాలను మరింతగా ప్రోత్సహించాలని తెలిపారు.

దేశంలోనే సీడ్ హబ్‌గా కర్నూలు



విత్తనోత్పత్తి, విత్తన పరిశ్రమకు కర్నూలు జిల్లా దేశంలో పెట్టింది పేరు. 2000 సంవత్సరానికి ముందు దేశం మొత్తానికి అవసరమైన విత్తనాల్లో 75 శాతం ఇక్కడే ఉత్పత్తి అయ్యేవి. నాటితో పోలిస్తే నేడు విత్తనోత్పత్తి తగ్గింది. అయినప్పటికీ వివిధ రాష్ట్రాలు విత్తనాల కోసం కర్నూలు వైపు చూస్తున్నాయి. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఓర్వకల్లు ఇండస్ట్రియల్ హబ్‌లో సీడ్ ప్రాసెసింగ్ యూనిట్ల ఏర్పాటుకు భూములు కేటాయించడంతో పాటు రాయితీలు ఇస్తోంది. మరింతగా ప్రోత్సహించాల్సిన అవసరం ఉంది.

– ఎంవీ రెడ్డి, చైర్మన్, సీడ్ మెన్ అసోసియేషన్, కర్నూలు జిల్లా

దేశంలోని సగం రాష్ట్రాలకు కర్నూలు విత్తనం



ఖరీఫ్ సీజన్ దగ్గర పడుతుండటంతో వివిధ రాష్ట్రాలకు విత్తనాలు ఎగుమతి చేసేందుకు ముమ్మరంగా ప్రాసెసింగ్ జరుగుతోంది. విత్తనోత్పత్తికి జిల్లాలోని భూములు చాల అనుకూలమైనవి. బహుళ జాతి కంపెనీలు కూడ ఇక్కడ విత్తనోత్పత్తి చేస్తున్నాయి. విత్తనోత్పత్తి రైతులకు లాభసాటిగా ఉంటోంది.

– మురళీధర్‌రెడ్డి, చైర్మన్, తెలుగు రాష్ట్రాల సీడ్ మెన్ అసోషియేషన్



అమరావతి అంటే నీకు, నీ వాళ్లకే సొంతమా బాబూ?

- బహుజన పరిరక్షణ సమితి నేతలు
- 938వ రోజుకు చేరిన రిలే దీక్షలు



రిలే దీక్షల్లో బహుజన పరిరక్షణ సమితి నేతలు

తాడికొండ: అమరావతిలో ఉన్న తను, తనవారి ఆస్తులు కాపాడుకునేందుకే రాజధాని పేరుతో చంద్రబాబు అరాచకాలు సృష్టిస్తున్నాడని బహుజన పరిరక్షణ సమితి నేతలు మండిపడ్డారు. తుళ్లూరు మండలం తాళ్లాయపాలెం సీడ్ యాక్సిస్ రోడ్డు జంక్షన్‌లో మూడు రాజధానులకు మద్దతుగా బహుజన పరిరక్షణ సమితి ఆధ్వర్యంలో చేపట్టిన రిలే నిరాహార దీక్షలు ఆదివారం నాటికి 938వ రోజుకు చేరాయి. పలువురు ముఖ్య అతిథులు దీక్ష శిబిరాన్ని సందర్శించి మాట్లాడారు. ప్రభుత్వం పేదల కోసం ఈ ప్రాంతంలో భూములిస్తుంటే రైతుల ముసుగులో ఉన్న టీడీపీ నాయకులు అడ్డుకోవడం వెనుక బాబు అండ్ కో కుట్రలు దాగున్నాయన్నారు. ఐదు శాతం స్థానికేతరులకు ఈ ప్రాంతంలో అవకాశం కల్పించేలా చట్టంలో పొందుపరిచి ఉందని, ఆ మేరకు అమరావతిలో నిరుపేదలకు స్థలాలిచ్చే కార్యక్రమం కొనసాగుతుంటే.. వీరికి వచ్చిన అడ్డంకి ఏంటో చెప్పాలన్నారు. పేదలకు ఇళ్ల స్థలాలివ్వడంపై కోర్టుల్లో తప్పుడు కేసులు వేసిన కులవాదులకు కోర్టు అక్షింతలు వేసినా అడ్డదారిలో వెళుతూ భూముల చదును కార్యక్రమాన్ని అడ్డుకోవడం దుర్మార్గమన్నారు. రాజధాని అంటే తనకు, తన సామాజిక వర్గానికే సొంతమన్నట్టుగా చంద్రబాబు.. ఈ ప్రాంతంలో పేదలకు స్థానం లేకుండా చేసేందుకు నానా తంటాలు పడుతున్నాడని ధ్వజమెత్తారు. కార్యక్రమంలో బహుజన పరిరక్షణ సమితి నేతలు మాదిగాని గురునాథం, నూతక్కి జోషి, పల్లె బాబు తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా...

27 నుంచి బ్రహ్మంగారి ఆరాధనోత్సవాలు

- మే 1న రథోత్సవం



బ్రహ్మంగారిమఠం (వైఎస్సార్ జిల్లా): వైఎస్సార్ జిల్లాలోని బ్రహ్మంగారి మఠంలో ఈ నెల 27 నుంచి శ్రీ జగద్గురు మద్విరాట్ పోతులూరు వీరబ్రహ్మేంద్రస్వామి ఆరాధన గురుపూజోత్సవాలు వైభవంగా నిర్వహించనున్నారు. ఆయన క్రీ.శ.1693నకు సరియగు శ్రీముఖ నామ సంవత్సర వైశాఖ శుద్ధ దశమినాడు సజీవ సమాధి నిష్ట వహించారు. అప్పటి నుంచి ఈ సందర్భాన్ని పురస్కరించుకుని ఏటా ఆరాధనోత్సవాలు నిర్వహిస్తున్నారు. ఈ ఏడాది ఈ నెల 27 నుంచి మే 2 వరకు ఆరు రోజుల పాటు నిర్వహిస్తారు. ఇందులో ప్రధానంగా ఈ నెల 30న వైశాఖ శుద్ధ దశమినాడు ఆరాధన కార్యక్రమం ఉంటుంది. మే 1న రథోత్సవం, 2న మహాప్రసాదం వినియోగం ఉంటాయి. ఉభయ తెలుగు రాష్ట్రాలతోపాటు తమిళనాడు, కర్ణాటక, మహారాష్ట్ర తదితర ప్రాంతాల నుంచి భక్తులు, మాలధారులు తరలిరానున్నారు. ఆరాధనోత్సవాలకు ఏర్పాట్లు పూర్తి చేస్తున్నామని మఠం ఫిట్‌పర్సన్ సి.శంకర్‌బాలాజి తెలిపారు.

ఢిల్లీలో శ్రీ వేంకటేశ్వరస్వామి వారి వార్షిక బ్రహ్మోత్సవాలు

- మే 4 నుంచి 12 వరకు నిర్వహణ

సాక్షి, న్యూఢిల్లీ: దేశ రాజధాని ఢిల్లీలోని గోల్ మార్కెట్ సమీపంలో టీటీడీ ఆధ్వర్యంలో నిర్వహిస్తోన్న శ్రీ వేంకటేశ్వర స్వామి ఆలయంలో మే 4 నుంచి 12 వరకు వార్షిక బ్రహ్మోత్సవాలు జరగనున్నాయి. దీనికి సంబంధించి ఏప్రిల్ 25న ఆలయ శుద్ధి చేపట్టి, మే 3న అంకురార్పణం నిర్వహిస్తారు. 4న ఉదయం 8.30– 9.30 గంటల మధ్య వృషభ లగ్నంలో ధ్వజారోహణం చేపడతారు. బ్రహ్మోత్సవాల్లో ఉదయం 8–9 గంటల వరకు, రాత్రి 7.30–8.30 గంటల వరకు వాహన సేవలు జరుగుతాయి. 4న పెద్ద శేష వాహనం, 5న చిన్న శేష వాహనం, హంస వాహనం, 6న సింహ వాహనం, ముత్యపు పందిరి వాహనం, 7న కల్పవృక్ష వాహనం, సర్వ భూపాల వాహనం, 8న మోహినీ అవతారం, కల్యాణోత్సవం, గరుడ వాహనం, 9న హనుమంత వాహనం, గజవాహనం, 10న సూర్య ప్రభ వాహనం, చంద్రప్రభ వాహనం, 11న రథోత్సవం, అశ్వ వాహనం, 12న చక్ర స్నానం, ధ్వజావరోహణం, 13న పుష్పయాగం నిర్వహిస్తారు.

తిరుమలలో పీఏసీ-1 వద్ద ఫుడ్ కౌంటర్ ప్రారంభం



ఫుడ్ కౌంటర్‌లో ఆహారం పంపిణీ చేస్తున్న టీటీడీ అధికారులు

తిరుమల: తిరుమలలో పీఏసీ–1 వద్ద ఆదివారం ఫుడ్ కౌంటర్‌ను టీటీడీ ప్రారంభించింది. ఇక్కడ ఉదయం 10.30 నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు, సాయంత్రం 6.30 నుంచి రాత్రి 9.30 గంటల వరకు అన్నప్రసాదాలు పంపిణీ చేస్తుంది. పీఏసీ–1లో బసచేసే భక్తులకు ఈ కౌంటర్ సౌకర్యవంతంగా ఉంటుంది. తిరుమలలో మాతృశ్రీ తరిగొండ వెంగమాంబ అన్నప్రసాద భవనంతో పాటు పాత అన్నదానం కాంప్లెక్స్, పీఏసీ–2లో అన్నప్రసాద వితరణ జరుగుతోంది. వీటితోపాటు రాం భగీచా బస్టాండ్, కేంద్రీయ విచారణ కార్యాలయం వద్ద ఫుడ్ కౌంటర్లున్నాయి.

మరో నకిలీ వెబ్‌సైట్‌పై ఎఫ్ఐఆర్ నమోదు

టీటీడీ పేరుతో ఉన్న మరో నకిలీ వెబ్‌సైట్‌ను టీటీడీ ఐటీ విభాగం గుర్తించి తిరుమల వన్ టౌన్ పోలీసులకు ఫిర్యాదు చేసింది. దీనిపై పోలీసులు ఎఫ్ఐఆర్ నమోదు చేసి దాన్ని ఏపీ ఫోరెన్సిక్ సైబర్ సెల్‌కు అప్పగించారు. సైబర్ సెల్ అధికారులు నకిలీ వెబ్‌సైట్‌పై విచారణ ప్రారంభించారు. ఇదివరకే 40 నకిలీ వెబ్‌సైట్లపై కేసులు నమోదు కాగా, దీంతో కలిపి కేసుల సంఖ్య 41కి చేరింది. https:// tirupatibalaji.ap.gov.in అధికారిక వెబ్‌సైట్ కాగా, చిన్న మార్పులతో రూపొందించిన https:// tirupatibalaji&ap&gov.org/ నకిలీ వెబ్‌సైట్‌ను టీటీడీ తాజాగా గుర్తించింది.

కనుల పండువగా చందనోత్సవం

- 2.25 లక్షల మందికి అప్పన్న నిజరూప దర్శన భాగ్యం
- పట్టువస్త్రాలు సమర్పించిన మంత్రి సత్యనారాయణ, టీటీడీ చైర్మన్ వైవీ సుబ్బారెడ్డి
- తొలి దర్శనం చేసుకున్న అనువంశిక ధర్మకర్త అశోక్ గజపతిరాజు



శ్రీవరాహ లక్ష్మీనృసింహస్వామి వారి నిజరూప దర్శనం కోసం క్యూలైన్లలో బారులుతీరిన భక్తులు

సాక్షి, విశాఖపట్నం: వైశాఖ శుద్ధ తదియను పురస్కరించుకుని సింహాచల శ్రీ వరాహ లక్ష్మీ నృసింహస్వామివారి చందనోత్సవం ఆదివారం వైభవంగా జరిగింది. ఏడాదిలో ఒక్కరోజు మాత్రమే లభించే స్వామివారి నిజరూప దర్శనం చేసుకునేందుకు భక్త జనం భారీగా తరలివచ్చారు. పాంచరాత్ర ఆగమ శాస్త్ర ప్రకారం ఉదయం ఒంటి గంటకు స్వామిని అర్చకులు సుప్రభాత సేవతో మేల్కొలిపి చందనం ఒలుపుని (స్వామిపై ఉన్న చందనాన్ని తొలగించడం) నిర్వహించారు. నాదస్వర వాయిద్యాలు, చతుర్వేదాలు, పురాణ, ఇతిహాస, క్షేత్ర మహాత్మ్యం పారాయణాలు జరుగుతుండగా అర్చకులు వైదికాదికాలు పూర్తి చేశారు. వెండి బొరిగెల సాయంతో పట్టు వస్త్రాన్ని, శ్రీగంధాన్ని తొలిచి స్వామిని నిజరూపంలోకి తీసుకువచ్చారు. పవిత్ర జలాలతో అర్చకులు స్వామికి తిరుమంజనం నిర్వహించారు. ఆరాధన నిర్వహించి సంప్రదాయం ప్రకారం దేవస్థానం అనువంశిక ధర్మకర్త పూసపాటి అశోక్ గజపతిరాజు దంపతులకు స్వామివారి తొలి దర్శనాన్ని కల్పించారు. రాష్ట్ర ప్రభుత్వం తరపున ఉప ముఖ్యమంత్రి, దేవదాయ శాఖ మంత్రి కొట్టు సత్యనారాయణ, టీటీడీ తరపున చైర్మన్ వైవీ సుబ్బారెడ్డి స్వామివారికి పట్టువస్త్రాలు సమర్పించారు. తెల్లవారుజామున 3.30 గంటల నుంచి సర్వ దర్శనానికి అనుమతించారు. దర్శనానికి విశాఖ శ్రీ శారదాపీఠాధిపతి స్వరూపానందేంద్ర సరస్వతి, ఉత్తరాధికారి స్వాత్మానందేంద్ర సరస్వతి, ఉప ముఖ్యమంత్రి పీడిక రాజన్నదొర, మంత్రులు గుడివాడ, బొత్స, సీదిరి, డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి, హైకోర్టు న్యాయమూర్తులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు వచ్చారు.

ట్రాఫిక్ జామ్

అనూహ్యంగా పెరిగిన భక్తుల రద్దీతో సింహాచలం ఘాట్ రోడ్డుపై గంటల తరబడి ట్రాఫిక్ ఏర్పడింది. ఉదయం నుంచి సాయంత్రం వరకు ఈ ట్రాఫిక్ జామ్ కొనసాగింది. దీంతో కొండ దిగువ నుంచి పైకి, పై నుంచి కిందకు వాహనాలు వెళ్లేందుకు వీలు పడలేదు. ట్రాఫిక్ క్లియర్ చేయడానికి పోలీసులు ప్రయత్నించినా ఫలితం లేకుండా పోయింది. కొండ పైకి 56 ఆర్టీసీ, మరికొన్ని ప్రైవేటు బస్సులను సమకూర్చినా పూర్తి స్థాయిలో వినియోగంలోకి రాక భక్తులు ఇబ్బందులు పడ్డారు. పలువురు కాలి నడకన కొండకు చేరుకున్నారు.



స్వామికి ప్రభుత్వం తరఫున పట్టువస్త్రాలు సమర్పిస్తున్న మంత్రి కొట్టు సత్యనారాయణ



స్వామికి టీటీడీ తరఫున పట్టువస్త్రాలు తెస్తున్న చైర్మన్ వైవీ సుబ్బారెడ్డి దంపతులు

సింహాచలానికి పోటెత్తిన భక్తులు

ఇటీవల కాలంలో ఎన్నడూ లేనివిధంగా ఈసారి చందనోత్సవానికి భక్తులు పోటెత్తారు. మూడేళ్ల నుంచి కోవిడ్ ప్రభావంతో ఈ చందనోత్సవానికి భక్తుల సంఖ్య తగ్గింది. కోవిడ్ తగ్గుముఖం పట్టడం, వాతావరణం అనుకూలించడంతో ఈ ఏడాది భక్తులు భారీగా తరలివచ్చారు. దీంతో వీరిని కట్టడి చేయడం అధికార యంత్రాంగానికి కష్టతరంగా మారింది. ఈసారి చందనోత్సవానికి 1.5 లక్షల మంది వస్తారని అధికారులు అంచనా వేశారు. కానీ 2.25 లక్షల మంది భక్తులు వచ్చినట్టు దేవదాయ శాఖ మంత్రి కొట్టు సత్యనారాయణ చెప్పారు. ఈసారి చందనోత్సవానికి రూ.300, 1000, 1500 టికెట్లను ఆన్‌లైన్‌లో ఉంచారు. టికెట్లు పొందిన వారికి టైం స్లాట్లను కేటాయించారు. వారికి కేటాయించిన సమయాని కంటే ముందుగానే కొంతమంది క్యూలైన్లలోకి వచ్చారు. ఈసారి రూ.1500 టికెట్ కొనుగోలు చేసిన వారికి, ప్రొటోకాల్ భక్తులకు అంతరాలయ దర్శనం కల్పించారు. దీంతో దర్శనానికి సమయం ఎక్కువ పట్టింది. ఫలితంగా క్యూలైన్లలో నిల్చున్న వారు గంటల తరబడి వేచి ఉండాల్సి వచ్చింది. దీంతో భక్తులు ఆగ్రహించి వారు ఉన్న బారికేడ్లను దాటి బయటకు వచ్చి నినాదాలు చేశారు. వీరిని శాంతింపజేయడం పోలీసులకు కష్టతరమైంది. పరిస్థితిని గమనించిన అధికారులు మధ్యాహ్నం నుంచి అంతరాలయ దర్శనాలను నిలిపివేశారు. దీంతో సామాన్యులకు దర్శనం వేగం పుంజుకుంది.

క్షుద్రపూజల కలకలం

- ఏలూరు జిల్లా వేమవరప్పాడులో ఉద్రిక్తత
- రొయ్యల చెరువు వద్ద క్షుద్రపూజలు చేస్తున్నారని స్థానికుల ఆందోళన



వేమవరప్పాడులో పోలీసులు, దళితవాడ వాసుల మధ్య తోపులాట

కైకలూరు: రొయ్యలచెరువు వద్ద ఓ ఎంపీటీసీ సభ్యుడు క్షుద్రపూజలు చేయిస్తున్నాడని స్థానికులు అడ్డుకోవడంతో ఏలూరు జిల్లా కైకలూరు మండలం వేమవరప్పాడులో తీవ్ర ఉద్రిక్తత నెలకొంది. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల మేరకు... వేమవరప్పాడు ఎంపీటీసీ సభ్యుడు బోడావుల తిరుపతిరాజు తమ గ్రామంలోని దళితవాడకు చెందిన ఓ వ్యక్తి నుంచి రొయ్యల చెరువును లీజుకు తీసుకుని కొన్నేళ్లుగా సాగు చేస్తున్నాడు. అతనికి ఇటీవల కొంతనష్టం వచ్చింది. ఈ క్రమంలో మూడురోజులుగా మూడు కార్లలో కొందరు వచ్చి చెరువు వద్ద పూజలు చేస్తున్నారు. శనివారం రాత్రి చెరువు వద్ద మంటలు గమనించిన ఓ యువకుడు క్షుద్రపూజలు జరుగుతున్నాయని దళితవాడ ప్రజలకు చెప్పాడు. దీంతో మహిళలు, పెద్దలు చెరువు వద్దకు వెళ్లగా, పసుపు, కుంకుమ, వేపకొమ్మలు, హోమాల కోసం తీసిన గోతులు కనిపించాయి. జనం రావడంతో అక్కడ ఉన్నవారిలో కొందరు రెండు కార్లలో వేగంగా వెళ్లిపోయారు. చివరి కారులో ఎంపీటీసీ, మరో ముగ్గురు రావడాన్ని చూసి దళితవాడ వద్ద స్థానికులు అడ్డుకుని క్షుద్రపూజల గురించి ప్రశ్నించారు. తాను చెరువు వద్ద శాంతి పూజలు చేయించుకున్నానని, క్షుద్ర పూజలు కాదని ఎంపీటీసీ చెప్పాడు. అతను చెప్పిన సమాధానంతో సంతృప్తి చెందని స్థానికులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. కై కలూరు రూరల్ సీఐ వైవీవీఎల్ నాయుడు, పెద్ద ఎత్తున పోలీసులు వచ్చారు. ఈ వ్యవహారంపై ఇక్కడే విచారణ చేయాలని, ముందు కార్లలో వెళ్లినవారిని తీసుకురావాలని దళితవాడ వాసులు పట్టుబట్టారు. ఈ క్రమంలో ఎంపీటీసీ తరపున వచ్చిన ఇద్దరు వ్యక్తులు దురుసుగా మాట్లాడారు. దీంతో గొడవ మరింత ముదిరింది. రాత్రంతా ఎంపీటీసీని కారు కదలనీయకుండా గ్రామస్తులు అడ్డుకున్నారు. ఎంత చెప్పినా గ్రామస్తులు వినకపోవడంతో ఆదివారం ఉదయం ప్రత్యేక పోలీసు బలగాలను తీసుకొచ్చి కారులో ఉన్న నలుగురిని కైకలూరు పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. ఆ సమయంలో పోలీసులు, గ్రామస్తులకు మధ్య తీవ్ర తోపులాట జరిగింది.

ఎస్సీ, ఎస్టీ కేసుల నమోదు...

ఎంపీటీసీ తరపున వచ్చిన గ్రామానికి చెందిన తలారి మంగారావు, శ్రీహరిలు తమను కులం పేరుతో దూషించారని తేరా జయంతిరాజు, జశ్వంత్, ఏసురత్నం పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో మంగారావు, శ్రీహరి, ఎంపీటీసీ సభ్యుడు తిరుపతిరాజు, మరో ఏడుగురిపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేశామని కై కలూరు పట్టణ సీఐ ఎంవీఎస్ నాగరాజు చెప్పారు. గ్రామంలో సాధారణ పరిస్థితి నెలకొందని, ఉన్నతాధికారులు పూర్తిస్థాయి విచారణ చేస్తారని తెలిపారు.

13 మంది అంతర్రాష్ట్ర స్మగ్లర్లు అరెస్ట్

- రూ.71 లక్షల విలువైన ఎర్రచందనం దుంగలు, వాహనాలు స్వాధీనం
- వివరాలు వెల్లడించిన తిరుపతి ఎస్పీ పరమేశ్వర్‌రెడ్డి

తిరుపతి క్రైమ్: తిరుపతి జిల్లా, చంద్రగిరి నియోజకవర్గం, ఎర్రావారిపాళెం మండలంలోని ఆంజనేయస్వామి గుడి వద్ద ఎర్రచందనం అక్రమ రవాణా చేస్తున్న 13 మంది అంతర్రాష్ట్ర దొంగలను పోలీసులు అరెస్ట్ చేశారు. ఆదివారం ఎస్పీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఎస్పీ పరమేశ్వర్‌రెడ్డి ఆ వివరాలు వెల్లడించారు. ఆయన కథనం ప్రకారం...శనివారం సాయంత్రం అందిన రహస్య సమాచారం మేరకు ఎర్రావారిపాళెం సీఐ తులసీరామ్, ఎస్ఐలు ప్రకాష్, వెంకటేశ్వర్లు సిబ్బందితో మండలంలోని బోడెవాండ్లపల్లి గ్రామం వద్ద కూంబింగ్ నిర్వహించారు. వీరికి 13 మంది అంతర్రాష్ట్ర ఎర్రచందనం దొంగలు తారసపడ్డారు. పోలీసులు వారిని చుట్టుముట్టి అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద ఉన్న రూ.71 లక్షల విలువైన 20 ఎర్రచందనం దుంగలు, ఒక కారు, ఆరు ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకున్నారు. మరో ఇద్దరు నిందితులు పరారీలో ఉన్నారు. పట్టుబడిన వారంతా గతంలో ఇదే తరహాలో దొంగతనాలకు పాల్పడి జైలు శిక్ష అనుభవించినవారే. వీరిలో ఇద్దరు తిరుపతి జిల్లా వాసులు కాగా, ఓ వ్యక్తి అన్నమయ్య జిల్లా, మరో 10 మంది తమిళనాడుకు చెందిన వారిగా గుర్తించారు. ఇందులో ఏ–1 ముద్దాయి శంకర్‌పై కడప జిల్లాలో 30కి పైగా కేసులు ఉన్నాయి. పీడీ యాక్ట్ కూడా నమోదు చేశారు. ఎ–2 శ్రీనివాసులు, ఎ–3 బాబాసాహెబ్ తమిళనాడు నుంచి కూలీలను పిలిపించి తరచూ ఇతర రాష్ట్రాలకు అటవీ సంపదను విక్రయిస్తూ సొమ్ము చేసుకుంటున్నట్లు గుర్తించారు. ఈ మేరకు వారిపై కేసులు నమోదు చేశారు. సమావేశంలో ఏఎస్పీలు కులశేఖర్, విమలకుమారి పాల్గొన్నారు.



ఎర్రచందనం స్మగ్లర్లను మీడియాకు చూపెడుతున్న ఎస్పీ పరమేశ్వరరెడ్డి

వాటర్ మెట్రో వచ్చేస్తోంది




కొచ్చి: నీళ్లల్లో రయ్‌మని దూసుకువెళ్లే మెట్రో వచ్చేస్తోంది. దేశంలోనే మొట్టమొదటి వాటర్ మెట్రో కేరళలో ప్రారంభం కానుంది. కేరళ అంటేనే బ్యాక్ వాటర్స్‌తో నిండి ఉండే రాష్ట్రం. అక్కడ ప్రయాణాలంటే రోడ్లు, రైలు, ఆకాశ మార్గాలతో పాటు గమ్యస్థానం చేరుకోవడానికి నీళ్లలో కూడా ప్రయాణం తప్పనిసరి. అందుకే ఒక దీవి నుంచి మరో దీవికి చేరుకోవడానికి అన్ని హంగులతో కూడిన ఎలక్ట్రిక్ హైబ్రిడ్ పడవల్ని ప్రవేశపెడుతున్నారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ మంగళవారం కొచ్చిలో ఈ వాటర్ మెట్రోని ప్రారంభిస్తారు. ఈ మెట్రో కొచ్చి రవాణా రంగంలో ఒక గేమ్ ఛేంజర్‌గా మారనుంది. కొచ్చి చుట్టుపక్కల పది దీవుల మధ్య వాటర్ మెట్రో ప్రయాణిస్తుంది. కొచ్చి షిప్‌యార్డ్ లిమిటెడ్ మొత్తం ఎనిమిది ఎలక్ట్రిక్ హైబ్రిడ్ బోట్స్‌ని తయారు చేసింది. వాటర్ ట్రాన్స్‌పోర్ట్ రంగంలో ఈ మెట్రోతో విప్లవాత్మక మార్పులు వస్తాయని ముఖ్యమంత్రి పినరయి విజయన్ చెప్పారు. రవాణా, పర్యాటక రంగాలకు ఈ మెట్రో ఊతమిస్తుందని అన్నారు. జర్మనీ ఫండింగ్ ఏజెన్సీ కేఎఫ్‌డబ్ల్యూ, కేరళ రాష్ట్ర ప్రభుత్వం సంయుక్తంగా రూ.1,137 కోట్ల ఖర్చుతో ఈ ప్రాజెక్టు చేపట్టింది.

షిరిడి ట్రస్ట్‌కి 'చిల్లర' కష్టాలు

షిరిడి: షిరిడిలో సాయిబాబా ఆలయానికి కొత్త కష్టం వచ్చింది. భక్తులు ప్రతీ రోజూ భక్తితో సమర్పించుకునే కానుకల్లో వచ్చే చిల్లర నాణేలను తీసుకోవడం బ్యాంకులకు తలనొప్పుల్ని తెస్తోంది. శ్రీ షిరిడి సాయిబాబా సంస్థాన్ ట్రస్ట్‌కి (ఎస్ఎస్ఎస్‌టీ) ప్రతీ రోజూ దాదాపుగా రూ.90 వేల వరకు చిల్లర రూపంలో వస్తుంది. ఈ చిల్లరని వారానికి ఒకసారి బ్యాంకుల్లో డిపాజిట్ చేస్తుంటారు. అయితే ఆ చిల్లర నాణేలను తీసుకోవడానికి బ్యాంకులు నిరాకరిస్తున్నాయి. షిరిడి ట్రస్ట్‌కి వివిధ బ్యాంకుల్లో 13 ఖాతాలున్నాయి. ట్రస్ట్ ఇచ్చిన చిల్లర నాణేల బ్యాగులతో బ్యాంకుల స్ట్రాంగ్ రూమ్‌లు నిండుతున్నాయి. కొన్ని బ్యాంకులు స్ట్రాంగ్ రూమ్ బయటే చిల్లర నాణేల సంచీలను ఉంచుతున్నాయి. షిరిడి సంస్థాన్ నుంచి వచ్చిన చిల్లర డబ్బులు అన్ని బ్యాంకుల్లో కలిసి రూ. 11 కోట్ల వరకు ఉంది. ఇంకా బస్తాల్లో చిల్లర తీసుకువస్తే ఉంచడానికి తమ బ్యాంకుల్లో జాగా లేదని 4 ప్రధాన బ్యాంకులు నాణేలను తీసుకోవడానికి నిరాకరించాయి. చిల్లర నాణేల బ్యాగులతో నిండిపోయిన కెనరా బ్యాంకు స్ట్రాంగ్ రూమ్ ఆ బరువు తాళలేక ఎప్పుడైనా కుప్పకూలిపోతుందేమోనని దాని కింద అంతస్తులో ఉన్న దుకాణదారులు వణికిపోతున్నారు.

ఇతర గ్రహాలపై జీవజాలం..
ఓజోన్ పొర ఆధారం

భూమికి ఆవల జీవుల అన్వేషణకు కొత్త పద్ధతి ● నక్షత్రాలకు అధిక లోహతత్వం ఉంటే గ్రహాల చుట్టూ రక్షిత పొర



అనంతమైన విశ్వంలో మనం జీవిస్తున్న ఈ భూగోళంపైనే కాకుండా ఇతర గ్రహాలు, నక్షత్రాలపైనా జీవజాలం ఉందా? ఇప్పుడు లేకపోయినా గతంలో ఎప్పుడైనా ఉండేదా? ఒకవేళ ఉంటే అవి ఎలాంటి జీవులు? ఈ ప్రశ్నలు ఎన్నో శతాబ్దాలుగా భూమిపై మానవాళిని వెంటాడుతూనే ఉన్నాయి. సువిశాలమైన విశ్వంలో భూమికి ఆవల జీవుల ఉనికిని కనిపెట్టేందుకు ఖగోళ శాస్త్రవేత్తలు అలుపెరగకుండా అన్వేషణ కొనసాగిస్తూనే ఉన్నారు. మన పాలపుంత(గెలాక్సీ)లో ఇప్పటిదాకా 5,000కుపైగా గ్రహాలను కనిపెట్టారు. వాటిపై జీవులు ఉన్నాయా? అనేది తెలుసుకొనేందుకు కృషి చేశారు. ఇందుకోసం ఎన్నెన్నో పద్ధతులు అనుసరించారు. ఇతర గ్రహాలపై జీవజాలం ఉన్నట్లు ఇప్పటివరకైతే బలమైన ఆధారాలేవీ లభించలేదు. పరిశోధనల్లో భాగంగా శాస్త్రవేత్తలు మరో కొత్త పద్ధతిపై దృష్టి పెట్టారు. అదేమిటో తెలుసుకోవడం ఆసక్తికరమే.

- మన భూగోళానికి రక్షణ కవచం ఓజోన్ పొర అన్న సంగతి తెలిసిందే. అత్యంత హానికరమైన అల్ట్రావయొలెట్(యూవీ) రేడియేషన్ నుంచి ఓజోన్ పొర రక్షిస్తోంది. అందుకే భూమిపై కోట్లాది జీవులు నిక్షేపంగా మనుగడ సాగిస్తున్నాయి.
- ఏదైనా గ్రహాన్ని మందపాటి ఓజోన్ పొర ఆవరించి ఉంటే ఆ గ్రహంపై జీవుల ఉనికి సాధ్యమని దీన్నిబట్టి అర్థం చేసుకోవచ్చు. శాస్త్రవేత్తలు ఇప్పుడు ఇదే అంశాన్ని సరికొత్త అస్త్రంగా మార్చుకుంటున్నారు.
- ఏదైనా నక్షత్రానికి లోహతత్వం(మెటాలిసిటీ) ఎక్కువగా ఉంటే దాని చుట్టూ ఉన్న గ్రహాలపై రక్షిత ఓజోన్ పొర ఆవరించి ఉంటుందని గుర్తించారు.
- ఈ అధ్యయనం వివరాలను 'నేచర్ కమ్యూనికేషన్' పత్రికలో ప్రచురించారు.
- విశ్వ పరిణామ క్రమంలో కొత్తగా పుట్టుకొస్తున్న నక్షత్రాలకు లోహతత్వం అధికంగా ఉంటున్నట్లు తేల్చారు. ఇలాంటి నక్షత్ర మండల్లాలోని గ్రహాల చుట్టూ దట్టమైన ఓజోన్ పొర ఏర్పడుతుందని, తద్వారా అక్కడ జీవులు ఉద్భవించడానికి ఎక్కువ అవకాశాలు ఉంటాయని చెబుతున్నారు.
- అధిక లోహతత్వం ఉన్న నక్షత్రాల పరిధిలోని గ్రహాలే జీవుల అన్వేషణకు మెరుగైన లక్ష్యాలని శాస్త్రవేత్తలు అభిప్రాయపడుతున్నారు.
- గ్రహాల చుట్టూ రక్షిత ఓజోన్ పొర ఏర్పడాలంటే దానికి సంబంధించిన నక్షత్రానికి ఏయే లక్షణాలు ఉండాలో అర్థం చేసుకునేందుకు ప్రయత్నిస్తున్నామని చెబుతున్నారు.
- విశ్వంలో గ్రహాలను కలిగిన చాలా నక్షత్రాల ఉష్ణోగ్రత 5,000 నుంచి 6,000 డిగ్రీల సెల్సియస్ ఉంది. మన నక్షత్రమైన సూర్యుడు ఇదే విభాగంలోకి వస్తాడు.
- సూర్యుడి నుంచి వెలువడుతున్న అల్ట్రావయొలెట్ కాంతి(రేడియేషన్) మన భూగ్రహ వాతావరణంపై చూపిస్తున్న సంక్లిష్టమైన ప్రభావాన్నే ఇతర గ్రహాల వాతావరణంపైనా చూపించే అవకాశం ఉందని ఖగోళ శాస్త్రవేత్త డాక్టర్ అన్నా సపిరో ఒక ప్రకటనలో వెల్లడించారు.
- నక్షత్రాల్లోని లోహతత్వం వాటి నుంచి ఉద్గారమయ్యే అల్ట్రావయొలెట్ కాంతిని ప్రభావితం చేస్తున్నట్లు శాస్త్రవేత్తలు గుర్తించారు. యూవీ రేడియేషన్ నక్షత్రాల సమీపంలో కక్ష్యలో తిరిగే గ్రహాల వాతావరణంపై ఎలాంటి ప్రభావం చూపిస్తోందన్న దానిపై దృష్టి సారించారు.
- మన భూగోళంపై ఉన్న వాతావరణం ఇక్కడి జీవ పరిణామ క్రమాన్ని తెలుసుకొనేందుకు ఉపకరిస్తుందని, ఇదే సూత్రాన్ని ఇతర గ్రహాలకు సైతం వర్తింపజేయవచ్చని సైంటిస్టు జోస్ లెలీవెల్డ్ అన్నారు.

- సాక్షి, నేషనల్ డెస్క్

ఎట్టకేలకు అమృత్‌పాల్ అరెస్ట్

అస్సాం జైలుకు తరలించిన పంజాబ్ పోలీసులు



అరెస్ట్ సందర్భంగా అమృత్‌పాల్

చండీగఢ్/దిబ్రూఘర్: ఖలిస్తాన్ వేర్పాటువాద బోధకుడు, వారిస్ పంజాబ్ దే సంస్థ చీఫ్ అమృత్‌పాల్ ఎట్టకేలకు పంజాబ్ పోలీసులకు చిక్కాడు. నాడు స్వర్ణదేవాలయంలో నక్కిన ఖలిస్తాన్ ఉగ్రవాది దివంగత జర్నైల్‌సింగ్ బింద్రన్‌వాలే స్వగ్రామం రోడేలో ఆదివారం ఉదయం అమృత్‌పాల్ తానున్నచోటు చెప్పిమరీ లొంగిపోయినట్లు వార్తలొచ్చాయి. 'అతడు లొంగిపోలేదు. రాష్ట్ర పోలీసులు, నిఘా విభాగం సంయుక్తంగా అతని ఆచూకీ కనిపెట్టి గురుద్వారా అన్నివైపులా చుట్టుముట్టాం. అపవిత్రం చేయకూడదనే ఉద్దేశంతో యూనిఫాంలో ఉన్న పోలీసులు గురుద్వారా లోపలికి వెళ్లలేదు. లొంగిపోవాలని బయటి నుంచే హెచ్చరించాం. పారిపోయేందుకు ఆస్కారం లేకపోవడంతో అమృత్‌పాల్ బయటికొచ్చి లొంగిపోయాడు' అని ఐజీ సుఖ్‌చైన్‌సింగ్ గిల్ స్పష్టం చేశారు. 36 రోజులపాటు పంజాబ్ పోలీసులను ముప్పతిప్పలు పెట్టిన అమృత్‌పాల్‌ను కఠిన జాతీయ భద్రతా చట్టం కింద అరెస్ట్ చేసిన పోలీసులు వాయు మార్గంలో అస్సాం రాష్ట్రంలోని దిబ్రూఘర్ కేంద్ర కారాగారానికి తరలించారు.

ఎందుకీ అరెస్ట్ ?

తమ సహచరుడిని విడిపించుకునిపోవడానికి అజ్నాలా పోలీస్‌స్టేషన్‌పై వందలాది మంది అమృత్‌పాల్ అనుచరులు ఖడ్గాలతో దాడికి తెగబడిన తర్వాత అమృత్‌పాల్ కోసం పోలీసుల వేట మొదలైన విషయం తెల్సిందే. పాక్ నిఘా సంస్థ ఐఎస్ఐతో సత్సంబంధాలు నెరుపుతూ మళ్లీ ఖలిస్తాన్ దేశం కోసం పోరాడేలా సిక్కు యువతను వేర్పాటువాదం వైపు ఆకర్షించేందుకు అమృత్‌పాల్ ప్రయత్నిస్తున్నాడని ఆరోపణలున్నాయి. గతంలో దుబాయ్ నుంచి తిరిగొచ్చాక ఉద్యమకారుడు, గాయకుడు దీప్ సిద్ధూ మరణించాక వారిస్ పంజాబ్ దేకు చీఫ్ అయ్యాడు. డ్రగ్స్ బానిసలను బాగుచేస్తామని పైకి చెప్పినా సంస్థ లోపల జరిగేది వేరే అని నిఘా వర్గాలు చెబుతున్నాయి. రాష్ట్రంలో శాంతిభద్రతకు భంగం కలిగేలా దుష్ప్రచారం, హత్యాయత్నం, పోలీసులపై దాడి తదితర ఘటనలపై అతనిపై, అనుచరులపై పలు కేసులు నమోదయ్యాయి. ఇటీవల లండన్‌కు వెళ్లేందుకు యత్నించిన అతని భార్యను పోలీసులు అమృత్‌సర్ ఎయిర్‌పోర్ట్‌లో అడ్డుకోవడం తెల్సిందే. కాగా, 'సారవంతమైన పంజాబ్ నేలలో ఏ పంటలైనా పండుతాయి. కానీ విద్వేష విత్తులు మొలకెత్తవు. మొలకెత్తనివ్వం. శనివారం రాత్రి ఆచూకీ తెలిశాక రాత్రంతా నిద్రపోలేదు. రక్తపాతం, ఘర్షణలు జరక్కుండా అరెస్ట్ పూర్తవ్వాలని కోరుకున్నా' అని అమృత్‌పాల్ అరెస్ట్ తర్వాత రాష్ట్ర సీఎం భగవంత్ మాన్ ట్వీట్‌చేశారు.

అంతం కాదిది.. ఆరంభం

గురుద్వారా వద్ద తీసిన వీడియో ఒకటి సామాజిక మాధ్యమాల్లో వైరల్‌గా మారింది. 'నేను పరారీలో ఉన్నపుడు రాష్ట్రంలోని సిక్కులపై ప్రభుత్వం తీవ్రమైన ఒత్తిడి తెచ్చింది. నన్ను అరెస్ట్ చేయడం కంటే భద్రతా ఏజెన్సీలకు ప్రజలను వేధించడమే ఇష్టమనుకుంటా. అవి ఆపేందుకే లొంగిపోవాలనుకున్నా. నా అరెస్ట్‌తో అంతా అయిపోదు. ఇప్పుడే మొదలైంది. దైవం ముందు నేను నిర్దోషినే' అని అందులో అమృత్ ప్రసంగిస్తున్నట్లు ఉంది.

కలర్‌ఫుల్ ఎంఆర్ఐ స్కానర్



న్యూఢిల్లీ: ఎంఆర్ఐ స్కానింగ్ అంటే చాలా మందికి భయం. వింత శబ్దాలతో గుహలోకి వెళ్లిన ఫీలింగ్. చిన్నారులకు ఎంఆర్ఐ అంటే మరీ కష్టం. పిల్లలు భయపడకుండా స్కాన్ తీయడం కోసం 'చిన్నారి' ఎంఆర్ఐ మిషన్లు వస్తున్నాయి. మిషన్‌కు రంగులద్దడంతో పాటు దానిపైన ఫిక్షనల్ కేరక్టర్స్, బొమ్మలు చిత్రీకరించి పిల్లల్ని ఆకర్షించేలా రూపొందిస్తున్నారు. చాలా ఆస్పత్రుల్లో ఇలాంటి ఎంఆర్ఐ మిషన్లు ఉంటున్నాయని పారిశ్రామికవేత్త హర్షగోయెంక ఒక ఫొటోను సామాజిక మాధ్యమాల్లో పోస్టు చేశారు. ఇప్పుడు ఆ మిషన్‌ను చూసిన నెటిజన్లు భలేగా ఉందంటూ కామెంట్లు చేస్తున్నారు.

69 క్యాన్ల సోడాలు హాంఫట్

ఒట్టావా: కెనడాలో ఒక మహిళకి వింత అనుభవం ఎదురైంది. ఇంట్లో అవసరాల కోసం తెచ్చుకున్న సోడా క్యాన్లను ఒక ఎలుగు ఊది పారేసింది. షరోన్ రోజెల్ అనే మహిళ తెల్లవారుజామున కుక్క మొరగడంతో లేచి చూసింది. అప్పటికే తన కారు అద్దాలు బద్దలు కొట్టిన ఎలుగుబంటి అందులో ఉంచిన 72 సోడాల క్యాన్లలో ఏకంగా 69 తాగేసింది. బాల్కనీ నుంచి ఇదంతా చూసి రోజెల్ వాటి ఫోటోలు తీసి సోషల్ మీడియాలో షేర్ చేసింది. ఒక ఎలుగుబంటి ఆ స్థాయిలో సోడాలు తాగడం అత్యంత అరుదు అని కొందరు వ్యాఖ్యానించారు.

'సెలబ్రిటీ' ఖాతాలకు మళ్లీ బ్లూ టిక్

న్యూఢిల్లీ: చందా మొత్తాన్ని చెల్లించలేదంటూ చాలా మంది ప్రముఖుల ట్విట్టర్ ఖాతాల్లో బ్లూ టిక్‌ను తొలగించిన ట్విట్టర్ యాజమాన్యం ఆదివారం కొందరికి బ్లూ టిక్‌ను పునరుద్ధరించింది. లక్షలాది మంది ఫాలోవర్లు ఉన్న ట్విట్టర్ ఖాతాలకే ఈ మినహాయింపు ఇచ్చినట్లు మీడియాలో కథనాలు వెలువడ్డాయి. షారుఖ్ ఖాన్, సల్మాన్ ఖాన్, రాహుల్ గాంధీ, సచిన్ టెండూల్కర్, విరాట్ కోహ్లీసహా ప్రముఖ భారతీయ నటులు, రాజకీయనేతలు, క్రీడాకారుల బ్లూ టిక్‌ను ఇటీవల తొలగించగా ఆదివారం ఆ టిక్ మళ్లీ ప్రత్యక్షమైంది. లక్షలాది మంది ఫాలోవర్లు ఉండటం వల్లే వీరందరికి బ్లూ టిక్ ఇచ్చారా ? లేక సబ్‌స్క్రైబ్ చేసుకున్నారా అనేది తెలియరాలేదు. 'చందా కట్టకున్నా ఆదివారం బ్లూ టిక్ మళ్లీ వచ్చేసింది. మిస్టర్ మస్క్ మీరే నా తరఫున చందా రుసుం కట్టేశారా? ' అంటూ కశ్మీర్ మాజీ ముఖ్యమంత్రి ఒమర్ అబ్దుల్లా ఆదివారం ట్వీట్‌చేశారు. అయితే లక్షలాది మంది ఫాలోవర్లు ఉన్న ఖాతాలకు మాత్రమే వెరిఫైడ్ స్టేటస్(బ్లూ టిక్) హోదా కట్టబెట్టినట్లు తెలుస్తోంది. అయితే, దివంగతుల ఖాతాలకు టిక్ ప్రత్యక్షమవడం గమనార్హం. మైఖేల్ జాక్సన్, చాడ్విక్ బోస్‌మ్యాన్, కోబె బ్రయాంట్ తదితర సెలబ్రిటీల ఖాతాలు ఇందులో ఉన్నాయి. కాగా బ్లూ టిక్ కోసం చందా కట్టే ప్రసక్తే లేదని ప్రకటించిన కొందరు ప్రముఖుల తరఫున తానే నగదు చెల్లించి టిక్ పునరుద్ధరించినట్లు ట్విట్టర్ యజమాని, కుబేరుడు ఎలాన్ మస్క్ వెల్లడించారు. దిగ్గజ నటుడు విలియం శాట్నర్ తదితరుల తరఫున మస్క్ రుసుం చెల్లించారు.

కర్ణాటకలో మాదే విజయం




- 150 స్థానాలు కచ్చితంగా గెలుచుకుంటాం: రాహుల్

సాక్షి, బళ్లారి/విజయపుర: కర్ణాటక అసెంబ్లీ ఎన్నికల్లో తాము ఘన విజయం సాధించబోతున్నామని, 224 స్థానాలకు గాను 150 స్థానాలు కచ్చితంగా గెలుచుకుంటామని కాంగ్రెస్ పార్టీ నేత రాహుల్ గాంధీ ధీమా వ్యక్తం చేశారు. ఆయన ఆదివారం కర్ణాటకలోని విజయపురలో ఎన్నికల ప్రచారంలో పాల్గొన్నారు. శివాజీ సర్కిల్ నుంచి కనకదాస సర్కిల్ వరకూ జరిగిన భారీ రోడ్డు అనంతరం ప్రజలను ఉద్దేశించి ప్రసంగించారు. '40 పర్సెంట్ బీజేపీ సర్కారు'కు ఈ ఎన్నికల్లో 40 సీట్లు మాత్రమే వస్తాయని జోస్యం చెప్పారు. ప్రధాని మోదీతోపాటు బీజేపీ నాయకులు 12వ శతాబ్దపు సంఘ సంస్కర్త బసవణ్ణ బోధనల గురించి మాట్లాడుతున్నారు గానీ వాటిని ఏమాత్రం ఆచరించడం లేదని రాహుల్ ఆక్షేపించారు.

బసవేశ్వరుడికి రాహుల్ నివాళులు

సంఘ సంస్కర్త బసవేశ్వరుడి జయంతి సందర్భంగా రాహుల్ గాంధీ ఆదివారం కర్ణాటక రాష్ట్రం బాగల్‌కోట జిల్లాలోని కూడల సంగమంలోని బసవణ్ణ సమాధిని దర్శించుకున్నారు. నివాళులర్పించారు. కూడల సంగమంలో సంగమనాథ దేవాలయాన్ని దర్శించుకుని విశేష పూజలు చేశారు. నుదుటిన విభూతి ధరించారు. విశ్వగురు బసవణ్ణ సమ సమాజ స్థాపన కోసం కృషి పడ్డారని, ఆనాడే చట్టసభ ద్వారా అన్ని వర్గాల ప్రజలను అందలమెక్కించాలని తపనపడ్డారని రాహుల్ కొనియాడారు. సమాజాన్ని సన్మార్గంలో నడిపించడానికి బసవణ్ణ చేసిన కృషి ప్రశంసనీయమని పేర్కొన్నారు. అనంతరం అసెంబ్లీ ఎన్నికల ప్రచారం గురించి కాంగ్రెస్ నేతలతో రాహుల్ చర్చించారు. హుబ్లీకి వెళ్లి ఇటీవల కాంగ్రెస్‌లో చేరిన మాజీ సీఎం జగదీశ్ శెట్టర్‌తో మాట్లాడారు.

ఊరు కాదు వీధి




ఈ ఫొటోలో కనిపిస్తున్నది ఒక ఊరు అనుకుంటే పొరపాటే. అదొక వీధి. అక్కడ ఏకంగా 6 వేల మంది నివసిస్తున్నారు. ఆ వీధి మొదలు ఎక్కడుందో, చివర ఎక్కడుంటుందో అక్కడ నివసించే వారికే సరిగ్గా తెలీదు. ఇలాంటి వీధి పోలండ్‌లో ఉంది. ఈ వీధికి సంబంధించిన ఏరియల్ వ్యూ ఫొటో ఇటీవల వైరల్‌గా మారింది. దక్షిణ పోలండ్‌లో సులోస్జోవా అనే పట్టణంలో ఈ వీధి ఉంది. దీని పొడవు ఏకంగా తొమ్మిది కిలో మీటర్లు. ప్రపంచంలోనే అతి పెద్ద వీధి ఇదే. ఇరువైపులా పచ్చని పంట పొలాలతో, పొందికగా అమర్చిన ఇళ్లతో ఈ వీధి ఫొటోలను చూసి నెటిజన్లు ఫిదా అయిపోయారు.

కలల అలలపై...



హాయిగా మనవలు, మనవరాళ్లతో కాలం గడిపే వయసు. ఏ బాదర బందీ లేకుండా ఎవరో వండిపెడితే తింటూ కాలం గడిపే వయసు. అయినా ఆమెలో ఉత్సాహం ఏ మాత్రం తగ్గలేదు. సర్వస్వతంత్రంగా వ్యవహరించే ఆమె తనకున్న ఆస్తుల్ని అమ్మకానికి పెట్టారు. ఎం.వి.జెమిని అనే నౌకలో ప్రపంచ యాత్ర చెయ్యడానికి ఏర్పాట్లు చేసుకుంటున్నారు. ఆమే అమెరికాలోని కాలిఫోర్నియాకు చెందిన షరాన్ లేన్. ఇప్పుడు ఆమె వయసు 75 ఏళ్లు. హైస్కూలు రిటైర్డ్ టీచర్. చిన్నప్పట్నుంచి ప్రయాణాలంటే ఆమెకు చాలా ఇష్టం. అడ్వంచర్స్ అంటే చెప్పలేనంత థ్రిల్. స్కూల్లో విదేశీ భాషలు బోధించేవారు. స్కూలు పిల్లల్ని తీసుకొని యూరప్ దేశాలన్నీ చుట్టేసి వచ్చారు. అయినా ఆమెకు లైఫ్‌లో ఏదో అసంతృప్తి. ఇంకొన్ని దేశాలు తిరగాలి. అక్కడ ఆచార వ్యవహారాలు, సంప్రదాయాలు తెలుసుకోవాలి. సరికొత్త రుచులు చవి చూడాలి. కొత్త కొత్త విషయాలు తెలుసుకోవాలి. జీవితంలో అనుక్షణం కొత్తదనం కోసం పరితపించే లేన్‌కు ఎంవి.జెమిని అనే నౌక ప్రయాణం ఒక చుక్కానిలా కనిపించింది. ఈ నౌక ప్రపంచాన్ని చుట్టి వస్తుందని సన్నిహితులు చెబితే తెలుసుకున్నారు. ఒక రోజు కాదు రెండ్రోజులు కాదు ఏకంగా మూడేళ్ల నౌక ప్రయాణం. ఆ నౌకలో అత్యంత తక్కువ ధరకి లభించే ఒక చిన్న కేబిన్‌లాంటి గదికి ఏడాదికి 30 వేల డాలర్లు చెల్లించాలి. తన ఆస్తిపాస్తుల్ని అమ్మేస్తే మూడేళ్లకి సరిపడా డబ్బులు వచ్చేస్తాయని ఆ గది బుక్ చేసుకున్నారు. ఆ చిన్న గదికి కనీసం కిటికీ కూడా ఉండదు. కానీ బయట ఏం జరుగుతుందో తెలుసుకోవడానికి ఒక చిన్న స్క్రీన్ ఏర్పాటు చేస్తారు. అదే మహద్భాగ్యం



గా భావించారు. నవంబర్ 1 నుంచి ఈ నౌక ప్రయాణం ప్రారంభమవుతుంది. కూతురికి చెబితే ఏమంటుందోనని ఆమెకి మాట మాత్రంగానైనా చెప్పలేదు. గాలి, ఎండ సోకని ఆ గదిలో కేవలం రాత్రి పూట మాత్రమే గడిపి మిగిలిన సమయమంతా తనకెంతో ఇష్టమైన సముద్రాన్ని చూస్తూ గడిపేస్తానని చెబుతున్నారు. నౌకలో తోటి ప్రయాణికులతో మాటలు కలపడం, కొత్త స్నేహితుల్ని చేసుకోవడం కూడా ఆమెకు ఇష్టమే. మొత్తం మూడేళ్ల పాటు సాగే ప్రయాణంలో ఎంవి జెమిని నౌక 375 రేవు పట్టణాల్లో ఆగుతుంది. ఇండియా నుంచి చైనా, మాల్దీవ్స్, ఆస్ట్రేలియా ఇలా అన్ని దేశాలు తిరుగుతుంది. ''నాకున్న లక్ష్యం ఒక్కటే. ప్రతీ రోజూ ఏదో ఒక కొత్త విషయం నా బ్లాగ్‌లో రాయాలి. కలం పేరుతో ఒక బ్లాగ్‌ను ఏర్పాటు చేసి అందులో నా అనుభవాలన్నీ కథలుగా రాస్తాను. ఎవరైనా నాలుగ్గోడల మధ్య మగ్గిపోతూ ఇంట్లో కూర్చుంటే ఏం వస్తుంది. పది మందిలో తిరిగితేనే జీవితంపై అవగాహన వస్తుంది. అందులోనూ సముద్రాన్ని చూస్తూ ప్రయాణమంటే అదో అవధుల్లేని అనుభూతి. ఇల్లంటే మన మనసుకి ఎంతో ఇష్టమైన ప్రదేశమే కావొచ్చు. కానీ విమానమో, పడవో, రైలో ఏదో ఒకటి ఎక్కి బయట ప్రపంచాన్ని చూడండి. అదెంత అద్భుతంగా ఉంటుందో'' అని లేన్ తన మనసులో మాట వెల్లడించారు. మూడేళ్లంటే తక్కువ కాలం ఏమీ కాదు. అందులోనూ కరోనా సోకిన తర్వాత ఆమె శ్వాసకోశ సంబంధ సమస్యలతో బాధపడుతున్నారు. అయినా కూడా ఆమె దేనికీ భయపడట్లేదు. ఇల్లు కంటే పడవే పదిలమంటున్నారు. తాను ప్రయాణించే పడవలో కూడా అనారోగ్యం వస్తే చికిత్స అందించే ఏర్పాట్లు కూడా ఉన్నాయని చెప్పారు. ఇలా ఒంటరి ప్రయాణం ఆమెకు కొత్తేం కాదు. చాలా కాలంగా ఆమె ఒంటరిగానే జీవిస్తున్నారు. ఇప్పుడీ ప్రయాణం ఆమెలో ఉత్సాహాన్ని నింపి వయసుని మరింత తగ్గించింది. మరి మనమూ లేన్‌కి హ్యాపీ జర్నీ చెప్పేద్దాం.

- సాక్షి, నేషనల్ డెస్క్

నేడు కేరళకు ప్రధాని మోదీ

కొచ్చిన్/తిరువనంతపురం: ప్రధాని మోదీ సోమవారం నుంచి కేరళలో రెండు రోజుల పాటు పర్యటిస్తారు. సోమవారం ఆయన కొచ్చిన్‌లో జరిగే రోడ్‌షోలో పాల్గొంటారు. దేశంలో తొలి డిజిటల్ సైన్స్ పార్క్‌కు శంకుస్థాపన చేయడంతోపాటు చర్చి పెద్దలతో సమావేశమవుతారు. వందేభారత్ ఎక్స్‌ప్రెస్ రైలును ప్రారంభిస్తారు. యువజనుల కార్యక్రమం యువమ్–2023కి హాజరవుతారు. ప్రధాని పర్యటన ద్వారా రాష్ట్రంలో బీజేపీ శ్రేణుల్లో ఉత్తేజం కలిగించేందుకు రాష్ట్ర నాయకత్వం ప్రయత్నిస్తోంది. కాగా, ప్రధాని పర్యటన బందోబస్తులో 2,060 మందిని వినియోగించనున్నారు. పర్యటన సమయంలో ప్రధాని మోదీని ఆత్మాహుతి బాంబర్‌తో చంపేస్తామంటూ బెదిరింపు లేఖ రాసిన వ్యక్తిని ఆదివారం పోలీసులు అరెస్ట్ చేశారు. మరో వ్యక్తి పేరుతో ఆ లేఖ రాసిన కొచ్చిన్‌కు చెందిన వ్యాపారి జేవియర్‌ని అదుపులోకి తీసుకున్నామని, జానీ అనే వ్యక్తిపై కక్షతోనే అతడు ఈ పనికి పాల్పడినట్లు తేలిందని చెప్పారు.

ఏసీ అక్కర్లేదు, ఒక చెట్టున్నా చాలు

న్యూఢిల్లీ: ఎండలు మండిపోతున్నాయి. భానుడి ప్రతాపంతో ఏసీ గదుల్లోంచి బయటకు రావడానికే జనం ఇష్టం పడడం లేదు. సుభాషిణి చంద్రమణి అనే మహిళ మాత్రం ఎండ నుంచి రక్షణకి ఏసీ గదులు అక్కర్లేదని ఒక చెట్టు చాలని ప్రయోగాత్మకంగా నిరూపించారు. ఆమె మండుటెండలో నిల్చొని ఉష్ణోగ్రతని రికార్డు చేస్తే 40 డిగ్రీల సెల్సియస్ చూపించింది. అలా నడుచుకుంటూ పక్కనే ఉన్న చెట్టు నీడలోకి వెళితే ఉష్ణోగ్రతలు భారీగా తగ్గిపోయి 27 డిగ్రీల సెల్సియస్‌గా నమోదైంది. అంటే ఏకంగా 13 డిగ్రీలు తేడా ఉందన్న మాట. ఆమె ఈ ప్రయోగం చేసి దానికి సంబంధించిన వీడియోను ట్విటర్‌లో పోస్టు చేస్తే అది వైరల్‌గా మారింది.

30దాకా కేదార్‌నాథ్ రిజిస్ట్రేషన్ నిలిపివేత

రిషికేశ్: ఎగువ హిమాలయాల ప్రాంతం గర్వాల్ హిమాలయాల్లో వర్షం, హిమపాతం కారణంగా కేదార్‌నాథ్ యాత్ర కోసం రిషికేశ్, హరిద్వార్‌లలో జరిగే యాత్రికుల రిజిస్ట్రేషన్‌లను ఈ నెల 30వ తేదీదాకా నిలుపుదల చేస్తున్నట్లు అధికారులు ప్రకటించారు. మరోవైపు కేదార్‌నాథ్ ఆలయ ద్వారాలు మంగళవారం తెరుచుకోనున్న సంగతి తెల్సిందే. వాతావరణ పరిస్థితులకు అనుగుణంగా తదుపరి నిర్ణయాలు తీసుకుంటామని సంబంధిత అధికారులు తెలిపారు. బద్రీనాథ్, గంగోత్రి, యమునోత్రి ధామ్‌ల దర్శనాలకు సంబంధించిన రిజిస్ట్రేషన్ కొనసాగుతోంది.

20 రోజుల్లో షిండే సర్కార్ పతనం: సంజయ్

జల్గావ్: మహారాష్ట్రలోని ఏక్‌నాథ్ షిండే ప్రభుత్వానికి మరణశాసనం సిద్ధమైందని శివసేన(ఉద్ధవ్ వర్గం)నేత సంజయ్ రౌత్ వ్యాఖ్యానించారు. మరో 15–20 రోజుల్లో ఈ ప్రభుత్వం కూలిపోవడం ఖాయమని, మరణశాసనంపై సంతకం చేసేదెవరో ఇప్పుడు తేలాల్సి ఉందని రౌత్ జోస్యం చెప్పారు. ఉద్ధవ్ ఠాక్రే నాయకత్వంపై తిరుగుబాటు చేసి షిండే వర్గంలో చేరిన 16 మంది ఎమ్మెల్యేల అనర్హత సహా పలు పిటిషన్లు కోర్టులో పెండింగ్‌లో ఉన్న విషయాన్ని ప్రస్తావిస్తూ..తీర్పు కోసం తమ పార్టీ ఎదురుచూస్తోందని, న్యాయం జరుగుతుందన్న నమ్మకం తమకుందని చెప్పారు. ఉద్ధవ్ నేతృత్వంలోని శివసేన, కాంగ్రెస్, ఎన్సీపీల మహా వికాస్ అఘాడీ ప్రభుత్వాన్ని గత ఏడాది జూన్‌లో షిండే, 39 మంది ఎమ్మెల్యేలు కూల్చి, బీజేపీ సాయంతో ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయడం తెలిసిందే.

అమెరికాలో ఇద్దరు భారతీయ విద్యార్థులు మృతి

న్యూయార్క్: అమెరికాలో ఇండియానా రాష్ట్రంలో సరస్సులో ఈతకెళ్లిన ఇద్దరు భారతీయ విద్యార్థులు మృత్యువాతపడ్డారు. ఈ నెల 15వ తేదీన సిద్ధాంత్ షా(19), ఆర్యన్ వైద్య(20)లు మరికొందరితో కలిసి మొన్రో సరస్సులో సరదాగా ఈత కొట్టేందుకు వెళ్లారు. ఈదుతూనే ఇద్దరూ నీళ్లలో మునిగిపోయారు. అధికారులు ఎంతగా ప్రయత్నించినా వారి జాడ దొరకలేదు. ఈ నెల 18వ తేదీన ఇద్దరి మృతదేహాలు సరస్సులో తేలియాడుతూ కనిపించగా వెలికితీశారు. సిద్ధాంత్, ఆర్యన్‌లు ఇండియానా యూనివర్సిటీకి చెందిన కెల్లీ స్కూల్ ఆఫ్ బిజినెస్ విద్యార్థులని అధికారులు వెల్లడించారు. వీరిద్దరి పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

సూడాన్ నుంచి విదేశీయుల తరలింపు షురూ

ఖార్టూమ్/వాషింగ్టన్: ఆఫ్రికాలోని మూడో అతిపెద్ద దేశం సూడాన్ వరుసగా తొమ్మిదోరోజూ తుపాకీ చప్పుళ్లు, బాంబు మోతలతో దద్దరిల్లుతోంది. అంతర్జాతీయ సమాజం చేసిన విజ్ఞప్తులను అక్కడి ఆర్మీ, ఆర్ఎస్ఎఫ్(ర్యాపిడ్ సపోర్ట్ ఫోర్సెస్) జనరళ్లు పట్టించుకోవడం లేదు. పరిస్థితులు ప్రమాదకరంగా మారడంతో అమెరికా సహా పలుదేశాలు అక్కడ చిక్కుకుపోయిన తమ దౌత్య సిబ్బందిని, పౌరులను బయటకు తరలించేందుకు ప్రయత్నాలను వేగవంతం చేశాయి. ఆదివారం అమెరికా ప్రత్యేక బలగాలు ఖార్టూమ్ దౌత్య కార్యాలయంలో పనిచేసే 70 మందిని పొరుగునే ఉన్న ఇథియోపియాలోని ఓ ప్రాంతానికి సురక్షితంగా తరలించాయి. సౌదీ అరేబియా శనివారమే తమ దౌత్యాధికారులు, పౌరులు కలిపి మొత్తం 157 మంది వెనక్కితీసుకొచ్చింది. వీరిలో కొందరు భారతీయులు ఉన్నట్లు సమాచారం. ఖార్టూమ్‌తోపాటు అక్కడికి సమీపంలోని ఒమ్‌డుర్మన్ నగరంలో పోరు తీవ్రమైనట్లు స్థానికులు చెబుతున్నారు.

సాక్షి 24|7 తమిళనాడు
TAMILNADU
సోమవారం | 24 | ఏప్రిల్ | 2023

కరోనా పరిస్థితులపై త్వరలో పుస్తకం

సాక్షి, చెన్నై: కరోనా పరిస్థితులపై పుస్తకం రాయనున్నట్లు ఆరోగ్యశాఖ మంత్రి ఎం. సుబ్రమణియన్ తెలిపారు. ఆదివారం చెన్నైలో జరిగిన ప్రపంచ పుస్తక దినోత్సవ కార్యక్రమంలో మంత్రి ప్రసంగిస్తూ, తాము అధికారంలోకి రాగానే, కరోనా పరిస్థితులు ఓ సవాల్‌గా మారినట్లు గుర్తు చేశారు. తొలిసారిగా మంత్రి పదవి చేపట్టిన తాను ఆరోగ్య శాఖపై పూర్తిస్థాయిలో పట్టు, అవగాహన లేని సమయంలో కరోనా పరిస్థితులను సమర్థవంతంగా ఎదుర్కొన్నట్లు వివరించారు. కరోనా సమయంలో పడ్డ శ్రమ, ప్రజలకు అందించిన సేవలను గుర్తు చేస్తూ పుస్తకం సిద్ధం చేయనున్నట్లు ఆయన ప్రకటించారు.

న్యూస్‌రీల్

19 జిల్లాల్లో వానలు

- పిడుగుపాటుకు ముగ్గురి మృతి

సాక్షి, చెన్నై : వాతావరణ మార్పుల కారణంగా 19 జిల్లాలలో ఆదివారం వర్షం కురిసింది. ముఖ్యంగా తిరుచ్చి, సేలంలలో అనేక చోట్ల అకాలవర్షం బీభత్సం సృష్టించింది. వేర్వేరు చోట్ల పిడుగు పడడంతో ముగ్గురు మరణించారు. వివరాలు.. వేసవిలో ఓవైపు భానుడి ప్రతాపం, మరో వైపు అకాలవర్షం అనేక చోట్ల కురుస్తున్న విషయం తెలిసిందే. శనివారం సాయంత్రం నుంచి చెన్నై, శివారు జిల్లాలతో పాటు రాష్ట్రంలోని 19 జిల్లాల్లో వర్షం పడింది. ఆదివారం కూడా అక్కడక్కడ వర్షం కురిసింది. తిరుచ్చి, సేలంలో అకాల వర్షం ఈదురు గాలుల ధాటికి అరటి తోటలు దెబ్బతిన్నాయి. ఉరుములు, మెరుపులతో కురిసిన వర్షానికి చెన్నై శివారులోని ఓ మహిళ, పొన్నేరి సమీపంలో ఓ వ్యక్తి మరణించారు. అలాగే తిరుచ్చి ముసిరి లో 65 ఏళ్ల వృద్ధురాలు పిడుగు పాటుకు మృతి చెందింది. సోమవారం కూడా వర్షాలు కొనసాగే అవకాశాలు ఉన్నాయని వాతావరణ కేంద్రం అధికారులు వెల్లడించారు.

మే 12న ఒక రోజు సమ్మె

- 12 గంటల పని వేళలకు వ్యతిరేకంగా నిర్ణయం

సాక్షి, చెన్నై: పని వేళలను పెంచుతూ ప్రభుత్వం అసెంబ్లీలో బిల్లు ఆమోదించడాన్ని వ్యతిరేకిస్తూ మే 12వ తేదీన ఒక రోజు పాటు అన్ని పరిశ్రమలు, సంస్థల్లో సమ్మె నిర్వహించనున్నామని కార్మిక సంఘాలు ప్రకటించాయి. ప్రైవేటు పరిశ్రమలు, సంస్థల్లో ఇప్పుడుండే 8 గంటల పని వేళలను 12 గంటలకు పొడిగిస్తూ రాష్ట్ర ప్రభుత్వం అసెంబ్లీలో తీర్మానం చేసిన విషయం తెలిసిందే. దీనిని డీఎంకే మిత్ర పక్షాలు, అన్నాడీఎంకే తదితర ప్రతి పక్షాలు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నాయి. ఈ నేపథ్యంలో ఆదివారం సీఐటీయూ నేతృత్వంలో డీఎంకే మిత్ర పక్ష పార్టీల కార్మిక సంఘాలు ఏకమయ్యాయి. చెన్నైలో జరిగిన ఈ సమావేశంలో ప్రభుత్వానికి వ్యతిరేకంగా పోరాటానికి డీఎంకే మిత్ర పక్ష పార్టీల కార్మిక సంఘాలు నిర్ణయించారు. మే 12వ తేదీన రాష్ట్ర వ్యాప్తంగా కార్మికులను ఏకం చేసిన ఈ నెల 12 గంటల పని వేళలకు వ్యతిరేకంగా సమ్మె నిర్వహిచనున్నామని ప్రకటించారు. ఆ రోజున రాష్ట్రవ్యాప్తంగా కార్మిక లోకం నేతృత్వంలో నిరసన కార్యక్రమాలు జరుగుతాయని తెలిపారు. అప్పటిలోపు ప్రభుత్వం ఆ చట్టాన్ని ఉప సంహరించుకోని పక్షంలో కీలక నిర్ణయం తీసుకోవాల్సి ఉంటుందని హెచ్చరించారు.

కపాలీశ్వరాలయంలో పళణి పూజలు

సాక్షి, చెన్నై: అన్నాడీఎంకే ప్రధాన కార్యదర్శి పళణి స్వామి మైలాపూర్‌లోని కపాలీశ్వరాలయంలో ఆదివారం ప్రత్యేక పూజలు చేశారు. గురు పెయర్చి సందర్భంగా ఆయన ఈ పూజలు చేశారు. జ్యోతిష్యం ప్రకారం మీనం నుంచి మేష రాశికి గురు ప్రవేశంతో పళణి స్వామి ఈ పూజల్లో నిమగ్నమైనట్లు సమాచారం వెలువడింది.

అన్నాడీఎంకేలోకి మనోహరన్

అమ్మ మక్కల్ మున్నేట్ర కళగం కోశాధికారి, తిరుచ్చికి చెందిన నేత మనోహరన్ ఆ పార్టీ నేత టీటీవీ దినకరన్‌కు షాక్ ఇచ్చారు. ఆ పార్టీకి గుడ్ బై చెప్పి మాతృ సంస్థ అన్నాడీఎంకేలోకి వచ్చేశారు. ఆదివారం గ్రీన్ వేస్ రోడ్డులోని నివాసంలో అన్నాడీఎంకే ప్రధాన కార్యదర్శి పళణిస్వామి సమక్షంలో మళ్లీ పార్టీ తీర్థం పుచ్చుకున్నారు. అనంతరం పార్టీ వర్గాలైన ముఖ్య నాయకులతో పళణి స్వామి లోక్‌సభ ఎన్నికలకు కసరత్తు మొదలెట్టారు. పార్టీ పరంగా కార్యక్రమాలు విస్తృతం, జిల్లాల వారీగా తన పర్యటనకు సంబంధించి చర్చించినట్లు సంకేతాలు వెలువడ్డాయి.

కుటుంబ కలహాలతో భార్య ఆత్మహత్య

- భర్తకూ నిప్పంటుకోవడంతో తీవ్రగాయాలు

అన్నానగర్: కడలూరు జిల్లా పన్రుట్టి సమీపంలోని మరుంగూర్ తోప్పు కొల్లై గ్రామానికి చెందిన అరుల్ (55), ముత్తులక్ష్మి (32) దంపతులకు ముగ్గురు పిల్లలున్నారు. అరుల్‌కి తాగుడు అలవాటు ఉంది. తన సంపాదనలో ఎక్కువ భాగం మద్యం తాగడానికే వెచ్చించేవాడు. దీంతో భార్యాభర్తల మధ్య తరచూ గొడవలు జరిగేవి. ఈ క్రమంలో శుక్రవారం రాత్రి ఇంట్లో ఉక్కపోత కారణంగా ముత్తులక్ష్మి తన పిల్లలతో కలిసి సమీపంలోని ఆలయంలో నిద్రపోయింది. శనివారం తెల్లవారుజామున ఇంటికి వచ్చారు. అప్పుడు మద్యం మత్తులో ఉన్న అరుల్ గొడవ పడడంతో ముత్తులక్ష్మి కిరోసిన్ పోసుకుని మంటలు అంటించుకుంది. ఈ క్రమంలో భర్తని పట్టుకుంది. మంటలు పెద్దఎత్తున వ్యాపించడంతో భార్యాభర్తలిద్దరూ కేకలు వేశారు. ఇరుగు పొరుగు వారు వెంటనే వారిని రక్షించి 108 అంబులెన్స్ ద్వారా బన్రుట్టి ప్రభుత్వాసుపత్రికి తరలించారు. తర్వాత మెరుగైన వైద్యం కోసం పుదుచ్చేరి జిప్‌మార్ ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స అందక ముత్తులక్ష్మి ఆదివారం ఉదయం మృతి చెందింది. ఆమె భర్త అరుల్‌కు 80 శాతం గాయాలు అయ్యాయి. అతడికి అత్యవసర చికిత్స అందిస్తున్నారు. కాగా ఈ ఘటన స్థానికంగా కలకలం రేపింది.

బ్రహ్మాండోత్సవం


ధ్వజ స్తంభానికి ప్రత్యేక పూజలు


విద్యుత్ దీపకాంతుల్లో మదురై ఆలయం

ఆధ్యాత్మిక నగరం మదురై మీనాక్షి అమ్మవారి సన్నిధిలో చిత్తిరై బ్రహ్మోత్సవాలు ఆదివారం ఘనంగా ప్రారంభమయ్యాయి. దీంతో నగరం అంతా పండుగ వాతావరణం నెలకొంది. ఉదయం శివాచార్యుల పర్యవేక్షణలో శాస్త్రోక్తంగా జరిగిన పూజాది కార్యక్రమాలతో బ్రహ్మోత్సవాలకు శ్రీకారం చుడుతూ ధ్వజారోహణం నిర్వహించారు. ఈ సందర్భంగా శివనామస్మరణతో మాడ వీధులు మారుమోగాయి.

- 'మీనాక్షి' అమ్మవారి సన్నిధిలో చిత్తిరై ఉత్సవాలు
- ధ్వజారోహణంతో ఘనంగా ప్రారంభం
- మదురైలో భద్రత కట్టుదిట్టం
- నగరం అంతా పండుగ శోభ

సాక్షి, చెన్నై: మదురై పేరు వింటే అందరికీ మొదట గుర్తుకొచ్చేది మీనాక్షి అమ్మవారి సన్నిధి. కోరిన కోర్కెలు తీర్చే ఈ అమ్మవారుగా సాక్షాత్తూ పార్వతీ దేవి అవతారమే. పురాణాల్లో పేర్కొన్న మేరకు మదురై పాలకుడు మలయ ధ్వజ పాండ్య చేసిన ఘోర తపస్సుకు మెచ్చి ఓ పాప రూపంలో భూమ్మీదకు పార్వతీ దేవి అడుగు పెడుతారు. పెరిగి పెద్దయిన తర్వాత ఆమెను వివాహం చేసుకునేందుకు సుందరేశ్వరుడిగా శివుడు ప్రత్యక్షం అవుతాడు. భూమ్మీద జరిగిన ఈ వివాహ ఘట్టానికి సమస్తలోకాలు తరలి వచ్చినట్టుగా పురాణాలు చెబుతాయి. ఆ మేరకు ఏటా మీనాక్షి అమ్మవారి సన్నిధిలో చైత్రమాస (చిత్తిరై) ఉత్సవాలు కనుల పండువగా జరుగుతాయి. ఇక్కడ ఏడాది పొడవున ఉత్సవాలు జరిగినా, చిత్తిరై ఉత్సవాలకు ప్రత్యేకత ఉంది. తమిళనాడు నుంచే కాదు, పొరుగు రాష్ట్రాలు, విదేశాల నుంచి సైతం లక్షలాదిగా భక్తులు మదురై వైపుగా పోటెత్తుతారు. అందుకే ఆధ్యాత్మిక నగరం మదురై నగరంలో పండుగ శోభ సంతరించుకునే విధంగా బ్రహ్మోతవ ఏర్పాట్లు చేశారు.

శాస్త్రోక్తంగా ధ్వజారోహణం

ధ్వజారోహణంతో ఆదివారం బ్రహ్మోత్సవాలకు చుట్టారు. వేకువ జాము నుంచే ఆలయంలో ప్రత్యేక పూజలు జరిగాయి. అమ్మవారికి అభిషేకాలు, ప్రత్యేక అలంకరణలు నిర్వహించారు. మీనాక్షి అమ్మవారు, సుందరేశ్వర స్వామి వారిని వేర్వేరుగా బంగారు సింహాసనంలో అధిష్టింపజేసి ఆలయం ఆవరణలో ధ్వజస్తంభం వద్దకు తీసుకొచ్చారు. స్వామి, అమ్మవార్లు అక్కడ ఆశీనులు కాగా, శివాచార్యుల నేతృత్వంలో 56 అడుగుల ఎత్తులో ఉన్న బంగారు ధ్వజస్తంభం వద్ద విశేష పూజలు, అభిషేకాలు జరిగాయి. 12 రోజుల పాటు వైభవోపేతంగా జరిగే చిత్తిరై బ్రహ్మోత్సవాలకు శాస్త్రోక్తంగా పూజలతో శ్రీకారం చుడుతూ ధ్వజారోహణం నిర్వహించారు. ఈ సమయంలో భక్తులు శివనామ స్మరణతో ఆలయం మారుమోగింది. సరిగ్గా 10.35 గంటల నుంచి 11 గంటల మధ్య మిథున లగ్నంలో బంగారు ధ్వజస్తంభంపై చిత్తిరై ఉత్సవ పతాకాన్ని ఎగుర వేశారు. ఈ కార్యక్రమానికి ఆర్థిక మంత్రి పళణి వేల్ త్యాగరాజన్, మేయర్ ఇంద్రాణి పొన్ వసంత్, పోలీసు కమిషనర్ నరేంద్రన్ నాయర్, దేవదాయ శాఖ అధికారి చెల్ల దురై తదితరులు పాల్గొన్నారు. ఆలయ పరిసరాలను సప్త వర్ణ పుష్పాలు, విద్యుత్ దీప కాంతులతో శోభాయమానంగా తీర్చిదిద్దారు.

రోజుకో ప్రత్యేక ఉత్సవం

బ్రహోత్సవాల నేపథ్యంలో రోజూ అమ్మవారి ఆలయంలో ప్రత్యేక పూజలు జరగనున్నాయి. ప్రతి రోజు మాసి వీధుల్లో అమ్మవారు భక్తులకు దర్శనం ఇవ్వనున్నారు. ధ్వజారోహనంతో ఆదివారం రాత్రి కల్ప వృక్షం, సింహ వాన సేవ జరిగింది. 24న బూత, అన్న వాహన సేవ, 25న కామధేను, 26న బంగారు పల్లకి, 27న బంగారు అశ్వ వాహనం, 28న రిషభ వాహనం సేవ నిర్వహిస్తారు. ఈ ఉత్సవాలను తిలకించేందుకు లక్షల్లో భక్తులు తరలివస్తున్నారు. ఇక ఈనెల 30వ తేదీన అమ్మ వారికి పట్టాభిషేకం కనుల పండువగా జరగనుంది. మే 1న మీనాక్షి దిగ్విజయం, 2న మీనాక్షి, సుందరేశ్వర స్వామి వారి కల్యాణ మహోత్సవం జరగనున్నాయి. 3న అత్యంత వైభవంగా రథోత్సవం చేపడుతారు. 4వ తేదీన అలగర్ ఆలయంలో జరుగుతున్న బ్రహ్మోత్సవాలలో భాగంగా మధురై మీనాక్షి అమ్మవారి ఆలయంలో ప్రత్యేక వేడుకలు చేపడుతారు. ఆ రోజున అళగిర ఎదుర్ సేవ కార్యక్రమం ఉంటుంది. మరుసటి రోజు మే 5వ తేదీన కళ్లలగర్ స్వామి వారి వైగై నదీ ప్రవేశ ఉత్సవం జరగనుంది. ఈ ఉత్సవం, మదురై నగరంలో ప్రవహిస్తున్న వైగై నదీ తీరంలో లక్షలాది భక్తులు గోవింద..గోవింద నామస్మరణ నడుమ అంగరంగ వైభవంగా నిర్వహించనున్నారు. ఈ ఉత్సవాలతో మదురైలో పండుగ శోభ సంతరించుకుంది. నగరం అంతా


మాడ వీధుల్లో విహరిస్తున్న స్వామి, అమ్మవారు

విద్యుత్ దీపాలంకరణలు చేపట్టారు. పెద్దఎత్తున భక్తులు తరలి రానుండడంతో మదురై ఆధ్యాత్మిక వాతావరణంలో పులకించనుంది. ఇతర జిల్లాల నుంచి మదురైకు ప్రత్యేక బస్సులు రోడ్డెక్కనున్నాయి. ఈ ఉత్సవాల్లో భాగంగా ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకోకుండా వేలాది మంది పోలీసులతో భద్రతను కట్టుదిట్టం చేశారు. మదురై, విరుదునగర్, రామనాథపురం జిల్లాలకు చెందిన పోలీసులను భద్రతా విధుల్లో నియమించారు.


ధ్వజారోహణాన్ని వీక్షిస్తున్న మంత్రి, అధికారులు


మదురై ఆలయం


వెయ్యికాళ్ల మండపంలో అలంకరణలు

ఆర్థిక మంత్రికి కొత్త చిక్కులు

ఆర్థిక మంత్రి పళణి వేల్ త్యాగరాజన్ చిక్కుల్లో పడ్డారు. ఢిల్లీలోని ఓ మీడియా ప్రతినిధితో ఆయన కొంత కాలం క్రితం మాట్లాడినట్లు భావిస్తున్న ఓ ఫోన్ కాల్ ఆడియో తాజాగా వివాదాస్పదమైంది. ఇందులో సీఎం స్టాలిన్, ఆయన తనయుడు ఉదయ నిధి స్టాలిన్, బంధువులు కలిసి రూ. 30 వేల కోట్లు మింగేశారని ఆయన చేసిన వ్యాఖ్యలు తీవ్ర చర్చకు దారి తీశాయి. దీనిపై విచారణకు అన్నాడీఎంకే, బీజేపీలు డిమాండ్ చేస్తున్నాయి.

- కలకలం రేపిన ఆడియో
- సీఎం కుటుంబం అవినీతిపై వ్యాఖ్యలు
- విచారణకు ప్రతిపక్షాల పట్టు


పళణి వేల్ త్యాగరాజన్

సాక్షి, చెన్నై: ఆర్థిక మంత్రి పళణి వేల్ త్యాగరాజన్ ఢిల్లీలోని ఓ మీడియా ప్రతినిధితో తరచూ ఫోన్లో మాట్లాడుతూ వస్తున్నట్టు సమాచారం. ఈ ఇద్దరి మధ్య జరిగిన 26 ఫోన్‌కాల్స్‌కు సంబంధించిన సమాచారం. అందులో ఉన్న వారి మాటల్లోని అంశాలతో ఒక పూర్తిస్థాయి ఆడియో శనివారం రాత్రి నుంచి సామాజిక మాధ్యమాల్లో చక్కర్లు కొడుతోంది. ఆర్థిక మంత్రి పళణి వేల్ త్యాగరాజన్ గొంతు ఆ ఆడియోలో ఉండటం చర్చకు దారి తీసింది.

రూ. 30 వేల కోట్లు కొట్టేశారు..

సీఎం స్టాలిన్, ఆయన తనయుడు ఉదయ నిధి స్టాలిన్, బంధువులు శబరీషన్, మురుగన్ ఏడాది కాలంలో రూ.30 వేల కోట్లు కొట్టేశారని, ఇంత పెద్ద మొత్తాన్ని డీఎంకేలో ఉన్న మునుపటి నాయకులు కూడా సంపాదించ లేక పోయారని వ్యాఖ్యానించడం గమనార్హం. ఈ మొత్తాన్ని ఎలా దాచబోతున్నారో, ఎక్కడ పెట్టనున్నారో? అని ఉన్న తీవ్ర వ్యాఖ్యలు ఇప్పుడు డీఎంకేలోనే కాదు రాష్ట్రవ్యాప్తంగా చర్చకు దారి తీశాయి. ఈ ఆడియోను అన్నాడీఎంకే ప్రధాన కార్యదర్శి పళణి స్వామి తీవ్రంగా పరిగణించారు. విచారణకు ఆదేశించాలని పట్టుబట్టారు. ఇక, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు అన్నామలై అయితే, డీఎంకే ప్రభుత్వంపై దుమ్మెత్తి పోశారు. ఇప్పటికే తాను డీఎంకే అక్రమాస్తుల జాబితా విడుదల చేశానని, తాజా ఆడియో ఆ పాలకుల అక్రమాలకు సాక్ష్యంగా మారిందని పేర్కొన్నారు. ఈ ఆడియోపై విచారణ జరగాలని, ఆర్థిక మంత్రి విచారణకు సిద్ధం కావాలని డిమాండ్ చేశారు. ఈ విషయంగా గవర్నర్ ఆర్‌ఎన్ రవిని కలిసి విచారణకు ఆదేశించాలని కోరబోతున్నామన్నారు. అయితే ఆర్థిక మంత్రి పళణి వేల్ త్యాగరాజన్ స్పందిస్తూ, ఆ గళం తనది కాదే కాదని, ఎవరో తన వలే మిమిక్రీ చేసినట్లుందని వ్యాఖ్యానించడం గమనార్హం. అదే సమయంలో అన్నామలై స్పందిస్తూ, ఈ ఆడియోలో ఉన్నది ఎవరి గళం అన్నది తేల్చుకునేందుకు ఫోరెన్సిక్ అనాలసిస్‌కు పరిశోధనకు సిద్ధమా..? అని సవాల్ చేశారు. ఇదిలా ఉండగా, ఈ ఆడియోలో ఉన్న గళం పళణి వేల్ త్యారాజన్‌దా..? కాదా? అన్నది పక్కన పెడితే, సీఎం ఫ్యామిలీని టార్గెట్ చేసి మరీ తీవ్ర ఆరోపణలు అందులో ఉండటం కొత్త చర్చకు తెర లేపినట్లైంది. ఈ వ్యవహారం మంత్రి మెడకు చుట్టుకున్న పక్షంలో పదవీ గండం తప్పదనే ప్రచారం సాగుతోంది.

పండగ వ్యాపారం రూ.11 వేల కోట్లు

- బంగారు దుకాణాలకు పోటెత్తిన కొనుగోలు దారులు



సాక్షి, చెన్నై: అక్షయ తృతీయ నేపథ్యంలో శని, ఆదివారాల్లో బంగారు దుకాణాలకు జనం పోటెత్తారు. ఈ పరిమాణం బంగారం వర్తకులకు కాసుల వర్షం కురిపించింది. జనం తరలి రావడంతో జ్యువెలరీస్ కిక్కిరిశాయి. వివరాలు.. అక్షయ తృతీయ నాడు బంగారం కొంటే సాక్షాత్తూ లక్ష్మీదేవి తమ నట్టింట్లో అడుగు పెడుందని ప్రజలు విశ్వసిస్తారు. దీంతో ప్రజల్ని ఆకర్షించేందుకు వివిధ డిజైన్ల బంగారు ఆభరణాలను, ప్లాటినం జ్యువెలరీస్‌ను, లక్ష్మి దేవి, వెంకటేశ్వర స్వామి తదితర దేవతామూర్తుల బంగారు, వెండి కాయిన్లను తమ తమ షోరూంలలో వర్తకులు కొలువు దీర్చారు.

రెండు రోజుల పాటు..

తమిళ కాలమాన ప్రకారం అక్షయ తృతీయ శనివారం ఉదయం నుంచి ఆదివారం ఉదయం వరకు కొనసాగింది. దీంతో శనివారం ఉదయం నుంచి కాదు, రాత్రి వేళలలోనూ టీనగర్, ప్యారిస్, పుర్సై వాక్కం, పెరంబూరు, మైలాపూర్ , అన్నానగర్ పరిసరాల్లోని అన్ని బంగారు షోరూమ్‌లలో విక్రయాలు జోరుగా జరిగాయి. వినియోగదారుల్ని సంప్రదాయ బద్ధంగా అనేక దుకాణాలు ఆహ్వానించాయి. కొన్నిచోట్ల తేనీరు, చాక్లెట్లు, స్వీట్లను అందించారు. శని, ఆదివారాలలో జ్యువెలరీస్ యజమానులు ప్రత్యేక ఆభరణాలతో వినియోగదారుల్ని ఆకర్షించారు. దీంతో గత ఏడాదితో పోల్చుకుంటే, ఈ సారి విక్రయాలు మరింతగా పెరిగాయి. కాగా ఈ ఏడాది రాష్ట్రవ్యాప్తంగా రూ. 11 వేల కోట్లు బంగారు అమ్మకాలు జరిగినట్లు వర్తకులు పేర్కొంటున్నారు.

లోయలో పడిన వ్యాన్!



- నలుగురు నెల్లై వాసుల మృతి
- 17 మందికి గాయాలు

సాక్షి, చెన్నై: కేరళ- తమిళనాడు సరిహద్దులలోని బోడినాయనూరు మార్గంలోని 300 అడుగుల లోయలో వ్యాన్ బోల్తా పడింది. ఇందులో ప్రయాణిస్తున్న తిరునల్వేలి(నెల్లై)కు చెందిన నలుగురు సంఘటనా స్థలంలో మరణించారు. మరో 17 మంది తీవ్రంగా గాయపడ్డారు. వివరాలు.. తిరునల్వేలి జిల్లా షణ్ముగపురానికి చెందిన 21 మంది కేరళ రాష్ట్రం మూనారులోని లక్ష్మీ ఎస్టేట్‌లో ఆదివారం జరగాల్సిన వివాహానికి వ్యాన్‌లో శనివారం సాయంత్రం బయలుదేరారు. తేని జిల్లా -బోడి మెట్టు మార్గంలో మూనారు వైపుగా ఈ వ్యాన్ వెళ్తున్న సమయంలో ఓ మలుపు వద్ద అదుపు తప్పింది. చీకటిమయం కావడంతో వ్యాన్‌ను డ్రైవర్ అదుపుచేయలేని పరిస్థితి నెలకొంది. ఈ వ్యాన్ పిట్టగోడను ఢీకొట్టి 300 అడుగుల లోతులోని లోయలోకి దూసుకెళ్లింది. ఈ మార్గంలో ఇతర వాహనాలు ఆ సమయంలో రాక పోవడంతో ప్రమాదాన్ని ఎవరూ గుర్తించ లేదు. అటువైపుగా ద్విచక్ర వాహనాల్లో వెళ్లిన యువకులు కొందరు మూనారు మార్గం మలుపు వద్ద ఏదో ప్రమాదం జరిగినట్లు గుర్తించి చెక్ పోస్టులో ఉన్న సిబ్బందికి సమాచారం అందించారు. ఆ పరిసరాల్లో చిమ్మచీకటి నెలకొనడంతో సహాయక చర్యలు కష్టతరంగా మారాయి. అతికష్టం మీద రెస్క్యూ టీం లోయలోకి వెళ్లి, గాయాలతో ఆర్తనాదాలు చేస్తున్న వారిని గుర్తించారు. చికిత్స నిమిత్తం మూనారులోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. ఆదివారం ఉదయాన్నే ఆ వాహనంలో మరణించి పడి ఉన్న మృతదేహాలను బయటకు తీశారు. వీటిని పోస్టుమార్టానికి తరలించారు. ఘటనా స్థలంలోనే మరణించిన వారిలో తిరునల్వేలికి చెందిన పెరుమాల్ (59), వళ్లియమ్మాల్(70), సుశీంద్రన్(8), సుధా(35) ఉన్నారు. గాయపడ్డ వారిలో దైవానై, సీతాలక్ష్మి, షెంబగం, ప్రకాష్, సెల్వ ప్రకాష్, కృష్ణమ్మాల్ పరిస్థితి ఆందోళనకరంగా ఉంది. వీరికి అత్యవసర చికిత్స అందిస్తున్నారు. మిగిలిన వారు స్వల్ప గాయాలతో బయటపడ్డారు.

పుళల్ బైపాస్‌కు కొత్త శోభ

- విద్యుత్ వెలుగుల కోసం రూ. 15 కోట్లతో పనులు


పెరుంగళత్తూరు- పుళల్ బైపాస్ రోడ్డు

సాక్షి, చెన్నై: చెన్నై పెరుంగళత్తూరు – పుళల్ బైపాస్ రోడ్డుకు కొత్త శోభను సంతరించుకోనుంది. విద్యుత్ వెలుగుల కోసం రూ. 15 కోట్లతో ఒప్పందాలను రహదారుల శాఖ ఖరారు చేసింది. వివరాలు.. చెన్నై నగరంలో రద్దీ నియంత్రణ కోసం కొన్నేళ్ల క్రితం దక్షిణం వైపుగా ఉన్న పెరుంగళత్తూరు నుంచి ఉత్తరం వైపు గా ఉన్న పుళల్ వరకు 32 కి.మీ దూరం జాతీయ రహదారిగా బైపాస్ రోడ్డు ఏర్పాటైన విషయం తెలిసిందే. ఈ మార్గం పోరూర్, మదురవాయిల్, అంబత్తూరును కలుపుతూ రూపుదిద్దుకుని ఉంది. కోయంబేడు నుంచి దక్షిణ తమిళనాడులోని జిల్లాలు, నగరాలకు జాతీయ రహదారి వైపుగా వెళ్లే వాహనాలు మదుర వాయిల్ వద్ద ఈ బైపాస్‌లో కలుస్తాయి. ఈ మార్గంలో పోరూర్, పుళల్ వద్ద రెండు టోల్‌గేట్లు సైతం ఉన్నాయి. టోల్ గేట్ల వద్ద మాత్రమే విద్యుత్ దీపాలు ఉంటాయి. మిగిలిన ప్రాంతాల్లో ఎక్కడా కనిపించవు. ఫలితంగా రాత్రులలో ఈమార్గంలో ద్విచక్ర వాహన దారులు వెళ్లాలంటే భయాందోళన చెందుతుంటారు. ఈ బైపాస్‌లో పోరూర్, మదుర వాయిల్, అంబత్తూరు వద్ద మాత్రమే వాహనాలు ప్రవేశించేందుకు ప్రత్యేక మార్గాలు ఉన్నాయి. చిమ్మ చీకటితో నిండిన ఈ బైపాస్ మార్గంలో రాత్రుళ్లలో ప్రమాదాలు, అసాంఘిక కార్యక్రమాలు నిత్యకృత్యంగా మారాయి. దీంతో విద్యుత్ దీపాలు ఏర్పాటు చేయాలని కొన్నేళ్లుగా వాహనదారులు విజ్ఞప్తి చేస్తున్నారు.

స్పందించిన రహదారుల శాఖ

వాహనదారుల విజ్ఞప్తులకు రహదారుల శాఖ స్పందించింది. పెరుంగళత్తూరు సమీపంలోని వండలూరు నుంచి మీంజూరు వరకు రూపుదిద్దుకున్న ఔటర్ ఎక్స్‌ప్రెస్ మార్గంలో ఉన్నట్టుగానే ఈ బైపాస్ రోడ్డులోనూ విద్యుత్ దీపాలు ఏర్పాటు చేయనున్నట్లు వెల్లడించారు. పెరుంగళత్తూరు నుంచి – పుళల్ వరకు రూ. 14.82 కోట్లతో 2,133 చోట్ల విద్యుత్ దీపాలను ఏర్పాటు చేయనున్నారు. ఇందులో 10 మీటర్ల ఎత్తుతో కూడిన 1,033 స్తంభాలను ఇరు వైపులా విద్యుత్ లైట్లను ఏర్పాటు చేసే విధంగా అమర్చనున్నారు. అలాగే 9 మీటర్ల ఎత్తులో 341 విద్యుత్ స్తంభాలను ప్రధాన ప్రాంతాల్లో అమర్చనున్నారు. ఐదు నెలల్లో ఈ పనులు ముగించే విధంగా ఒప్పందాలను రహదారుల శాఖ ఖరారు చేసినట్లు సంబంధిత అధికారులు పేర్కొన్నారు.

క్లుప్తంగా

టాస్మాక్ ఉద్యోగులపై దాడి

– రూ. 5.37 లక్షలు చోరీ

తిరువొత్తియూరు: విరుదునగర్ జిల్లా తిరుచులి సమీపంలో ఉన్న గ్రామం పల్లిమతం గ్రామ పొలి మేరలో టాస్మాక్ దుకాణం ఉంది. ఇందులో పల్లిమతానికి చెందిన భూమినాథన్ (49) పచ్చే రికి చెందిన ముత్తుకరుప్పన్న (45), నార్ధంపట్టికి చెందిన నారాయణస్వామి (48) పనైయూరుకు చెందిన పెరుమాళ్ స్వామి పని చేస్తూ ఉన్నారు. అదే దుకాణంలో పులియంకులానికి చెందిన మారియప్పన్, సెంథిల్ తదితరులు పనిచేస్తు న్నారు. శనివారం రాత్రి పని పూర్తి అయిన తర్వాత ఉద్యోగులు విక్రయం అయిన నగదును లెక్కించి ఇంటికి దుకాణంకు తాళం వేస్తున్నారు. ఆ సమయంలో అక్కడికి రెండు బైకుల్లో వచ్చిన ముసుగు ధరించిన నలుగురు, భూమినాథన్‌తో సహా ముగ్గురిపై కత్తితో దాడి చేశారు. దుకాణం లోని రూ. 5,37,000 నగదును అపహరించుకుని పారిపోయారు. ఈ ఘటనపై ఫిర్యాదు మేరకు తిరుచ్చులి పోలీసులు కేసు నమోదు చేసి దుం డగుల కోసం గాలిస్తున్నారు.

సురక్షితమైన సందేశమే లక్ష్యం

సాక్షి, చెన్నై: సురక్షితంగా సందేశాలు, సమాచా రాన్ని వినియోగదారులకు అందించడమే సన్‌బర్డ్ మొబైల్ యాప్ ప్రధాన లక్ష్యమని ఆ సంస్థ వ్యవ స్థాపకులు డానీ మిజాహీ తెలిపారు. దీని గురించి స్థానికంగా ఆదివారం జరిగిన కార్యక్రమంలో ఆయన వివరించారు. ఆండ్రాయిడ్ ఫోన్ వినియో గదారుల కోసం యూనిఫైడ్ మెసేజింగ్ యాప్‌గా ఇది ఉపయోగ పడుతుందన్నారు. దీనినే సన్బర్డ్ మెసేజింగ్ యాప్ అని కూడా పిలుస్తారని తెలిపా రు. తాజాగా భారతదేశంలో ఈ సేవలను ఆవి ష్కరించామని, త్వరలో ప్రపంచ వ్యాప్తంగా యూ నిఫైడ్ మెసేజింగ్ యాప్ విస్తరించాలని యోచిస్తు న్నామని చెప్పారు. ప్రతీ దేశానికి, ప్రతీ ప్రాంతా నికి విభిన్న మెసేజింగ్‌లు ఉంటాయని వీటన్నిం టినీ ఒకే గొడుగుకిందికి తీసుకొచ్చేందుకు ఈ యాప్ ఉపయోగ పడుతుందని వివరించారు. వినియోగ దారుల మధ్య జరిగే సందేశాలు, సమాచారాన్ని సురక్షితంగా అందించడమే ఈ యాప్ ముఖ్య ఉద్దేశమని పేర్కొన్నారు.

కళాశాల విద్యార్థి ఆత్మహత్య

తిరువొత్తియూరు: కుమారి జిల్లా అరల్వాయిమొళి కుమారపురం ప్రాంతంలో రైలు కింద పడి కళాశాల విద్యార్థి ఆత్మహత్య చేసుకున్న ఘటన కలకలం రేపింది. నాగర్‌కోయిల్‌లోని పున్నైనగ ర్‌కు చెందిన సకాయసిమ్సన్ కుమారుడు షనీస్ (26) ప్రైవేట్ కళాశాలలో ఎంబీఏ చదువుతు న్నాడు. అతని తల్లిదండ్రులు మృతి చెందడంతో బంధువుల సంరక్షణలో ఉంటూ చదువుకుంటు న్నాడు. అతను క్రమం తప్పకుండా ఆన్‌లైన్ రమ్మీ ఆడుతూ డబ్బు పోగొట్టుకోవడంతో మనస్తాపం చెంది రైలు కింద పడి ఆత్మహత్య చేసుకుని ఉంటాడని పోలీసులు అనుమానం వ్యక్తం చేస్తు న్నారు. కేసు దర్యాప్తులో ఉంది.

తిరువణ్ణామలై అభివృద్ధికి ప్రత్యేక ప్రణాళిక



మార్కెట్ భవన నిర్మాణాలకు శంకుస్థాపన చేస్తున్న మంత్రి ఏవా వేలు

వేలూరు: తిరువణ్ణామలైను రాష్ట్రంలోనే ఆదర్శంగా తీర్చి దిద్దేందుకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్లు రాష్ట్ర మంత్రి ఏవా వేలు వెల్లడించారు. తిరువణ్ణా మలై పట్టణంలో రూ: 29.25 కోట్లు వ్యయంతో రైతు బజారు, పండ్లు మార్కెట్ నిర్మాణం కోసం శం కుస్థాపన పనులు కలెక్టర్ మురుగేష్ అధ్యక్షతన ఆది వారం ఉదయం జరిగింది. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ దేశ నలుమూలల నుంచి భక్తులు అధిక సంఖ్యలో తిరువణ్ణామలైకి దైవదర్శనం కోసం వస్తుంటారన్నారు. దీంతోనే ఇప్పటికే తిరువ ణ్ణామలై గిరివలయంలో భక్తులకు అవసరమైన అన్ని సౌకర్యాలను సిద్ధం చేశామన్నారు. ప్రస్తుతం రైతులను ఉత్సాహ పరచడం కోసం పట్టణ నడి బొ డ్డున రైతులు, కొనుగోలుదారులకు అనుగుణంగా రైతు బజారుతో పాటు పండ్లు మార్కెట్‌లో శాశ్వత భవనాలు నిర్మించేందుకు చర్యలు తీసుకుం టున్నట్లు తెలిపారు. ప్రజలకు అవసరమైన సంక్షేమ పథకాలు తీసుకు రావడమే తమ ప్రభుత్వ ధ్యేయ మన్నారు. ప్రజా సమస్యలను తరచూ గమనించి వారికి అవసరమైన సంక్షేమ పథకాలను తమ ముఖ్యమంత్రి ప్రవేశ పెడుతున్నారని వీటిని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్ర మంలో ఎమ్మెల్యేలు గిరి, శరవణన్, ఎస్పీ కార్తికేయ న్, రాష్ట్ర క్రికెట్ స్టోర్స్ అకాడమీ సభ్యులు కంబన్, మున్సిపల్ చైర్మన్ కార్తివేల్‌మురుగన్, మున్సిపల్ కమిషనర్ మురుగేశన్, వివిధ శాఖల అధికారులు, ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

దేశ రక్షణకు సిద్ధం కావాలి



వధూవరులను ఆశీర్వదిస్తున్న సీఎం స్టాలిన్

– డీఎంకే కార్యకర్తలకు స్టాలిన్ పిలుపు

సాక్షి, చెన్నై: దేశాన్ని రక్షించేందుకు పార్టీ కేడర్ సిద్ధం కావాలని డీఎంకే అధ్యక్షుడు, సీఎం ఎంకే స్టాలిన్ పిలుపు నిచ్చారు. ఇందు కోసం రానున్న లోక్‌సభ ఎన్నికల్లో డీఎంకే కూటమికి భారీ గెలుపు దక్కే విధం గా ప్రతి కార్యకర్త శ్రమించాలని కోరారు. ఆదివారం తేనాంపేటలోని డీఎంకే ప్రధాన కార్యాలయం అన్నా అరియవాలయంలో జరిగిన ఓ నేత కుటుంబ వివాహ వేడుకలో కేడర్‌ను ఉద్దేశించి స్టాలిన్ ప్రసం గించారు. రానున్న లోక్ సభ ఎన్నికలను ప్రతి ఒక్కరూ సీరియస్‌గా తీసుకోవాలని సూచించారు. పుదుచ్చేరితో పాటు రాష్ట్రంలో క్లీన్‌స్వీప్ లక్ష్యంగా ముందుకెళ్లాలన్నారు. అసెంబ్లీ ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన వాగ్దానాలన్నీ ప్రభుత్వం అమలు చేస్తున్న విషయాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లాలని సూచించారు. పథకాలు ఎవ్వరెవ్వరికి దరి చేరలేదో గుర్తించి, అధికా రులను సంప్రదించి ఆయా కుటుంబాలకు న్యాయం జరిగే విధంగా చర్యలు తీసుకోవాలని తెలిపారు. రాష్ట్ర హక్కులను కేంద్రంలోని పాలకులు హరింప చేస్తున్నారని, వీటిని రక్షించుకునేందుకు నిత్యం పోరాటం చేయాల్సి ఉందన్నారు.

రక్షకులుగా..

దేశాన్ని మతమత్వ శక్తుల నుంచి రక్షించుకోవాల్సిన అవసరం ఉందని వ్యాఖ్యలు చేశారు. కేంద్రం సహ కారం కొరవడడం, ఆర్థికంగా ఇబ్బందులు ఎదురైనా.. రాష్ట్రంలో ఏ ఒక్క పథకం ఆగకూడదన్న ఉద్దే శంతో తన ప్రభుత్వం విస్తృతంగా, ఉత్తమంగా సేవలను అందిస్తున్నట్లు వివరించారు. ప్రభుత్వ ప్రగతి పథకాలన్నీ ప్రజల్లోకి వెళ్లాల్సిన అవసరం ఉందని, ఇందుకోసం లోక్‌సభ ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని పార్టీ పరంగా బూత్‌కమిటీలను విస్తృతం చేయాలని, నియోజకవర్గాల వారీగా కార్యక్రమా లకు ఇన్‌చార్జ్‌లను నియమించడం, పర్యవేక్షకులను రంగంలోకి దించడం వంటి ప్రక్రియను వేగవంతం చేశామన్నారు. దేశాన్ని రక్షించుకునేందుకు లోక్ సభ ఎన్నికలు కీలకం కానున్నాయన్నారు. ఇందులో జాతీయ స్థాయిలో డీఎంకే కీలక పాత్ర పోషించా ల్సిన అవశ్యం ఏర్పడిందని, దీనిని గుర్తుంచుకుని అన్ని నియోజకవర్గాల్లో గెలుపే లక్ష్యంగా శ్రమిం చాలని పిలుపు నిచ్చారు.

కుక్కపిల్లను కాల్చిచంపేశాడు!

- తిరుచ్చిలో ఘటన
- డాక్టర్ అరెస్టు

సాక్షి, చెన్నై: పుట్టి రోజులు అవుతున్న శునకం పిల్లను ఓ కిరాతక డాక్టర్ ఎయిర్ పిస్టోల్‌తో కాల్చి చంపేశాడు. తిరుచ్చిలో ఈ ఘటన వెలుగు చూసింది. వివరాలు.. తిరుచ్చి జిల్లా పాలకరై ఖాజాపేటకు చెందిన సయ్యద్ హస న్(46) యూనానీ డాక్టర్. ఇతడి వద్ద ఏయిర్ పిస్టోల్ ఉంది. దీనికి లైసెన్స్ ఉందా..? లేదా..? అనేది పక్కన పెడితే, తరచూ ఇతగాడు పిస్టల్‌తో పక్షులను వేటాడేవాడు. ఈ పరిస్థితుల్లో శనివారం ఓ చోట ఉన్న కుక్కపిల్లను కనికరం లేకుండా హతమా ర్చాడు. తన వద్ద ఉన్న పిస్టల్‌తో దానిని కాల్చి చంపేశాడు.ఈ దృశ్యాన్ని సమీపం లోని ప్రభు, పళణి అనే వ్యక్తులు గుర్తిం చారు. అక్కడి ఓ సీసీ కెమెరా ఆధారంగా నిర్ధారణ చేసుకుని.. ఈ సమాచారాన్ని పోలీ సులకు అందజేశారు. అలాగే అతడిపై చర్యలు తీసుకోవాలని పాలకరై పోలీసులకు ఫిర్యాదు చేశారు. వీడియో ఆధారంగా సయ్యద్‌ను ఆదివారం పోలీసులు అరెస్టు చేశారు. విచారణలో ఇతగాడు చేతిలో అనేక శునకాలు హతమైనట్లు వెలుగు చూసింది. అలాగే పక్షులు అధికంగా ఉన్న చోట్ల యాసిడ్ కలిపిన నీటినిపెట్టి మరి వాటిని హతమార్చేవాడని తేలింది. ఇతగాడిని కఠి నంగా శిక్షించాలని జంతు ప్రేమికులు డిమాండ్‌చేస్తున్నారు.

డాక్టర్‌ను బురిడీ కొట్టించిన అమెరికా యువతి

సాక్షి, చెన్నై: ప్రేమ, పెళ్లి పేరిట పుదుచ్చేరికి చెం దిన వైద్యుడిని అమెరికాకు చెందిన ఓ యువతి బురిడీ కొట్టించింది. అతడి వద్ద నుంచి రూ. 37 లక్షలు తస్కరించి స్విచ్ ఆఫ్ చేసింది. వివరాలు.. ఆలస్యంగా మేల్కొన్న డాక్టర్ ఆదివారం పోలీ సులను ఆశ్రయించారు. వివరాలు.. పుదు చ్చేరిలోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో బాలాజీ(34) డాక్టర్‌గా పనిచేస్తున్నాడు. రెండో వివాహం చేసు కునేందుకు నిర్ణయించిన బాలాజీ తన వివ రాలను ఓ వివాహ వెబ్‌సైట్‌లో పెట్టాడు. దీనిని చూసి అమెరికాలోని సోము శ్రీనాయర్ అనే యువతి బాలాజీకి దగ్గరైంది. ఇద్దరు ఫోన్లలో మాట్లాడుకున్నారు. చాటింగ్‌లు చేసుకున్నారు. పరస్పరం తమ భావాలను అంది పుచ్చుకున్నారు. ఇద్దరు వివాహం చేసుకునేం దుకు సిద్ధమయ్యారు. ఈ సమయంలో అమెరి కాలో తనకు హఠాత్తుగా రెండు సార్లు ఆర్థిక సమస్యలు ఎదురు కావడంతో ఆ యువతి బాలా జీని సాయం కోరింది. తనకు కాబోయే భార్యను ఆర్థిక కష్టాల నుంచి గట్టెక్కించేందుకు రూ. 37 లక్షలు అందజేశాడు. అయితే గత నాలుగైదు రోజులుగా సోమ శ్రీ నాయర్ ఫోన్ స్పందించక పోవడం, సామాజిక మాధ్యమాల్లోని పేజీలను ఆమె బ్లాక్ చేసి ఉండటంతో తాను మోస పోయి నట్లు గ్రహించిన డాక్టరు పోలీసులను ఆశ్రయిం చాడు.

ఘనంగా అవార్డుల ప్రదానోత్సవం



అవార్డు గ్రహీతలతో మాజీ ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ కె.కన్నన్

కొరుక్కుపేట: పంజాబ్, హర్యానా హైకోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ కె.కన్నన్ అధ్యక్షతన రోటరీ మద్రాస్ సౌత్ వెస్ట్ క్లబ్ ఆధ్వర్యంలో చారియట్ అవా ర్డులు – 2023 ప్రదానోత్సవం ఆదివారం ఘనంగా జరిగింది. స్థానిక ఎగ్మోర్‌లో జరిగిన ఈ కార్యక్రమం లో వివిధ రంగాల్లో విశిష్ట సేవలందించిన ఐదుగురు ప్రముఖులకు అవార్డులను మాజీ ప్రధాన న్యాయ మూర్తి జస్టిస్ కె. కన్నన్ అందజేశారు. ఇందులో అవా ర్డులను సీనియర్ న్యాయవాది శ్రీరామ్ పంచు, ప్రిన్స్ జ్యువెలరీ మేనేజింగ్ డైరెక్టర్ ప్రిన్సన్ జోస్, రచ యిత, సీనియర్ జర్నలిస్ట్ సీఏ పట్టాభి రామ్, స్విమ్మర్ క్రీడాకారులు శ్రీరామ్ శ్రీనివాస్ , కర్ణాటక సంగీత గాయని, వయోలిన్ గాయత్రీ అందుకు న్నారు. ఈ సందర్భంగా జస్టిస్ కె. కన్నన్ మాట్లా డుతూ రోటరీ మద్రాస్ సౌత్ వెస్ట్ క్లబ్ తరపున చెన్నై చుట్టుపక్కల పాఠశాలలు గ్రామాల్లో ఆరోగ్య శిబి రాలు, అనాథ శరణాలయాలు వృద్ధాశ్రమాలలో వారానికోసారి అన్నదానం వంటి ప్రాజెక్టులు చేయడంపై నిర్వాహకులను అభినందించారు. ఇం కా విస్తృతంగా సమాజ సేవ చేయాలని పిలుపు నిచ్చారు. రోటరీ మద్రాస్ సౌత్‌వెస్ట్ సభ్యులు, వారి కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

తత్వహెల్త్ సేవలు మరింత విస్తృతం



రసాయన రహిత చక్కెర ప్యాక్‌లతో ప్రతినిధులు

సాక్షి, చెన్నై: ప్రముఖ ఆహార ఉత్పత్తి సంస్థల్లో ఒకటైన తత్వ హెల్త్ అండ్ వెల్ నెస్ సేవలను దేశంలోని పలు రాష్ట్రాలకు విస్తరించనున్నామని ఆ సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ సచిన్ జైన్ తెలిపారు. ఈ సంస్థ నేతృత్వంలో ఆరోగ్య సంరక్షణలో భాగంగా సిద్ధం చేసిన రసాయన రహిత కేసరి గోల్డెన్ షుగర్‌ను స్థానికంగా ఆదివారం ఆవిష్కరించారు. దీని గురించి సచిన్ జైన్ మీడియాకు వివరిస్తూ ఆరోగ్య కరమణ చక్కెర ఎంపిక కోసం వినియోగ దారులు ఎదురు చూస్తూ వచ్చారని పేర్కొ న్నారు. కరోనా పరిస్థితుల అనంతరం ప్రజలు ఆరోగ్య జాగ్రత్తలపై స్వీయ అవహన కలిగి ఉన్నారని వివరిం చారు. ఇలాంటి వారు తాము తీసుకునే ఆహారంపై ప్రత్యేక శ్రద్ధ చూపుతున్నట్టు తెలిపారు. అందుకే తాము ఆరోగ్య సంరక్షణలో భాగంగా కొత్త రకంగా కేసరి గోల్డెన్ షుగర్‌ను తీసుకొచ్చామన్నారు. న్యూకేన్ ఆస్ట్రేలియా సంస్థతో భాగస్వామ్యం కలిగి ఉన్నామని, గ్లోబెల్ పేటెంట్ టెక్నాలజీతో, సాంకేతికతో ఈ చక్కెరను ఉత్పత్తి చేస్తున్నామని వివరించారు. ఇటీవల బెంగళూరులో, తాజాగా చెన్నైలో తమ సేవలకు శ్రీకారం చుట్టామని, మున్ముందు దేశంలోని అన్ని రాష్ట్రాలకు విస్తరించనున్నామని వెల్లడించారు.

కోలీవుడ్ టాక్స్


మణిరత్నం చిత్రానికి ముందే..!



దర్శకుడు హెచ్.వినోద్, కమలహాసన్

తమిళ సినిమా: కోలీవుడ్ టాప్ స్టార్స్ కమల్ హాసన్, రజనీకాంత్ వరుస చిత్రాలతో బిజీ బిజీగా ఉన్నారు. నటుడు కమలహాసన్ విషయానికి వస్తే కథానాయకుడుగా, నిర్మాతగా చిత్రాలు చేస్తూ సక్సెస్ బాటలో పయనిస్తు న్నారు. విక్రమ్ వంటి ఘన విజయం సాధించిన చిత్రం తర్వాత ఈయన ప్రస్తుతం శంకర్ దర్శకత్వంలో ఇండియన్- 2 చిత్రాన్ని పూర్తి చేసే పనిలో ఉన్నారు. లైకా ప్రొడక్షన్స్ మూవీ సాంగ్స్ కలిసి నిర్మిస్తున్న ఈ భారీ చిత్రం లో కాజల్ అగర్వాల్, రకుల్ ప్రీతిసింగ్, ప్రియ భవానీ శంకర్ హీరోయిన్ లుగా నటిస్తున్నారు. కాగా ఈ చిత్రం తర్వాత కమలహాసన్ కోసం రెండు చిత్రాలు ఎదురుచూస్తున్నాయి. అందులో ఒకటి మణిరత్నం దర్శకత్వం లో నటించే చిత్రం. ఇది కమలహాసన్ నటించిన 234వ చిత్రం అవుతుం ది. అయితే అంతకుముందే తుణివు చిత్రం ఫేమ్ హెచ్.వినోద్ దర్శకత్వం లో ఒక చిత్రాన్ని చేయడానికి రెడీ అవుతున్నారు అన్నది తాజా సమాచా రం. హెచ్. వినోద్ చెప్పిన కథ నచ్చడంతో కమలహాసన్ ఇప్పటికే గ్రీన్ సిగ్నల్ ఇచ్చారు. అయితే మణిరత్నం దర్శకత్వంలో నటించే గురించి ప్రచారం వెలుగులోకి రావడంతో హెచ్. వినోద్ చిత్రం డ్రాప్ అయిందనే ప్రచారం జరిగింది. అయితే తాజాగా కమలహాసన్ మణిరత్నం దర్శ కత్వంలో నటించే చిత్రానికి ముందు హెచ్.వినోద్ చిత్రాన్ని పూర్తి చేయడా నికి సిద్ధం అవుతున్నట్లు కోలీవుడ్ వర్గాలు సమాచారం. ఈ చిత్ర నవం బర్‌లో సెట్ పైకి వెళ్లనున్నట్లు తెలిసింది. మరో విషయం ఏమిటంటే దీన్ని పాన్ ఇండియా స్థాయిలో తెరకెక్కించబోతున్నట్లు, ఇందులో కమలహాస న్‌తో పాటు నటుడు విజయ్ సేతుపతి ముఖ్యపాత్రలో నటించనున్నట్లు సమాచారం. అదేవిధంగా ఇందులో కమలహాసన్‌కు సంబంధించిన సన్ని వేశాలను దర్శకుడు నెల రోజుల్లో పూర్తి చేయడానికి ప్రణాళికను సిద్ధం చేస్తున్నట్లు సమాచారం. ఆ తర్వాత విజయ్ సేతుపతి, ఇతర నటీనటుల సన్నివేశాలను చిత్రీకరించనున్నట్లు తెలుస్తోంది. అయితే దీనికి సంబంధిం చిన అధికారిక ప్రకటన వెలువడాల్సి ఉన్నజని అన్నారు.

చిత్ర ప్రారంభోత్సవంలో యూనిట్ సభ్యులు



విశాల్ 34వ చిత్రానికి శ్రీకారం

తమిళ సినిమా: నటుడు విశాల్ వరుసగా చిత్రాలు చేస్తూ బిజీగా ఉన్నారు. ఈయన తాజాగా మార్క్ అంటాని చిత్రంలో నటిస్తున్నారు. నటి రీతు వర్మ నాయకిగా నటిస్తున్న ఇందులో ఎస్‌జే సూర్య ప్రతి నాయకుడిగా నటిస్తున్నారు. ఆధిక్ రవిచంద్రన్ దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రం షూటింగ్ పూర్తి చేసుకుని ప్రస్తుతం నిర్మాణానంతర కార్యక్రమాల ను జరుపుకుంటోంది. దీంతో విశాల్ కొత్త చిత్రానికి సిద్ధమయ్యారు. ఇది ఈయన నటిస్తున్న 34 చిత్రం అవుతుంది. దీనికి కమర్షియల్ చిత్రాల దర్శకుడు హరి దర్శకత్వం వహిస్తున్నారు. విశాల్, దర్శకుడు హరి కాంబినేషన్లో ఇంతకుముందు తామర భరణి, పూజై వంటి విజయవంతమైన చిత్రాలు వచ్చాయి అన్నది గమనార్హం. కాగా తాజా చిత్రాన్ని దర్శకుడు కార్తీక్ సుబ్బురాజ్‌కు చెందిన స్టోన్ బెంచ్ ఫిలిమ్స్ సంస్థ, జి స్టూడియోస్ సౌత్ సంస్థ కలిసి నిర్మిస్తు న్నాయి. ఈ చిత్రం ఆదివారం ఉదయం చెన్నైలో పూజా కార్యక్రమాలతో ప్రారంభమైంది. దీని గురిం చి చిత్ర నిర్మాతలు మీడియాకు విడుదల చేసిన ప్రక టనలో తెలుపుతూ ఈ చిత్ర కథ అన్ని వర్గాల వారిని ఆలరించే విధంగా ఉంటుందని చెప్పారు. ఇందులో ఇతర పాత్రలో ప్రముఖ నటీనటులు సాం కేతిక వర్గం పని చేస్తున్నారని, ఆ వివరాలను త్వరలోనే వెల్లడిస్తామని చెప్పారు. అదేవిధంగా చిత్రం రెగ్యులర్ షూటింగ్‌ను కూడా త్వరలోనే ప్రారంభించనున్నట్లు చెప్పారు.

జోక్ చేశా.. అంతే!

తమిళ సినిమా: సినిమా రంగంలో చాలా మంది నోరు జారడం, అది ప్రేక్షకుల్లో వైరల్ అవడంతో తూచ్ తాను అలా అనలేదని, నా వ్యాఖ్యలు వక్రీకరించారు అని ప్లేట్ పిరా యించడం సర్వ సాధారణంగా జరుగుతున్నదే. తాజాగా నటి షెరిన్ కూడా ఇలానే మాట మార్చేసింది. తుళ్లువదో ఇళమై చిత్రం ద్వారా ధనుష్‌కు జంటగా నాయకిగా పరిచయం అయిన నటి ఈ భామ. ఆ తర్వాత విజిల్ తదితర చిత్రాల్లో నటిం చిన పెద్దగా క్రేజ్‌ను సంపాదించుకోలేకపోయింది. దీంతో అవకాశాలు లేక నటనకు దూరం అయ్యింది. అలాంటిది ఇప్పుడు మళ్లీ నటించడానికి ప్రయత్నాలు చేస్తోంది. అందులో భాగంగా ఇటీవల బిగ్‌బాస్ రియాల్టీ గేమ్ షోలో పాల్గొని మళ్లీ వార్తల్లో నిలిచింది. ప్రస్తుతం కుక్ విత్ కోమలి సీజన్ 4లో పాల్గొంటుంది. కాగా ఈమె ఇటీవల ఫేస్బుక్ ద్వారా అభిమానంతో ముచ్చటించింది. అప్పుడు ఒక అభిమాని పెళ్లి ఎప్పుడు చేసుకుంటారు అన్న ప్రశ్నకు ఒక నెలలో తన పెళ్లి జరుగుతోందని బదులిచ్చింది. దీంతో నటి షెరిన్ పెళ్లికి సిద్ధమైంది అంటూ సామాజిక మాధ్యమాల్లో ప్రచారం వైరల్ అవుతుంది. దీంతో ఏమైందో ఏమో గానీ.. నటి షెరిన్ ఈ ప్రచారంపై స్పందిస్తూ లేదు అభిమాని ప్రశ్నకు ఓ నెలలో తన పెళ్లి అని సరదాగా చెప్పానని అది ఇంతగా వైరల్ అవుతుందని ఊహించలేదని చెప్పుకొచ్చింది. నిజానికి తనకు ఇప్పట్లో పెళ్లి చేసుకునే ఆలోచన లేదని ఈ అమ్మడు వివరణ ఇచ్చింది. దీంతో ఇలాంటివి మామూలే అని నెటిజన్లు సెటైర్లు వేస్తున్నారు.



నటి షెరిన్

నా తల్లిదండ్రులు గర్వపడడం లేదు



రష్మిక మందన్న

తమిళ సినిమా: అతికొద్ది కాలంలోనే అగ్ర కథానాయిక స్థాయికి ఎదిగిన నటి రష్మిక మందన్న. కిరిక్ పార్టీ అని కన్నడం చిత్రం ద్వారా కథానాయికగా తెరంగేట్రం చేసిన ఈ అమ్మడు తొలి చిత్రంతోనే విజ యాన్ని తన ఖాతాలో వేసుకుంది. దీంతో ఈమెపై ఇతర భాష దర్శక నిర్మా తల దృష్టి పడింది. అలా తెలుగులో చలో చిత్రం ద్వారా ఎంట్రీ ఇచ్చింది. ఆ చిత్రం మంచి గుర్తింపును తెచ్చిపెట్టింది. ఆ తర్వాత నటించిన గీతాగో విందం చిత్రం రష్మిక దశను మార్చేసింది. అంతే ఆపై ప్రముఖ కథానాయ కుల సరసన నటించే అవకాశాలు వరుసగా ఈ అమ్మడి గుమ్మం తొక్కాయి. అలా తెలుగులో మహేష్ బాబుతో సర్కారి వారి పాట, అల్లు అర్జున్ సరసన పుష్ప వంటి చిత్రాలు రష్మికను స్టార్ హీరోయిన్‌ను చేశాయి. అంతేకాదు బాలీ వుడ్ అవకాశాలను తెచ్చిపెట్టాయి. అలా పాన్ ఇండియా నటిగా గుర్తింపు తెచ్చు కుంది. అయితే హిందీ, తమిళం భాషలో ఈమె నటించిన చిత్రాలు ఆశించిన విజయాలను సాధించలేదని చెప్పాలి. ఇక్కడ ఇటీవల విజయ్‌తో జతకట్టిన వారిసు చిత్రం హిట్ అయినా రష్మిక పాత్రకు ప్రాముఖ్యత లేకపోగా, పాటల్లో విచ్చలవిడిగా అందాలను ఆరబోసిందని విమర్శలను ఎదుర్కొంది. ప్రస్తుతం తెలుగులో పుష్ప -2 చిత్రంతోపాటు మరో చిత్రంలోనూ, హిం దీలో యానిమల్ అనే చిత్రంలోనూ నటిస్తోంది. కాగా ఈమె ఇటీవల ఒక భేటీలో పేర్కొంటూ నటిగా తాను చాలా ఉన్నత స్థాయికి ఎదిగానని చెప్పుకుంది. పలు అవార్డులు అందుకున్నానని అయితే తన స్థాయి గురించి తన తల్లిదండ్రులు ఇప్పటివరకు గర్వపడలేదని పేర్కొం ది. కారణం వారికి సినిమా రంగం గురించి ఏమి తెలియదని చెప్పింది. తాను ఏం చేస్తున్నాను అన్నది కూడా వారికి పూర్తిగా అర్థం కాని పరిస్థితి అని పేర్కొంది. అయితే తాను అవార్డులు అందుకుంటున్నప్పుడు వారు సంతోషపడతారని చెప్పిం ది. తన వృత్తి గురించి వారికి పూర్తిగా అవగాహన లేకపో యినా తనకు అవసరమైనదంతా చేసి పెడుతున్నారని తెలిపింది. తనకు ఎలాంటి సమస్య లేకుండా చూసుకుం టు న్నారని, అయితే తన వల్ల ఆరంభ కాలంలో తన తల్లిదండ్రులు పలు ఆర్థిక సమస్యలను ఎదుర్కొన్నారని, వారు పడ్డ కష్టాలు తనకు తెలుసని చెప్పింది. అందుకే తన తల్లిదండ్రులను నిజంగా గర్వపడేలా చేయడానికి తాను ఇంకా చాలా సాధిం చాల్సి ఉందని నటి రష్మిక మందన్న చెప్పుకొ చ్చింది.

ఆటంకాలను అధిగమించిన తమిళరసన్

తమిళ సినిమా: సంగీత దర్శకుడు నటుడు విజయ్ ఆంటోని కథానాయకుడిగా నటిం చిన చిత్రాలకు మినిమం గ్యారెంటీ ఉం టుంది. అందుకు కారణం ఆయన ఎం చుకునే కథలే. పిచ్చైక్కారన్ చిత్రం విజయం తరువాత విజయ్ ఆంటోని ప్రేక్షకుల్లో ఆదరణ పెరిగిందని చెప్పక తప్పదు. అయితే ఇటీవల ఆయన నటించిన చిత్రాలు సమస్యలను చిక్కుకుంటున్నాయి. విజయ్ ఆం టోనీ తొలిసారిగా మెగా ఫోన్ పట్టి కథానాయకుడిగా నటించిన పిచ్చై క్కారన్- 2 చిత్రం ఆటంకాలను ఎదుర్కొంటోంది. కారణాలు ఏమైనా ఇది ఇప్పుడు కోర్టు గుమ్మం ఎక్కింది. కాగా విజయ్ ఆంటోనీ కథానాయకుడిగా నటించిన మరో చిత్రం తమిళరసన్. నటి రమ్య నంబీశన్ నాయకిగా నటిం చిన ఇందులో సురేష్ గోపి, నటుడు రాధా రవి, సోను సూద్, వైజి.మహేంద్రన్, యోగిబాబు, రోబో శంకర్, నటి కస్తూరి, సం గీత, మధుమిత, కదీర్, శ్రీలేఖ, శ్రీజ తదితర ప్రముఖ నటీన టులు ముఖ్యపాత్రలు పోషిం చారు. బాబు యోగేశ్వరన్ కథ, కథనం, మాటలు, దర్శకత్వం బాధ్యతలను నిర్వహించిన ఈ చిత్రాన్ని కౌసల్య రాణి నిర్మించారు. ఇళయరాజా సంగీతాన్ని, ఆర్డీ.రాజశేఖర్ ఛాయాగ్రహణం అందించిన ఈ చిత్రం నిర్మాణ కార్య క్రమాలు పూర్తి చేసుకుని గత ఏడాదిలోని తెరపైకి రావాల్సింది. అయితే అనివార్య కారణాలవల్ల చిత్ర విడుదల వాయిదా పడింది. ఆ తర్వాత తమిళ ఉగాది సందర్భంగా ఈ నెల 14వ తేదీన విడుదల చేయను న్నట్లు చిత్ర వర్గాలు ప్రకటించారు. అయితే ఆర్థిక పర మైన సమస్యల కారణంగా ఆ తేదీన చిత్రం విడుదల కాలేదు. ఈ నేపథ్యంలో ఎట్టకేలకు ఆటంకాలను తొలగించుకుని ఈ నెల 22న ఈ చిత్రం తెరపైకి వచ్చింది. కార్పొరేట్ ఆసుపత్రుల దందాలను ఆవిష్క రించే కథాంశంతో రూపొందిన ఈ చిత్రంలో గుండెకు సంబంధించిన వ్యాధికి గురైన తన కొడుకును కాపా డుకోవడానికి ఓ పోలీస్ అధికారైన విజయ్ ఆంటోని చేసే పోరాటమే తమిళరసన్.



తమిళరసన్ చిత్రంలో ఓ సన్నివేశం

క్లుప్తంగా

పుట్టిన రోజు వేడుకల్లో వివాదం

• ఒకరిపై దాడి, 9మంది అరెస్టు

తిరువొత్తియూరు: పుట్టిన రోజు సందర్భంగా నడి రోడ్డుపై కేక్ కట్ చేయడాన్ని ప్రశ్నించిన వ్యక్తి పై విద్యార్థులు దాడి చేశారు. ఈ ఘటనలో తొమ్మిది మందిని పోలీసులు అరెస్టు చేశారు. చెన్నై టీపీ సత్రం నగర్ ప్రాంతంలో నడిరోడ్డుపై కేక్ కట్ చేసి పుట్టినరోజు వేడుకలను జరుపుకున్నారు. దీంతో ఆ ప్రాంతంలో ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడింది. ఈ క్రమంలో అదే ప్రాంతానికి చెందిన రవి (50) అనే అతను అక్కడికి వెళ్లి ఎందుకు ఇలా నడిరోడ్‌లో కేక్ కట్ చేసి ట్రాఫిక్‌కు అంతరాయం చేస్తున్నారని ప్రశ్నించాడు. దీంతో వారి మధ్య వివాదం ఏర్పడింది. విద్యార్థులు రవిపై తీవ్రంగా దాడి చేశారు. దీంతో అతను తీవ్రంగా గాయపడ్డాడు. అతన్ని చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలించారు. సమాచారం అందుకున్న టీపీ సత్రం పోలీసులు వేడుకలు చేసుకున్న తొమ్మిది మందిని అరెస్టు చేశారు. పోలీసుల విచారణలో టీపీ సత్రం ప్రాంతానికి చెందిన సూర్య (22) పుట్టినరోజు వేడుకలు కోసమో చెన్నై పచ్చయప్పాస్ కళాశాల విద్యార్థులు వచ్చి అతనికి కేక్ కట్ చేసి రోడ్డులో సంబరాలు చేసుకుంటున్న సమయంలో ప్రశ్నించిన రవిపై దాడి చేసినట్లు తెలిసింది. దీంతో 9 మందిని పోలీసులు అరెస్టు చేశారు. వారిని ఎగ్మోర్ కోర్టులో హాజరుపరిచి కళాశాల విద్యార్థులు కావడంతో హెచ్చరించి విడుదల చేశారు.

కళాశాల విద్యార్థిని హత్య

తిరువొత్తియూరు: దిండుకల్లు జిల్లాలో కళాశాల విద్యార్థిని హత్య చేసిన దుండగుడి కోసం పోలీసులు గాలిస్తున్నారు. దిండుకల్లు జిల్లా అయ్యం పాళయానికి చెందిన అలుగుపాండి తాపీమేస్త్రి. ఇతని భార్య ముత్తాలమ్మాల్. వీరికి ముగ్గురు కుమార్తెలు, ఒక కుమారుడు ఉన్నాడు. వీరిలో రెండో కుమార్తె జ్యోగిత (18) తిరుచ్చి తెన్నూరు భారతి నగర్‌లో ఉన్న తన అత్త మహాలక్ష్మి (40) ఇంటిలో ఉంటూ డిగ్రీ చదువుతోంది. మహాలక్ష్మి ప్రొవిజన్ దుకాణంలో పని చేసేది. జోగిత అక్క పవిత్ర భర్తతో తిరుచ్చిలో మహాలక్ష్మి ఇంటికి సమీపంలోనే నివాసం ఉంటున్నారు. ఈ క్రమంలో మహాలక్ష్మి శనివారం ఉదయం ప్రొవిజన్ దుకాణానికి వెళ్లారు. దీంతో జోగిత ఇంటిలో ఒంటరిగా ఉంటుంది. సాయంత్రం సమయంలో పవిత్ర తన చెల్లెలకు ఫోన్ చేసింది. స్విచ్ ఆఫ్ అని వచ్చింది. దీంతో అనుమానంతో పవిత్ర తన అత్త ఇంటికి వెళ్లి చూడగా జోగిత రక్తపు మడుగులో హత్యకు గురై కనిపించింది. సమాచారం అందుకున్న పోలీసులు విద్యార్థిని మృతదేహాన్ని స్వాధీనం చేసుకుని శవపరీక్ష కోసం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. పోలీసులు విచారణ చేస్తున్నారు.

అక్కను మందలించిన మామపై దాడి

తిరువొత్తియూరు: సెల్ ఫోన్‌లో తరచూ మాట్లాడుతున్న కోడలిని మామ మందలించాడు. దీంతో ఆగ్రహం చెందిన కోడలి తమ్ముడు బీరు బాటిల్‌తో దాడి చేశాడు. చెన్నై హార్బర్ వెంకటేష్ లింగ శెట్టి వీధికి చెందిన రాజీ (47) బ్రాడ్ వేలో కూలి పనులు చేసుకుంటూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. శనివారం సాయంత్రం వ్యాసార్పాడి కల్యాణపురం ప్రాంతంలో ఉన్న కుమారుడు పుష్పరాజు ఇంటికి వెళ్లాడు. ఆ సమయంలో కోడలు అనిత ఎవరితోనో చాలా సేపు సెల్‌ఫోన్‌లో మాట్లాడుతూనే ఉంది. దీనిపై అతను కోడలిని మందలించాడు. ఆ సమయంలో అక్కడికి వచ్చిన అనిత తమ్ముడు మాధవన్ తన అక్కను ప్రశ్నించడాన్ని తప్పు పడుతూ బీరు బాటిల్‌తో రాజీపై దాడి చేశాడు. తీవ్రంగా గాయపడిన అతన్ని స్థానికులు చెన్నై స్టాన్లీ ప్రభుత్వ ఆసుపత్రిలో చేర్చారు. వ్యాసార్పాడి పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

స్నేహితుడిని కత్తితో పొడిచిన డ్రైవర్ అరెస్టు

తిరువొత్తియూరు: చెన్నై మనలి ప్రాంతంలో స్నేహితుడిని కత్తితో పొడిచిన డ్రైవర్‌ను పోలీసులు అరెస్టు చేశారు. కన్యాకుమారి జిల్లాకు చెందిన అజిత్ (25), చరణ్ రాం (28) స్నేహితులు. వీరు మనలి పుదునగర్‌లో ఉంటూ ప్రైవేటు సరుకు ఎగుమతి చేసే సంస్థలో లారీ డ్రైవర్లుగా పనిచేస్తున్నారు. శనివారం రాత్రి మద్యం తాగారు. ఖర్చులను అజిత్ పెట్టాడు. మద్యం తీసి ఇవ్వడానికి అయిన ఖర్చులు తిరిగి ఇవ్వాలని చరణ్ రాంను అజిత్ కోరాడు. దీంతో ఇద్దరి మధ్య వాగ్వాదం ఏర్పడింది. ఇద్దరూ ఒకరిపై ఒకరు దాడి చేసుకున్నారు. ఆగ్రహం చెందిన చరణ్ రాం తన వద్ద ఉన్న చిన్న కత్తితో అజిత్ కడుపులో పొడిచి పారిపోయాడు. తీవ్ర గాయమైన అజిత్‌ను స్థానికులు స్టాన్లీ ఆసుపత్రికి తరలించారు. మనలి పుదునగర్ పోలీసులు కేసు నమోదు చేసి చరణ్ రాంను ఆదివారం అరెస్టు చేశారు.

గూండా చట్టం కేసు నమోదు

తిరువొత్తియూరు: కన్యాకుమారి జిల్లాలో మహిళ హత్య కేసులో అరెస్ట్ అయిన నిందితుడిపై పోలీసులు గూండా చట్టం కేసు నమోదు చేశారు. ముప్పార్ ప్రాంతానికి చెందిన 47 ఏళ్ల మహిళ ఇంటిలో ఒంటరిగా ఉన్న సమయంలో అదే ఆ ప్రాంతానికి చెందిన ఎడ్విన్ (28) ఆమె ఇంటిలోకి చొరబడి దాడి చేశాడు. తీవ్రంగా గాయపడిన ఆమె ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందింది. హత్య కేసు నమోదు చేసి ఎడ్విన్‌ను అరెస్టు చేశారు. అతనిని కోర్టులో హాజరుపరిచి నాగర్ కోయిల్‌లో ఉన్న జైలులో పెట్టారు. ఎడ్విన్‌పై గూండా చట్టం కేసు నమోదు చేయాలని జిల్లా ఎస్పీ హరిహరన్ ప్రశాంత్ జిల్లా కలెక్టర్ శ్రీధర్‌కు సిఫారసు చేశారు. విచారణ తరువాత నిందితుడిపై గూండా చట్టం కింద కేసు నమోదు చేశారు. నాగర్ కోయిల్ జైల్లో ఉన్న ఎడ్విన్‌ను పోలీసులు గూండా చట్టం కింద కేసు నమోదు చేసి, పాళయంకోట జైలుకు తరలించారు.

అలరించిన నృత్య రూపకం



వేడుకల్లో మహిళా సభ సభ్యులు, నిర్వాహకులు

• ఘనంగా ఆర్యవైశ్య మహిళా సభ రూబీ వేడుకలు



నయనానందకరంగా శ్రీనివాస కల్యాణ ఘట్టం

కొరుక్కుపేట: తమిళనాడు ఆర్యవైశ్య మహిళా సభ (మద్రాసు యూనిట్) ఆధ్వర్యంలో రూబీ వేడుకలు ఆదివారం ఘనంగా నిర్వహించారు. స్థానిక చేట్‌పెట్ లోని చిన్మయ హెరిటేజ్ కేంద్రంలోని ఆడిటోరియం వేదికగా మహిళా సభ (మద్రాసు యూనిట్) చైర్ పర్సన్ పి.మనిమాల రావు అధ్యక్షతన జ్యోతి ప్రజ్వలన, ప్రార్థనా గీతంతో వేడుకలు ప్రారంభమయ్యాయి. ముందుగా రూబీ సెలెబ్రేషంస్‌ను పురస్కరించుకుని శతమానం భవతి ప్రాజెక్టు పేరుతో సంకల్ప్ బుద్ధి మాంద్యం లెర్నింగ్ ఇన్‌స్టిట్యూట్ విద్యార్థులకు ఆర్థిక సాయం అందజేశారు. అలాగే నుంగంబాక్కంలోని శ్రీవెంకటేశ్వర తెలుగు విద్యాలయ విద్యార్థులకు నోట్ పుస్తకాలు, సరస్వతి దేవి చిత్ర పటాలు అందజేసి ఆశీర్వదించారు. ఉద్గిత ట్రస్ట్, ఆన్బగం ట్రస్ట్‌లకు సహాయకాలు, సభ 40 ఏళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా 40 మంది మహిళలకు ఉచితంగా చీరలను పంపిణీ చేశారు. అధ్యక్షురాలు పి.మనిమాల రావు నేతృత్వంలో వేడుకల సందర్భంగా మహిళా సభ మాజీ నిర్వాహకులకు శాలువాలు కప్పి మెమెంటోలతో ఘనంగా సత్కరించారు. సభ అధ్యక్షురాలు మనిమాల రావు స్వాగతం పలుకుతూ 40 ఏళ్ల సభ ద్వారా వివిధ సేవా కార్యక్రమాలను సభ్యుల సహకారంతో విజయవంతంగా చేసినట్లు తెలిపారు. మహిళ బాగుంటేనే సమాజం ఆరోగ్యంగా ఉంటుందన్న అభిప్రాయంతో మహిళల అభివృద్ధికి తమవంతు కృషి చేయడంతో పాటు వివిధ రంగాల్లో విశిష్ట సేవలను అందిస్తున్న పురస్కారాలతో సత్కరిస్తున్నట్లు తెలిపారు. మహిళా సభ గౌరవ కార్యదర్శి శైలశ్రీ రాజేష్, కోశాధికారి చిత్రలేఖ సాయి రామ్, మాజీ నిర్వాహకులు, సభ్యులు పాల్గొన్నారు.

అలరించిన శ్రీనివాస కల్యాణం

శ్రీదేవి నృత్యాలయ కొరియోగ్రాఫర్ డాక్టర్ శీలా ఉన్ని కృష్ణన్ పర్యవేక్షణలో 65 మంది విద్యార్థినులు దేవతామూర్తుల వేషధారణలో ప్రదర్శించిన శ్రీనివాస కల్యాణం నృత్యరూపకం అలరించింది. దాదాపు రెండు గంటల పాటు సాగిన ఈ నృత్య రూపకం విద్యార్థినులు తమదైన హావభావాలతో రక్తికట్టించి ప్రేక్షకులను ఆధ్యాత్మిక చింతనలోకి నెట్టింది.

ఉపాధ్యాయుడి ఆత్మహత్య

అన్నానగర్: కలకురిచ్చి జిల్లా నడు తొరడిపట్టు గ్రామానికి చెందిన రామరాజ్ (26) పోస్ట్ గ్రాడ్యుయేషన్ పూర్తి చేసిన రామరాజ్ ఈరోడ్ లోని ఓ ప్రైవేట్ పాఠశాలలో తాత్కాలిక ఉపాధ్యాయుడిగా పనిచేశాడు. కాలేజీలో చదువుతున్న సమయంలో సేలంకు చెందిన ఓ అమ్మాయిని ప్రేమించాడు. ఆమెను పెళ్లి చేసుకోవాలని తల్లిదండ్రులు కోరారు. అయితే అమ్మాయిది వేరే కులం అని రామరాజ్ తల్లిదండ్రులు పెళ్లికి నిరాకరించారు. ఈక్రమంలో గత 20వ తేదీన ఇంటికి వచ్చిన రామరాజు తిని వెళ్లి మళ్లై వెళ్లిపోయినట్లుగా తెలుస్తుంది. అయితే ఆ రాత్రి ఇంటికి తిరిగి రాలేదు. దీంతో దిగ్భ్రాంతి చెందిన అతని తల్లిదండ్రులు పలుచోట్ల వెతికారు. ఈ నేపథ్యంలో వెల్లిమలై సమీపంలో రామరాజ్ మామిడి చెట్టుకు ఉరివేసుకుని చనిపోయినట్లు శనివారం సమాచారం వచ్చింది. అక్కడికి వెళ్లి కుమారుడి మృతదేహాన్ని చూసిన తల్లీ, తండ్రీ బోరున విలపించారు. పోలీసులు కేసు దర్యాప్తు చేపట్టారు. అతడి ప్యాంటు జేబులో కాగితంపై రాసిన లేఖను కూడా పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. అందులో "నాకు పెళ్లి కాలేదు అందుకే దేవుడిని వెతుక్కుంటూ వెళ్తున్నాను" అని రాసి ఉన్నట్లు అధికారులు పేర్కొన్నారు.

విద్యుత్ షాక్‌తో వ్యక్తి మృతి



మృతి చెందిన ధనశేఖరన్ (ఫైల్)

తిరువళ్లూరు: అడవి పందుల నుంచి పంటను కాపాడుకునేందుకు పొలానికి వేసిన విద్యుత్ కంచెలో చిక్కుకుని వెల్డర్ మృతిచెందాడు. ఈ సంఘటన తిరువళ్లూరు జిల్లా వలసవెట్టికాడులో కలకలం రేపింది. కడంబత్తూరు యూనియన్ వలసవెట్టికాడుకు చెందిన ధనశేఖరన్(37) వెల్డర్‌గా పనిచేస్తూ భార్య, ఇద్దరు పిల్లలను పోషించుకుంటున్నాడు. అతను శనివారం రాత్రి 9.30 గంటల ప్రాంతంలో బయటకు వెళ్లాడు. గంట దాటినా ఇంటికి రాకపోవడంతో భార్య నిత్య, సోదరి అమల పలుచోట్ల వెతికారు. ఆ సమయంలో అదే గ్రామానికి చెందిన రైతు దామోధరన్ పొలంలోని కంచె వద్ద అచేతనంగా పడి వున్న ధనశేఖర్‌ను గుర్తించారు. విద్యుత్ తీగలు తగిలి అతను మృతి చెందినట్లు అనుమానించిన నిత్య మనవాలనగర్ పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు అక్కడికి చేరుకుని మృతదేహాన్ని తిరువళ్లూరు ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. విచారణలో స్థానిక రైతు దామోధరన్ తన భూమిలో వేరుశనగ, మిర్చి పంటలను సాగు చేసుకుంటున్నారు. వాటిని అడవి పందుల నుంచి రక్షించుకునేందుకు విద్యుత్ తీగలను ఏర్పాటు చేశారని తేలింది. ఆ తీగలు తగిలి ధనశేఖరన్ మృతి చెందినట్లు గుర్తించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

బాణసంచా కర్మాగారంలో పేలుడు

–మహిళ మృతి, 13 మోటార్ సైకిళ్లు దగ్ధం

తిరువొత్తియూరు: శివకాశి సమీపంలో బాణాసంచా కర్మాగారంలో ఏర్పడిన పేలుడులో వివాహిత మృతి చెందింది. ఈ ఘటనలో 13 మోటార్ సైకిళ్లు దగ్ధం అయ్యాయి. విరుదునగర్ జిల్లా శివకాశి సమీపంలోని ఏళాయిరం పన్నైకి చెందిన కేశవన్ (50) మార్గానందాపురంలో టపాసుల తయారీ కర్మాగారం నడుపుతున్నాడు. ఈ టపాసుల కర్మాగారంలో 60 గదుల్లో టపాసులు తయారు చేస్తున్నారు. శనివారం మధ్యాహ్నం 3 గంటల సమయంలో ముడి సరుకు ఉంచిన గదిలో హఠాత్తుగా పేలుడు సంభవించింది. ఇందులో రెండు గదులు పూర్తిగా మండుకున్నాయి. గదిలో పనిచేస్తున్న మార్గనందపురానికి చెందిన అరుణాచలం భార్య జయ చిత్ర (24) సంఘటనా స్థలంలోని మృతి చెందారు. తక్కిన కార్మికులు అక్కడి నుంచి పరుగులు తీసి తప్పించుకున్నారు. సంఘటనలో ఆ ప్రాంతంలో నిలిపి ఉంచిన కార్మికులకు చెందిన 13 మోటార్ సైకిళ్లు దగ్ధం అయ్యాయి. మృతి చెందిన జయ చిత్రకు ఇద్దరు మగపిల్లలు ఉన్నారు. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి విచారణ చేస్తున్నారు.

రాయితో కొట్టి యువకుడి హత్య

అన్నానగర్: ఇద్దరి మధ్య జరిగిన వాగ్వాదంలో రాయితో కొట్టి యువకుడిని హత్యచేసిన సంఘటన కలకలం రేపింది. చెన్నైలోని కోరుక్కుపేట అరణి రంగల్ వీధికి చెందిన కమలకన్నన్ (36) శనివారం రాత్రి టాస్మాక్ షాపులో మద్యం కొన్నాడు. అక్కడికి వచ్చిన తిరువొత్తియూర్‌కి చెందిన రాజశేఖర్(42)తో వాగ్వాదం జరిగింది. కోపోద్రిక్తుడైన కమలకన్నన్ రాయితో రాజశేఖర్ ముఖంపై కొట్టాడు. అతను స్పృహ తప్పి కింద పడిపోవడంతో అతను అక్కడి నుంచి పారిపోయాడు. సమాచారం అందుకున్న కోరుక్కుపేట పోలీసులు అక్కడికి చేరుకుని రాజశేఖర్‌ను స్టాన్లీ ప్రభుత్వాసుపత్రికి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసి కమలకన్నన్‌ను అరెస్టు చేశారు. విచారణలో కొరుక్కుపేటకు ప్రముఖ రౌడీ కరుప్పుకుమార్‌ను ఆరుగురు శనివారం నరికి చంపారు. అతని అంత్యక్రియల్లో పాల్గొనేందుకు వచ్చిన సమయంలో మద్యం మత్తులో ఉన్న కమలక్కన్నన్‌కు, రాజశేఖర్ గొడవ పడినట్టు తేలింది. కమలకన్నన్‌ను కోర్టులో హాజరుపరిచి, పుళల్ జైలుకు తరలించారు. ఈ క్రమంలో ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న రాజశేఖర్ ఆదివారం తెల్లవారుజామున మృతి చెందాడు. పోలీసులు హత్య కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

బ్రెయిన్ డెడ్ అయిన విద్యార్థి అవయవాలు దానం

కొరుక్కుపేట: తిరుప్పూర్ జిల్లా ఉడుమలైపేటకు చెందిన అజయ్ కుమార్ (23) ఉడుమలైపేటలోని ఓ ప్రైవేట్ కళాశాలలో ఎంకామ్ చివరి సంవత్సరం చదువుతున్నాడు. మూడు రోజుల క్రితం కళాశాలకు వెళ్తూ అకస్మాత్తుగా వాంతులు చేసుకుని స్పృహతప్పి పడిపోయాడు. కోయంబత్తూరులోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతుండగా, మెదడుకు వెళ్లే రక్తనాళంలో రక్తం గడ్డకట్టడంతో విద్యార్థి బ్రెయిన్ డెడ్‌కు గురయ్యాడు. అజయ్ కుమార్ అవయవాలను దానం చేసేందుకు తల్లిదండ్రులు ముందుకు వచ్చారు. విద్యార్థి రెండు కిడ్నీలు, కాలేయాన్ని అదే ప్రైవేట్ వైద్యుడికి, గుండెను చెన్నైలోని ఓ ప్రైవేట్ వైద్యుడికి, కళ్లు, చర్మం, క్లోమం, ఊపిరితిత్తులను పంపించారు. బ్రెయిన్ డెడ్ అయిన కాలేజీ విద్యార్థి అవయవాలతో ఎనిమిది మందికి పునర్జన్మ ప్రసాదించారు.

బాస్కెట్‌బాల్ క్రీడాకారుడు మృతి



నెహ్రూ రాజా (ఫైల్)

కొరుక్కుపేట: ఊటీలోని హిల్ జంపింగ్ డెవలప్‌మెంట్ ప్రాజెక్ట్ గ్రౌండ్‌లో తమిళనాడు బాస్కెట్ బాల్ అసోసియేషన్, నీలగిరి జిల్లా బాస్కెట్ బాల్ అసోసియేషన్ సంయుక్తంగా రాష్ట్ర స్థాయి మూత్తర్ బాస్కెట్‌బాల్ టోర్నమెంట్‌ను నిర్వహించాయి. ఇందులో శనివారం మధ్యాహ్నం మదురై జట్టు, కోయంబత్తూరు జట్టు ఆడుతున్నాయి. మ్యాచ్ హోరాహోరీగా సాగుతున్న సమయంలో మధురై జట్టులోని నెహ్రూరాజా (60) మైదానంలో ఒక్కసారిగా స్పృహతప్పి పడిపోయాడు. వెంటనే అతనికి ప్రాథమిక చికిత్స అందించి ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అక్కడ పరీక్షించిన వైద్యులు మృతి చెందినట్లు నిర్ధారించారు.

హత్య కేసులో నిందితుల కోసం గాలింపు

వేలూరు: రాణిపేటలో కళాశాలకు వెళ్లిన కుమార్తెను హేళన చేసిన వారిని నిలదీసిన తండ్రిని హత్య చేశారు. రాణిపేట జిల్లా లాలాపేటకు చెందిన సుందరేషన్(48) సిప్‌కాడులోని ప్రయివేటు కంపెనీలో పనిచేస్తున్నాడు. అతనికి భార్య, ముగ్గురు కుమార్తెలు ఉన్నారు. ఇద్దరు కుమార్తెలు వాలాజలోని కళాశాలలో చదువుతున్నారు. వారు శుక్రవారం సాయంత్రం కళాశాల నుంచి బస్సులో లాలాపేట బస్టాంపింగ్ వద్దకు వచ్చారు. అక్కడి నుంచి ఇంటికి నడిచి వెళుతుండగా లాలాపేటకు చెందిన అజిత్, శరణ్ వారిని హేళన చేస్తూ మాట్లాడారు. ఈ విషయాన్ని విద్యార్థినులు తల్లిదండ్రులకు తెలిపారు. సుందరేషన్ అక్కడికి చేరుకుని అజిత్, శరణ్‌ను నిలదీశాడు. దీంతో ఆగ్రహం చెందిన యువకులు కత్తితో సుందరేషన్‌పై దాడి చేశారు. స్పృహ తప్పి పడి పోయిన సుందరేషన్‌ను స్థానికులు వాలాజ ప్రభుత్వాసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ సుందరేషన్ ఆదివారం ఉదయం మృతి చెందాడు. ఈ మేరకు సిప్‌కాడు పోలీసులు కేసు నమోదు చేసి పరారీలో ఉన్న అజిత్, శరణ్ కోసం గాలిస్తున్నారు.

ప్రాణాలు తీసిన ఈత సరదా

తిరువొత్తియూరు: చెరువులో మునిగి ఇద్దరు విద్యార్థులు మృతి చెందిన సంఘటన సేలంలో జరిగింది. పోలీసుల కథనం మేరకు.. కన్నంగురిచ్చి గోవిందసామి కాలనీకి చెందిన సంపత్ కుమారుడు ప్రశాంత్ (17) ప్రైవేట్ స్కూల్లో ప్లస్–2 చదువుతున్నాడు. అదే ప్రాంతానికి చెందిన మెకానిక్ కృష్ణమూర్తి కుమారుడు బాలాజీ ప్లస్ 2 చదువుతున్నాడు. వీరు స్నేహితులు. పరీక్షలు ముగియడంతో శనివారం మధ్యాహ్నం అదే ప్రాంతానికి చెందిన బాలుడు (13)తో కలిసి కన్నంకురిచ్చి చెరువులో స్నానం చేయడానికి వెళ్లారు. ప్రశాంత్, బాలాజీ లోతైన ప్రాంతానికి వెళ్లడంతో ఈత రాక మునిగిపోయారు. గమనించిన గట్టుమీద ఉన్న బాలుడు పరిగెత్తుకుని వచ్చి తల్లిదండ్రులకు చెప్పాడు. సమాచారం అందుకున్న అగ్నిమాపక సిబ్బంది చెరువులో గాలింపు చేపట్టి ఇద్దరు విద్యార్థుల మృతదేహాలను బయటకు తెచ్చారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

కార్యకర్తలు సైనికుల్లా పనిచేయాలి

వేలూరు: రానున్న పార్లమెంట్ ఎన్నికలకు కార్యకర్తలు ఇప్పటి నుంచే సైనికుల్లా పనిచేయాలని పీఎంకే పార్టీ జిల్లా కార్యదర్శి ఇళవయగన్ అన్నారు. వేలూరులోని ఆ పార్టీ కార్యకర్తల సమావేశం ఆదివారం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా పీఎంకే పార్టీని బలోపేతం చేయడమే ప్రతి కార్యకర్త లక్ష్యంగా పెట్టుకోవాలన్నారు. ప్రస్తుతం సభ్యత్వ నమోదుకు అధిక ప్రాధాన్యం ఇవ్వాలన్నారు. గ్రామీణ ప్రాంతాల నుంచి పట్టణ ప్రాంతాల వరకు పార్టీ కార్యకర్తల వద్ద సభ్యత్వ నమోదును వేగవంతం చేయాలన్నారు. ప్రస్తుతం ప్రారంభించిన సభ్యత్వ నమోదును ప్రతి వార్డులోనూ చేసేందుకు కార్యకర్తలు సిద్ధంగా ఉండాలన్నారు. అనంతరం పార్టీ కార్యకర్తలతో రానున్న పార్లమెంట్ ఎన్నికలకు సంబంధించి బూత్ కమిటీ సభ్యులు, తదితర వాటిపై సమీక్షించి పలు తీర్మాణాలను అమలు చేశారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి వెంకటేశన్, శరవణన్, పీఎంకే పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.

ముగ్గురు గంజాయి విక్రేతల అరెస్టు



అరెస్టయిన కళావతి, రాణి, ఆకాష్

తిరువళ్లూరు: కేరళ నుంచి రైలులో అక్రమంగా గంజాయిని తరలించి విక్రయిస్తున్న ముగ్గురిని పోలీసులు అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. తిరువళ్లూరు జిల్లా ఆవడి పోలీసు కమిషనరేట్ పరిధిలోని ఐనవరంలో అక్రమంగా గంజాయిని నిల్వ వుంచి విక్రయిస్తున్నట్టు కమిషనర్ సందీప్‌రాయ్ రాథోడ్‌కు సమాచారం అందింది. ఆయన ఆదేశాల మేరకు అంబత్తూరు ఇన్‌స్పెక్టర ధనమ్మాల్ తన సిబ్బందితో కలిసి తనిఖీలు చేపట్టారు. ఇంట్లో అక్రమంగా నిల్వ వుంచి గంజాయి విక్రయిస్తున్న అంబత్తూరుకు చెందిన ఉదయకుమార్ భార్య కళావతి(63), శంకర్ భార్య రాణి(59) చెన్నై కొళత్తూరుకు చెందిన కుమార్ కుమారుడు ఆకాష్(23)ను అరెస్టు చేశారు. వారి నుంచి 16 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. అనంతరం వారిని పూందమల్లి కోర్టులో హాజరుపరిచి రిమాండ్‌కు తరలించారు.

ఇండియన్ ఆర్మీలోకి.. ఎన్‌సీసీ మహిళా కేడెట్లు



ఆర్మీలోకి ఎంపికైన మహిళా కేడెట్లు

కొరుక్కుపేట: ఎన్‌సీసీ (నేషనల్ కేడెట్ క్రాప్స్) చేసిన మహిళా కేడెట్లను ఆర్మీ ప్రత్యేకంగా ప్రోత్సహిస్తోంది. ఏడాదికి రెండుసార్లు షార్ట్ సర్వీస్ కమిషన్ విధానంలో ఎన్‌సీసీ స్పెషల్ ఎంట్రీ పోస్టుల భర్తీకి నిర్ణయించారు. అందులో భాగంగా ఆదివారం చెన్నైలోని ఆఫీసర్స్ ట్రెనింగ్ అకాడమీ (ఓటీఏ)లో జరిగిన షార్ట్ సర్వీస్ కమిషన్ (ఎస్ఎస్‌సీ–115, ఎస్ఎస్‌సీ(డబ్ల్యూ–29)కి సంబంధించి కమిషనింగ్ బోర్డు అకాడమీలోని మహిళా క్యాడెట్లు ఐదుగురు ఇండియన్ ఆర్మీలోకి ఎంపికయ్యారు. మొట్టమొదటి సారిగా ఇండియన్ ఆర్మీలోకి యుద్ధంలో దేశ సేవకు మహిళా క్యాడెట్‌లు రావడంపై అధికారులు అభినందించారు.

పారిశ్రామికవేత్త నుంచి రూ.98.28 లక్షల మోసం

• మహిళ సహా ముగ్గురి అరెస్టు

అన్నానగర్: పారిశ్రామికవేత్త నుంచి రూ.98.28 లక్షలు మోసం చేసిన మహిళ సహా ముగ్గురిని పోలీసులు అరెస్టు చేశారు. తిరుపూర్‌కు చెందిన శివ కుమార్ బనియన్ సంస్థ యజమాని. ఆయన వాట్సాప్ నంబర్‌కు గత మార్చి 22న విదేశీ నంబర్ నుంచి మెసేజ్ వచ్చింది. అదేవిధంగా ఒక వ్యక్తి వాట్సాప్ కాల్ చేశాడు. బ్రెయిన్ క్యాన్సర్‌కు సంబంధించిన మందుల తయారీ ముడిసరుకులను హిమాచల్ ప్రదేశ్ నుంచి కొనుగోలు చేసి విక్రయిస్తున్నానని, దానిపై పెట్టుబడి పెడితే భారీగా కమీషన్ వస్తుందని చెప్పాడు. దాన్ని నమ్మిన శివకుమార్ వారి బ్యాంకు ఖాతాలో రూ.98.28 లక్షలు పంపించాడు. తర్వాత తాను మోసపోయినట్టు తెలుసుకుని తిరుపూర్ మెట్రోపాలిటన్ సైబర్ క్రైమ్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. పోలీసులు దర్యాప్తు చేపట్టి మోసగాళ్ల బ్యాంకు ఖాతా నుంచి రూ.5.83 లక్షలను స్తంభింపజేశారు. ప్రత్యేక బలగాలు ముంబయి, ఢిల్లీలో విచారణ చేపట్టి ఉమేష్ రమేష్ విధాందేను అరెస్టు చేశారు. అతను ఇచ్చిన సమాచారం ద్వారా నైజీరియాకు చెందిన జేమ్స్ ఒసీ బోహిన్ లారెన్స్, ఉగాండాకు చెందిన నసాబా సరోమ్ అనే మహిళను అరెస్టు చేశారు. పశ్చిమ ఢిల్లీకి చెందిన ముఖేష్ కుమార్ మిశ్రాను కూడా స్పెషల్ స్క్వాడ్ పోలీసులు అరెస్ట్ చేశారు. వారి నుంచి 24 సెల్ ఫోన్లు, 8 సిమ్ కార్డులు, రెండు ల్యాప్‌టాప్‌లు, మోడెమ్, ఏటీఎం కార్డులు, 2 పాస్ పోర్టులు, రూ.28 వేల నగదు స్వాధీనం చేసుకున్నారు.

బిడ్డలతో కలిసి తల్లి ఆత్మహత్య

తిరువొత్తియూరు: పోటీ పరీక్షల్లో వరుసగా ఫెయిల్ అవుతుండడంతో మనస్తాపం చెందిన మహిళ ఇద్దరు బిడ్డలను హత్య చేసి తానూ ఆత్మహత్య చేసుకుంది. కృష్ణగిరి జిల్లా చోళనాయకపట్టి గ్రామానికి చెందిన గుణశేఖరన్ (40) తిరుపూర్‌లోని ప్రైవేటు సంస్థలో మేనేజర్‌గా పనిచేస్తున్నాడు. ఇతని భార్య దైవ (30). వీరికి ఇనియా (8) అనే కుమార్తె, గోకుల కృష్ణ (4) అనే కుమారుడు ఉన్నారు. ఈ క్రమంలో దైవ తన బిడ్డలతో చోళనాయకన్‌పట్టి గ్రామంలో నివాసం ఉండేది. దైవ మామ ఆర్ముగం (58) భార్యతో కలిసి వేరుగా నివాసం ఉంటున్నాడు. ఎమ్మెస్సీ పీజీ గ్రాడ్యుయేట్ అయిన దైవ ప్రభుత్వ ఉద్యోగం కోసం పోటీ పరీక్షలకు సిద్ధమయ్యేది. ఇందు కోసం పలు ప్రభుత్వ పోటీ పరీక్షలు రాసినా ర్యాంకు సాధించలేదని తెలిసింది. ఈ కారణంగా తీవ్ర మనస్తాపానికి గురైంది. ఫెయిల్ అవుతున్నానని మామతో చెప్పి బాధపడేదని తెలుస్తోంది. ఈ క్రమంలో శనివారం ఇంటిలో ఉన్న దైవ కుమార్తె ఇనియా, కుమారుడు గోకుల కృష్ణకు ఎక్కువ మొత్తంలో మాత్రలు నూరి నీటిలో కలిపి ఇచ్చింది. ఆ తర్వాత కొద్ది సమయానికి ఇద్దరు పిల్లలు నోటిలో నురగలు తోసుకొని మృతి చెందారు. దీని తర్వాత ఇంటిలో ఉన్న ఫ్యాన్‌కు దైవ చీరకు ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకుంది. గమనించిన ఇరుగుపొరుగు వారు కల్లావి పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు అక్కడికి చేరుకుని తల్లి, ఇద్దరు పిల్లల మృతదేహాలను శవ పరీక్ష కోసం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. దీనికి సంబంధించి దైవ తల్లి పూంగోడి ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి విచారణ చేస్తున్నారు. పోలీసుల ప్రాథమిక విచారణలో దైవ బిడ్డలకు ఎక్కువ మోతాదులో మాత్రలు నూరి నీటిలో కలిపి హత్య చేసినట్లు తెలిసింది. ఆత్మహత్య చేసుకున్న దైవకు మామతో గొడవలు ఏర్పడినట్లు తెలిసింది. దీనికి తోడు పోటీ పరీక్షల్లో ఫెయిల్ అవుతుండడంతో ఈ నిర్ణయం తీసుకున్నట్లు గుర్తించారు.

విద్యార్థినిపై లైంగికదాడి.. ఐదుగురి అరెస్టు

అన్నానగర్: నాగర్‌కోయిల్‌లో ఇన్‌స్టాగామ్‌లో పరిచయమైన ప్లస్1 విద్యార్థినిపై లైంగికదాడి చేసిన ఘటనలో ఇద్దరు మహిళలు సహా ఐదుగురిని పోలీసులు ఆదివారం అరెస్టు చేసి విచారిస్తున్నారు. కేరళ రాష్ట్రం ఎర్నాకులం కలాడికి చెందిన అజిన్ సామ్, ఇతని స్నేహితులు అఖిలేశ్‌బాబు, జితిన్ వర్గీస్, పూర్ణిమ దినేష్, శ్రుతి సిద్ధార్థ్ అజిన్ సామ్ ఇన్‌స్టాగామ్ ద్వారా కలియకవిలై సమీపంలోని ప్లస్ 1 విద్యార్థితో సన్నిహితంగా మెలిగారు. ఆ తర్వాత అజిన్ సామ్ ఆమెను పెళ్లి చేసుకుంటానని హామీ ఇచ్చాడు. ఈ ఏడాది ఏప్రిల్ 17వ తేదీ రాత్రి అజిన్ సామ్ కారులో కలియక్కవిలకు వచ్చాడు. ఆమె స్నేహితులు విద్యార్థినిని తమ వెంట తీసుకెళ్లి నెయ్యాట్రిన్ కరైలో ఉన్న నక్షత్ర హోటల్లో బంధించారు. అక్కడ అజీన్ సామ్ ప్లస్ 1 విద్యార్థిని అత్యాచారం చేశాడు. ఏప్రిల్ 18న విద్యార్థిని ఇంటి దగ్గర వదిలి వారంతా పారిపోయారు. మరుసటి రోజు నుంచి అజిన్ సామ్ మొబైల్ ఫోన్ స్విచ్ఛాఫ్ అయింది. దీంతో అనుమానం వచ్చిన ప్లస్ 1 విద్యార్థిని కుటుంబసభ్యులకు జరిగిన విషయాన్ని తెలియజేసింది. కుటుంబికులు వెంటనే పారాసాలై పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు జరిపిన విచారణలో ఎర్నాకులం కాలడీలో ఉన్న అజిన్ సామ్ అతని స్నేహితులు అఖిలేష్ సాబు, జితిన్ వర్గీస్, పూర్ణిమ దినేష్, శృతి సిద్ధార్థ్‌లను పోలీసులు ఆదివారం అరెస్టు చేశారు. సోషల్ మీడియాలో సోషలైజ్ చేస్తూ పెళ్లి చేసుకుంటానని చెప్పి అమ్మాయిలను ఒంటరిగా తీసుకెళ్లే రేపిస్టుల ముఠా సభ్యులా? అని పోలీసులు అనుమానిస్తున్నారు. ఎవరికి అనుమానం రాకూడదని తమతో పాటు మహిళా స్నేహితులను కూడా తీసుకువస్తున్నారు. వివిధ కోణాల్లో విచారణ జరుగుతోంది.

ఇన్‌స్పెక్టర్ సహా ఆరుగురు పోలీసుల సస్పెన్షన్

వేలూరు: లారీ చోరీ కేసులో లంచం డిమాండ్ చేసిన ఘటనలో ఇన్‌స్పెక్టర్ సహా ఆరుగురు పోలీసులు సస్పెండ్‌కు గురయ్యారు. వివరాలు.. క్రిష్ణగిరి జిల్లా పాగలూరుకు చెందిన మురళికి సొంతమైన లారీ కర్ణాటక రాష్ట్రం బెంగళూరు నుంచి ద్విచక్ర వాహన విడి భాగాలను ఎక్కించుకుని చెన్నైకి బయలు దేరింది. వేలన్‌కల్‌నత్తం సమీపంలో టాటా సుమోలో వచ్చిన కొందరు లారీని అడ్డగించి డ్రైవర్‌ను కిందకు దింపి ఆంధ్రాకు తీసుకెళ్లారు. దీంతో లారీ యజమాని మురళి నాట్రంపల్లి పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఆ సమయంలో పోలీస్ ఇన్‌స్పెక్టర్ కామరాజ్, ఎస్ఐ శేఖర్, పోలీసులు కేసు నమోదు చేసి విచారణ చేపట్టారు. ఈ కేసుకు సంబంధించి వేలూరు జిల్లా అనకట్టు జార్దాన్‌కొల్లై గ్రామానికి చెందిన రాజశేఖర్‌ను పోలీసులు అరెస్ట్ చేశారు. నిందితుడు లారీని విక్రయించినట్లు తెలిసింది. రూ. 12 లక్షలు ఇస్తానని పోలీసులకు చెప్పాడు. మొదటి విడతగా రూ. 7 లక్షల నగదును పోలీసుల సమక్షంలో ఇచ్చాడు. ఈ నగదును పోలీసులు కోర్టులో అప్పగించకుండా పోలీస్ స్టేషన్‌లోనే పెట్టుకుని వేధింపులకు గురి చేసినట్లు తెలిసింది. మిగిలిన నగదును ఇవ్వాలని రాజశేఖర్‌ను పోలీసులు వేధింపులకు గురి చేశారు. ఈ క్రమంలో రాజశేఖర్ ఏసీబీ అధికారులకు ఫిర్యాదు చేశారు. ఏసీబీ అధికారులు పోలీస్ స్టేషన్‌లో ఆకస్మిక తనిఖీలు చేపట్టి ఇన్‌స్పెక్టర్ కామరాజ్, ఎస్ఐ శేఖర్‌ను పది రోజుల క్రితం సస్పెండ్ చేశారు. ఈ కేసు కోర్టులో ఉన్న నేపథ్యంలో పోలీస్ డీఐజీ ముత్తుస్వామి విచారణ జరిపి పోలీస్ ఇన్‌స్పెక్టర్ కామరాజ్, ఎస్ఐ శేఖర్‌తో పాటు మొత్తం నలుగురు పోలీసులను సస్పెండ్ చేస్తూ ఆదేశాలు జారీ చేశారు.

ఎస్‌ఐకి సత్కారం



ఎస్ఐ పరమశివంను సత్కరిస్తున్న సినీ నటుడు దాడి బాలాజీ

తిరువళ్లూరు: గిరిజన తాండాలకు వెళ్లి విద్య ఆవశ్యకతను వివరించడంతో పాటు సాయం కోసం తనను సంప్రదించాలన్న ఎస్ఐ వీడియో సోషల్ మీడియాలో వైరల్ అయింది. ఈ నేపథ్యంలో హాస్య నటుడు దాడి బాలాజీ ఆదివారం పెనాలూరు పేట పోలీసు స్టేషన్‌కు వచ్చి ఎస్ఐ పరమశివంను అభినందించారు. తిరువళ్లూరు జిల్లా ఊత్తుకోట తాలూకా పెనాలూరుపేట ఎస్ఐ పరమశివం ఐదు రోజుల క్రితం సమీపంలోని ఎస్టీ కాలనీకి కేసు విచారణ నిమిత్తం వెళ్లారు. అక్కడ చాలా మంది పిల్లలు బడికి వెళ్లడం లేదని గుర్తించి తల్లిదండ్రులతో మాట్లాడారు. విద్య ఆవశ్యకతను వివరించి పిల్లలందరూ బడికి వెళ్లేలా చూడాలని కోరారు. పిల్లలను పనులకు తీసుకెళ్లే తల్లిదండ్రులపై కేసు నమోదు చేస్తామని హెచ్చరించారు. కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సర్వశిక్షా అభియాన్ గురించి వివరించారు. విద్య కోసం ఎవరికైనా సాయం అవసరమైతే తనను సంప్రదించాలని, సాయం చేయడానికి 24 గంటలూ అందుబాటులో వుంటానన్నారు. ఈ విషయాన్ని కొందరు యువకులు వీడియో తీసి సోషల్ మీడియాలో పోస్టు చేశారు. ఈ వీడియో వైరల్ కావడంతో ముఖ్యమంత్రి స్టాలిన్, విద్యాశాఖ మంత్రి అన్బిల్ మహేష్, కలెక్టర్ ఆల్బీజాన్‌వర్గీష్, ఎస్పీ ఫకెర్లా సెఫాస్ కల్యాణ్‌తో పాటు పలువురు ఎస్ఐని అభినందించారు. ఎస్ఐ తన విధులను మాత్రమే నిర్వహించకుండా సామాజిక స్పృహ కల్పించేలా వ్యవహరించారని ప్రశంసించారు. ఈ నేపథ్యంలో పరమశివం వీడియోను చూసిన సినీ హాస్యనటుడు దాడి బాలాజీ ఆదివారం ఉదయం పెనాలూరుపేట పోలీసు స్టేషన్‌కు వచ్చారు. ఎస్ఐని అభినందించారు. అవసరమైతే తాను కూడా సాయం చేస్తానని హామీ ఇచ్చారు.

అలరించిన దుర్యోధన వధ



భాకరాపేట : స్థానిక మహా భారత ప్రాంగణంలో నిర్వహిస్తున్న మహాభారత ఉత్సవాల్లో చివరి ఘట్టమైన దుర్యోధన వధ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఇందులో భాగంగా దుర్యోధన విగ్రహాన్ని బంక మట్టితో తీర్చిదిద్దారు. దుర్యోధనుడు, భీముడి వేషధారులు యుద్ధం చేసే ఘట్టాన్ని రక్తి కట్టించారు. బంక మట్టి కోసం భక్తులు పోటీ పడడంతో తొక్కిసలాట జరిగింది.

స్వదేశానికి బై.. బై!

- అమెరికాకే తొలి ప్రాధాన్యం

సాక్షి, అమరావతి: విద్య, ఉపాధి, వ్యాపారం.. తదితర కారణాలతో భారత్ నుంచి విదేశాలకు వెళ్లిన వారు అక్కడే స్థిరపడిపోవడానికి మొగ్గుచూపుతున్నారు. తమ పిల్లలు ఆయా దేశాల పౌరులుగా పెరగాలని కోరుకుంటున్నారు. ఈ క్రమంలో భారత పౌరసత్వం వదులుకుని.. విదేశీ పౌరసత్వాలు పొందుతున్నారు. విదేశాంగ శాఖ వివరాల ప్రకారం.. 2011 నుంచి 2022 మధ్య 16.63 లక్షల మంది భారత్ పౌరసత్వాన్ని వదులుకున్నారు. అమెరికా, కెనడా, ఆస్ట్రేలియా, రష్యా సహా 135 దేశాల్లో స్థిరపడ్డారు. 2022లో అత్యధికంగా 2,25,260 మంది.. 2019లో 1.44 లక్షలు, 2020లో 85వేలు, 2021లో 1.63 లక్షల మంది మన దేశ పౌరసత్వాన్ని వదులుకున్నారు. చదువుల కోసం, ఉద్యోగాల కోసం విదేశాలకు వెళ్లాలనుకునేవారు.. తొలి ప్రాధాన్యం అమెరికాకే ఇస్తున్నారు. 2017 నుంచి 2021 మధ్య 6.08 లక్షల మంది భారత్ పౌరసత్వాన్ని వదులుకోగా.. వీరిలో అత్యధికంగా 2.56 లక్షల మంది అమెరికా పౌరసత్వం తీసుకున్నారు. ఆ తర్వాత కెనడా(91,429 మంది), ఆస్ట్రేలియా(86 వేల మంది), బ్రిటన్(66 వేల మంది) దేశాల్లోనే ఎక్కువ మంది భారతీయులు స్థిరపడ్డారు.

నిర్ణయాత్మక శక్తి ఏపీ మహిళ



రాష్ట్రంలో 43.4 శాతం వారిదే నాయకత్వం

దేశం మొత్తంలో అది 22.2 శాతమే

- సీనియర్ అధికారులు, మేనేజర్లు, ఎమ్మెల్యేలు వంటి నిర్ణయాత్మక పదవుల్లో ఏపీలో మహిళలదే హవా
- దేశ సగటుతో పాటు పెద్ద రాష్ట్రాల్లో కన్నా ఏపీలో వారిదే పైచేయి
- సీనియర్, మిడిల్ మేనేజ్‌మెంట్ స్థానాల్లో దేశ సగటు 18.1 శాతమే
- అదే ఆంధ్రప్రదేశ్‌లో అది 30.3 శాతం..
- దేశంలో పురుషులు, మహిళలు–2022 నివేదిక వెల్లడి

సాక్షి, అమరావతి

రాష్ట్రంలో మహిళలు తిరుగులేని శక్తిగా ఉన్నారు. స్థానిక సంస్థల్లో 50 శాతానికి పైగా వారికే పదవులు ఇస్తూ రాష్ట్ర ప్రభుత్వం విప్లవాత్మక నిర్ణయం తీసుకున్న విషయం తెలిసిందే. నిర్ణయాత్మక స్థానాలు, కీలకమైన పదవుల్లో ఏపీ మహిళలది దేశంలోనే అగ్రస్థానం. కేంద్ర కార్యక్రమాల అమలు, గణాంకాల మంత్రిత్వ శాఖ 'భారతదేశంలో వివిధ రంగాల్లో మహిళలు, పురుషులు–2022' అనే నివేదికలో ఈ విషయాన్ని వెల్లడించింది.

నివేదిక ముఖ్యాంశాలు ఇవే..

- సాధారణ హోదా, సీనియర్ అధికారులు, మేనేజర్లు, శాసనసభ్యుల హోదాల్లో నిర్ణయాలు తీసుకోవడంతో దేశ సగటుతో పాటు దేశంలోని పెద్ద రాష్ట్రాలతో పోలిస్తే ఏపీ మహిళలు అగ్రస్థానంలో ఉన్నారు.
- సీనియర్ అధికారులు, మేనేజర్లు, ఎమ్మెల్యేల వంటి నిర్ణయాత్మక పదవుల్లో రాష్ట్ర మహిళల హవా కొనసాగుతోంది.
- శాసనసభ్యులు, సీనియర్ అధికారులు, మేనేజర్ల హోదాల్లో మహిళల భాగస్వామ్యం దేశ సగటు 22.2 శాతం ఉంటే ఆంధ్రప్రదేశ్‌లో అది అత్యధికంగా 43.4 శాతం ఉంది.
- సీనియర్, మిడిల్ మేనేజ్‌మెంట్ స్థానాల్లో మహిళల భాగస్వామ్యం దేశ సగటు 18.1 శాతం ఉండగా ఏపీలో 30.3 శాతం ఉంది. మరే ఇతర పెద్ద రాష్ట్రాల్లో కూడా మహిళల భాగస్వామ్యం ఏపీలో ఉన్నంత స్థాయిలో లేదు.
- మొత్తం కార్మికుల్లో మేనేజర్ హోదాలో ఏపీలో 30.4 శాతం మహిళలే ఉండగా ఇదే దేశం మొత్తం చూస్తే కేవలం 18.0 శాతమే.
- అలాగే, ఆంధ్రప్రదేశ్‌లోని పంచాయతీరాజ్ సంస్థల్లో 50 శాతం మంది మహిళలు (78,025 మంది) ప్రజా ప్రతినిధులుగా ఉన్నారు.
- అదే సాధారణ కార్మికులు, నిర్ణయాత్మక హోదాల్లోనూ, శాసనసభ్యులు, సీనియర్ అధికారులు, మేనేజర్ల స్థాయిలో మహిళల భాగస్వామ్యం బీహార్, ఉత్తరాఖండ్, పంజాబ్, జమ్మూకశ్మీర్ తదితర రాష్ట్రాల్లో అత్యల్పంగా ఉంది.

వివిధ రాష్ట్రాల్లో సాధారణ కార్మికులు, ఎమ్మెల్యేలు, సీనియర్ అధికారులు, మేనేజర్లుగా పనిచేస్తున్న మహిళల శాతం ఇలా..

ఆంధ్రప్రదేశ్	43.4
కర్ణాటక	36.0
తమిళనాడు	28.6
ఢిల్లీ	28.2
కేరళ	27.8
ఒడిశా	24.3
మధ్యప్రదేశ్	23.1
తెలంగాణ	21.6
మహారాష్ట్ర	19.0
రాజస్థాన్	11.3

- సమాజంలో సగభాగమైన మహిళలకు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం అన్ని రంగాల్లో అత్యధిక ప్రాధాన్యమిస్తోంది.
- మంత్రిమండలితో పాటు స్థానిక సంస్థల్లోనూ మహిళలకు ప్రాధాన్యత ఇవ్వడంతోపాటు నామినేటెడ్ పదవులు, నామినేటెడ్ పనుల్లో మహిళలకు 50% రిజర్వేషన్ కల్పిస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఏకంగా చట్టాలు చేసింది.
- అంతేకాక.. రాష్ట్రంలో 30 లక్షల మందికి పైగా పేదలకు ఇళ్ల స్థలాలిస్తే వాటిని మహిళల పేరు మీదే పంపిణీ చేశారు. సాధారణ హోదాలోనూ మిగతా రాష్ట్రాలతో పోలిస్తే ఏపీలో ఎక్కువమంది మహిళలున్నారని.. వీరంతా నిర్ణయాలు తీసుకోవడంలో ముందున్నట్లు నివేదిక వెల్లడించింది.

సేంద్రియ సాగును 'వరి'ంచి..!

- ఆస్ట్రేలియాలో సాఫ్ట్‌వేర్ కొలువును వదిలేసి సేంద్రియ సాగు చేస్తున్న టెకీ
- తోటి రైతులతో కలిసి 'మన రైతు' పేరిట బియ్యం, చిరుధాన్యాల మార్కెటింగ్
- గేటెడ్ కమ్యూనిటీ ఇళ్లు, అపార్ట్‌మెంట్స్‌లో స్టాల్స్



ఈడుపుగల్లులో గేటెడ్ కమ్యూనిటీ అపార్ట్‌మెంట్స్ వద్ద ఏర్పాటు చేసిన ఉత్పత్తుల స్టాల్

సాక్షి, అమరావతి: ఆస్ట్రేలియాలో రూ.లక్షల జీతంతో సాఫ్ట్‌వేర్ కొలువు. విదేశీ పౌరసత్వం. విలాసవంతమైన జీవితం. ఇంతకంటే ఎవరైనా ఏం కోరుకుంటారు. హాయిగా అక్కడే సెటిలవ్వాలని చూస్తారు. కానీ.. అతడు అలా ఆలోచించలేదు. సేంద్రియ వ్యవసాయంపై మక్కువతో 15 ఏళ్లపాటు చేసిన ఉద్యోగానికి రాజీనామా చేసి సొంతూరు వచ్చేశాడు. కుటుంబ సభ్యులతో కలిసి మూడెకరాల్లో సేంద్రియ వరి సాగుకు శ్రీకారం చుట్టాడు. తనలాగే సేంద్రియ పంటలు పండిస్తూ మార్కెటింగ్ చేసుకోలేని రైతులతో చేయి కలిపాడు. 50 మందిని రైతులను కూడగట్టి 'మన రైతు' పేరిట సేంద్రియ ఉత్పత్తుల్ని మార్కెటింగ్ చేస్తూ వారికి తోడుగా నిలుస్తున్నాడు కృష్ణా జిల్లా పోరంకికి చెందిన బొల్లికొండ ప్రకాశ్.

సొంతూరికి వచ్చేసి..

ప్రకాశ్ ఉన్నత విద్య పూర్తి చేయగానే సాఫ్ట్‌వేర్ కొలువును అందిపుచ్చుకున్నాడు. వివిధ దేశాలను చుట్టి చివరకు కుటుంబంతో సహా ఆస్ట్రేలియాలో సెటిలయ్యాడు. ఆరంకెల జీతం. హాయిగా గడిచిపోతున్న అతడి జీవితంలో ఏదో వెలితి. తన పిల్లలకు తెలుగు సంస్కృతి, సంప్రదాయాలు తెలియకుండా పోతున్నాయన్న బాధ, సొంతూరికి దూరమైపోయానన్న ఆవేదన ఆయన్ని కలచివేసింది. చివరకు సొంతూరికి వచ్చేసి తన సోదరి వీరంకి ప్రమీల సాయంతో 3 ఎకరాల భూమిని కౌలుకు తీసుకుని సేంద్రియ సాగుకు శ్రీకారం చుట్టాడు. చిట్టి ముత్యాలు, సిద్ధసన్నాలు, నారాయణ కామినీ, నవారా వంటి వరి రకాలను సాగు చేయడం మొదలు పెట్టాడు. వాటికి మంచి డిమాండ్ ఏర్పడటంతో సేంద్రియ పద్ధతుల్లో రాజముడి, కాలబట్టి, మైసూర్ మల్లిగ దేశీ, రత్నచోడి, కుజిపటాలియా, బ్రౌన్, సెమీ బ్రౌన్ రైస్ పండిస్తున్న రైతుల నుంచి సేకరించి మార్కెటింగ్ చేయడం ప్రారంభించాడు. చిరు, తృణధాన్యాలు సాగు చేసే రైతులతో కలిసి వారు పండించే గో ఆధారిత వ్యవసాయ ఉత్పత్తులను ప్రాసెస్ చేసి మార్కెటింగ్‌కు శ్రీకారం చుట్టారు. 'మన రైతు' పేరిట మార్కెటింగ్ చేస్తున్నారు. సొంతంగా వెబ్‌సైట్, యూట్యూబ్ చానల్ ప్రారంభించి విస్తృత ప్రచారం చేస్తున్నారు. తాజాగా గేటెడ్ కమ్యూనిటీస్, అపార్టుమెంట్స్‌లో స్టాల్స్ ఏర్పాటు చేస్తూ ప్రజల్లోకి తీసుకెళ్తున్నారు.

ప్రజల్లోకి తీసుకెళ్లడమే లక్ష్యం



సేంద్రియ వ్యవసాయంపై మక్కువతోనే సాఫ్ట్‌వేర్ ఉద్యోగం వదిలేసి వచ్చాను. ఈ రంగంలో ఉన్న రైతులు పండించే ఉత్పత్తులను కూడా మార్కెటింగ్ చేస్తున్నాను. మార్కెట్ ధర కంటే కనీసం 30 శాతం తక్కువ ధరలకే వీటిని అందిస్తున్నాం. మంచి స్పందన వస్తోంది.

– బొల్లికొండ ప్రకాశ్, పోరంకి, కృష్ణా జిల్లా

చిన్నప్పటి నుంచీ మక్కువ



చిరు ధాన్యాలంటే చిన్నప్పటి నుంచి మక్కువ. మా ఇంటిల్లపాదీ వాటినే తింటాం. ఇప్పుడు సొంతంగా పండిస్తున్నాం. ఆస్ట్రేలియాలో సెటిలైన మా సోదరుడు ప్రకాశ్ ప్రోద్బలంతో మరింత ముందుకు తీసుకెళ్లాలని సంకల్పించా.

– వీరంకి ప్రమీల, సేంద్రియ రైతు, పోరంకి, కృష్ణా జిల్లా

తెలంగాణ

అధికారంలోకి రాగానే ముస్లిం రిజర్వేషన్లు రద్దు

చేవెళ్ల సభలో కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్‌షా

చేవెళ్ల నుంచి సాక్షి ప్రత్యేక ప్రతినిధి : తెలంగాణ రాష్ట్రంలో బీజేపీ అధికారంలోకి రాగానే రాజ్యాంగ వ్యతిరేక ముస్లిం రిజర్వేషన్లను రద్దు చేస్తామని, వాటి ఫలాలు ఎస్సీ, ఎస్టీ, ఓబీసీలకు అందేలా చర్యలు తీసుకుంటామని కేంద్ర హోం శాఖ మంత్రి అమిత్‌షా ప్రకటించారు. పార్టీకి పెరుగుతున్న మద్దతు, ఈ సభకు వచ్చిన ప్రజాస్పందన చూస్తుంటే వచ్చే ఎన్నికల్లో తెలంగాణలో బీజేపీ భారీ మెజారిటీతో అధికారంలోకి వస్తుందనే విషయం స్పష్టమౌతోందన్నారు. ఆదివారం చేవెళ్లలో జరిగిన తొలి 'విజయసంకల్ప యాత్ర' బహిరంగ సభలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. సీఎం కేసీఆర్, బీఆర్ఎస్ సర్కార్‌పై ప్రజల్లో పెల్లుబుకుతున్న జనాగ్రహాన్ని మొత్తం ప్రపంచం వీక్షిస్తోందన్నారు. అవినీతిమయ బీఆర్ఎస్ పాలనకు 'రివర్స్ కౌంటింగ్' మొదలైనట్టేనని చెప్పారు. తాను మళ్లీ వస్తానని, అన్నింటికీ లెక్కలు అడుగుతానని, ఇచ్చిన హామీల అమలు ఏమైందో నిలదీస్తానన్నారు.

ఎంఐఎం చేతుల్లో కారు స్టీరింగ్

'బీఆర్ఎస్ ఎన్నికల గుర్తు అయిన కారు స్టీరింగ్ ఎంఐఎం అధినేత అసదుద్దీన్ ఒవైసీ చేతుల్లో ఉంది. ఒవైసీ ఎజెండాపై నిర్లజ్జగా నడుస్తున్న తెలంగాణ ప్రభుత్వం సెప్టెంబర్ 17న తెలంగాణ స్వాతంత్ర్య దినోత్సవాన్ని నిర్వహించడం లేదు. మోదీ నేతృత్వంలో ఇక్కడ బీజేపీ అధికారంలోకి వచ్చాక పరేడ్ గ్రౌండ్స్‌లో ఈ ఉత్సవాన్ని అధికారికంగా నిర్వహిస్తాం. మీరు మజ్లిస్‌కు భయపడవచ్చేమో కానీ బీజేపీ భయపడదు. డబుల్ బెడ్‌రూం స్కీంలో, విద్యలో మైనారిటీలకు రిజర్వేషన్లు కల్పించారు. ఇది ఇక ముందు సాగదు. మోదీ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, కార్యక్రమాలు కింది స్థాయి వరకు చేరడం లేదు. రాబోయే ఎన్నికల్లో భారీ మెజారిటీతో తెలంగాణలో బీజేపీ అధికారంలోకి రావడం ఖాయం. ఇందుకు ప్రజలు సహకరించాలి' అని అమిత్‌షా కోరారు.



సభలో అభివాదం చేస్తున్న అమిత్‌షా

వారందర్నీ జైలుకు పంపుతాం

ఒక్క ఉద్యోగ భర్తీ పరీక్షను కూడా సరిగ్గా నిర్వహించలేని కేసీఆర్ ప్రభుత్వానికి అధికారం చెలాయించే అర్హత లేదని అమిత్ షా మండిపడ్డారు. బీజేపీ ప్రభుత్వం ఏర్పడ్డాక టీఎస్‌పీఎస్సీ పేపర్ లీకేజీతో సంబంధమున్న ప్రతి ఒక్కరినీ జైలుకు పంపుతామన్నారు. టీఎస్‌పీఎస్సీ లీకేజీతో లక్షలాది మంది నిరుద్యోగులు, యువత జీవితం నాశనమైందన్నారు. కుటుంబ అవినీతిమయ పాలన గురించి ప్రజల దృష్టి మళ్లించేందుకే టీఆర్ఎస్‌ను బీఆర్ఎస్‌గా మార్చారన్నారు. కేసీఆర్ కోసం ప్రధాని కుర్చీ ఖాళీగా లేదని, తెలంగాణలోనే ఆయన పాలన, పని ముగుస్తుందని చెప్పారు. కాగా, అంతకు ముందు అమిత్ షా నోవాటెల్ హోటల్‌లో 40 నిమిషాలపాటు పార్టీ నేతలతో వివిధ అంశాలపై చర్చించారు.

ఇక రైలు ప్రయాణంలో సమస్యలకు చెక్!

- రైలు మదద్ పేరుతో ప్రత్యేక యాప్ ప్రవేశపెట్టిన రైల్వే శాఖ
- 35 రకాల ఫిర్యాదులు చేసే అవకాశం

రాజమహేంద్రవరం సిటీ: రైలు ప్రయాణంలో ప్రయాణికుల సమస్యలను పరిష్కరించడానికి రైల్వే శాఖ తాజాగా 'రైల్ మదద్' పేరిట ఓ యాప్ రూపొందించింది. దీని ద్వారా ప్రయాణ సమయంలో 35 రకాల సేవల్లో లోపాలపై ఫిర్యాదు చేయొచ్చు. సమస్యను వివరించడంతో పాటు సంబంధిత ఫొటోను అప్‌లోడ్ చేసేందుకు యాప్‌లో వీలు ఉంది. ఈ యాప్‌లో ఫిర్యాదు చేసే ప్రయాణికులు రిజర్వేషన్, జనరల్, ప్లాట్‌ఫామ్ టికెట్లలో ఏదో ఒకటి తప్పనిసరిగా కలిగి ఉండాలి. ఫిర్యాదు సమయంలో ఆ టికెట్ వివరాలు తెలియజేయాలి. గూగుల్ ప్లే స్టోర్ నుంచి రైల్ మదద్ యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకోవచ్చు. ముందుగా ప్రయాణికుడి పేరు, ఫోన్ నంబర్ టైప్ చేస్తే మొబైల్‌కు ఓటీపీ వస్తుంది. దానిని ఎంటర్ చేస్తే యాప్‌లో ఫిర్యాదు చేసే పేజీ ఓపెన్ అవుతుంది. అక్కడ సూచించిన వివరాల మేరకు ఫిర్యాదు అప్‌లోడ్ చేయాలి. ఈ యాప్ ద్వారా వచ్చిన ఫిర్యాదులను జనరల్ మేనేజర్ (జీఎం), డివిజనల్ రైల్వే మేనేజర్ (డీఆర్ఎం) నేరుగా పర్యవేక్షిస్తారు. ఫిర్యాదు స్థాయిని బట్టి సంబంధిత విభాగానికి చెందిన ముఖ్య అధికారికి చేరవేస్తారు. దీనిపై వివరణ ఇవ్వాల్సిందిగా ఆదేశాలిస్తారు. ఫిర్యాదుపై అధికారుల స్పందనను బట్టి పరిష్కారానికి పట్టే సమయం, ఇతర వివరాలతో ఆయా ప్రయాణికుల ఫోన్‌కు మెసేజ్ పంపిస్తారు.

వేటిపై ఫిర్యాదు చేయొచ్చంటే..

- రిజర్వేషన్ చేసుకున్నా వెయిటింగ్ జాబితాలో ఉండటం.
- టీటీఈ, ఇతర సిబ్బంది అవినీతి
- నాణ్యత లేని ఆహారం
- మరుగుదొడ్లు, బోగీల అపరిశుభ్రత
- రైల్వే సిబ్బంది నిర్లక్ష్యం, దురుసు ప్రవర్తన
- అనుమానాస్పద వ్యక్తుల సంచారం
- వస్తువులు మరచిపోవడం
- రైళ్ల రాకపోకల్లో ఆలస్యం
- జూదం, ధూమపానం చేసే ప్రయాణికుల వల్ల కలిగే అసౌకర్యం
- రైల్వే స్టేషన్‌లో నీరు, వెయిటింగ్ హాల్స్ కొరత
- మహిళల పట్ల అసభ్య ప్రవర్తన, ఈవ్ టీజింగ్
- అధిక ధరలకు తినుబండారాల అమ్మకం.
- ప్యాంట్రీ కార్ అపరిశుభ్రత



దేవుడి సేవలన్నింటికీ ఆన్‌లైన్‌లో అడ్వాన్స్ బుకింగ్

సాక్షి, అమరావతి: కుటుంబ సమేతంగా అన్నవరం వెళ్లి సత్యనారాయణ స్వామి వ్రతం చేయించుకోవాలని అనుకుంటున్నవారు ఇంతకు ముందులా ఎక్కువగా హైరానా పడాల్సిన పని లేదు. 10–15 రోజుల ముందే వ్రతం టికెట్‌ను ఆన్‌లైన్‌లో కొనుక్కోవచ్చు. శ్రీశైలంలో మల్లికార్జున స్వామి దర్శనానికి వెళ్లాలనుకునే వారు నెలరోజుల ముందే ఆన్‌లైన్‌లో డబ్బులు చెల్లించి ఆలయం వద్ద దేవదాయశాఖ గదులను బుక్ చేసుకోవచ్చు. రాష్ట్రంలో దేవదాయశాఖ పరిధిలో పలు ఆలయాల్లో వివిధ రకాల పూజలు, దర్శన టికెట్లతోపాటు ఆయా ఆలయాల వద్ద నివాసిత గదుల బుకింగ్ వంటివన్నీ ఇప్పుడు ఆన్‌లైన్ విధానంలోకి తీసుకొచ్చింది. పూజలు, దర్శనం టికెట్లు, వసతి గదులను ఆల యం వద్దకు వెళ్లి మాత్రమే తీసుకోవాల్సిన ఇబ్బందులు తొలిగిపోయాయి. తాము వెళ్లే తేదీని ముందే నిర్ణయించుకున్న భక్తులు ఇంటివద్ద నుంచే ముందుగానే సేవా టికెట్లను, గదులను బుక్ చేసుకోవచ్చు. తమ పరిధిలోని ప్రముఖ ఆలయాలన్నింటిలో ఈ తరహా సేవలన్నీ ఉమ్మడిగా ఒకచోట ఆన్‌లైన్‌లో పొందేందుకు దేవదాయ శాఖ కొత్తగా ఏపీ టెంపుల్స్.ఏపీ.జీవోవీ.కాం వెబ్‌పోర్టల్‌ను అందుబాటులోకి తీసుకొచ్చింది. గతంలో కొన్ని ఆలయాల్లో కొన్ని రకాల సేవలకు మాత్రమే దేవదాయశాఖ ప్రత్యేక వెబ్‌పోర్టల్ నిర్వహించగా.. ఇప్పుడు మొదటి దశలో 175 ప్రముఖ ఆలయాలన్నింటిలో అన్ని రకాల సేవలను ఈ కొత్త వెబ్‌పోర్టల్ ద్వారా భక్తులు ముందస్తుగా పొందేందుకు వీలు కల్పించింది. సింహాచలం, అన్నవరం, ద్వా రకా తిరుమల, విజయవాడ దుర్గగుడి, పెనుగంచిప్రోలు, శ్రీశైలం, కాణిపాకం, శ్రీకాళహస్తి, మహానంది, విశాఖపట్నం శ్రీకనకమహాలక్ష్మి, అంతర్వేది, అరసవెల్లి, మోపిదేవి సుబ్రహ్మణ్యస్వామి, మురమళ్ల వీరేశ్వరస్వామి, వాడపల్లి వేంకటేశ్వరస్వామి, కసాపురం నెక్కంటి ఆంజనేయస్వామి.. మొత్తం 16 ఆలయాల్లో స్వామి సేవలు, దర్శన టికెట్లు, గదుల కేటాయింపు వంటివన్నీ ముందస్తుగానే ఆన్‌లైన్‌లో పొందేందుకు అందుబాటులోకి ఉంచింది. అడ్వాన్స్ బుకింగ్ గడువు వివిధ ఆలయాల్లో అక్కడి స్థానిక పరిస్థితులను బట్టి వివిధ రకాలుగా నిర్ణయించారు. మొదటి దశలో మొత్తం 175 పెద్ద ఆలయాల్లో, తర్వాత దశలో ఓ మోస్తరు ఆలయాల్లోనూ ఈ తరహా ముందస్తు ఆన్‌లైన్ సేవలు ఈ వెబ్‌పోర్టల్ ద్వారానే అందుబాటులోకి తీసుకురానున్నట్లు దేవదాయశాఖ అధికారులు తెలిపారు.



ఈ ఫొటోలో కనిపిస్తున్న రైతు పేరు ఈరక్యాతప్ప. అమరాపురం మండలం గొడసకుంట. ఐదెకరాల్లో వక్క సాగుచేశాడు. దిగుబడి బాగుంది. ఏటా రూ.12 లక్షల ఆదాయం వస్తోందని తెలిపాడు.




ఈ చిత్రంలో కనిపిస్తున్న రైతు పేరు నాగప్ప. అమరాపురం మండలం మద్దలకుంట గ్రామం. రెండెకరాల్లో వక్క సాగుచేశాడు. ఈ ఏడాది రెండు టన్నుల దిగుబడి వచ్చింది. టన్ను ధర రూ.42 వేలు ఉండటంతో ఇంట్లోనే నిల్వ ఉంచాడు. ధరలు పెరిగిన తర్వాత అమ్ముతానని చెబుతున్నాడు.

వక్క సాగు.. లాభాలు బాగు

తక్కువ పెట్టుబడితో ఎక్కువ ఆదాయం

- శ్రీసత్యసాయి జిల్లా అమరాపురం మండలంలో అత్యధికంగా సాగు
- జిల్లా వ్యాప్తంగా ఐదువేల ఎకరాల్లో వక్క పంట
- పక్క రాష్ట్రం కర్ణాటకలోని మార్కెట్లకు తరలింపు



వక్క కాయలు

సాక్షి, పుట్టపర్తి: వక్క.. శ్రీసత్యసాయి జిల్లా రైతుల కష్టానికి ప్రతిఫలం ఇస్తోంది. ఒకసారి పంటవేస్తే దీర్ఘకాలం దిగుబడి వస్తోంది. నీటి లభ్యత పుష్కలంగా ఉన్న ప్రాంతాల్లో తక్కువ రసాయన ఎరువులు, క్రిమిసంహారక మందులతో అధిక దిగుబడులు సాధించవచ్చు. శ్రీసత్యసాయి జిల్లా మడకశిర నియోజకవర్గంలో వక్కసాగుకు అనుకూల వాతావరణం ఉండటంతో అమరాపురం, గుడిబండ, అగళి, రొళ్ల మండలాలతో పాటు పరిసర ప్రాంతాల రైతులు దశాబ్దాలుగా వక్క తోటలు సాగుచేస్తున్నారు.

ఐదేళ్ల తర్వాత దిగుబడి

ఎకరాలో 450 నుంచి 500 వక్క మొక్కలు నాటుతున్నారు. ఐదేళ్ల వరకు ఎకరాకు రూ.50 వేలు పెట్టుబడి పెట్టాల్సి వస్తుంది. ఐదేళ్ల తర్వాత ఏటా దిగుబడి వస్తుంది. ధరలు బాగుంటే ఎకరాకు రూ.3 లక్షల ఆదాయం వస్తుంది. ఎకరా తోట నుంచి ఎండబెట్టిన వక్కలు ఆరు క్వింటాళ్ల వరకు వస్తాయి. ఒకసారి పంట వేస్తే 45 ఏళ్ల వరకు ఆదాయం వస్తూనే ఉంటుంది. హిందూ సంప్రదాయంలో వక్క లేదా పోక చెక్కకు అధిక ప్రాధాన్యం ఉంది. వీటిని శుభకార్యాల్లో విరివిగా వినియోగిస్తారు.

పెరుగుతున్న ఆదరణ

వక్క చెట్టు నుంచి గరిష్టంగా క్వింటాలు చొప్పున పచ్చి వక్కకాయలు వస్తాయి. వాటి నుంచి 30 శాతం వక్క వస్తుంది. విత్తన కాయల నుంచి మొక్కలను పెంచి భూమిలో నాటే వక్క మొక్కలకు రసాయన ఎరువులు, పురుగుమందుల అవసరం ఉండదు. వక్క పంటకు సేంద్రియ ఎరువులు ఏడాదికి ఒకసారి మాత్రమే వేస్తారు. డ్రిప్ ద్వారా సరిపడా నీరు వదులుతారు. వక్క కాయలు పక్వానికి వచ్చిన సమయంలో నాలుగు నెలలు మాత్రమే పని ఉంటుంది. మిగిలిన ఎనిమిది నెలలు చెట్ల సంరక్షణ చూసుకోవాలి. పెట్టుబడి తక్కువగా ఉండడంతోపాటు అధిక లాభాలు ఉన్నందున వక్క తోటల సాగుకు ఆదరణ లభిస్తోంది.



కాసిన వక్క కాయలు (ఫైల్)

స్థానికంగానే నర్సరీలు

కొందరు రైతులు వక్క తోటల నర్సరీలు పెంచుతున్నారు. తొలుత రైతులు ఎండబెట్టి వలిచిన వక్కను తీసుకొచ్చి పాలిథీన్ కవర్‌లో విత్తనం వేసి నీరు పోస్తారు. పదిరోజుల తర్వాత విత్తనం నుంచి మొక్క వస్తుంది. రెండేళ్ల పాటు నీరు, ఎరువు అందిస్తారు. తర్వాత రైతులు తమ పొలాల్లో 5 అడుగుల పొడవు, 5 అడుగుల వెడల్పు దూరంలో మొక్కలు నాటుతారు. మరికొందరు తాము పండించిన వక్క కాయలను ప్రాసెసింగ్ చేసి మార్కెట్‌లో విక్రయిస్తున్నారు. పచ్చికాయల నుంచి పీచు వేరుచేసిన అనంతరం వేడినీటిలో గంటన్నర పాటు కాయల నుంచి వేరుచేసిన వక్కను ఉడికిస్తారు. తర్వాత పదిరోజులు ఆరబెడితే వక్కగా మారుతుంది.

కర్ణాటక మార్కెట్‌కు..

రైతులు వక్కను పండిస్తున్నప్పటికీ రాష్ట్రంలో సరైన మార్కెటింగ్ సౌకర్యం లేకపోవడంతో పక్క రాష్ట్రం కర్ణాటకకు తరలిస్తున్నారు. కర్ణాటకలోని శిర, హిరియూర్, చిత్రదుర్గంలోని మార్కెట్లకు వెళ్లి పంట అమ్ముతున్నారు. పలువురు వ్యాపారులు ఇక్కడ తోటల వద్దకే వచ్చి సరుకు కొనుగోలు చేస్తున్నారు. ప్రస్తుతం మార్కెట్‌లో క్వింటాలు వక్క ధర రూ.48 వేల నుంచి రూ.52 వేల వరకు పలుకుతోంది. వక్క పంట కోత సాధారణంగా జూలై నెలలో ప్రారంభమవుతుంది. డిసెంబర్ ఆఖరు వరకు కోస్తారు. నెలకు ఒకసారి పంట కోత ఉంటుంది. కొందరు చెట్లపైనే పచ్చి వక్కలను వ్యాపారులకు అమ్మేస్తారు.

రాష్ట్రంలోనే అమరాపురం టాప్

శ్రీసత్యసాయి జిల్లా వ్యాప్తంగా 5,171.3 ఎకరాల్లో వక్క పంట సాగులో ఉంది. అమరాపురం మండలంలో 1,829 ఎకరాల్లో, రొళ్లలో 1,128, గుడిబండలో 970, అగళిలో 811, మడకశిరలో 190, హిందూపురంలో 97, లేపాక్షిలో 41, చిలమత్తూరులో 29, రొద్దంలో 27, పరిగిలో 25, పెనుకొండలో 13, సోమందేపల్లిలో 8, కొత్తచెరువు మండలంలో రెండెకరాల్లో వక్క సాగుచేస్తున్నారు. మన రాష్ట్రంలోనే వక్కసాగు అత్యధికంగా అమరాపురం మండలంలోనే చేస్తున్నారు. ఇటీవల పశ్చిమ గోదావరి జిల్లాలోను వక్క కొంతమేర సాగులోకి వచ్చింది.

ఏటా రూ.5 లక్షల ఆదాయం



నేను 20 ఏళ్లుగా మూడెకరాల్లో వక్క సాగుచేస్తున్నా. ఏటా ఖర్చులు పోను రూ.5 లక్షల ఆదాయం వస్తోంది. దిగుబడిని పొరుగు రాష్ట్రం కర్ణాటక మార్కెట్‌కు తరలిస్తుంటాం. సరిహద్దు ప్రాంతంలో ఉండటంతో రవాణా ఖర్చులు కూడా తక్కువగానే ఉంటాయి.

– నారాయణప్ప, టీడీపల్లి, రొళ్ల మండలం

మార్కెటింగ్ సమస్య ఉంది



ఇరవై ఏళ్లుగా రెండున్నర ఎకరాల్లో వక్క సాగుచేస్తున్నాం. ఏటా రూ.4 లక్షల ఆదాయం వస్తోంది. అయితే స్థానికంగా మార్కెట్ లేకపోవడంతో కర్ణాటకకు తరలిస్తున్నాం. డిమాండ్‌కు అనుగుణంగా ధరలు ఉంటాయి.

– రవికుమార్, బీసీహళ్లి, రొళ్ల మండలం

తక్కువ పెట్టుబడితో అధిక లాభాలు



తక్కువ పెట్టుబడితో ఎక్కువ ఆదాయం ఉండటంతో చాలామంది రైతులు వక్కసాగుకు ఆసక్తి చూపుతున్నారు. వాతావరణం అనుకూలంగా ఉండటంతో అమరాపురం, గుడిబండ, రొళ్ల ప్రాంతాల్లో వక్క పంట అధిక విస్తీర్ణంలో సాగులో ఉంది. ఇటీవల కాలంలో ఇతర ప్రాంతాల్లో కూడా సాగుచేస్తున్నారు. వక్క పంటకు పక్క రాష్ట్రం కర్ణాటకలో మంచి గిరాకీ ఉంది. వక్క నార్కోటిక్స్ విభాగంలోకి వస్తున్న కారణంగా ప్రభుత్వం నుంచి ఎలాంటి సహకారం ఉండదు. రాయితీలు వర్తించవు.

– చంద్రశేఖర్, శ్రీసత్యసాయి జిల్లా ఉద్యానశాఖాధికారి

సన్నిధి



మంచి మాట

జీవన చలనం

చలనం ఉండాలి; మనకు చలనం అన్నది కావాలి. చలనంతో మనం సాగుతూ ఉండాలి. మనలోని రక్తంలో చలనం లేకపోతే మనం ఉండం. మన రక్తంలో ఉన్న చలనం మన తీరులోనూ ఉండాలి. చలనం లేకుండా ఆగిపోయిన నీరు బురద అయిపోతుంది. చలనం లేకపోతే ఎవరి జీవనం అయినా ఎందుకూ పనికి రాకుండా పోవడమే కాదు హానికరం అయిపోతుంది కూడా.

చలనం పరంగా ఉచ్ఛ్వాస, నిశ్వాసాలు మనకు తొలిపాఠాలు. ఉచ్ఛ్వాస నిశ్వాసాల చలనం లేకపోతే మనం మనకే చెందం కదా? శ్వాసకు చలనం ఉండడంవల్లే మనం బతుకుతూ ఉన్నాం; మనకు ఉన్నవి ఉండడానికి కారణం శ్వాసకు చలనం ఉండడమే. మనం చలనంతో ఉండాలి అన్న ఆలోచన శ్వాసలాగా మనకు ఎప్పుడూ ఉంటూనే ఉండాలి.

మనిషికి ప్రధానమైన వ్యాధి స్తబ్దత. ఈ స్తబ్దతకు వైద్యం, విరుగుడు చలనం. అడుగు వేస్తే పడిపోతాం అనుకుని స్తబ్దతలో ఉండిపోవడం సరికాదు. భద్రత కోసం అనో, జరిగిపోతోంది కదా అనో స్తబ్దతలో, స్తబ్దతతో ఉండిపోవడం పెనుదోషం. ఆ దోషం ముదిరితే అది పాపంగా కూడా పరిణమిస్తుంది.

'జీవితం వెనక్కు వెళ్లదు; అది నిన్నటితో ఉండిపోదు' అని కవి–తాత్త్వికుడు ఖలీల్ జిబ్రాన్ ఒక సందర్భంలో అంటారు. చలనం అన్నది ఉంటుంది, ఉండాలి కాబట్టి ఆయన అలా అన్నారు. చలనం లేకుండా స్తబ్దతలో ఉండిపోతే జీవితం వెనక్కు, ఆ వెనక్కు పడిపోతుంది, జీవితం నిన్నటితో ఉండిపోవడం కాదు మొన్నటికీ, అటు మొన్నటికీ జారిపోతుంది.

> జీవనం అంటేనే గమనం. గమనానికి ఆరంభం చలనం. గమనానికి మాత్రమే కాదు ఏ గమ్యానికైనా తొలి చుక్క చలనమే.

జీవితం నుంచి జీవనం జారిపోకూడదు; జీవనానికి జీవితం లేకుండా పోకూడదు. అందుకు స్తబ్దత కాదు చలనం కావాలి; చలనం ఉండాలి. సేద తీరచ్చు కానీ స్తబ్దతలో ఉండిపోకూడదు. అలిసిపోవడం సహజమైందే కానీ బిగుసుకుపోవడం అసహజమైంది. స్తబ్దతకు మలిదశ బిగుసుకుపోవడం. స్తబ్దత, బిగుసుకుపోవడం మనుగడలో ఉన్న మనిషి లక్షణాలు కావు, కాకూడదు.

మరణించిన వ్యక్తి లక్షణాలు స్తబ్దత, బిగుసుకుపోవడం. మరణించాక తప్పనిసరిగా వచ్చేవి అవి. కాబట్టి మరణం రానంత వరకూ అవి మన దగ్గరకు రాకూడదు. మనుగడ ఉన్నంతవరకూ మనం వాటిని రానివ్వకూడదు. స్తబ్దత కారణంగా మనుగడలో ఉన్న మనం మరణించిన వ్యక్తులంలాగా మారిపోకూడదు. మరణించాక కూడా జీవించి ఉండేందుకు మనం చలనాన్ని ఒంటపట్టించుకోవాలి.

మెరుపు మెరుపయింది చలనం వల్లే. గాలికి చలనం లేకపోతే మన పరిస్థితి ఏమిటి? మేఘాలకు, భూమికి చలనం అన్నది లేకపోతే మనకు ఉండేది ఏమిటి? మనకు మనగడే ఉండదు. చలనం అన్నది లేకపోతే మనం ప్రపంచానికి ఉండం; మనకు ప్రపంచం ఉండదు. చలనం లేకపోతే గమనం ఉంటుందా? ఉండదు. జీవనం అంటేనే గమనం. గమనానికి ఆరంభం చలనం. గమనానికి మాత్రమే కాదు ఏ గమ్యానికైనా తొలిచుక్క చలనమే.

జీవితానికి జీవనం ఉన్నప్పుడు జీవనానికి చలనం ఉండాలి. స్తబ్దతలో మనల్ని మనం మోసుకుంటూ ఉండిపోవడం జీవనం కాదు; స్తబ్దతతో మనం మనకే బరువైపోవడం జీవితం కాదు. చలనం ఇంధనం కాగా జీవితం పండాలి. జీవితానికి జ్వలనం కావాలంటే జీవనానికి చలనం కావాలి.

నది నది అయ్యేది చలనం వల్లే. చలనమే లేకపోతే నది అన్నదే లేదు; నది లేకపోతే జరగాల్సిన మేలు జరగదు. చలనం వల్ల ఏం మేలు జరుగుతుందో, ఎంత మేలు జరుగుతుందో నది మనకు తెలియజెబుతునే ఉంది. నదిని మనం స్ఫూర్తిగానూ, ఆదర్శంగానూ తీసుకోవాలి. మనం చలనంతో నదిలాగా బతకాలి; బతుకే గెలుపై మనం మునుముందుకు నడుస్తూ ఉండాలి.

– రోచిష్మాన్

గురువాణి

ఆ నాలుగు = గెలుపు



మనిషి విజయం సాధించాలంటే పవిత్రత, ఓర్పు, పట్టుదల, ప్రేమ ఉండాలంటారు స్వామి వివేకానంద. ఇవి మనిషికి ఉండాల్సిన లక్షణాలు. పవిత్రత మొదట ఆలోచనలో ఉండాలి. మనిషి మనసు ఎప్పుడూ ప్రశాంతంగా, నిశ్చలంగా, ఏ విధమైన సంకల్పవికల్పాలు లేకుండా ఉండదు. అందులోంచి ఏవో ఆలోచనలు వస్తూనే ఉంటాయి. అలాకాక అవి పవిత్రమై, నలుగురికీ ఉపకరించేలా ఉండాలంటే... దానికి తగిన ఆలంబనం ఉండాలి. పసిపిల్లవాడికి బొమ్మ ఇస్తే క్షేమంగా ఆడుకుంటాడు. కత్తి ఇస్తే ఏ కాలో వేలో కోసుకుంటాడు. అలా మన మనసుకు మనం ఏమి ఇస్తున్నామనే దానినిబట్టి అది ఆధారపడి ఉంటుంది.

మంచి గ్రంథాలు, మహాత్ముల జీవిత చరిత్రలు, మంచి కీర్తనలు మనసుకు అలవాటు చేస్తే మనసు పవిత్రత పొందుతుంది. ఇది మనం తలపెట్టిన ఏ కార్యాన్నయినా విజయంవైపు నడిపిస్తుంది. మాట అగ్నిహోత్రంతో సమానం. అగ్ని ఎలా వస్తువును కాలుస్తుందో మంచి మాట అవతలివారి అజ్ఞానాన్ని అలా దహించి వేస్తుంది. పవిత్రమైన ఆలోచనలు చేసేటప్పుడు మంచి మాటలే వస్తాయి. మంచి సంస్కారాన్ని, సంస్కృతిని ఏర్పరుస్తాయి.

దాని తరువాత క్షమ. అంటే ఓర్పు. శక్తి ఉన్నవాళ్ళందరూ శక్తి లేనివాళ్లను అణచివేసే ప్రయత్నం చేస్తే ప్రపంచం నిలబడదు. మనిషికి అలంకారం ఓర్పు అంటుంది రామాయణం. క్షమాదానం క్షమా యజ్ఞః క్షమా సత్యం హి పుత్రికాః / క్షమా యశః క్షమా ధర్మః క్షమయా విష్ఠితం జగత్... ఆ ఓర్పే దానం, అదే యజ్ఞం, సత్యం, కీర్తి, ధర్మం, ఈ జగత్తంతా ఆ ఓర్పుమీదే ఆధారపడి ఉంది. అది లేకపోతే ఎక్కడా ఎప్పుడూ ఏ ఇద్దరూ కలిసి ఉండలేరు.. అప్పుడు ఎక్కడా ఏ కార్యం ఫలప్రదం కాదు. తరువాత పట్టుదల ఉండాలి. మనిషికి మొక్కవోని ఆత్మవిశ్వాసం ఉన్నప్పుడే పట్టుదల వస్తుంది. అది ఉంటే ఎన్ని పరిమితులున్నా మనిషి దాటుకొని వెళ్ళగలడు. కర్ణాటకలో మాలతీ కృష్ణమూర్తి అని ఒకామె ఉంది. పుట్టిన కొన్ని నెలలకే పోలియో వచ్చి రెండు కాళ్ళు కింది భాగం చచ్చుబడిపోయాయి. తరువాతి కాలంలో 15 ఏళ్ళు ఫిజియో థెరపీ, 34 శస్త్ర చికిత్సలు జరిగాయి. అయినా తనకిష్టమైన క్రీడారంగంలో ప్రవేశించి 389 స్వర్ణపతకాలు, 27 రజిత పతకాలు, 5 కాంస్య పతకాలు, చివరకు అర్జున అవార్డు, పద్మశ్రీ కూడా పొందింది. అదీ పట్టుదల అంటే.

అన్నిటికన్నా ముఖ్యమైనది ప్రేమ. ప్రతిఫలాన్ని ఆశించకుండా ప్రేమించ గలగడం. ప్రతిఫలం ఆశిస్తే అది కామం. తల్లిదండ్రులు పిల్లలమీద, భార్యాభర్తలు పరస్పరం చూపే ప్రేమ.. ఫలితం ఆశించని ప్రేమ. దానికి కారణాలుండవు. మిగిలిన ప్రాణులలో ప్రేమ కొద్దికాలమే. కానీ మనుషుల్లో అది చివరి ఊపిరివరకు ఉంటుంది. అందువల్ల విజయ సాధనకు పవిత్రత, ఓర్పు, పట్టుదల, ప్రేమ ఉండాలంటారు స్వామి వివేకానంద.



బ్రహ్మశ్రీ చాగంటి కోటేశ్వరరావు

బౌద్ధవాణి

ధర్మరక్షకుడు

పెద్దల, అనుభవజ్ఞుల మార్గంలో నడవడం మనుషుల్లోనే కాదు, పశు, పక్ష్యాదుల్లోనూ కనిపిస్తూ ఉంటుంది. అలా పెద్దల మాటలు వినని పశువులు కూడా ప్రమాదాల్లో పడతాయి. ప్రాణాల మీదకు తెచ్చుకుంటాయి. ఇలా పశువులు తమకు తామే కాదు, తమను కాచే కాపరుల వల్ల కూడా ఆపదల్లో పడతాయి.



అది గంగాతీరంలోని వజ్జిదేశం. వర్షాకాలం ముగిసి, శరద్కాలం మొదలయ్యింది. నది నిండుగా పారుతోంది. తెల్లని మేఘాలు బారులు తీరి నది మీద మెల్లగా కదులుతున్నాయి. నీటి ఉరవడి ఎక్కువగా ఉంది. మధ్యాహ్నం దాటి పొద్దు పడమరకి వాలింది. పచ్చిక మైదానంలో మేస్తున్న పశువుల్ని తోలుకొస్తున్నారు కాపర్లు. మందకు ముందు ఒక కాపరి వేగంగా నడుస్తూ దారితీస్తున్నాడు. మంద వెనుక ఇద్దరు కాపర్లు అదిలిస్తూ ఉన్నారు.

అంతలో నీటిలో పెద్ద శబ్దం వచ్చింది. కాపర్లు అటుకేసి పరుగుతీశారు. చిన్న ఆవుదూడ ఎగిరి నీటిలో దూకింది. అది చెంగు చెంగున ఎగురుతూ ఉల్లాసంతో దూకింది. కానీ, అది రేవు తీరం కాదు. లోతైన ప్రాంతం. నీటి ఉరవడి సుడులు తిరుగుతోంది. నీటిలో మునిగి తేలుతున్న దూడ ఆర్తనాదం విన్న తల్లి ఆవు పరుగు పరుగున వచ్చి, తానూ దూకింది. కాపర్లు వేగంగా వచ్చి, మిగిలిన మందను దూరంగా తోలారు. లేకపోతే వాటి వెనుకే మరికొన్ని దూకేసేవి. సుడిలో దూకిన తల్లి ఆవు తేరుకుని ఈదుకుంటూ ఒడ్డుకు చేరింది. దూడ పెయ్యి మాత్రం నీటి ప్రవాహంలో పడి ఏటి మధ్యలోకి కొట్టుకుపోయింది.

పశువులు దిగాల్సిన రేవు అక్కడికి కొద్దిదూరంలోనే ఉంది. మిగిలిన మందను ఎక్కడ దిగాలో అక్కడే దించాడు ముందున్న కాపరి. అవి అక్కడే దిగి, సురక్షితంగా అవతలి ఒడ్డుకు చేరాయి. అవతలి తీరంలో నది రేవుకి చాలా దిగువ నుండి నదీతీరాన భిక్షుసంఘంతో కలిసి నడిచి వస్తున్నాడు బుద్ధుడు. నదిలో కొట్టుకు వస్తున్న ఆవుదూడను చూశాడు. అది ఈదలేక బాధపడుతూ ఏదోవిధంగా అవతలి తీరం వెంటే కొట్టుకుపోతోంది. బుద్ధుడు ఆగాడు. భిక్షుసంఘం ఆగిపోయింది.

వెంటనే ఈత తెలిసిన ఒక భిక్షువు నీటిలో దిగి, ఆవుదూడ మెడకు కట్టిన తాడు పట్టుకుని భద్రంగా ఒడ్డుకు చేర్చాడు. అది బాగా అలసిపోయి ఉంది. నిలబడలేకపోతోంది. బుద్ధుడు వచ్చి దాని వెన్ను నిమిరాడు. ఒక భిక్షువు లేత పచ్చిక పరకలు నోటికి అందించాడు.

కొద్దిసేపటికి అది తేరుకుంది. మెల్లగా నడక ప్రారంభించారు. అది బుద్ధుని వెనుక వస్తూ ఉంది. ప్రశాంతంగా ఉన్నారు అందరూ!

''భిక్షువులారా!'' అన్నాడు బుద్ధుడు. ''భంతే..!'' అన్నారు.

''**అప్రమత్తత చాలా అవసరం. మనల్ని సరైన దారిలో నడిపించే పెద్దల మాటలు వినాలి. వారు చూపిన ఉన్నతమైన మార్గంలో నడవాలి. అలా నడచిన వారు ప్రమాదాలకు లోను కారు. అజ్ఞానంతో, రాగ ద్వేష మోహాలకు లోనై తనని తాను అదుపు చేసుకోలేని వారు ఈ లేగ దూడలా దుఃఖమనే నదీప్రవాహంలో పడిపోతారు. వారిని ఎల్లవేళలా కాచి కాపాడే వారు ఉండరు. కాబట్టి ప్రతి మనిషీ తనని తాను నియంత్రించుకోవాలి. ధర్మాన్ని గ్రహించాలి. ఆచరణలో పెట్టాలి. ఈ ఆచరణ అనే అభ్యాసం వల్ల దుఃఖమనే నదిని ఈది అవతలి ఒడ్డుకు సులభంగా చేరే శక్తి వస్తుంది. బలం చేకూరుతుంది.**

సరైన గురువుని ఎంచుకుని, సరైన మార్గంలో నడిస్తే, దుఃఖమనే ప్రవాహాన్ని దాటి దుఃఖ రహిత తీరం చేరగలం. దీనికి శ్రద్ధ, సాధన అవసరం. శ్రద్ధ, సాధన వల్లే పశువులు నీటిలో ఈదగలిగాయి.'' అంటూ, తన పక్కనే నడుస్తున్న ఆవుదూడ తల నిమిరాడు.

''దుఃఖ సాగరాన్నుండి మనల్ని కాపాడే రక్షకుడు ఈ తథాగతుడే'' అనుకొని భిక్షువులందరూ వంగి–''బుద్ధం శరణం గచ్ఛామి'' అంటూ నమస్కరించారు.

– డా. బొర్రా గోవర్ధన్

సినిమా

వారి ప్రేమ, అభిమానం గొప్పవి

– నాగార్జున



● అనిల్ సుంకర, సాక్షీ వైద్య, నాగార్జున, అఖిల్, ఎర్రబెల్లి దయాకర్‌రావు, ఆరూరి రమేష్, సురేందర్ రెడ్డి

''అక్కినేని ఫ్యాన్స్ ప్రేమ, ప్రేక్షకుల అభిమానం ఎంతో గొప్పవి. అభిమానుల ఆదరణ లేకుంటే సినిమాలు హిట్ కావు. అఖిల్‌కి చిన్నప్పటి నుంచి కష్టపడే స్వభావం ఉంది. తనలో ఎంతో ఎనర్జీ ఉంది.. 'ఏజెంట్' సినిమాతో ఆ ఎనర్జీని సురేందర్ రెడ్డి బయటకు తీశాడు. ఈ సినిమా కచ్చితంగా హిట్ అవుతుంది'' అని హీరో నాగార్జున అన్నారు. అఖిల్, సాక్షీ వైద్య జంటగా సురేందర్ రెడ్డి దర్శకత్వంలో తెరకెక్కిన చిత్రం 'ఏజెంట్'. ఏకే ఎంటర్‌టైన్మెంట్స్, సురేందర్ రెడ్డి 2 పతాకాలపై అనిల్ సుంకర, రామబ్రహ్మం సుంకర నిర్మించిన ఈ సినిమా ఈ నెల 28న విడుదల కానుంది. ఈ సందర్భంగా ఆదివారం వరంగల్‌లో నిర్వహించిన 'ఏజెంట్' సినిమా ప్రీ రిలీజ్ వేడుకకి ముఖ్య అతిథిగా నాగార్జున హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ–''పోరాటాలకు అడ్డా... వీరత్వానికి ఇంటి పేరు వరంగల్. ఓ సినిమా బ్లాక్ బస్టర్ కావాలంటే ఏం కావాలో అవి సమకూర్చుకోవడంలో దర్శకుడు సురేందర్ రెడ్డి పేరు పొందారు. ఈ సినిమాను ఇంత గ్రాండ్‌గా తెరకెక్కించడంలో అనిల్ సుంకర, రామబ్రహ్మం సుంకర రాజీ పడలేదు. 'ఏజెంట్' సినిమాతో తెలుగు ఇండస్ట్రీకి పరిచయమవుతున్న సాక్షీ వైద్యకు మంచి భవిష్యత్తు ఉంటుంది. ఈ మూవీలో నటించేందుకు నటుడు మమ్ముట్టి ఒప్పుకోవడం గొప్ప విషయం. మా చిత్రం హిట్ చేస్తే మంత్రి దయాకర్‌రావుగారు చెప్పినట్లు మా ప్రతి సినిమా వేడుకకు తప్పకుండా వరంగల్‌కు వస్తాం. తెలుగు ప్రేక్షకులు గొప్పవాళ్లు.. మంచి సినిమాలను తప్పకుండా హిట్ చేస్తారు'' అన్నారు. తెలంగాణ రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు మాట్లాడుతూ–''షూటింగ్.. ఆడియో రిలీజ్.. ప్రీ రిలీజ్.. ఇలా ఏదో ఒక కార్యక్రమం వరంగల్‌లో నిర్వహించిన సినిమాలన్నీ హిట్ అయ్యాయి. ప్రీ రిలీజ్ వేడుక జరుపుకుంటున్న 'ఏజెంట్' కూడా విజయం సాధిస్తుంది'' అన్నారు. అఖిల్ మాట్లాడుతూ–''నా మైండ్‌లో ఒకటే ఉంది. 'ఏజెంట్' ని ఇంత హైలో పనిచేసిన తర్వాత నెక్ట్స్ ఏం చేయాలనే ప్రశ్న నాలో కలుగుతోంది'' అన్నారు. ఈ వేడుకలో వరంగల్ ఎంపీ పసునూరి దయాకర్, సాక్షీ వైద్య, సురేందర్ రెడ్డి, అనిల్ సుంకర, వరంగల్ మేయర్ గుండు సుధారాణి, వర్ధన్నపేట ఎమ్మెల్యే ఆరూరి రమేష్ పాల్గొన్నారు.

రాజమౌళి ఆ ఆత్మవిశ్వాసాన్ని ఇచ్చారు: మణిరత్నం



● 'దిల్' రాజు, విజయేంద్ర ప్రసాద్, విక్రమ్, కుమరన్, సుభాస్కరన్, కార్తీ, 'జయం' రవి, త్రిష, శోభిత, ఐశ్వర్యలక్ష్మి

''నేను ఇదివరకే చెప్పాను. మళ్లీ చెబుతున్నాను. రాజమౌళికి థ్యాంక్స్. ఎందుకంటే 'బాహుబలి' రెండు భాగాలుగా రాకపోయిఉంటే 'పొన్నియిన్ సెల్వన్'(పీఎస్)తెరకెక్కేది కాదు. ఈ విషయాన్ని రాజమౌళితో కూడా చెప్పాను.'పొన్నియిన్ సెల్వన్'ను రెండు భాగాలుగా తీసే దారిని తను చూపించాడు. చారిత్రాత్మక సినిమాలను తీసే ఆత్మవిశ్వాసాన్ని సినిమా ఇండస్ట్రీకి రాజమౌళి ఇచ్చా రు. భారదేశ చరిత్ర ఆధారంగా చాలామంది ఇప్పుడు సినిమాలు తీసేందుకు ప్రయత్నిస్తున్నారు'' అన్నారు డైరెక్టర్ మణిరత్నం. విక్రమ్, కార్తీ, 'జయం' రవి, ఐశ్వర్యారాయ్, త్రిష, ఐశ్వర్యలక్ష్మి ప్రధాన పాత్రల్లో మణిరత్నం దర్శకత్వంలో రూపొందిన తమిళ చిత్రం 'పొన్నియిన్ సెల్వన్'. సుభాస్కరన్, మణిరత్నం నిర్మించిన ఈ చిత్రంలోని రెండో భాగం 'పొన్నియిన్ సెల్వన్ 2' ఈ నెల 28న రిలీజ్ కానుంది. నిర్మాతలు 'దిల్' రాజు, శిరీష్‌లు ఈ చిత్రాన్ని తెలుగులో విడుదల చేస్తున్నారు. ఆదివారం హైదరాబాద్‌లో జరిగిన ఈ సినిమా ప్రీ రిలీజ్ వేడుకలో మణిరత్నం మాట్లాడుతూ– ''పొన్నియిన్ సెల్వన్' తీయడానికి కారణమైన సుభాస్కరన్, వాయిస్ ఓవర్ ఇచ్చిన చిరంజీవి, తెలుగులో సినిమాను రిలీజ్ చేస్తున్న 'దిల్'రాజుగార్లకు థ్యాంక్స్'' అన్నారు. ''నా గురువు మణిరత్నంతో మరో అద్భుతమైన ఎక్స్‌పీరియన్స్. 'ఆర్ఆర్ఆర్'కు ఆస్కార్ వచ్చినందుకు టీమ్‌కు శుభాకాంక్షలు'' అన్నారు విక్రమ్. ''ఒకేసారి రెండు విభాగాలు చిత్రీకరించి, తొలి భాగం రిలీజ్ చేసిన ఆరు నెలల తర్వాత రెండో భాగాన్ని రిలీజ్ చేస్తానన్న గుండె ధైర్యం ప్రపంచంలో ఎవరికీ లేదు. ఎవరూ రెండు విభాగాలను ఒకేసారి చిత్రీకరించలేదు. మణిరత్నంగారి ధైర్యానికి హ్యాట్సాఫ్'' అన్నారు 'జయం' రవి. ''భారతదేశ చరిత్ర తెలియాలని మణిరత్నంగారు ఈ సినిమా తీశారు''అన్నారు కార్తీ. ''పొన్నియిన్ సెల్వన్' మ్యాజికల్ వరల్డ్'' అన్నారు ఐశ్వర్యారాయ్. ''హైదరాబాద్ నాకు రెండో ఇల్లు'' అన్నారు త్రిష. ''పొన్నియిన్ సెల్వన్ పార్టు 2'లో అద్భుతం చూడబోతున్నాం'' అన్నారు 'దిల్' రాజు. ఈ కార్యక్రమంలో శోభిత, ఐశ్వర్యాలక్ష్మి, ప్రముఖ రచయిత, దర్శకుడు విజయేంద్ర ప్రసాద్, సుహాసినీ మణిరత్నం, లైకా ప్రొడక్షన్స్ హెడ్ తమిళ కుమరన్, లైకా డిప్యూటీ చైర్మన్ ప్రేమ్ పాల్గొన్నారు.



● ఐశ్వర్యారాయ్

ప్రేక్షకుల సవాల్‌కి జవాబే విరూపాక్ష

– సాయిధరమ్ తేజ్

''గత ఏడాది కొన్ని సినిమాలకు ప్రేక్షకులు సరిగ్గా రాలేదు. మమ్మల్ని థియేటర్స్‌కు రప్పించే సినిమాలు తీస్తేనే వస్తామంటూ ఆడియన్స్ ఓ చాలెంజ్ విసిరారు. ఆ సవాల్‌కి జవాబే 'విరూపాక్ష'' అని హీరో సాయిధరమ్ తేజ్ అన్నారు. కార్తీక్ దండు దర్శకత్వంలో సాయిధరమ్ తేజ్, సంయుక్తా మీనన్ జంటగా నటించిన చిత్రం 'విరూపాక్ష'.



● కార్తీక్, బీవీఎస్ఎన్ ప్రసాద్, సాయిధరమ్ తేజ్, సంయుక్త

బాపినీడు బి.సమర్పణలో బీవీఎస్ఎన్ ప్రసాద్ నిర్మించారు. డైరెక్టర్ సుకుమార్ స్క్రీన్ ప్లే అందించిన ఈ సినిమా గత శుక్రవారం (ఏప్రిల్ 21) విడుదలైంది. ఈ సందర్భంగా నిర్వహించిన సక్సెస్ మీట్‌లో సాయిధరమ్ తేజ్ మాట్లాడుతూ–''విరూపాక్ష' విజయం నాదో, మా టీమ్‌దో కాదు.. మన ప్రేక్షకులది. మన ఇండస్ట్రీకి ఈ చిత్రం బ్లాక్ బస్టర్ సక్సెస్ ఇచ్చింది. పాన్ ఇండియా స్థాయిలో ఈ సినిమాను తీసుకెళ్లటానికి ప్లాన్ చేస్తున్నాం'' అన్నారు. ''విరూపాక్ష'ని హిట్ చేసిన ఆడియన్స్‌కి థ్యాంక్స్'' అన్నారు కార్తీక్ దండు. ''ఈ మూవీలో నా పాత్రకి వస్తున్న స్పందనకు కారణం కార్తీక్‌గారే'' అన్నారు సంయుక్తా మీనన్. ''ఈ సినిమాని ఆదరిస్తున్న తెలుగు ప్రేక్షకులకు థ్యాంక్స్'' అన్నారు డైరెక్టర్ మారుతి. ''విరూపాక్ష' ని అందరూ థియేటర్‌లోనే చూడండి.. గొప్ప అనుభూతి వస్తుంది'' అన్నారు దర్శకుడు గోపీచంద్ మలినేని. ఈ కార్యక్రమంలో మ్యూజిక్ డైరెక్టర్ అజనీష్ లోక్‌నాథ్, కెమెరామేన్ శ్యామ్ దత్, నటీనటులు సోనియా సింగ్, సాయిచంద్, అజయ్, కమల్ కామరాజు బ్రహ్మాజీ, రవికృష్ణ పాల్గొన్నారు.

మూడోసారి



● విశాల్, హరి

హీరో విశాల్, దర్శకుడు హరి కాంబినేషన్‌లో ముచ్చటగా మూడో సినిమా షురూ అయింది. 'పూజై'(2014), 'తామిరభరణి' (2017) వంటి హిట్ చిత్రాల తర్వాత వీరి కాంబినేషన్‌లో రూపొందుతోన్న సినిమా ప్రారంభోత్సవం చెన్నైలో జరిగింది. కార్తికేయన్ సతానం, జీ స్టూడియోస్ ఈ సినిమాను నిర్మిస్తున్నాయి. ''యాక్షన్ ఎంటర్‌టైనర్‌గా ఈ చిత్రం రూపొందనుంది. విశాల్ కెరీర్‌లో ఇది 34వ సినిమా. త్వరలోనే ఈ మూవీ రెగ్యులర్ షూటింగ్ ఆరంభం కానుంది'' అన్నారు.

టీజర్ ఆసక్తిగా ఉంది

– సురేశ్ బాబు



● విజయ్, సప్తగిరి, జీవన్, సురేశ్‌బాబు, సోమసుందరం

''మన్యంరాజు' టీజర్ చాలా ఆసక్తిగా ఉంది. సినిమా చూడాలనే కుతూహలాన్ని రేపుతోంది. ఈ చిత్రం హిట్ అయి, యూనిట్‌కి మరిన్ని అవకాశాలు తీసుకురావాలి'' అని నిర్మాత డి.సురేశ్ బాబు అన్నారు. జీవన్, బేబీ పరిణిక జంటగా బీయమ్ సోము సుందరం దర్శకత్వంలో తెరకెక్కిన చిత్రం 'మన్యంరాజు'. వాయుపుత్ర ఆర్ట్స్‌పై విజయ్ బాబు, వై.ప్రవీణ్, పుష్పలత.బి నిర్మించిన ఈ సినిమా టీజర్‌ని సురేశ్ బాబు రిలీజ్ చేశారు. బీయమ్ సోము సుందరం మాట్లాడుతూ–''వైవిధ్యమైన కథాంశంతో రూపొందిన చిత్రం ఇది'' అన్నారు. ''నాకు అవకాశం ఇచ్చిన డైరెక్టర్, నిర్మాతలకు థ్యాంక్స్'' అన్నారు జీవన్. ''మే లో సినిమా విడుదలకి సన్నాహాలు చేస్తున్నాం'' అన్నారు నిర్మాతలు. ఈ కార్యక్రమంలో పరిపూర్ణానంద స్వామి, ఎంపీ, నిర్మాత ఎంవీవీ సత్యనారాయణ, నటుడు సప్తగిరి తదితరులు పాల్గొన్నారు.

తలరాతను మార్చే విద్యార్థి

చేతన్ చీను, బన్నీవోక్స్ జంటగా మధు మాదాసు దర్శకత్వంలో తెరకెక్కిన చిత్రం 'విద్యార్థి'. మహాస్ క్రియేషన్స్ పతాకంపై ఆళ్ల వెంకట్ నిర్మించిన ఈ సినిమా ఈ నెల 29న రిలీజ్ కానుంది. ఈ చిత్రం కాన్సెప్ట్ పోస్టర్‌ను నిర్మాత డీఎస్ రావు విడుదల చేసి, మాట్లాడుతూ–''ఆద్యంతం ఉత్కంఠగా సాగే చిత్రం ఇది. ఈ సినిమాపై నమ్మకంతో విడుదల చేస్తున్నాను'' అన్నారు. మధు మాదాసు మాట్లాడుతూ–''దర్శకుడిగా నా తొలి చిత్రం 'విద్యార్థి'. సింగిల్ షెడ్యూల్‌లో సినిమా పూర్తి చేశాం. అయితే కరోనా వల్ల సినిమా విడుదల ఆలస్యమైంది'' అన్నారు. ''ప్రతి ప్రాంతంలో జరిగే ఓ అంశాన్ని తీసుకుని ఈ చిత్ర కథ రాశారు మధు మాదాసు. మా యూనిట్ అందరి తలరాతను 'విద్యార్థి' మారుస్తుందనే నమ్మకం ఉంది'' అన్నారు చేతన్ చీను. డైరెక్టర్ ఏఎస్ రవికుమార్ చౌదరి పాల్గొన్నారు. ఈ చిత్రానికి కెమెరా: కన్న పీసీ, సహ నిర్మాత: రామకృష్ణ రాజేటి, లైన్ ప్రొడ్యూసర్: వంశీ తాడికొండ.



● వెంకట్, చేతన్ చీను, ఏఎస్ రవికుమార్, మధు మాదాసు

యాక్షన్ డ్రామా



● శేఖర్, వైభవి

శేఖర్ అయాన్ వర్మ, వైభవి రావ్ జంటగా ఓ.సాయి దర్శకత్వంలో రూపొందిన చిత్రం 'కళ్యాణమస్తు'. బోయపాటి రఘుబాబు నిర్మించిన ఈ లవ్ అండ్ యాక్షన్ డ్రామా మే 12న రిలీజ్ కానుంది. ఈ చిత్రంలోని 'వేసవి కాలం..' అనే పాట లిరికల్ వీడియోను రిలీజ్ చేశారు మేకర్స్. ఆర్.ఆర్.ధ్రువన్ సంగీతం అందించారు. అలరాజు సాహిత్యం అందించిన ఈ పాటను యాజిన్ నజీర్, అదితి భావరాజు పాడారు. ఈ సినిమాకు కెమెరా: మల్లికార్జున్ నారగని.



సచిన్ టెండూల్కర్ 'ఫిఫ్టీ'

భారత క్రికెట్ దిగ్గజం సచిన్ టెండూల్కర్ నేడు 50వ పడిలోకి అడుగుపెట్టాడు. పదేళ్ల క్రితం అంతర్జాతీయ క్రికెట్ నుంచి రిటైర్మెంట్ తీసుకున్న సచిన్ ప్రస్తుతం ఐపీఎల్‌లో ఐదుసార్లు చాంపియన్ ముంబై ఇండియన్స్ జట్టుకు మెంటార్‌గా వ్యవహరిస్తున్నాడు. ప్లేయర్ హోదాలో ఐపీఎల్ టోర్నీలో ముంబై ఇండియన్స్ జట్టుకు ప్రాతినిధ్యం వహించిన సచిన్ ఆటకు వీడ్కోలు పలికాక అదే జట్టుతో కొనసాగుతున్నాడు. 1989లో అంతర్జాతీయ క్రికెట్‌లో అరంగేట్రం చేసిన సచిన్ ఎన్నో రికార్డులు సృష్టించాడు. 200 టెస్టులు ఆడిన ఈ ముంబైకర్ 51 సెంచరీలు, 68 అర్ధ సెంచరీలతో 15,921 పరుగులు చేశాడు. 463 వన్డేలు ఆడిన సచిన్ 49 సెంచరీలు, 96 అర్ధ సెంచరీలతో 18,426 పరుగులు సాధించాడు. కెరీర్‌లో ఒకే ఒక టి20 మ్యాచ్ ఆడిన సచిన్ పది పరుగులు చేసి అవుటయ్యాడు. టెస్టుల్లో 46 వికెట్లు, వన్డేల్లో 154 వికెట్లు, టి20ల్లో ఒక వికెట్ పడగొట్టిన సచిన్ కెరీర్ మొత్తంలో 20 సార్లు 'ప్లేయర్ ఆఫ్ ద సిరీస్' అవార్డులు గెల్చుకున్నాడు. వన్డేల్లో ఒకే ఏడాది అత్యధిక పరుగులు చేసిన బ్యాటర్ రికార్డు కూడా సచిన్ పేరిటే ఉంది. 1998లో 34 వన్డేలు ఆడి 9 సెంచరీలు, 7 అర్ధ సెంచరీలతో కలిపి 1894 పరుగులు చేశాడు.

భళా బెంగళూరు

వీకెండ్ మ్యాచ్‌లు 'ఎండ్'దాకా వచ్చి అమాంతం ఉత్కంఠ రేపుతున్నాయి. బెంగళూరు, రాజస్తాన్‌లు కూడా ఆఖరిదాకా పోరాడాయి. కానీ హర్షల్ పటేల్ తొలి మూడు బంతులు రాయల్ చాలెంజర్స్ శిబిరాన్ని డీలా పరిస్తే... తర్వాతి మూడు బంతులు విజయానికి ఊపిరి పోశాయి.

- రాజస్తాన్‌పై 7 పరుగులతో గెలుపు
- ఉత్కంఠభరిత పోరులో ఆర్‌సీబీదే విక్టరీ
- డుప్లెసిస్, మ్యాక్స్‌వెల్ మెరుపులు
- హర్షల్ పటేల్‌కు మూడు వికెట్లు



మ్యాక్స్‌వెల్

బెంగళూరు: ఐపీఎల్‌లో విరాట్ కోహ్లి జట్టు గర్జిస్తోంది. బ్యాటింగ్‌లో మెరుపులకు బౌలింగ్‌లో నిప్పులు చెరిగే బంతులు జతవడంతో రాయల్ చాలెంజర్స్ బెంగళూరు (ఆర్‌సీబీ) 7 పరుగుల తేడాతో రాజస్తాన్ రాయల్స్‌పై గెలిచింది. మొదట బెంగళూరు 20 ఓవర్లలో 9 వికెట్లకు 189 పరుగులు చేసింది. గత మ్యాచ్ ఫార్ములాతోనే రెగ్యులర్ కెప్టెన్ డుప్లెసిస్ (39 బంతుల్లో 62; 8 ఫోర్లు, 2 సిక్స్‌లు) 'ఇంపాక్ట్' చూపాడు. 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' మ్యాక్స్‌వెల్ (44 బంతుల్లో 77; 6 ఫోర్లు, 4 సిక్సర్లు) తన శైలి ధాటి కొనసాగించాడు. బౌల్ట్, సందీప్ శర్మ చెరో 2 వికెట్లు తీశారు. తర్వాత గెలుపు తీరందాకా వచ్చిన రాజస్తాన్ 20 ఓవర్లలో 6 వికెట్లకు 182 పరుగులే చేసి ఓడింది. డుప్లెసిస్‌కు 'ఇంపాక్ట్ ప్లేయర్'గా వచ్చిన బౌలర్ హర్షల్ పటేల్ (3/32) బెంగళూరు జట్టుకు ఉపయోగపడ్డాడు.

ఇద్దరి తీరు దంచికొట్టుడే!



డుప్లెసిస్

ఆర్‌సీబీ ఇన్నింగ్స్‌ను నడిపించింది... మెరిపించింది... మురిపించింది ఇద్దరే! ఓపెనర్ డుప్లెసిస్, మిడిలార్డర్‌లో మ్యాక్స్‌వెల్ కలిసి మెలిసి దంచేశారు. జట్టు ఖాతా తెరవకముందే కెప్టెన్‌గా కోహ్లి (0) డకౌటైతే... డుప్లెసిస్ 'ఇంపాక్ట్'కు మ్యాక్సీ డబుల్ డోసు ఇచ్చాడు. వన్‌డౌన్‌లో దిగిన షహబాజ్ (2) కూడా నిరాపరిచిన బెంగళూరు ఇన్నింగ్స్ 12 పరుగులకే 2 వికెట్లను కోల్పోయింది. కానీ ఆ తర్వాత 11 ఓవర్ల పైచిలుకు వరకు కూడా వారిద్దరి ప్రతాపమే స్కోరును హోరెత్తించింది. మ్యాక్సీ 27 బంతుల్లో ఫిఫ్టీ కొడితే, డుప్లెసిస్ 31 బంతుల్లో పూర్తి చేసుకున్నాడు. ఇద్దరు కలిసి మూడో వికెట్‌కు 127 పరుగులు జతచేశారు. ఆ తర్వాత వచ్చినవారెవరూ పెద్దగా ఆడలేదు. కాసేపైన నిలువలేదు.

పడిక్కల్ రాణించినా... అశ్విన్ వణికించినా...



హర్షల్

భారీలక్ష్యం ముందుంటే 'హిట్టర్' బట్లర్ (0) సిరాజ్ బౌలింగ్ క్లీన్‌బౌల్డ్ అయ్యాడు. యశస్వి, ఇంపాక్ట్ ప్లేయర్ దేవదత్ పడిక్కల్ లక్ష్యానికి తగ్గ జోరుతో స్కోరును పెంచారు. పడిక్కల్ 30 బంతుల్లో అర్ధ సెంచరీ చేసుకున్నాక... జట్టు స్కోరు వందకు ముందు అతను, వంద పరుగుల తర్వాత యశస్వి అవుటయ్యారు. అయితే సంజూ సామ్సన్ (15 బంతుల్లో 22; 2 ఫోర్లు, 1 సిక్స్), ధ్రువ్ జురెల్ (16 బంతుల్లో 34 నాటౌట్; 2 ఫోర్లు, 2 సిక్సర్లు) ఆడిన ఆటతో పోటీ ఆఖరిదాకా వచ్చింది. చివరి ఓవర్లో 20 పరుగులు చేయాల్సి ఉండగా.. అశ్విన్ (12) తొలి మూడు బంతుల్లో 4, 2, 4తో 10 పరుగులతో వణికించాడు. అయితే తర్వాతి మూడు బంతుల్లో హర్షల్... అశ్విన్ వికెట్, 1, 1తో ముగించడంతో ఆర్‌సీబీ ఊపిరి పీల్చుకుంది.

స్కోరు వివరాలు

రాయల్ చాలెంజర్స్ బెంగళూరు ఇన్నింగ్స్: కోహ్లి (ఎల్బీడబ్ల్యూ) (బి) బౌల్ట్ 0; డుప్లెసిస్ (రనౌట్) 62; షహబాజ్ (సి) యశస్వి (బి) బౌల్ట్ 2; మ్యాక్స్‌వెల్ (సి) హోల్డర్ (బి) అశ్విన్ 77; మహిపాల్ (సి) పడిక్కల్ (బి) చహల్ 8; దినేశ్ కార్తీక్ (సి) బట్లర్ (బి) సందీప్ శర్మ 16; సుయశ్ ప్రభుదేశాయ్ (రనౌట్) 0; హసరంగ (రనౌట్) 6; విల్లీ (నాటౌట్) 4; వైశాక్ (సి) హెట్‌మైర్ (బి) సందీప్ శర్మ 0; సిరాజ్ (నాటౌట్) 1; ఎక్స్‌ట్రాలు 13; **మొత్తం (20 ఓవర్లలో 9 వికెట్లకు) 189.** **వికెట్ల పతనం:** 1-0, 2-12, 3-139, 4-156, 5-163, 6-163, 7-180, 8-184, 9-184. **బౌలింగ్:** బౌల్ట్ 4-0-41-2, సందీప్ శర్మ 4-0-49-2, అశ్విన్ 4-0-36-1, చహల్ 4-0-28-1, హోల్డర్ 4-0-32-0.

రాజస్తాన్ రాయల్స్ ఇన్నింగ్స్: యశస్వి జైస్వాల్ (సి) కోహ్లి (బి) హర్షల్ పటేల్ 47; జోస్ బట్లర్ (బి) సిరాజ్ 0; దేవదత్ పడిక్కల్ (సి) కోహ్లి (బి) విల్లీ 52; సంజూ సామ్సన్ (సి) షహబాజ్ (బి) హర్షల్ పటేల్ 22; హెట్‌మైర్ (రనౌట్) 3; ధ్రువ్ జురెల్ (నాటౌట్) 34; అశ్విన్ (సి) ప్రభుదేశాయ్ (బి) హర్షల్ పటేల్ 12; అబ్దుల్ బాసిత్ (నాటౌట్) 1; ఎక్స్‌ట్రాలు 11; **మొత్తం (20 ఓవర్లలో 6 వికెట్లకు) 182.** **వికెట్ల పతనం:** 1-1, 2-99, 3-108, 4-125, 5-155, 6-180. **బౌలింగ్:** సిరాజ్ 4-0-39-1, విల్లీ 4-0-26-1, వైశాక్ 2-0-24-0, మ్యాక్స్‌వెల్ 2-0-25-0, హర్షల్ పటేల్ 4-0-32-3, హసరంగ 4-0-32-0.

రఫ్ఫాడించిన రహానే...

- 29 బంతుల్లో 6 ఫోర్లు, 5 సిక్స్‌లతో 71 నాటౌట్
- కాన్వే, శివమ్ దూబే అర్ధ సెంచరీలు
- కోల్‌కతాపై చెన్నై ఘనవిజయం



'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' రహానే

కోల్‌కతా: సాధారణంగా టీవీ బ్రాడ్‌కాస్టర్లు ఒక ఇన్నింగ్స్ ముగిశాక, లేదంటే మ్యాచ్ పూర్తయ్యాక మొత్తమ్మీద ఐదారు నిమిషాలు హైలైట్స్ చూపిస్తారు. కానీ ఈ మ్యాచ్‌లో అజింక్య రహానే తను ఆడుతున్నంతసేపూ హైలైట్స్ చూపాడు. వన్నె తగ్గిన ఈ వెటరన్ తనలో దంచేసే సత్తా ఇంకా తగ్గలేదని సుడిగాలి ఇన్నింగ్స్ (29 బంతుల్లో 71 నాటౌట్; 6 ఫోర్లు, 5 సిక్సర్లు)తో నిరూపించాడు. దీంతో చెన్నై సూపర్‌కింగ్స్ 49 పరుగుల తేడాతో కోల్‌కతా నైట్‌రైడర్స్‌పై విజయం సాధించింది. ముందుగా సూపర్‌కింగ్స్ 20 ఓవర్లలో 4 వికెట్లు కోల్పోయి 235 పరుగుల భారీస్కోరు చేసింది. శివమ్ దూబే (21 బంతుల్లో 50; 2 ఫోర్లు, 5 సిక్స్‌లు), కాన్వే (40 బంతుల్లో 56; 4 ఫోర్లు, 3 సిక్స్‌లు) కూడా అర్ధ సెంచరీలు చేశారు. కష్టమైన లక్ష్యఛేదనకు దిగిన కోల్‌కతా 20 ఓవర్లలో 8 వికెట్ల నష్టానికి 186 పరుగులే చేయగలిగింది. జట్టు స్కోరు 1 పరుగుకే ఓపెనర్లు నరైన్ (0), జగదీశన్ (1)లు... కాసేపటికి వెంకటేశ్ (20), నితీశ్ రాణా (27) అవుటవడంతో నైట్‌రైడర్స్ లక్ష్యానికి దూరమైంది. జేసన్ రాయ్ (26 బంతుల్లో 61; 5 ఫోర్లు, 5 సిక్స్‌లు), రింకూ సింగ్ (33 బంతుల్లో 53 నాటౌట్; 3 ఫోర్లు, 4 సిక్సర్లు) భారీ షాట్లతో అలరించారు. చెన్నై బౌలర్లలో తుషార్, తీక్షణలకు రెండేసి వికెట్లు దక్కాయి.

స్కోరు వివరాలు

చెన్నై సూపర్ కింగ్స్ ఇన్నింగ్స్: రుతురాజ్ (బి) సుయశ్ శర్మ 35; కాన్వే (సి) వీస్ (బి) వరుణ్ చక్రవర్తి 56; రహానే (నాటౌట్) 71; శివమ్ దూబే (సి) జేసన్ రాయ్ (బి) ఖెజ్రోలియా 50; జడేజా (సి) రింకూ సింగ్ (బి) ఖెజ్రోలియా 18; ధోని (నాటౌట్) 2; ఎక్స్‌ట్రాలు 3; **మొత్తం (20 ఓవర్లలో 4 వికెట్లకు) 235.** **వికెట్ల పతనం:** 1-73, 2-109, 3-194, 4-232. **బౌలింగ్:** ఉమేశ్ 3-0-35-0, వీస్ 3-0-38-0, వరుణ్ 4-0-49-1, కుల్వంత్ ఖెజ్రోలియా 3-0-44-2, నరైన్ 2-0-23-0, సుయశ్ శర్మ 4-0-29-1, రసెల్ 1-0-17-0.

కోల్‌కతా నైట్‌రైడర్స్ ఇన్నింగ్స్: జగదీశన్ (సి) జడేజా (బి) తుషార్ 1; నరైన్ (బి) ఆకాశ్ సింగ్ 0; వెంకటేశ్ అయ్యర్ (ఎల్బీడబ్ల్యూ) (బి) మొయిన్ అలీ 20; నితీశ్ రాణా (సి) రుతురాజ్ (బి) జడేజా 27; జేసన్ రాయ్ (బి) తీక్షణ 61; రింకూ సింగ్ (నాటౌట్) 53; రసెల్ (సి) శివమ్ దూబే (బి) పతిరణ 9; వీస్ (ఎల్బీడబ్ల్యూ) (బి) తుషార్ 1; ఉమేశ్ (సి) కాన్వే (బి) తీక్షణ 4; వరుణ్ (నాటౌట్) 0; ఎక్స్‌ట్రాలు 10; **మొత్తం (20 ఓవర్లలో 8 వికెట్లకు) 186.** **వికెట్ల పతనం:** 1-1, 2-1, 3-46, 4-70, 5-135, 6-162, 7-171, 8-180. **బౌలింగ్:** ఆకాశ్ 4-0-29-1, తుషార్ 4-0-43-2, తీక్షణ 4-0-32-2, మొయిన్ అలీ 1-0-20-1, జడేజా 3-0-34-1, పతిరణ 4-0-27-1.

ఐపీఎల్ పాయింట్ల పట్టిక

జట్టు	ఆ	గె	ఓ	పా	నె.ర.
చెన్నై	7	5	2	10	0.662
రాజస్తాన్	7	4	3	8	0.844
లక్నో	7	4	3	8	0.547
గుజరాత్	6	4	2	8	0.212
బెంగళూరు	7	4	3	8	-0.008
పంజాబ్	7	4	3	8	-0.162
ముంబై	6	3	3	6	-0.254
కోల్‌కతా	7	2	5	4	-0.186
హైదరాబాద్	6	2	4	4	-0.794
ఢిల్లీ	6	1	5	2	-1.183

నోట్: ఆ-ఆడినవి, గె-గెలిచినవి, ఓ-ఓడినవి, పా-పాయింట్లు, నె.ర.-నెట్ రన్‌రేట్

ఐపీఎల్‌లో నేడు

హైదరాబాద్ x ఢిల్లీ (రాత్రి గం. 7:30 నుంచి)

స్టార్ స్పోర్ట్స్, జియో సినిమాలో ప్రత్యక్ష ప్రసారం

ధీరజ్ గురి అదిరె...

- రజత, కాంస్య పతకాలు నెగ్గిన ఆంధ్రప్రదేశ్ ప్లేయర్
- ప్రపంచకప్ ఆర్చరీ టోర్నీ



అంటాల్యా (తుర్కియే): అంచనాలకు మించి రాణించిన ఆంధ్రప్రదేశ్ యువ ఆర్చర్ ధీరజ్ బొమ్మదేవర ప్రపంచకప్ ఆర్చరీ స్టేజ్-1 టోర్నీలో రెండు పతకాలతో మెరిశాడు. తొలిసారి ప్రపంచకప్ టోర్నీలో ఆడుతున్న 21 ఏళ్ల ధీరజ్ పురుషుల రికర్వ్ టీమ్ విభాగంలో అతాను దాస్, తరుణ్‌దీప్ రాయ్‌లతో కలిసి రజత పతకం ... వ్యక్తిగత విభాగంలో కాంస్య పతకాన్ని సొంతం చేసుకున్నాడు. పురుషుల టీమ్ ఫైనల్లో ధీరజ్, అతాను దాస్, తరుణ్‌దీప్ రాయ్ బృందం 4-5తో లీ జాంగ్‌యువాన్, కి జింగ్‌షువో, వె షావోజువాన్‌లతో కూడిన చైనా జట్టు చేతిలో ఓడింది. వ్యక్తిగత విభాగం కాంస్య పతక మ్యాచ్‌లో ధీరజ్ 7-3తో ఇల్ఫాత్ అబ్దులిన్ (కజకిస్తాన్)పై గెలిచాడు. సెమీస్‌ఫైనల్లో ధీరజ్ 4-6తో డాన్ ఒలారు (మాల్డోవా) చేతిలో ఓడిపోయాడు.

మళ్లీ రెజ్లర్ల ధర్నా

న్యూఢిల్లీ: భారత స్టార్ రెజ్లర్లు బజరంగ్, వినేశ్ ఫొగాట్, సాక్షి మలిక్ మళ్లీ ధర్నాకు దిగారు. మేరీకోమ్ కమిటీ నివేదిక బహిర్గతం చేయాలని, లైంగిక వేధింపులకు గురైన మహిళా రెజ్లర్లకు న్యాయం చేయాలని 'జంతర్ మంతర్' వద్ద చేపట్టిన ధర్నాలో డిమాండ్ చేశారు. భారత రెజ్లింగ్ సమాఖ్య చీఫ్, బీజేపీ ఎంపీ బ్రిజ్‌భూషణ్ శరణ్ సింగ్ రెజ్లర్లపై వేధింపులకు పాల్పడుతున్నారని ఆరోపిస్తూ గత జనవరిలో రెజ్లర్లు కొన్ని రోజులపాటు ధర్నాకు దిగారు. కేంద్ర క్రీడా మంత్రి అనురాగ్ ఠాకూర్ వారితో చర్చలు జరిపి మేరీకోమ్ నేతృత్వంలో ఆరుగురు సభ్యుల కమిటీతో విచారణ జరిపించింది. ఇటీవల కమిటీ నివేదిక క్రీడాశాఖకు సమర్పించినా దీన్ని బహిర్గతం చేయకపోవడం, చర్యలు తీసుకోకపోవడంతో రెజ్లర్లు మళ్లీ రోడ్డెక్కారు.

భవిత

ఉజ్వల కెరీర్‌కు కళాత్మక కోర్సులు

ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం కడపలోని డాక్టర్ వైఎస్ఆర్ ఆర్కిటెక్చర్ అండ్ ఫైన్ ఆర్ట్స్ యూనివర్సిటీ(డా.వైఎస్ఆర్ఏఎఫ్‌యూ).. వివిధ ఫైన్ ఆర్ట్స్, డిజైన్ కోర్సులను అందిస్తోంది. వీటిల్లో 2023-24 విద్యాసంవత్సరానికి ప్రవేశాల కోసం ఏపీ ఉన్నత విద్యామండలి.. ఆర్ట్ అండ్ డిజైన్ కామన్ ఎంట్రన్స్ టెస్ట్(ఏడీసెట్)-2023 నోటిఫికేషన్ విడుదల చేసింది. ఆ వివరాలు..

- **అందించే కోర్సులు:** బ్యాచిలర్ ఆఫ్ డిజైన్(ఇంటీరియర్ డిజైన్), బ్యాచిలర్ ఆఫ్ ఫైన్ ఆర్ట్స్(బీఎఫ్ఏ) ఇన్ పెయింటింగ్/స్కల్ప్చర్/యానిమేషన్/అప్లయిడ్ ఆర్ట్స్/ఫోటోగ్రఫీ.
- **అర్హత:** 10+2 లేదా ఇంటర్మీడియేట్(ఎంపీసీ/ఎంఈసీ/బైపీసీ/ఎంబైపీసీ/సీఈసీ/హెచ్ఈసీ) లేదా తత్సమాన ఉత్తీర్ణత ఉండాలి.
- **రాత పరీక్ష ఇలా:** ఏడీసెట్‌లో పొందిన ర్యాంక్ ఆధారంగా ప్రవేశం కల్పిస్తారు. బీఎఫ్ఏ, బీడిజైన్ కోర్సుల్లో ప్రవేశాల కోసం ఒకే ఉమ్మడి ప్రశ్నపత్రం ఉంటుంది. ఆన్‌లైన్(సీబీటీ) విధానంలో ఆబ్జెక్టివ్ పద్ధతిలో పరీక్షను నిర్వహిస్తారు. 100 ప్రశ్నలు-100 మార్కులకు పరీక్ష ఉంటుంది. పరీక్ష సమయం 120 నిమిషాలు. తెలుగు, ఇంగ్లిష్ మాధ్యమాల్లో ప్రశ్నపత్రం ఉంటుంది.
- **సిలబస్:** జనరల్ నాలెడ్జ్, ఆర్ట్స్ అండ్ కమ్యూనికేషన్ స్కిల్స్, అప్లయిడ్ ఆర్ట్స్‌లో టెక్నికల్ డిటైల్స్, పెయింటింగ్, స్కల్ప్చర్, యానిమేషన్, ఫోటోగ్రఫీ, ఆర్ట్ హిస్టరీ, డిజైన్ స్కిల్స్ అంశాల నుంచి ప్రశ్నలు అడుగుతారు.
- **కెరీర్:** ఈ కోర్సులు పూర్తి చేసుకున్న వారికి విస్తృత అవకాశాలు లభిస్తున్నాయి. ఆర్ట్ స్టూడియోలు, అడ్వర్టైజింగ్ కంపెనీలు, గ్రాఫిక్, ప్రింటింగ్, పబ్లిషింగ్, ఫ్యాషన్ సంస్థలు, ఎల్రక్టానిక్ ఇండస్ట్రీ, టెక్స్‌టైల్ ఇండస్ట్రీ, ఫిల్మ్ అండ్ థియేటర్, మల్టీమీడియా, యానిమేషన్ తదితర సంస్థల్లో ఉద్యోగావకాశాలను సొంతం చేసుకోవచ్చు. ఆర్ట్ గ్యాలరీల్లో వీరు తమ ప్రతిభను చాటవచ్చు. ఫ్రీలాన్సింగ్, స్వయం ఉపాధి(వర్క్‌షాపు నడపడం) ద్వారా ఎక్కువ మొత్తంలో సంపాదించుకునే అవకాశముంది. ఎండోమెంట్, ఆర్కియాలజికల్ విభాగాల్లోనూ అవకాశాలు దక్కించుకోవచ్చు.

ముఖ్యసమాచారం ఏడీసెట్-2023

- **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా
- **దరఖాస్తులకు చివరి తేదీ:** 20.05.2023
- **ఆలస్య రుసుముతో దరఖాస్తుకు చివరి తేదీ:** 28.05.2023
- **హాల్‌టికెట్ డౌన్‌లోడింగ్:** 31.05.2023
- **వెబ్‌సైట్ :** https://cets.apsche.ap.gov.in/ADCET

విద్య, ఉద్యోగ సమాచారం

కంబైన్డ్ మెడికల్ సర్వీసెస్ పరీక్ష-2023

యూనియన్ పబ్లిక్ సర్వీస్ కమిషన్(యూపీఎస్సీ).. వివిధ విభాగాల్లో మెడికల్ ఆఫీసర్/జీడీఎంవో పోస్టుల భర్తీకి సంబంధించి కంబైన్డ్ మెడికల్ సర్వీసెస్ ఎగ్జామినేషన్-2023 నోటిఫికేషన్ విడుదల చేసింది. » **మొత్తం పోస్టుల సంఖ్య:** 1261

పోస్టుల వివరాలు

» **కేటగిరీ-1:** మెడికల్ ఆఫీసర్స్ గ్రేడ్(జనరల్ డ్యూటీ మెడికల్ ఆఫీసర్స్ సబ్-క్యాడర్ ఆఫ్ సెంట్రల్ హెల్త్ సర్వీస్)-584.

» **కేటగిరీ-2:** అసిస్టెంట్ డివిజనల్ మెడికల్ ఆఫీసర్(రైల్వే)-300, జనరల్ డ్యూటీ మెడికల్ ఆఫీసర్(న్యూఢిల్లీ మున్సిపల్ కౌన్సిల్)-01, జనరల్ డ్యూటీ మెడికల్ ఆఫీసర్ గ్రేడ్-2(ఢిల్లీ మున్సిపల్ కార్పొరేషన్)-376.

» **అర్హత:** ఎంబీబీఎస్ ఉత్తీర్ణులవ్వాలి. **వయసు:** 01.08.2023 నాటికి 32 ఏళ్లు మించకూడదు.

» **ఎంపిక విధానం:** రాతపరీక్ష(500 మార్కులు), ఇంటర్వ్యూ/పర్సనాలిటీ టెస్ట్(100 మార్కులు), డాక్యుమెంట్ వెరిఫికేషన్, మెడికల్ ఎగ్జామినేషన్ ఆధారంగా ఎంపికచేస్తారు.

» **తెలుగు రాష్ట్రాల్లోని పరీక్ష కేంద్రాలు:** హైదరాబాద్, విశాఖపట్నం, తిరుపతి.

» **దరఖాస్తులకు చివరి తేదీ:** 09.05.2023.

» **వెబ్‌సైట్:** www.upsc.gov.in

ఐఈఎస్/ఐఎస్ఎస్ఈ-2023 పరీక్ష

యూనియన్ పబ్లిక్ సర్వీస్ కమిషన్(యూపీఎస్సీ).. ఎకనామిక్స్ /స్టాటిస్టికల్ సర్వీసుల్లో జూనియర్ టైం స్కేల్ పోస్టుల భర్తీకి సంబంధించి ఇండియన్ ఎకనామిక్ సర్వీస్(ఐఈఎస్)/ఇండియన్ స్టాటిస్టికల్ సర్వీస్ ఎగ్జామినేషన్ (ఐఎస్ఎస్ఈ)-2023 నిర్వహిస్తోంది. అర్హులైన అభ్యర్థులు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి.

» **మొత్తం పోస్టుల సంఖ్య:** 51

» **పోస్టుల వివరాలు:** ఇండియన్ ఎకనామిక్ సర్వీస్-18, ఇండియన్ స్టాటిస్టికల్ సర్వీస్-33.

» **అర్హత:** ఎకనామిక్ సర్వీసుకు పీజీ(ఎకనామిక్స్/అప్లైడ్ ఎకనామిక్స్/బిజినెస్ ఎకనామిక్స్/ఎకనామెట్రిక్స్), స్టాటిస్టికల్ సర్వీసుకు డిగ్రీ (స్టాటిస్టిక్స్/మ్యాథమేటికల్ స్టాటిస్టిక్స్/అప్లైడ్ స్టాటిస్టిక్స్) లేదా పీజీ(స్టాటిస్టిక్స్/మ్యాథమేటికల్ స్టాటిస్టిక్స్/అప్లైడ్ స్టాటిస్టిక్స్) ఉత్తీర్ణులై ఉండాలి.

» **వయసు:** 01.08.2023 నాటికి 21 నుంచి 30 ఏళ్ల మధ్య ఉండాలి.

» **ఎంపిక విధానం:** రాతపరీక్ష(100 మార్కులు), ఇంటర్వ్యూ/పర్సనాలిటీ టెస్ట్(200 మార్కులు), డాక్యుమెంట్ వెరిఫికేషన్, మెడికల్ ఎగ్జామినేషన్ ఆధారంగా ఎంపికచేస్తారు.

» **తెలుగు రాష్ట్రాల్లోని పరీక్ష కేంద్రాలు:** హైదరాబాద్.

» **ఆన్‌లైన్‌దరఖాస్తులకు చివరితేదీ:** 09.05.2023.

» **వెబ్‌సైట్:** www.upsc.gov.in

కటాఫ్ అంచనా.. 88-100!

» జేఈఈ-మెయిన్-2023.. ముగిసిన రెండు సెషన్లు

» దాదాపు 10 లక్షల మంది హాజరైనట్లు అంచనా

» జేఈఈ-మెయిన్ 2023 కటాఫ్ అంచనా 88-100

» మెయిన్ స్కోర్‌తో నిట్‌లు, ట్రిపుల్ ఐటీ, జీఎఫ్‌టీఐల్లో ప్రవేశాలు

» ఐఐటీల్లో అడుగు పెట్టాలనుకుంటే అడ్వాన్స్‌డ్ ఉత్తీర్ణత తప్పనిసరి

జేఈఈ మెయిన్-2023.. నిట్‌లు, ట్రిపుల్ ఐటీలు, కేంద్ర ప్రభుత్వ ఆధ్వర్యంలోని.. ఇతర సాంకేతిక ఇన్‌స్టిట్యూట్స్‌లో.. ప్రవేశానికి నిర్వహించే పరీక్ష! ఐఐటీల్లో అడుగు పెట్టేందుకు కూడా జేఈఈ-మెయిన్‌లో అర్హత సాధించడం తప్పనిసరి! 2023 సంవత్సరానికి సంబంధించి.. జేఈఈ-మెయిన్ రెండు సెషన్ల పరీక్షలు ముగిశాయి! ఈ నేపథ్యంలో.. జేఈఈ-మెయిన్‌కు హాజరైన విద్యార్థుల తదుపరి కర్తవ్యం ఏంటి? ఈ ఏడాది కటాఫ్ అంచనా, ఉమ్మడి కౌన్సెలింగ్ తదితర వివరాలు..

ఈ ఏడాది రెండు దశలుగా నిర్వహించిన జేఈఈ-మెయిన్‌కు హాజరైన అభ్యర్థుల సంఖ్య దాదాపు పది లక్షలుగా ఉంటుందని అంచనా. జనవరి 24 నుంచి ఫిబ్రవరి 1 వరకు నిర్వహించిన తొలి సెషన్‌కు 8,23,967 మంది హాజరయ్యారు. తాజాగా ఏప్రిల్ 6 నుంచి 13 వరకు నిర్వహించిన పరీక్షలకు కూడా దాదాపు ఇదే సంఖ్యలో విద్యార్థులు హాజరైనట్లు అంచనా. వీరిలో తొలి సెషన్‌కు కూడా హాజరైన వారి సంఖ్య 30 నుంచి 40 శాతం మేరకు ఉంటుందని భావిస్తున్నారు. మొత్తంగా చూస్తే దాదాపు పది లక్షల మందికిపైగా జేఈఈ-మెయిన్ పరీక్షలు రాసినట్లు పేర్కొంటున్నారు.

జనరల్ కటాఫ్ ఎంత?

రెండు సెషన్లుగా, పలు స్లాట్లలో నిర్వహించిన జేఈఈ-మెయిన్-2023కు కటాఫ్ జనరల్ కేటగిరీలో 88-100, ఓబీసీ(ఎన్‌సీఎల్) కేటగిరీలో 74-90, ఎస్సీ కేటగిరీలో 54-80; ఎస్టీ కేటగిరీలో 45-90 మధ్యలో ఉంటుందనే అంచనాలు వెలువడుతున్నాయి. ఈ కటాఫ్ శ్రేణుల మధ్యలో నిలుస్తామని భావించే విద్యార్థులు తదుపరి దశలకు సన్నద్ధమవ్వాలని నిపుణులు సూచిస్తున్నారు.

జేఈఈ అడ్వాన్స్‌డ్ దిశగా

జేఈఈ-మెయిన్ ర్యాంకుతో నేషనల్ ఇన్‌స్టిట్యూట్స్ ఆఫ్ టెక్నాలజీ(నిట్) క్యాంపస్‌లు, ట్రిపుల్ ఐటీలు, కేంద్ర ప్రభుత్వ ఆధ్వర్యంలోని ఇతర టెక్నికల్ ఇన్‌స్టిట్యూట్స్‌లో ప్రవేశాలు కల్పిస్తారు. జేఈఈ-మెయిన్ స్కోర్ ఆధారంగా 2.5 లక్షల మందికి ఐఐటీల్లో ప్రవేశాలకు నిర్వహించే జేఈఈ-అడ్వాన్స్‌డ్‌కు అర్హత కల్పిస్తారు. దీంతో.. జేఈఈ-మెయిన్‌లో కటాఫ్ అంచనాల కంటే ఎక్కువ స్కోర్ సాధిస్తామనే ధీమా ఉన్న విద్యార్థులు.. అడ్వాన్స్‌డ్ ప్రిపరేషన్‌ను ముమ్మరం చేయాలని నిపుణులు సూచిస్తున్నారు.

ఐఐటీలు.. కొందరికే అవకాశం

ఐఐటీలో అడుగు పెట్టే అవకాశం కొద్ది మందికే లభిస్తుంది. ఎందుకంటే.. దేశంలోని 23 ఐఐటీల్లో మొత్తంగా అందుబాటులో ఉన్న సీట్ల సంఖ్య 16,598 మాత్రమే. అంటే.. జేఈఈ-అడ్వాన్స్‌డ్‌కు 2.5 లక్షల మందికి అర్హత కల్పించినా.. ప్రవేశం లభించేది కేవలం 16,598 మందికే! దీంతో మిగతా విద్యార్థులకు నిట్‌లు, ట్రిపుల్ ఐటీలు, జీఎఫ్‌టీఐలే ప్రధాన గమ్యాలుగా నిలుస్తున్నాయి.

మొత్తం సీట్లు 37,879

- జాతీయ స్థాయిలో 32 ఎన్ఐటీ క్యాంపస్‌లలో 23,994 సీట్లు; 26 ట్రిపుల్ ఐటీల్లో 7,126 సీట్లు, సెంట్రల్ యూనివర్సిటీలు సహా కేంద్ర ప్రభుత్వ ఆధ్వర్యంలోని ఇతర టెక్నికల్ ఇన్‌స్టిట్యూట్స్‌లో 6,759 సీట్లు అందుబాటులో ఉన్నాయి.
- మొత్తంగా జేఈఈ-మెయిన్ స్కోర్ ఆధారంగా 37, 879 సీట్లు కేటాయిస్తారు.

ఉమ్మడి కౌన్సెలింగ్ జోసా

- ఐఐటీలు, నిట్‌లు, ట్రిపుల్ ఐటీలు తదితర ఇన్‌స్టిట్యూట్స్‌లో ప్రవేశాల కోసం జాయింట్ సీట్ అలొకేషన్ అథారిటీ(జోసా) ఆధ్వర్యంలో ఆన్‌లైన్ కౌన్సెలింగ్ నిర్వహిస్తారు. అభ్యర్థులు ఆన్‌లైన్‌లో ఛాయిస్ ఫిల్లింగ్ ప్రక్రియ పూర్తి చేయాల్సి ఉంటుంది.
- జేఈఈ-మెయిన్ ర్యాంకర్లకు నిట్‌లు, ట్రిపుల్ ఐటీలు, జీఎఫ్ఐటీలనే ప్రాథమ్యాలుగా ఎంచుకునే అవకాశం ఉంటుంది. అడ్వాన్స్‌డ్ ఉత్తీర్ణులు మాత్రం ఐఐటీలతో సహా అన్ని ఇన్‌స్టిట్యూట్‌లను ప్రాథమ్యాలుగా ఎంచుకోవచ్చు.
- విద్యార్థులు పేర్కొన్న ప్రాథమ్యాలు, ఆయా ఇన్‌స్టిట్యూట్స్, బ్రాంచ్‌లలో అందుబాటులో ఉన్న సీట్ల ఆధారంగా ఆన్‌లైన్‌లోనే సీట్ అలాట్‌మెంట్ జరుగుతుంది.
- సీట్ పొందిన విద్యార్థులు ఆన్‌లైన్‌లో నిర్దేశిత ఫీజు చెల్లించి.. సంబంధిత ఇన్‌స్టిట్యూట్‌లో సర్టిఫికెట్ వెరిఫికేషన్‌కు హాజరవ్వాలి. నిర్దేశిత తేదీలోపు తమకు సీటు లభించిన ఇన్‌స్టిట్యూట్‌లో జాయినింగ్ రిపోర్ట్ ఇవ్వాల్సి ఉంటుంది.

ఆరు రౌండ్లలో జోసా

జాయింట్ సీట్ అలొకేషన్ అథారిటీ నిర్వహించే ఆన్‌లైన్ కౌన్సెలింగ్ ప్రక్రియ మొత్తం ఆరు రౌండ్లలో జరగనుంది. ఇప్పటి వరకు ఉన్న సమాచారం ప్రకారం-జోసా 2023 కౌన్సెలింగ్ ప్రక్రియ జూన్ 19న ప్రారంభం కానుంది. అభ్యర్థులు అయిదో రౌండ్ వరకు కౌన్సెలింగ్‌లో పాల్గొని స్లైడింగ్ ప్రక్రియకు హాజరవ్వచ్చు.



జేఈఈ-మెయిన్-2023

సీఎస్ఏబీ కౌన్సెలింగ్

జోసా అన్ని దశలు పూర్తయిన తర్వాత కూడా ఎన్ఐటీల్లో సీట్లు మిగిలితే.. వాటి భర్తీ కోసం ప్రత్యేకంగా ఎన్ఐటీ ప్లస్ సిస్టమ్ పేరుతో సీఎస్ఏబీ(సెంట్రల్ సీట్ అలొకేషన్ బోర్డ్) ఆధ్వర్యంలో ఎన్ఐటీల్లో మిగిలిన సీట్ల భర్తీకి ప్రత్యేక కౌన్సెలింగ్ నిర్వహిస్తారు. సాధారణంగా ఇది రెండు దశల్లో ఉంటుంది. దీనికోసం అభ్యర్థులు ప్రత్యేకంగా దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుంది.

నిట్‌లు.. హోమ్ స్టేట్ కోటా

- నిట్‌ల్లో హోమ్ స్టేట్ కోటా విధానాన్ని అమలు చేస్తున్నారు. దీని ప్రకారం-నిట్ ఏర్పాటైన రాష్ట్ర విద్యార్థులకు హోమ్ స్టేట్ కోటా కింద 50 శాతం సీట్లు కేటాయిస్తారు. ఉదాహరణకు.. నిట్-వరంగల్‌నే పరిగణనలోకి తీసుకుంటే.. ఇందులో తెలంగాణ రాష్ట్ర విద్యార్థులకు 50 శాతం సీట్లు అందుబాటులో ఉంటాయి. ఇలా దేశంలోని మొత్తం 31 నిట్‌లలోనూ ఈ విధానంతో సంబంధిత రాష్ట్రాల విద్యార్థులు సీట్లు సొంతం చేసుకునే అవకాశం లభిస్తుంది.
- తెలుగు రాష్ట్రాలకు సంబంధించి ప్రస్తుతం రెండు నిట్ క్యాంపస్‌లు అందుబాటులో ఉన్నాయి. అవి..ఎన్ఐటీ-వరంగల్ (తెలంగాణ), ఎన్ఐటీ-ఆంధ్రప్రదేశ్ (తాడేపల్లిగూడెం).
- నిట్ క్యాంపస్‌లలో హోమ్ స్టేట్ కోటా అమలవుతున్న నేపథ్యంలో 15 వేల లోపు ర్యాంకుతో విద్యార్థులు తమ సొంత రాష్ట్రంలోని నిట్ క్యాంపస్‌లో సీటు పొందే అవకాశం ఉంది. సీఎస్ఈ, ఈసీఈ వంటి క్రేజీ కోర్సుల విషయంలో ఆరు వేల లోపు ర్యాంకుతో సులభంగా సీటు పొందే వీలుంది. అదర్ స్టేట్ కోటాలో సీటు సొంతం చేసుకోవాలంటే.. పదివేల లోపు ర్యాంకుతోనే సాధ్యమవుతున్న పరిస్థితి కనిపిస్తోంది.

ఫీజుల్లోనూ రాయితీ

- గత ఏడాది గణాంకాల ప్రకారం-ప్రతి సెమిస్టర్‌కు రూ.62,500 ఫీజుగా నిర్ణయించారు. ప్రభుత్వ విధానాల ప్రకారం-ఆయా వర్గాల వారికి ట్యూషన్ ఫీజు నుంచి నిర్దేశిత మొత్తాల్లో మినహాయింపు కూడా లభిస్తోంది.
- కుటుంబ వార్షికాదాయం రూ.లక్షలోపు ఉన్న విద్యార్థులకు, ఆర్థికంగా అత్యంత వెనుకబడిన వర్గాల కేటగిరీలో ట్యూషన్ ఫీజు నుంచి పూర్తి మినహాయింపు కల్పిస్తున్నారు.
- కుటుంబ వార్షికాదాయం రూ.లక్ష నుంచి రూ.అయిదు లక్షల లోపు ఉన్న విద్యార్థులకు మొత్తం ట్యూషన్ ఫీజులో మూడింట రెండొంతుల ఫీజును మినహాయిస్తున్నారు.
- ఎస్సీ, ఎస్టీ, దివ్యాంగుల కేటగిరీలకు చెందిన విద్యార్థులకు పూర్తి స్థాయిలో ఫీజు మినహాయింపు లభిస్తోంది.
- ఈ మినహాయింపులు కోరుకునే అభ్యర్థులు సంబంధిత ఆదాయ ధ్రువీకరణ పత్రాన్ని అందజేయాల్సి ఉంటుంది.

జోసా ప్రక్రియకు సిద్ధంగా

జేఈఈ-మెయిన్ స్కోర్‌తో నిట్‌లు, ట్రిపుల్ ఐటీలు, కేంద్ర ప్రభుత్వ ఆధ్వర్యంలోని ఇతర సాంకేతిక విద్యా సంస్థల్లో చేరాలనుకునే వారు..జోసా-2023 ప్రక్రియకు సన్నద్ధమవ్వాలి. ఇందుకోసం.. జోసా ఆన్‌లైన్ ఛాయిస్ ఫిల్లింగ్‌కు అవసరమైన అన్ని ధ్రువ పత్రాలను సిద్ధం చేసుకోవాలి. మూడు పాస్‌పోర్ట్ సైజ్ ఫొటోగ్రాఫ్స్; ఫొటో ఐడెంటిటీ కార్డ్; జేఈఈ-మెయిన్ అడ్మిట్ కార్డ్; జేఈఈ-మెయిన్ స్కోర్ కార్డ్; జనన ధ్రువీకరణ పత్రం (పదో తరగతి మార్క్స్ షీట్); ఇంటర్మీడియెట్ మార్క్స్ షీట్; మెడికల్ సర్టిఫికెట్; కుల ధ్రువీకరణ పత్రం; ఈడబ్ల్యూఎస్ ధ్రువీకరణ పత్రాలను సిద్ధం చేసుకోవాలి.


స్టాక్ మార్కెట్లు (శుక్రవారం ముగింపు)

దేశీ సూచీలు		విదేశీ సూచీలు		
సెన్సెక్స్ ▲ 23	59,655	నాస్డాక్	12,072	▲ 22
నిఫ్టీ 0	17,624	డోజోన్స్	33,809	▲ 13
		ఎఫ్టీఎస్ఈ 100	7,914	▲ 12
		డాక్స్	15,882	▲ 86
		షాంఘై	3,301	▽ 66
		నికాయ్	28,564	▲ 93

మరిన్ని బిజినెస్ వార్తల కోసం 'సాక్షి ప్లస్' చూడండి

•అమెరికా •బ్రిటన్ •జర్మనీ •చైనా •జపాన్

ఐటీ రిటర్నులు సరే.. ఆ తర్వాత?



- జూలై 31లోపు ఐటీఆర్ల దాఖలు
- అనంతరం వాటిని వెరిఫై చేయాల్సిందే
- లేదంటే చెల్లుబాటు కావు
- అలాంటప్పుడు ఆలస్యపు రిటర్నులు
- తప్పులు గుర్తిస్తే సవరణలతో దాఖలు
- లెక్కలు సరిపోలకపోతే డిమాండ్ నోటీస్

గడిచిన ఆర్థిక సంవత్సరానికి సంబంధించి ఆదాయ పన్ను (ఐటీ) రిటర్నులు దాఖలు చేసే సమయం వచ్చేసింది. సాధారణంగా జూలై 31లోపు రిటర్నులు దాఖలు చేయాల్సి ఉంటుంది. ఇందుకోసం ఎన్నో వివరాలను సిద్ధం చేసుకోవాలి. ఆదాయం, పెట్టుబడులు, గృహ రుణం చెల్లింపులు, అద్దె చెల్లింపులు, ఈపీఎఫ్, పీపీఎఫ్, బీమా ప్రీమియం చెల్లింపులు, మూలధన లాభాలు అన్నింటినీ ఒక పేపర్పై రాసి పెట్టుకుంటే రిటర్నులను సులభంగా దాఖలు చేయవచ్చు. పాత, కొత్త విధానాల్లో ఏది అనుకూలమో కూడా మదింపు వేసుకోవాలి. అయితే, రిటర్నులు సమర్పించడంతోనే పని పూర్తయినట్టు అనుకోవద్దు. రిటర్నులు దాఖలు తర్వాత చేయాల్సిన ముఖ్యమైన పనులు కొన్ని ఉన్నాయి. వాటి గురించి తెలియజేసేదే ఈ కథనం.

రిటర్నుల ధ్రువీకరణ

రిటర్నులు దాఖలు చేసిన ప్రతి ఒక్కరూ వాటిని వెరిఫై చేయాల్సి ఉంటుంది. అప్పుడే రిటర్నులు విజయవంతంగా సమర్పించినట్టు అవుతుంది. ధ్రువీకరించకపోతే అవి మదింపునకు వెళ్లవన్న విషయాన్ని గుర్తు పెట్టుకోండి. రిటర్నులు చెల్లుబాటు కూడా కావు. రిటర్నులు దాఖలు చేసిన తర్వాత వాటిని ధ్రువీకరించేందుకు 120 రోజుల గడువు ఉంటుంది. ఆలోపు ఎప్పుడైనా చేయవచ్చు. రిటర్నులు దాఖలు చేసిన తర్వాత వచ్చే అక్నాలెడ్జ్మెంట్ కాపీని ప్రింట్ తీసుకుని, దానిపై సంతకం చేసి లేదంటే ఇన్కమ్ట్యాక్స్ వెబ్సైట్ నుంచి ఫామ్ 5ను డౌన్లోడ్ చేసుకుని బెంగళూరులోని ఆదాయపన్ను శాఖ కార్యాలయానికి పోస్ట్ చేయాల్సి ఉంటుంది. ఆర్డినరీ పోస్ట్ లేదా స్పీడ్ పోస్ట్ చేయవచ్చు. కొరియర్ ద్వారా చేయకూడదు. ఆన్లైన్లోనూ వెరిఫై చేయవచ్చు. పోస్ట్ ద్వారా పంపించడం కంటే ఇది ఎంతో సులభ విధానం. నెట్బ్యాంకింగ్ అకౌంట్ లేదంటే ఆధార్ ఆధారిత ఓటీపీ లేదా డీమ్యాట్ అకౌంట్ ద్వారా చేసేందుకు అవకాశం ఉంటుంది. వీటిల్లో ఏది ఎంపిక చేసుకుంటే ఆ రూపంలో మొబైల్ నంబర్కు ఓటీపీ వస్తుంది. దాన్ని ఆదాయపన్ను శాఖ పోర్టల్పై నమోదు చేయడం ద్వారా రిటర్నులను వెరిఫై చేయవచ్చు. వెరిఫికేషన్కు సంబంధించి ఎల్రక్టానిక్ కోడ్ను బ్యాంకు ఏటీఎంల ద్వారా కూడా పొందొచ్చు. ఎస్బీఐ, యాక్సిస్ బ్యాంక్, ఐసీఐసీఐ బ్యాంక్ ఈ సేవలను అందిస్తున్నాయి. ఏటీఎంలో డెబిట్ కార్డును స్వైప్ చేసి, పిన్ నంబర్ ఇచ్చి లాగిన్ అయిన తర్వాత 'జనరేట్ ఈవీసీ ఫర్ ఇన్కమ్ ట్యాక్స్ ఫైలింగ్'ను ఎంపిక చేసుకోవాలి. ఆయా బ్యాంకుల్లో ఖాతాదారులై, పాన్ నంబర్ ఇచ్చి ఉన్న వారికే ఇది సాధ్యపడుతుంది. ఒకవేళ ఆదాయపన్ను చట్టంలోని సెక్షన్ 44ఏబీ కింద పుస్తకాలను ఆడిట్ చేయించుకోవాల్సిన వారు రిటర్నులు దాఖలు చేసిన వెంటనే డిజిటల్ సిగ్నేచర్



సర్టిఫికెట్ ద్వారా వాటిని వెరిఫై చేయాల్సి ఉంటుంది. వ్యక్తులు రిటర్నులు వేసి, 120 రోజులు అయినా వాటిని వెరిఫై చేయలేదనుకుంటే.. అప్పుడు కండోనేషన్ ఆఫ్ డిలే సర్వీస్ రిక్వెస్ట్ సమర్పించాలి. తగిన కారణాన్ని పేర్కొనాలి. ఆదాయ పన్ను శాఖ కండోనేషన్ రిక్వెస్ట్ను ఆమోదిస్తే అప్పుడు రిటర్నులను వెరిఫై చేయవచ్చు. లేదంటే రిటర్నులు దాఖలు చేయనట్టుగానే ఆదాయపన్ను శాఖ పరిగణిస్తుంది. తిరిగి రిటర్నులను దాఖలు చేయాల్సిందే. లేట్ ఫీజు చెల్లించి దాఖలు చేయాల్సి ఉంటుంది. పన్ను చెల్లించాల్సి ఉంటే, దానిపై వడ్డీ కూడా పడుతుంది.

ఆదాయ పన్ను రిటర్నులను గడువులోపు సమర్పించిన వారు, అందులో తప్పులు దొర్లితే సవరించిన రిటర్నులు దాఖలు చేసుకోవచ్చు. దాఖలు చేసిన రిటర్నులు ఇంకా ప్రాసెస్ చేయకపోతే రివైజ్డ్ రిటర్నులు వేసుకునేందుకు అవకాశం ఉంటుంది. సవరించిన రిటర్నులు దాఖలు చేయడానికి ప్రత్యేకమైన ప్రక్రియ అంటూ ఏదీ లేదు. ఈఫైలింగ్ పోర్టల్కు వెళ్లి 'రివైజ్డ్ రిటర్న్' ఆప్షన్ ఎంపిక చేసుకోవాలి. తాజా రిటర్నులు దాఖలు చేసే ప్రక్రియనే అనుసరించాల్సి ఉంటుంది. సవరించిన రిటర్నుల పత్రంలో మొదటిసారి దాఖలు చేసిన అసలు రిటర్నుల అక్నాలెడ్జ్మెంట్ నంబర్, డేట్ కూడా ఇవ్వాలి. అసెస్మెంట్ సంవత్సరం ముగియడానికి

తప్పులు దొర్లితే..?

మూడు నెలల ముందు వరకు రివైజ్డ్ రిటర్నులు సమర్పించొచ్చు. పన్ను చెల్లింపుదారు దాఖలు చేసిన రిటర్నుల పత్రాన్ని ఆదాయపన్ను శాఖ ప్రాసెస్ చేసినట్టయితే సెక్షన్ 143 (1) కింద ఇంటిమేషన్ పంపిస్తుంది. ఇది వచ్చిన తర్వాత రివైజ్డ్ రిటర్నులు వేయడానికి అనుమతి ఉండదు. ఆలస్యపు రిటర్నులు దాఖలు చేయడానికి తుది గడువు అసెస్మెంట్ సంవత్సరంగా గుర్తించాలి. రిటర్నులు దాఖలు చేసి, దాన్ని ఆదాయపన్ను శాఖ ఇంకా ప్రాసెస్ చేయనట్టయితే గడువులోపు ఎన్ని సార్లు అయినా సవరణలు దాఖలు చేసుకోవచ్చు. ఈ విషయంలో పరిమితి లేదు. ఒక్కసారి సవరించిన రిటర్నులు సమర్పించగానే, ముందు దాఖలు చేసినది చెల్లకుండా పోతుంది. తాజా రిటర్నుల పత్రాన్ని పరిగణనలోకి తీసుకుంటారు. అవకాశం ఉంది కదా అని చాలా పర్యాయాలు సవరించిన రిటర్నులు సమర్పిస్తే అది పన్ను శాఖ అధికారుల దృష్టిలో పడుతుంది. దాంతో ప్రత్యేక స్క్రూటినీ చేయవచ్చు. ముఖ్యంగా సవరించిన రిటర్నుల్లో పెద్ద మార్పులు ఉంటే తప్పకుండా విస్తృత పరిశీలన ఉంటుంది. మొదటిసారి దాఖలు చేసిన పత్రాల మాదిరిగానే, సవరించిన రిటర్నులనూ వెరిఫై చేయడం మర్చిపోవద్దు. అవసరమైతే నిపుణుల సలహాలు తీసుకోండి.

దాఖలు చేసిన రిటర్నుల్లో వివరాల ఆధారంగా చెల్లించాల్సిన పన్నులో వ్యత్యాసం ఉంటే, ఆదాయ పన్ను శాఖ పంపించే 143 (1) ఇంటిమేషన్లో ఆ వివరాలు ఉంటాయి. పన్ను లెక్కల్లో పొరపాట్లు ఉంటే, అదనంగా పన్ను చెల్లించాల్సి ఉంటే, ఆదాయపన్ను శాఖ ఈ ఇంటిమేషన్లో పేర్కొంటుంది. ఆదాయపన్ను శాఖ వివరాలతో, పన్ను లెక్కలతో ఏకీభవిస్తే అప్పుడు పన్ను చెల్లింపుదారు ఆ మేరకు అదనపు పన్ను చెల్లిస్తే సరిపోతుంది. కొన్ని సందర్భాల్లో పన్ను మినహాయింపులు పేర్కొనడం మర్చిపోయినా.. పన్ను అదనంగా చెల్లించాల్సిన బాధ్యత ఏర్పడుతుంది. లేదంటే ఆదాయ పన్ను శాఖ అసెసింగ్ ఆఫీసర్ అయినా పొరపాటు పడొచ్చు.

సరిపోలకపోతే..?

లేదా ఎర్రర్ చోటు చేసుకోవచ్చు. అప్పుడు యూజర్ రెక్టిఫికేషన్ రిక్వెస్ట్ సమర్పించాలి. అంటే దాన్ని సరిదిద్దాలని కోరడం. ఇంటిమేషన్ పంపించిన నాటి నుంచి నాలుగేళ్ల వ్యవధిలో ఎప్పుడైనా కానీ దీన్ని దాఖలు చేయవచ్చు. ఆదాయపన్ను శాఖ గుర్తించిన వాటితో మీరు ఏకీభవించకపోవచ్చు. లేదా మీరు పేర్కొన్న వివరాల పరంగానూ ఆదాయపన్ను శాఖ లేవనెత్తిన తాజా డిమాండ్ సమ్మతం కాకపోయినా రెక్టిఫికేషన్ రిక్వెస్ట్ దాఖలు చేయవచ్చు. ఇలా దాఖలు చేసిన నాటి నుంచి ఆరు నెలల్లోపు ఆదాయపన్ను శాఖ స్పందిస్తుంది. పన్ను చెల్లింపుదారులు సాధారణంగా నాలుగు రకాల రెక్టిఫికేషన్ రిక్వెస్ట్లు సమర్పించొచ్చు. పన్ను చెల్లింపుదారు తనవైపు నుంచి అన్ని రకాల వివరాలు సమర్పించినప్పటికీ, పన్ను శాఖ ఏదైనా సమాచారాన్ని పరిగణనలోకి తీసుకోనట్టయితే అప్పుడు 'రీ ప్రాసెస్ ద రిటర్న్'ను ఎంపిక చేసుకోవాలి. టీడీఎస్/టీసీఎస్ లేదా ఐటీ చలాన్లలో దిద్దుబాటు చేయాల్సి ఉంటే అప్పుడు 'ట్యాక్స్ క్రెడిట్ మిస్మ్యాచ్ కరెక్షన్' రిక్వెస్ట్ను ఎంపిక చేసుకోవాలి. సెక్షన్ 234సీ కింద వడ్డీ లెక్కలను సరిదిద్దాల్సి ఉంటే 'అడిషనల్ ఇన్ఫర్మేషన్ ఫర్ 234సీ ఇంటరెస్ట్'ను ఎంపిక చేసుకోవాలి. వాస్తవ రిటర్నుల్లో ఇతర వివరాలను సరిదిద్దాలంటే అప్పుడు 'రిటర్న్ డేటా కరెక్షన్'ను ఎంపిక చేసుకోవాలి.

దాఖలు చేసిన రిటర్నుల్లో ఎలాంటి తప్పులు లేకపోతే అప్పుడు నిశ్చింతగా ఉండొచ్చు. ఒకవేళ చెల్లించాల్సిన మొత్తానికంటే అదనంగా పన్ను చెల్లించినట్టయితే అప్పుడు రిఫండ్ కోరడం ఒక్కటే మార్గం. యూజర్లు ఆదాయ పన్ను శాఖ పోర్టల్లో లాగిన్ అయిన తర్వాత డ్యాష్బోర్డులో ఇది కనిపిస్తుంది. పన్ను చెల్లింపుదారులు ఎన్ఎస్డీఎల్ పోర్టల్లోనూ పాన్ నంబర్ సమర్పించడం ద్వారా

రిఫండ్ల సంగతి ఇదీ..

దీన్ని చెక్ చేసుకోవచ్చు. ఇప్పుడు ఫేస్లెస్ ప్రాసెసింగ్ నడుస్తోంది. రిఫండ్లు పన్ను చెల్లింపుదారు బ్యాంకు ఖాతాకు జమ అవుతాయి. ఇంటిమేషన్ అందుకున్న 15 రోజుల్లోగా ఇది సాధ్యపడుతుంది. బ్యాంకు వివరాలు సరిగ్గా లేకపోవడం వల్ల రిఫండ్లు నిలిచిపోతుంటాయి. అకౌంట్ నంబర్ లేదా ఐఎఫ్ఎస్సీ నంబర్లో తప్పులు ఉన్నాయామో చెక్ చేసుకోవాలి. సర్వీస్ రిక్వెస్ట్ ఆప్షన్ ద్వారా దీన్ని చెక్ చేసుకోవచ్చు. పన్ను చెల్లింపుదారుడికి రావాల్సిన రిఫండ్లు ఆలస్యం అయితే ఒక్కో నెలకు అర శాతం చొప్పున వడ్డీని చెల్లిస్తారు. టీడీఎస్ లేదా టీసీఎస్ రూపంలో పన్నును మినహాయించి ఉంటే లేదా ముందస్తు పన్ను చెల్లించి ఉండి, చివర్లో పన్ను బాధ్యత తగ్గడం వల్ల వెనక్కి తిరిగి రావాల్సి ఉంటే.. అప్పుడు ఏప్రిల్ 1 నుంచి చెల్లించే నాటి వరకు వడ్డీ కూడా లభిస్తుంది. ఐటీఆర్లను గడువు తర్వాత దాఖలు చేసిన వారు, ఆ తేదీ నుంచే రిఫండ్పై వడ్డీ చెల్లింపులకు అర్హులవుతారు. రిఫండ్పై వచ్చే వడ్డీ సంబంధిత ఆర్థిక సంవత్సరం అదనపు ఆదాయం కింద చూపించాలి.



పోంజీ యాప్లపై ఉక్కుపాదం: సీతారామన్



న్యూఢిల్లీ: పోంజీ యాప్ల విషయంలో ఇన్వెస్టర్లు అప్రమత్తంగా ఉండాలని కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ సూచించారు. పెట్టుబడిదారుల కష్టారితాన్ని దోచేస్తున్న పోంజీ యాప్లపై ఉక్కుపాదం మోపేందుకు మైటీ, ఆర్బీఐతో కలసి పనిచేస్తున్నట్టు తెలిపారు. పెట్టుబడులు పెట్టేముందు తగినంత శ్రద్ధ చూపించాలని, అద్భుతమైన రాబడులు ఇస్తామంటూ చేసే ప్రకటనలకు ఆకర్షితులు కావద్దని కోరారు. ఇలాంటి వాటిల్లో ఎక్కువగా పోంజీ యాప్లు ఉంటున్నట్టు చెప్పారు. పోంజీ యాప్లను బ్లాక్ చేసేందుకు ఎల్రక్టానిక్స్, ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ శాఖ (మైటీ), ఆర్బీఐతో కలసి ఇంతకుముందు ఎన్నడూ లేని విధంగా చర్యలు చేపడుతున్నట్టు మంత్రి వివరించారు. కర్ణాటకలోని తుమకూరులో జరిగిన థింకర్స్ ఫోరమ్ కార్యక్రమంలో భాగంగా మంత్రి మాట్లాడారు. సామాజిక ప్రభావ శీలురు, ఆర్థిక ప్రభావ శీలురను నియంత్రించే ప్రతిపాదన ఏదీ లేదంటూ.. మనలో ప్రతి ఒక్కరి పట్ల జాగ్రత్తగా మసులుకోవాల్సిన అవసరాన్ని మంత్రి ప్రస్తావించారు. ప్రతి దానినీ ఒకటికి రెండు సార్లు పరిశీలించుకోవాలన్నారు. ప్రతి 10 మందిలో ముగ్గురు మంచి సూచనలే చేస్తున్నారంటూ, మిగిలిన ఏడుగురిని ఇతర ప్రభావాలు నడిపిస్తుండొచ్చన్నారు.

గోద్రెజ్ ప్రాపర్టీస్ | మోతీలాల్ ఓస్వాల్ ఫైనాన్స్ | కొనొచ్చు

సాక్షి ప్లస్

ప్రస్తుత ధర: రూ. 1,272 **టార్గెట్:** రూ. 1,575

ఎందుకంటే: గతించిన ఐదేళ్ల కాలం(2017–22)లో కంపెనీ అమ్మకాల బుకింగ్స్ నాలుగు రెట్లు ఎగసి రూ. 8,000 కోట్లను తాకాయి. ఇందుకు 10 కోట్ల చదరపు అడుగుల ప్రాజెక్టులు జత కలవడం దోహదం చేసింది. 2016 కేలండర్ ఏడాదిలో 2 శాతంగా నమోదైన గోద్రెజ్ ప్రాపర్టీస్ మార్కెట్ వాటా 2022కల్లా 8 శాతానికి బలపడింది. వెరసి దేశీ రియల్టీ రంగంలో ఏర్పడిన కన్సాలిడేషన్లో అత్యధికంగా లాభపడిన కంపెనీలలో ఒకటిగా నిలిచింది. 2019–21 మధ్య రియల్టీ రంగ ఏకీకృత పరిస్థితుల నేపథ్యంలో కంపెనీ రూ. 6,800 కోట్ల నిధులను సమీకరించింది. అయితే 2022 వరకూ వీటిని వినియోగించనే లేదు. కంపెనీ ప్రాజెక్టులు, అమ్మకాల పైప్లైన్ ఊపందుకున్నప్పటికీ అంతంతమాత్ర లాభదాయకత, తగ్గుతున్న నిర్వహణా క్యాష్ ఫ్లో కారణంగా



కంపెనీ షేరు దిద్దుబాట పట్టింది. 2022 తదుపరి షేరు 40 శాతంవరకూ క్షీణించింది. అయితే 2023లో రికార్డు స్థాయిలో ప్రాజెక్టులను జత చేసుకోవడంతోపాటు.. రూ. 30,000 కోట్ల స్థూల డెవలప్మెంట్ విలువ(జీడీవీ)ను సాధించడంతో కంపెనీ షేరు ఆకర్షణీయంగా కనిపిస్తోంది. ఇటీవల కంపెనీ యాజమాన్యం సైతం బిజినెస్ పటిష్ట పురోభివృద్ధి బాటలో ఉన్నట్లు తెలియజేసింది. 2024లోనూ ఇది కొనసాగే వీలున్నట్లు అంచనా వేసింది. వెరసి మెరుగైన లాభదాయకతను సాధించనున్నట్లు అభిప్రాయపడింది.

అమీ ఆర్గానిక్స్ | ఎలారా సెక్యూరిటీస్ | కొనొచ్చు

ప్రస్తుత ధర: రూ. 1,060 **టార్గెట్:** రూ. 1,335

ఎందుకంటే: మొత్తం 380కుపైగా ఫార్మా ఇంటర్మీడియెట్స్కు అనుమతి పొందింది. కంపెనీ ఔషధాలలో 90 శాతం క్రానిక్ విభాగంలోనివేకాగా.. 2037 వరకూ కొన్ని ప్రొడక్టులు దశలవారీగా ఆఫ్పేటెంట్లోకి ప్రవేశించనున్నాయి. వెరసి కంపెనీ భవిష్యత్ అవసరాలకు సిద్ధంగా ఉండటంతో 2022–2030 మధ్య కాలంలో వార్షికంగా 25 శాతం పురోగతిని సాధించవచ్చని అంచనా. ఈ కాలంలో ఏక్యూట్ విభాగం(5.6 శాతం)తో పోలిస్తే వార్షిక ప్రాతిపదికన క్రానిక్ వ్యాధులు(7.1 శాతం) అధిక వృద్ధిని అందుకోనున్నాయి. ఇది కంపెనీకి ప్రోత్సాహాన్నిస్తోంది. రానున్న రెండేళ్ల కాలంలో ఆదాయం, నికర లాభాల్లో వార్షికంగా 27 శాతం వృద్ధికి అవకాశముంది. ఇందుకు గతేడాది ఫార్మా ఇంటర్మీడియెట్స్లో నమోదైన 31 శాతం పురోగతి సహకరించనుంది. మొత్తం ఆదాయంలో వీటి వాటా 79 శాతంకాగా.. మరోవైపు అంకలేశ్వర్ ప్లాంటు ప్రారంభంకావడంతో స్పెషాలిటీ కెమికల్స్ 29 శాతం వార్షిక వృద్ధికి వీలుంది. 2023–25 మధ్య ఇబిటా మార్జిన్లు సగటున 20.6 శాతంగా ఉండొచ్చు. 2026–33 మధ్య మరింత అధికంగా 22.9 శాతం స్థాయిలో ఇబిటా మార్జిన్లకు అవకాశముంది. ఎలక్ట్రోలైట్ బిజినెస్ను పరిగణనలోకి తీసుకోకుండానే టార్గెట్ ధరను నిర్ణయించాం. అయితే అధిక ముడి సరుకుల వ్యయాలు, వీటిని వినియోగదారులకు బదిలీ చేయలేకపోవడం, నియంత్రణ సంస్థల నిబంధనలు, మారుతున్న టెక్నాలజీ వంటి అంశాలను కీలక రిస్కులుగా పేర్కొనవచ్చు.



గమనిక: ఈ కాలమ్లో షేర్లపై ఇచ్చిన సలహాలు, సూచనలు, వివిధ బ్రోకరేజీ సంస్థలు వ్యక్తం చేసిన అభిప్రాయాలు మాత్రమే

వర్తకులకు ప్రమాద బీమా

త్వరలో జాతీయ రిటైల్ వర్తక విధానం



న్యూఢిల్లీ: కేంద్ర సర్కారు జాతీయ రిటైల్ వర్తక విధానాన్ని, వర్తకులకు ప్రమాద బీమా సదుపాయాన్ని త్వరలోనే ప్రకటించనుంది. జీఎస్టీ నమోదిత వర్తకులకు మద్దతుగా నిలవడమే ఈ విధానం లక్ష్యమని ఆర్థికశాఖ సీనియర్ అధికారి ఒకరు తెలిపారు. నూతన విధానం మెరుగైన సదుపాయాల కల్పనకు తోడు వర్తకులకు రుణ లభ్యతను పెంచే విధంగా ఉంటుందని చెప్పారు. అందుబాటు రేట్లకే సత్వర రుణ సదుపాయం, రిటైల్ వాణిజ్యాన్ని మరింత ఆధునికీకరించడం, డిజిటైజ్ చేయడం, సరఫరా చైన్, నైపుణ్యాల అభివృద్ధి, కార్మిక ఉత్పాదకత పెంచడం, ప్రభావవంతమైన ఫిర్యాదుల పరిష్కార యంత్రాంగం ఏర్పాటు చేయడం నూతన రిటైల్ వర్తక విధానం లక్ష్యాలని వివరించారు. ప్రపంచంలో మన దేశం రిటైల్ వాణిజ్య పరంగా ఐదో స్థానంలో ఉంది.

ఫండ్స్ను మనవళ్లకు గిఫ్ట్ ఇవ్వొచ్చా?

నేను గ్రోత్ ఆప్షన్ బదులు ఐడీసీడబ్ల్యూ (నెలవారీ) ప్లాన్ను ఎంపిక చేసుకుంటే, ఈ రెండింటి మధ్య వ్యత్యాసాలు ఎలా ఉంటాయి? ఈ విషయంలో పన్ను బాధ్యతలు ఎలా ఉంటాయి? – అభినవశ్రీ

మీరు మ్యూచువల్ ఫండ్లో ఇన్వెస్ట్ చేయాలని అనుకుంటుంటే ఇనకమ్ ఇస్ట్రిబ్యూషన్ కమ్ క్యాపిటల్ విత్డ్రాయల్ (ఐడీసీడబ్ల్యూ) ప్లాన్కు దూరంగా ఉండండి. దీనికి బదులు గ్రోత్ ప్లాన్ ఎంపిక చేసుకోండి. ఐడీసీడబ్ల్యూ ప్లాన్ పన్ను పరంగా మెరుగైనది కాదు. గ్రోత్ ప్లాన్ పన్ను పరంగా మెరుగైన సాధనం. గ్రోత్ ప్లాన్లో పెట్టుబడులపై రాబడులు అన్నీ ఫండ్ వద్దే ఉంటాయి. దీంతో వాటిపైనా రాబడితో కాంపౌండింగ్ ప్రయోజనాన్ని పూర్తిగా పొందుతారు. అదే ఐడీసీడబ్ల్యూ ప్లాన్లో డివిడెండ్ అన్నది పెట్టుబడి, రాబడుల్లో కొత భాగాన్ని ఫండ్ సంస్థ తిరిగి చెల్లించడం. స్టాక్స్లో అయితే డివిడెండ్ వరకే ఇన్వెస్టర్లకు నేరుగా చెల్లిచడం ఉంటుంది. మ్యూచువల్ ఫండ్స్లో డివిడెండ్లు అన్నవి తప్పుడు పదంతో ఇంత కాలం కొనసాగాయి. అందుకే ఇటీవలే డివిడెండ్ పేరును ఐడీసీడబ్ల్యూగా మార్చారు. డివిడెండ్లు చెల్లించిన వెంటనే ఫండ్ ఎన్ఏవీ అంతే మేర తగ్గుతుంది. ఐడీసీడబ్ల్యూ ప్లాన్లో డివిడెండ్లు మీ పన్ను ఆదాయానికి తోడవుతాయి. మీ శ్లాబు ప్రకారం పన్ను చెల్లించాలి. ఒక ఏడాదిలో డివిడెండ్ ద్వారా రూ.5,000కు మించి ఆదాయం లభిస్తే టీడీఎస్ కింద 10 శాతాన్ని మినహాయిస్తారు. డివిడెండ్ను ఇన్వెస్టర్కు చెల్లించినా, లేక దాన్ని తిరిగి



ధీరేంద్ర కుమార్
సీఈవో, వ్యాల్యూ రీసెర్చ్

ఇన్వెస్ట్ చేసినా కానీ ఈ 10 శాతం టీడీఎస్ అమలవుతుంది. సాంకేతికంగా చూస్తే ఐడీసీడబ్ల్యూ ప్లాన్లో మీ పెట్టుబడి ఫండ్ సంస్థతోనే ఉంటుంది. కానీ, వాస్తవంగా చూస్తే చెల్లించే డివిడెండ్పై పన్ను పడుతుంది. కనుక పన్ను పరంగా అంత సమర్థమైనది కాదు. ఐడీసీడబ్ల్యూ ప్లాన్లో డివిడెండ్ ఎంత చెల్లించాలన్నది ఫండ్ సంస్థలు నిర్ణయిస్తాయి. ఇందులో ఇన్వెస్టర్లకు పాత్రకు ఉండదు. మీకు క్రమం తప్పకుండా ఫండ్స్ పెట్టుబడుల నుంచి ఆదాయం రావాలని కోరుకుంటే, అందుకు గ్రోత్ ప్లాన్లో ఇన్వెస్ట్ చేసి, సిస్టమ్యాటిక్ విత్డ్రాయల్ ప్లాన్ ఎంపిక చేసుకోవడం మెరుగైనది. దీనివల్ల ఎంత కాలానికి ఎంత చొప్పున కావాలన్నది మీరే నిర్ణయించుకోవచ్చు. కనుక ఐడీసీడబ్ల్యూ ప్లాన్తో పోలిస్తే గ్రోత్ ప్లాన్ చాలా మెరుగైనది. మీ పెట్టుబడులపై మీరు నియంత్రణ కలిగి ఉంటారు.

నా కుమారుడు మరణించాడు. జాయింట్ హోల్డర్గా ఉండడంతో ఫండ్స్ యూనిట్లు నాకు సంక్రమించాయి. వీటిని నా కుమారుడి పిల్లలకు బదిలీ చేయాలని అనుకుంటున్నాను. సాధ్యపడుతుందా? – విష్ణు కుమార్

మీ పేరుతో ఉన్న ఫండ్ యూనిట్లను మీ మనవళ్లు, మనవరాళ్లకు ఇవ్వడానికి లేదు. ఎందుకంటే ఫండ్స్ యూనిట్లు అనేవి గిఫ్ట్గా ఇవ్వడానికి, మరొకరికి బదిలీ చేయడానికి అవకాశం లేదు. అయితే మీ మనవళ్ల పేరిట ఫండ్స్లో ఇన్వెస్ట్ చేయడానికి అవకాశం ఉంది. ఇందుకు మీరు ముందుగా మీ పేరుతో ఉన్న ఫండ్స్ పెట్టుబడులు మొత్తాన్ని వెనక్కి తీసుకోండి. మీ మనవళ్ల వయసు 18 ఏళ్లు నిండి ఉంటే ప్రస్తుత పెట్టుబడులను వెనక్కి తీసుకుని, వచ్చిన మొత్తాన్ని వారి బ్యాంకు ఖాతాలకు బదిలీ చేయండి. అప్పుడు మీ మనవళ్లు, మనవరాళ్లే స్వయంగా వారి బ్యాంకు ఖాతా నుంచి ఫండ్స్లో ఇన్వెస్ట్ చేసుకోవచ్చు. ఈ విషయంలో మీరు వారికి సాయం అందించొచ్చు. ఒకవేళ మీ మనవళ్ల వయసు 18 ఏళ్లలోపు ఉంటే వారి తల్లి లేదంటే కోర్టు నియమించిన గార్డియన్కు పెట్టుబడులు బదలాయించొచ్చు. ఆ పని వారే చేస్తారు. మరో మార్గంలో ప్రస్తుతం మీ పేరుతో ఉన్న పెట్టుబడులను కొనసాగిస్తూ, నామినీగా మీ మనవళ్లు, మనవరాళ్లను పేర్కొనాలి. ఎవరికి ఎంత శాతం అనేది నిర్ణయించొచ్చు. అప్పుడు యూనిట్ హోల్డర్కు ఏదైనా జరిగితే అవి వారి పేరిట బదిలీ అవుతాయి.

ఐసీఐసీఐ బ్యాంక్ లాభం జూమ్

క్యూ4లో రూ. 9,853 కోట్లు

ముంబై: ప్రయివేట్ రంగ దిగ్గజం ఐసీఐసీఐ బ్యాంక్ గత ఆర్థిక సంవత్సరం(2022–23) చివరి త్రైమాసికంలో పటిష్ట ఫలితాలు సాధించింది. కన్సాలిడేటెడ్ ప్రాతిపదికన జనవరి–మార్చి(క్యూ4)లో నికర లాభం 27 శాతం ఎగసి రూ. 9,853 కోట్లకు చేరింది. స్టాండెలోన్ నికర లాభం సైతం 30 శాతం జంప్చేసి రూ. 9,122 కోట్లకు చేరింది. ఇందుకు రుణాలపై పెరిగిన వడ్డీ రేట్లు సహకరించాయి. సమీక్షా కాలంలో నికర వడ్డీ ఆదాయం 40 శాతం దూసుకెళ్లి రూ. 17,667 కోట్లను తాకింది. నికర వడ్డీ మార్జిన్లు 4 శాతం నుంచి 4.9 శాతానికి బలపడ్డాయి. రుణాల్లో 19 శాతం వృద్ధి ఇందుకు దోహదపడింది.

ఆదాయం సైతం అప్

గతేడాది క్యూ4లో ఐసీఐసీఐ బ్యాంక్ మొత్తం ఆదాయం రూ. 27,412 కోట్ల నుంచి రూ. 36,109 కోట్లకు ఎగసింది. మొత్తం వ్యయాలు రూ. 17,119 కోట్ల నుంచి రూ. 22,283 కోట్లకు పెరిగాయి. స్థూల మొండిబకాయిలు 3.6 శాతం నుంచి 2.81 శాతానికి దిగివచ్చాయి. మొత్తం ప్రొవిజన్లు రూ. 1,068 కోట్ల నుంచి రూ. 1,619 కోట్లకు పెరిగాయి. కనీస మూలధన నిష్పత్తి(సీఏఆర్) 18.34 శాతంగా నమోదైంది. అనుబంధ సంస్థలలో లైఫ్ ఇన్సూరెన్స్ నికర లాభం రూ. 185 కోట్ల నుంచి రూ. 235 కోట్లకు, సాధారణ బీమా లాభం రూ. 313 కోట్ల నుంచి రూ. 437 కోట్లకు జంప్చేశాయి.



యస్ బ్యాంక్ లాభం క్షీణత

క్యూ4లో రూ. 202 కోట్లకు పరిమితం

ముంబై: యస్ బ్యాంక్ మార్చి త్రైమాసికంలో నిరుత్సాహకర ఫలితాలు ప్రకటించింది. కన్సాలిడేటెడ్ ప్రాతిపదికన నికర లాభం 45 శాతం క్షీణించి రూ. 202 కోట్లకు పరిమితమైంది. ప్రొవిజన్లు రెట్టింపుకావడం లాభాలను దెబ్బతీసింది. అయితే నికర వడ్డీ ఆదాయం 15 శాతం పుంజుకుని రూ. 2,105 కోట్లను తాకింది. వడ్డీయేతర ఆదాయం 23 శాతం ఎగసి రూ. 1,082 కోట్లకు చేరింది. నికర వడ్డీ మార్జిన్లు 0.3 శాతం బలపడి 2.8 శాతానికి చేరాయి. రుణాల్లో 12 శాతం వృద్ధి ఇందుకు దోహదపడింది. మొత్తం ప్రొవిజన్లు 127 శాతం పెరిగి రూ. 618 కోట్లను తాకాయి. మార్చితో ముగిసిన పూర్తిఏడాదికి నికర లాభం 33 శాతం నీరసించి రూ. 717 కోట్లకు పరిమితమైంది. గతేడాది 3,000 మందికి ఉపాధి కల్పించింది. దీంతో మొత్తం సిబ్బంది సంఖ్య 27,517కు చేరింది.



కోడిగుడ్లు (హోల్సేల్-నెక్ / 100కు రూ.లలో)

24-4-2023	
విశాఖ	425–00
చిత్తూరు	458–00
ఈస్ట్, వెస్ట్ గోదావరి	415–00
విజయవాడ	415–00
రిటైల్ ధర (డజను)	60.00
23-4-2023 ఫామ్ ధర...	
హైదరాబాద్	400–00
వరంగల్	402–00
రిటైల్ ధర	4.60

క్లుప్తంగా...

విషమంగానే శరత్‌బాబు ఆరోగ్యం



సాక్షి, హైదరాబాద్: సినీ యర్ నటుడు శరత్‌బాబు ఆరోగ్య పరిస్థితి ఇంకా విష మంగానే ఉంది. గచ్చి బౌలిలోని ఏఐజీ ఆసు పత్రిలో నాలుగు రోజు లుగా చికిత్స పొం దుతున్న శరత్‌బాబు ఆరోగ్యాన్ని మెరుగుపరిచేందుకు వైద్యులు ఎంత కృషి చేస్తున్నప్పటికీ ఆ ప్రయత్నాలు ఫలించలేదు. ఆసుపత్రిలో చేరినప్పటి నుంచి వెం టిలేటర్‌పైనే ఉన్న శరత్‌బాబు అంతర్గత అవయవాలు పూర్తిగా పనిచేయడం లేదని సమాచారం.

కమెడియన్ చలాకీ చంటికి గుండెపోటు



గచ్చిబౌలి (హైదరాబాద్): బుల్లితెరలో ప్రసారమయ్యే జబర్దస్త్ కమెడియన్ చలాకీ చం టి తీవ్ర అస్వస్థతకు గురయ్యారు. ఈనెల 21వ తేదీన ఆయనకు తీవ్రమైన ఛాతినొప్పి రావడంతో కుటుంబ సభ్యులు అతన్ని గచ్చిబౌలిలోని కేర్ ఆస్పత్రికి తరలించారు. పరిస్థితిని పరిశీలించిన వైద్యులు గుండెపోటుగా గుర్తించారు. అవసరమైన వైద్య పరీక్షలు నిర్వహించి రక్త నాళాల్లో పూడికలను గుర్తించి, స్టంట్ వేసినట్టు తెలిసిం ది. ప్రస్తుతం అతని ఆరోగ్యం కొంత నిలకడగా ఉందని, ఐసీయూలో చికిత్స అందిస్తున్నామని వైద్యులు తెలిపారు.

వివేకా కేసులో ఐదో రోజూ కొనసాగిన విచారణ

- భాస్కర్‌రెడ్డి, ఉదయ్‌కుమార్‌రెడ్డిని ప్రశ్నించిన సీబీఐ



వైఎస్ వివేకా ఇంటి వద్ద కంప్యూటర్ ఆపరేటర్ ఇనయతుల్లాతో సీబీఐ అధికారులు

సాక్షి, హైదరాబాద్: మాజీ మంత్రి వైఎస్ వివేకానందరెడ్డి హత్య కేసు దర్యాప్తులో భాగం గా వరుసగా ఐదో రోజు కూడా సీబీఐ అధికారులు వైఎస్ భాస్కర్‌రెడ్డి, ఉదయ్‌కుమార్‌రెడ్డిని ప్రశ్నించారు. వారిని ఆదివారం ఉదయం 9.15 గంటలకు హైదరాబాద్‌లోని చంచల్‌గూడ జైలు నుంచి కోఠిలోని సీబీఐ కార్యాలయానికి తీసుకువచ్చారు. సాయంత్రం 4.20 గం టలకల్లా విచారణను పూర్తి చేసి.. వారిద్దరినీ తిరిగి చంచల్‌గూడ జైలుకు తరలించారు.

పులివెందులలో సీబీఐ విచారణ


- పలు ప్రాంతాలను పరిశీలించిన దర్యాప్తు అధికారులు

పులివెందుల: మాజీ మంత్రి వైఎస్ వివేకానం దరెడ్డి హత్య కేసు దర్యాప్తులో భాగంగా ఆదివారం సాయంత్రం సీబీఐ అధికారులు వైఎస్సార్ జిల్లా పులివెందులకు వచ్చారు. తొలుత వివేకా ఇంటి వద్దకు వెళ్లి.. బయటి నుంచే పరిసరాలను పరిశీలించారు. ఆ తర్వాత వైఎస్ భాస్కర్‌రెడ్డి ఇంటికి వెళ్లి.. అక్కడ ఉన్న పీఏ రమణారెడ్డితో మాట్లాడారు. అనంతరం మళ్లీ వివేకా ఇంటికి వచ్చి.. కం ప్యూటర్ ఆపరేటర్ ఇనయతుల్లాను తమ వాహనంలో ఎక్కించుకుని కొద్దిసేపు అక్కడే విచారించారు. ఆ తర్వాత ఇనయతుల్లాను తీసుకొని మళ్లీ భాస్కర్‌రెడ్డి ఇంటికి వెళ్లారు. ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి జమ్మలమడుగు ప్రచారానికి వెళుతూ ఘటన గురించి తెలిసిన వెంటనే తిరిగొచ్చిన స్థలాన్ని చూపించాలని పీఏ రమణారెడ్డిని సీబీఐ అధికారులు కోరారు. దీంతో రమణారెడ్డి రింగ్ రోడ్డులోని కృష్ణ టెం పుల్ సమీపంలో ఉన్న ప్రాంతాన్ని సీబీఐ అధికారులకు చూపించాడు. ఆ ప్రాంతాన్ని చూసిన అనంతరం సీబీఐ అధికారులు వివేకానందరెడ్డి ఇంటి లోపలికి వెళ్లి పరిశీలిం చారు. ఇనయతుల్లాను అక్కడే వదిలేసి కడపకు వెళ్లిపోయారు.

ప్రధాన కేంద్రాల్లో ఆదివారం నమోదైన గరిష్ట, కనిష్ట ఉష్ణోగ్రతలు (డిగ్రీల్లో)

కేంద్రం	గరిష్టం	కనిష్టం
కర్నూలు	41.3	27.5
రెంటచింతల	41.2	27.4
విజయనగరం	39.0	27.0
మార్కాపురం	39.0	26.0
నెల్లూరు	38.1	28.4
కడప	36.2	26.1
తిరుపతి	36.0	26.0
శ్రీకాకుళం	36.0	24.0
రాజమహేంద్రవరం	35.0	24.0
విజయవాడ	34.0	26.0
విశాఖపట్నం	32.8	24.2
తెలంగాణలో..		
ఆదిలాబాద్	37.0	22.7
రామగుండం	37.0	23.0
హైదరాబాద్	37.2	24.0

చేతిలో ఫోన్.. వెన్నెముక డౌన్!



ఒకప్పుడు రైల్లోనో, బస్సులోనో కూర్చునే చోటు దొరక్క నిలబడాల్సి వచ్చిందని మాత్రమే చిం తించేవారు.. మరి ఇప్పుడు మనం మొబైల్‌ను మిస్ అవుతున్నామని అంతకు మించి చింతిస్తున్న పరిస్థితి. (నిలబడీ మొబైల్ వాడేవాళ్లూ ఎక్కువే ఉన్నారనుకోం డి). కూర్చునేందుకు కాస్త చోటు దొరికితే చాలు.. టక్కున ఫోన్‌లో తలదూర్చేస్తు న్నారు. ఇదొక్కటే కాదు.. కూర్చున్నా, బెడ్‌పై ఉన్నా, బయట ఎక్కడైనా తిరుగుతున్నా, నడుస్తూ వెళుతున్నా మొబైల్ ఫోన్ చేతిలోనే ఉంటోంది. కానీ ఇదే అతిపెద్ద సమస్యను తెచ్చిపెడుతోంది. ఫోన్ చూడటం కోసం మెడ వంచడం, చేతులను ఎక్కువ సేపు పైకెత్తి ఉంచడం, కూర్చున్నా, పడుకున్నా ఫోన్ చూడటం కోసం ఏదో ఓవైపు వంగిపోతుండటం, స్క్రోలింగ్, టైపింగ్ కోసం వేళ్లను విపరీతంగా వినియోగిస్తుండటం వంటి వాటితో ఎన్నో ఆరోగ్య సమస్యలు వస్తున్నాయి.

- సాక్షి, హైదరాబాద్

ఫోన్ వినియోగాన్ని పరిమితం చేయాలి



ఇటీవల భుజాల నొప్పులు, మణికట్టు బాధలు చాలా మందిలో గమనిస్తున్నాం. మొబైల్స్‌ని ప్రొఫెషనల్‌గా వాడేవారిలో బొటనవేలు మొద్దు బారడం సహా మరిన్ని సమస్యలు కనప డుతున్నాయి. పడుకునే భంగిమలో పుస్తకం చదివినట్టు ఫోన్ చూడడం సరికాదు. అలాగే వాష్‌రూమ్స్, టాయిలెట్స్‌లో కూడా వాడొద్దు. ఎలాపడితే అలా వాడ టం వల్ల భుజాల కండరాలు, చేతులు, మణికట్టు ఒత్తిడికి గుర వుతాయి. అయితే ఏది సరైన భంగిమ అనేది ఇప్పటివరకు స్పష్టత లేదు. కాబట్టి వీలైనంత వరకూ ఫోన్ వాడేటప్పుడు మధ్యలో విరామాలు తీసుకోవ డం, ఫోన్ వినియోగాన్ని పరి మితం చేయడం తప్పనిసరి.

– డాక్టర్ శివరాజు, జనరల్ ఫిజీషియన్, కిమ్స్ ఆస్పత్రి

అతిగా మొబైల్ వాడకం.. నిలబడే, కూర్చునే తీరులో లోపాలు

శారీరక భంగిమ సరిగా లేక మెడ, వెన్నెముక, కీళ్ల సమస్యలు

'టెక్ నెక్' సమస్య బారిన పడుతున్న టీనేజర్లు

- మెడపై భారం పెరిగి లిగమెంట్లు, కండరాలపై ప్రభావం
- కోలుకోలేని స్థాయిలో దెబ్బతింటున్న 'జాయింట్లు'
- ఫోన్ చూసేప్పుడు.. వెన్ను, మెడ నిటారుగా ఉంచడం మంచిదని నిపుణుల సూచనలు
- వీలైనంత వరకు మొబైల్ వినియోగాన్ని తగ్గించుకోవడమే మేలని స్పష్టీకరణ

టెక్ నెక్.. సమస్యతో..

స్మార్ట్‌ఫోన్‌తో గంటల కొద్దీ గడిపేవారు, ఇందులో ముఖ్యంగా టీనేజర్లు 'టెక్ నెక్', లేదా 'న్యూ కార్పల్ టన్నెల్ సిండ్రోమ్'తో బాధపడుతు న్నారని తాజా పరిశోధనలు గుర్తించాయి. దీని ద్వారా మెడ, వెన్నునొప్పితోపాటు తలనొప్పి, భుజాల నొప్పులు, చేతుల్లో జలదరింపు, కం డరాలు పటుత్వం కోల్పోవడం వంటి సమస్యలు తలెత్తుతున్నాయి. చాలాసేపు మెడ వంచి చూడటం వల్ల.. మెడలోని స్నాయువులు, కండరాలు, కీళ్లపై ఒత్తిడి పడుతోందని ఇండియన్ స్పైనల్ ఇంజూరీస్ సెంటర్ (ఐఎస్ఐఈ) మెడికల్ డైరెక్టర్ డాక్టర్ హెచ్ ఎస్ ఛబ్రా హెచ్చరించారు. దీర్ఘకాలికంగా, మెడ కం డరాలు అపసవ్యంగా సంకోచించడం వల్ల పుర్రెతో అనుసంధానమైన ఉన్నచోట మంట, నొప్పిని కలిగి స్తుందని.. ఈ నొప్పి ఫాసియా ద్వారా మెడ నుంచి తలకు వ్యాపిస్తుందని వివరించారు.

భంగిమ సరిగా లేక.. భారంగా..

మొబైల్‌ను చేతిలో పట్టుకు న్నప్పుడు కేవలం వేళ్లు మాత్రమే ఉపయోగిస్తున్నా మని అనుకుంటాం. కానీ మన చేతులు, మోచేయి, కం డరం, మెడ ఇవన్నీ వినియోగిస్తాం. మొబైల్‌ను చూస్తున్నప్పుడు మెడను కిందకు వంచుతాం. దీని వల్ల మెడ, వెన్నెముకపై ఒత్తిడి పడుతుంది. 'ఇంట ర్నేషనల్ జర్నల్ ఆఫ్ ఎన్విరాన్‌మెంటల్ హెల్త్ అం డ్ పబ్లిక్ హెల్త్' కథనం ప్రకారం.. ఇలా మెడ వంచి చూసే భంగిమ వల్ల వెన్నెముకపై తల బరువు పెరుగుతుంది. ''వాస్తవానికి తల నిటారుగా ఉన్న స్థితిలో దాదాపు 5–8 కిలోల బరువుపడుతుంది. తల వంగుతున్నప్పుడు 15 డిగ్రీల దగ్గర.. మెడపై భారం సుమారు 12 కిలోలు, 30 డిగ్రీల దగ్గర 18.14 కిలోలకు 45 డిగ్రీల దగ్గర 22.23 కిలోలకు 60డిగ్రీల దగ్గర 27.22 కిలోలకు పెరుగుతుంది. ఇలా మెడ అతిగా వంగడంతో వెన్నెముక, సపో ర్టింగ్ లిగమెంట్లు, కండరాలపై ప్రభావం పడు తుంది..'' అని ఆ కథనం స్పష్టం చేసింది.



నిపుణులు ఏమంటున్నారంటే?



హైదరాబాద్ మెట్రోలో సెల్ ఫోన్ చూస్తూ ఇలా..

- మెడ భుజం ముందుకు సాగి నప్పుడు.. ముందువైపు కండ రాలు బిగుతుగా మారుతూ, వెనుక వైపు బలహీనపడ తాయి. కండరాల అసమతు ల్యత ఏర్పడుతుంది. కాబట్టి మొబైల్ ఉపయోగిస్తు న్నప్పుడు భంగిమపై శ్రద్ధ చూపడం తప్పనిసరి.
- శరీర భంగిమ అనేది ఫిట్‌నెస్‌కు కీలకం. ట్రెడ్‌మిల్, క్రాస్ ట్రైనర్ వంటివాటి మీద ఉండగా.. మొబైల్ ఫోన్ వినియోగించడం వంటివి చేయవద్దు.
- నిలబడి ఉన్నప్పుడు, ఎవరికైనా మెసేజీలు పంపుతున్నప్పుడు తల పైకి, భుజాలు కిందకు ఉంచాలి. వీలైనంత వరకు మొబైల్‌ను కళ్లకు సమాంతరంగా ఉంచడం సరైన భంగిమ.
- కుర్చీలో లేదా సోఫాలో కూర్చున్నప్పుడు ఫోన్ చూస్తూ వంగిపోవడం ఏ విధం గానూ ఆరోగ్యకరం కాదు. వెన్ను నిటారుగా ఉంచి కూర్చోవాలి. ఫోన్ చూడటానికి లేదా టెక్స్ట్ చేయడాని కిగానీ మెడ ఎక్కువగా వంచకూడదు.
- పడుకున్నప్పుడు ఫోన్ పట్టుకోవడానికి.. మోచేతికి దిండు లేదా మరేదైనా మెత్తని దాన్ని ఆసరాగా తీసుకోవాలి.
- భోజనం చేసేప్పుడు, టీవీ చూస్తున్నప్పుడు, కంప్యూటర్ వినియోగిస్తూ, డ్రైవ్ చేస్తూ.. ఇలా పలు సందర్భాల్లో ఫోన్‌ను కూడా ఉపయోగించడమనే మల్టీ టాస్కింగ్ అటు శారీరకంగా, ఇటు మానసికంగా కూడా ఆరోగ్యానికి చేటు తెస్తుందని వైద్యులు స్పష్టం చేస్తున్నారు.

కీళ్లు శాశ్వతంగా దెబ్బతినే ప్రమాదం

ఫోన్ మాట్లాడే సమయంలో నిలబడే, కూర్చునే భంగిమలో లోపాలు మస్క్యులోస్కెలెటల్ సమస్యలకు కారణం అవుతున్నాయని.. గర్భా శయ, థొరాసిక్, నడుము ప్రాంతాలలో వెన్నెముక దెబ్బతినడంతో అనేక మంది ఇబ్బందిపడుతున్నారని వైద్యులు చెప్తున్నారు. సాధారణం గా కీళ్ల పనితీరు బాగున్నప్పుడు ఒత్తిడికి గురైనా, విశ్రాంతి సమయంలో మరమ్మతు అవుతాయని వివరిస్తున్నారు. కానీ కీళ్లను అసాధారణ భంగి మలో ఎక్కువసేపు ఉంచడం, ఒకే భంగిమలో ఎక్కువసేపు ఉంచడం వల్ల తీవ్రమైన ఒత్తిడి పడి.. అరిగిపోయి, తిరిగి బాగయ్యేందుకు అవ కాశం లేనంతగా దెబ్బతింటున్నాయని స్పష్టం చేస్తున్నారు.

బఫెలో హంప్ కనిపిస్తోంది



టెక్స్ట్ నెక్ సిండ్రోమ్, స్పైన్ పెయిన్ వంటివన్నీ మనం నిలబడే, కూర్చునే, శరీరాన్ని ఉంచే తీరులో సమస్య వల్లే తలెత్తుతున్నాయి. దీర్ఘకా లంపాటు తప్పుడు భంగిమ వల్ల మెడ అలై న్‌మెంట్ సాగిపోతుంది. దాదాపు 60, 70ఏళ్ల వయసులో సంభవించే మెడలు సాగిపోవడం, ఫ్రోజెన్ షోల్డర్, రౌండెడ్ షోల్డర్ వంటివి 40 ఏళ్ల వయసులోనే వచ్చేస్తున్నాయి. మొత్తంగా సహజమైన శరీర నిర్మాణాన్ని ఈ భంగిమ లోపాలు దెబ్బతీస్తున్నాయి. ఒకప్పుడు బాగా తలవం చుకుని పనిచేసే కొందరు బ్యాంకు ఉద్యోగులు వంటివారిలో ఎక్కువగా కనిపించే మెడ వెనకాల సెమీ సర్కిల్ ఇప్పుడు చాలామందిలో కనిపిస్తోం ది. బఫెలో హంప్‌గా పేర్కొనే దీన్ని నిర్లక్ష్యం చేస్తే తీవ్ర సమస్యలు తప్పవు. ఏదేమైనా భంగిమ లోపాలు సరిచేసుకుంటూనే ఫోన్ వాడకాన్ని వీలైనంత తగ్గించుకోవడమే ఉత్తమం.

– డాక్టర్ విజయ్ బత్తిన, ఉఛ్వాస్ ట్రాన్సిషనల్ కేర్

రాజకీయ అజెండాతోనే బొప్పరాజు ఉద్యమం

- ఆ ఉద్యమాల్లో మేం పాల్గొనం
- ప్రభుత్వం ఉద్యోగులకు అనేక ప్రయోజనాలు చేకూర్చింది
- వాటిని మరచి ఉద్యోగులను రెచ్చగొట్టడం తగదు
- ఏపీ రెవెన్యూ జేఏసీ చైర్మన్ వీఎస్ దివాకర్



సమావేశంలో మాట్లాడుతున్న వీఎస్ దివాకర్

సాక్షి, అమరావతి: బొప్పరాజు వెంకటేశ్వర్లు రాజ కీయ ప్రేరేపిత ఉద్యమాలు చేస్తూ ఉద్యోగులను పక్కదారి పట్టిస్తున్నారని ఏపీ రెవెన్యూ జేఏసీ చైర్మన్ వీఎస్ దివాకర్ విమర్శించారు. తాడేపల్లిలో ఆది వారం జరిగిన ఏపీ రెవెన్యూ జేఏసీ సభ్యసంఘాల కార్యవర్గ సమావేశంలో ఆయన మాట్లాడారు. ఏపీ జేఏసీ అమరావతి పేరుతో ప్రభుత్వంపై బొప్ప రాజు చేస్తున్న ఆందోళనలు రాజకీయాల్లో భాగమే నని విమర్శించారు. ఈ నెల 18, 25, 29 తేదీల్లో కలెక్టరేట్ల వద్ద ధర్నాలు చేపడతామని చెప్పడంలో రాజకీయ అజెండా ఉందన్నారు. ఈ నిరసన కార్య క్రమాల్లో ఏపీ రెవెన్యూ జేఏసీ పాల్గొనడం లేదని చెప్పారు. ప్రభుత్వం ఉద్యోగులకు అనేక ప్రయోజ నాలు చేకూర్చిందని తెలిపారు. మరెన్నో ప్రయో జనాలు త్వరలోనే చేకూరుస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. బొప్పరాజు ఉద్యమాల పట్ల రాష్ట్రం లోని ఉద్యోగులందరూ అప్రమత్తంగా ఉండాలని కోరారు. రాష్ట్రంలో అవుట్ సోర్సింగ్ ఉద్యోగుల కోసం వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం రాగానే ఒక ప్రభు త్వరంగ కార్పొరేషన్ ఏర్పాటు చేసి ప్రతి నెల ఒకటో తేదీన జీతాలు చెల్లిస్తోందని గుర్తుచేశారు. అవుట్ సోర్సింగ్ ఉద్యోగులంతా సీఎం జగన్ పట్ల పూర్తి కృ తజ్ఞతతో ఉన్నా, వారిని రెచ్చగొట్టి కలెక్టరేట్ల వద్ద ధర్నాలకు పిలుపు ఇవ్వడం బొప్పరాజుకు తగదని చెప్పారు. గతంలో ఉద్యోగ భద్రత లేకుండా 7 లేదా 9 నెలలకు ఒకసారి జీతాలు ఇచ్చినప్పుడు బొ ప్పరాజు ఏమయ్యాడని ప్రశ్నించారు. రెవెన్యూ శాఖలో అన్ని తరగతుల ఉద్యోగుల నుంచి డిప్యూటీ కలెక్టర్ల వరకు ప్రభుత్వం పదోన్నతులు కల్పించిం దని చెప్పారు. గ్రామ రెవెన్యూ సహాయకులకు గ్రామ రెవెన్యూ అధికారులుగా, గ్రామ రెవెన్యూ అధికారులకు సీనియర్ సహాయకులుగా, తహశీల్దా ర్లకు డిప్యూటీ కలెక్టర్లుగా పదోన్నతులు కల్పించిన విషయాన్ని మరువరాదన్నారు. ప్రతి ఉద్యోగికి ప్రతి నెలా సక్రమంగా జీతాలు వస్తున్నప్పటికీ జీతాలు చెల్లించడం లేదని ఉద్యోగులను రెచ్చగొట్టడాన్ని ఖండిస్తున్నట్లు చెప్పారు. ఈ ప్రభుత్వం వైద్యశా ఖలో సుమారు 50 వేలకుపైగా నియామకాలు చే సిందని, గ్రామ, వార్డు సచివాలయాల ద్వారా లక్షా 60 వేల ఉద్యోగాలు కల్పించి ప్రొబేషన్‌ను డిక్లేర్ చేసిందని, 1998 డీఎస్సీ క్వాలిఫైడ్ అభ్యర్థులు 4 వేల మందికి నియామక పత్రాలు ఇచ్చిందని, ఆర్టీసీ ఉద్యోగులను ప్రభుత్వ ఉద్యోగులుగా మార్చిందని వివరించారు. కోవిడ్ కష్టకాలంలో ఆర్టీసీ బస్సులు తిరగకపోయినా జీతాలు సక్రమంగా చెల్లించిన ఘనత సీఎం జగన్‌దేనని చెప్పారు. ప్రభుత్వం ఉద్యోగులకు అన్ని రకాల ప్రయోజనాలు కల్పిస్తున్న ప్పటికీ బోగస్ ప్రచారానికి తెరలేపి పబ్బం గడుపు కోవాలని చూస్తున్న బొప్పరాజు ఇకనైనా ఉద్యోగుల మనోభావాలతో ఆడుకోవడం ఆపాలని ఆయన కోరారు. ఏపీ వీఆర్ఏ అసిస్టెంట్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు జి.ధైర్యం, ఏపీ రెవెన్యూ కంప్యూ టర్ ఆపరేటర్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు సూరిబాబు, ఏపీ డైరెక్ట్ వీఆర్ఏ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు పి.జోసెఫ్, ఏపీ సర్వేయర్స్ అసోసియే షన్ రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రెటరీ డి.సాయిబాబు, ఏపీ వీఆర్ఏ అసోసియేషన్ రాష్ట్ర జనరల్ సెక్రెటరీ సత్య రాజు, రాష్ట్రం నలుమూలల నుంచి వచ్చిన వివిధ సంఘాల అధ్యక్షులు, కార్యదర్శులు పాల్గొన్నారు.

పేదరికంలేని రాష్ట్రాన్ని చూడాలని ఉంది

- అధికారంలోకి వచ్చిన వెంటనే ప్రత్యేక బీసీ రక్షణ చట్టం తెస్తాం
- రాయలసీమను హార్టికల్చర్ హబ్‌గా మారుస్తాం
- రాయలసీమ దాటేలోపు సీమ అభివృద్ధిపై బ్లూప్రింట్
- యువగళం యాత్రలో బీసీలతో లోకేశ్ ముఖాముఖి

కర్నూలు (అగ్రికల్చర్): ప్రజలు ఎప్పటికీ పేదరికం లోనే ఉండాలనేది జగన్ ఆలోచన అని, పేదరికం లేని రాష్ట్రం చూడాలని తన కోరిక అని నారా లోకేశ్ అన్నారు. టీడీపీ అధికారంలోకి వచ్చిన వెంటనే బీసీలకు స్వర్ణయుగం తెస్తామని, బీసీలకు పుట్టినిల్లు టీడీపీ అని.. బీసీలకు రాజకీయ, ఆర్థిక స్వాతంత్ర్యం వచ్చింది టీడీపీ వల్లేనని ఆయన చెప్పారు. యువగళం పాదయాత్ర ఆదివారం ఆదోని నియోజకవర్గంలో సాగింది. కుప్పగల్ విడిది కేంద్రం వద్ద బీసీ సామాజికవర్గం ప్రతినిధులతో ఆయన ముఖాముఖి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా లోకేశ్ మాట్లాడుతూ.. టీడీపీ అధికారంలోకి వచ్చిన వెం టనే ప్రత్యేక బీసీ రక్షణ చట్టాన్ని తీసుకొస్తామన్నారు. ఇక తమ పార్టీ అధికారంలోకి వచ్చిన వెంటనే కురుబ సామాజికవర్గం వారికి గొర్రెలు కొనడానికి రుణాలిస్తామన్నారు. అలాగే, రాయలసీమ ప్రాంతాన్ని హార్టీకల్చర్ హబ్‌గా మారుస్తామని.. ప్రతి ఇంటికి కుళాయి ద్వారా తాగునీటిని అందిస్తామని.. పెండింగ్‌లో ఉన్న సాగునీటి ప్రాజెక్టులను పూర్తిచేసి వ్యవసాయానికి సాగునీరు అందిస్తామని ఆయన చెప్పారు. అం తేకాక.. తన పాదయాత్ర రాయలసీమ దాటేలోపు రాయలసీమ అభివృద్ధిపై బ్లూప్రింట్ విడుదల చేస్తామని లోకేశ్ తెలిపారు.

27 ఉత్తమ పంచాయతీలకు రాష్ట్రస్థాయి అవార్డులు

తొమ్మిది విభాగాల్లో మూడేసి పురస్కారాలు

- జాతీయ పంచాయతీరాజ్ దినోత్సవం సందర్భంగా నేడు పంపిణీ
- ప్రతి జిల్లాలోను 27 పంచాయతీలకు జిల్లాస్థాయి పురస్కారాలు

సాక్షి, అమరావతి: జాతీయ పంచాయతీరాజ్ దినో త్సవాన్ని పురస్కరించుకొని 27 గ్రామ పంచాయతీ లను రాష్ట్రస్థాయి పురస్కారాలకు ప్రభుత్వం ఎంపిక చేసింది. రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖ కమిషనర్ కార్యాలయంలో సోమవారం నిర్వహించే వేడుకల్లో ఆయా పంచాయతీలకు పురస్కారాలను అంద జేస్తారు. పరిపాలనలో కొన్ని అంశాల్లో గ్రామ పం చాయతీలకు స్వయం ప్రతిపత్తి కల్పిస్తూ పార్లమెం ట్ చేసిన 73వ రాజ్యాంగ సవరణ అమల్లోకి వచ్చిన సందర్భంగా ఏటా ఏప్రిల్ 24వ తేదీన దేశవ్యాప్తం గా జాతీయ పంచాయతీరాజ్ దినోత్సవం జరుపుకో వడం ఆనవాయితీగా వస్తోంది. ఆ రోజున ప్రతి పం చాయతీలో ప్రత్యేక గ్రామసభ నిర్వహించి సమ స్యలు, చేపట్టాల్సిన అభివృద్ధి కార్యక్రమాలపై చర్చి స్తారు. జాతీయ పంచాయతీరాజ్ దినోత్సవాన్ని పురస్కరించుకుని రాష్ట్రంలో 26 జిల్లాల్లోను ఆ జిల్లా పరిధిలో కూడా తొమ్మిది ప్రధాన అంశాల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన మూడేసి పంచాయతీల చొప్పున 27 పంచాయతీలకు జిల్లాస్థాయి పురస్కారాలు పం పిణీ చేయాలని పంచాయతీరాజ్ శాఖ ఇప్పటికే అన్ని జిల్లాల జెడ్పీ సీఈవోలు, డీపీవోలకు సూచించింది.

30 ఏళ్లు పూర్తి.. మధ్యప్రదేశ్‌లో ప్రధాని కార్యక్రమం

73వ రాజ్యాంగ సవరణ అమల్లోకి వచ్చి 30 ఏళ్లు పూర్తవుతున్న సందర్భంగా కేంద్ర పం చాయతీరాజ్ శాఖ ఈ ఏడాది జాతీయ పంచా యతీరాజ్ దినోత్సవాన్ని మరింత ఘనంగా నిర్వహించనుంది. మధ్యప్రదేశ్‌లోని రేవ గ్రామ పంచాయతీలో జరిగే జాతీయ పం చాయతీరాజ్ వేడుకల్లో ప్రధాని నరేంద్రమోదీ పాల్గొని దేశవ్యాప్తంగా గ్రామీణ స్థానికసంస్థల ప్రజాప్రతినిధులు, ఇతర బాధ్యులను ఉద్దేశిం చి ప్రసంగిస్తారని కేంద్ర పంచాయతీరాజ్ శాఖ వెల్లడించింది. ప్రధాని కార్యక్రమాన్ని దేశవ్యా ప్తంగా అన్ని పంచాయతీల్లో ప్రత్యక్ష ప్రసారా నికి అవకాశం కల్పించాలని ఆయా రాష్ట్రాల పంచాయతీరాజ్ శాఖ కార్యదర్శులకు కేంద్ర పంచాయతీరాజ్ శాఖ ఎకనమిక్ అడ్వయిజర్ బిజయకుమార్ బెహరా లేఖ రాశారు.

రాష్ట్రస్థాయి ఉత్తమ పంచాయతీ అవార్డులకు ఎంపికైన గ్రామాలు.. విభాగాల వారీగా (బ్రాకెట్‌లో ఆ పంచాయతీ ఉన్న మండలం, జిల్లా పేరు)

పేదరిక నిర్మూలన–ఉపాధి అవకాశాలు కల్పన
1. గంగిరెడ్డిపల్లి (వీఎన్‌పల్లి, వైఎస్సార్),
2. రాచర్ల (రాచర్ల, ప్రకాశం),
3. మల్లూరు (ముత్తుకూరు, శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు)

హెల్దీ పంచాయతీ
1. తరువ (దేవరపల్లి, అనకాపల్లి)
2. భీమవరం (హుకుంపేట, అల్లూరి సీతారామరాజు),
3. నడింపాలెం (పత్తిపాడు, గుంటూరు)

చైల్డ్ ఫ్రెండ్లీ పంచాయతీ
1. కసిపాడు (పెదకూరపాడు, పల్నాడు),
2. నేలమూరు (పెనుమంట్ర, పశ్చిమగోదావరి),
3. కుంతముక్కల (జి.కొండూరు, ఎన్టీఆర్)

వాటర్ సఫిషియెంట్ పంచాయతీ
1. ఇల్లూరు కొత్తపేట (బనగానపల్లి, నంద్యాల),
2. వి.వి.కండ్రిక (కోడూరు, అన్నమయ్య),
3. ధూపాడు (త్రిపురాంతకం, ప్రకాశం)

క్లీన్ అండ్ గ్రీన్ పంచాయతీ
1. కడలూరు (తడ, తిరుపతి),
2. బిల్లనందూరు (కోటనందూరు, కాకినాడ),
3. జోగింపేట (సీతానగరం, పార్వతీపురం మన్యం)

సెల్ఫ్ సఫిషియెంట్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ పంచాయతీ
1. నందిగాం (నందిగాం, శ్రీకాకుళం),
2. కట్టకిందపల్లి (అనంతపురం రూరల్, అనంతపురం),
3. సూరప్పగూడెం (భీమడోలు, ఏలూరు)

సోషియల్లీ సెక్యూర్డ్ పంచాయతీ
1. వెస్ట్ పెద్దివారిపాలెం (యద్దనపూడి, బాపట్ల),
2. మందగేరి (ఆదోని, కర్నూలు),
3. రామభద్రాపురం (రామభద్రాపురం–విజయనగరం)

పంచాయతీ విత్ గుడ్‌గవర్నెన్స్
1. సఖినేటిపల్లిలంక (సఖినేటిపల్లి, బీఆర్ అంబేడ్కర్ కోనసీమ),
2. నగరపాలెం (భీమునిపట్నం, విశాఖపట్నం),
3. చోరగుడి (పమిడిముక్కల, కృష్ణా)

ఉమెన్ ఫ్రెండ్లీ పంచాయతీ
1. మేడాపురం (సీకేపల్లి, శ్రీసత్యసాయి),
2. జేగురపాడు (కడియం, తూర్పు గోదావరి),
3. మార్టూరు (అనకాపల్లి, అనకాపల్లి)

'మైత్రీ'లో వాటా నిరూపిస్తే రాజకీయ సన్యాసం

- ఐటీ దాడులను మాకు అంటగట్టడం దుర్మార్గం
- ప్రశ్నించే పవన్ కళ్యాణ్ ఈ ఆరోపణలపై నిగ్గు తేల్చాలి
- నిరాధార వార్తలపై రూ.10 కోట్లకు పరువు నష్టం దావా
- 'ఈనాడు' తప్పుడు రాతలపై బాలినేని మండిపాటు



విలేకరులతో మాట్లాడుతున్న బాలినేని శ్రీనివాసరెడ్డి

ఒంగోలు :మైత్రీ మూవీస్‌లో తనకు, తన వియ్యం కుడికి ఒక్క రూపాయి పెట్టుబడులు ఉన్నట్లు నిరూపిస్తే తమ ఆస్తులు రాసివ్వడంతో పాటు రాజకీయ సన్యాసం చేయడానికి సిద్ధమని మాజీ మంత్రి, వైఎస్సార్‌సీపీ రీజినల్ కో ఆర్డినేటర్, ఒం గోలు ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆదివారం ఆయన తన నివాసంలో మీడియా సమావేశంలో మాట్లాడారు. మైత్రీ మూవీస్‌పై ఐటీ దాడుల నేపథ్యంలో వాటిని తమకు అంటగట్టడం దుర్మార్గం అని ధ్వజమెత్తారు. మైత్రీ మూవీస్‌లో పెట్టుబడులు ఉండబట్టే ఒం గోలులో వీరసింహారెడ్డి ప్రీ రిలీజ్ ఫంక్షన్‌కు స్థల అనుమతి ఇప్పించినట్లు పేర్కొనడం దారుణం అన్నారు. 'ఈ చిత్ర దర్శకుడిది ఒంగోలు నియోజకవర్గం. ప్రీ రిలీజ్ ఫంక్షన్ ప్రజలకు వినోదం అందించేది. దానిని రాజకీయ కోణంలో చూడడం సరికాదు. అది పవన్ కళ్యాణ్ సినిమా అయినా సాయం చేస్తాం' అని చెప్పారు. 'విశాఖలో మా వియ్యంకుడు అటవీ భూములు ఆక్రమించారని రోత రాతలు రాస్తున్నారు. సెంటు భూమి ఆక్రమణ ఉంటే చూపించండి. జనసేన కార్పొరేటర్ మూర్తి ఆరోపించడం.. ఆ వెంటనే ఈనాడు మెయిన్‌లోనే కాకుండా జిల్లాలోను దానికి మరో కథనాన్ని జోడిం చి అచ్చేయడం చూస్తుంటే నన్ను టార్గెట్ చేసి వార్తలు రాస్తున్నారని అర్థమవుతోంది. ఆయన 2004లో ఆ భూములు కొన్నారు. 2011లో మాకు వియ్యంకుడు అయ్యారు. ఈ వాస్తవాలు విస్మరించి నేను మంత్రిగా ఉన్నప్పుడు (2019) రిజిస్ట్రేషన్ చేయించారని రాయడాన్ని ఏమనాలి? ఒక సెంట్ ఫారెస్ట్ భూమిని రిజిస్ట్రేషన్ చేయడం ఎక్కడైనా చూశామా? ఎవరి కోసం ఈ తప్పుడు రాతలు? వీటి వెనుక ఎవరున్నారో తెలుసు. దమ్ముంటే నేరుగా రాజకీయాలు చేయాలి. కొత్తపట్నం మం డలం రాజుపాలెంలో ఎస్సీల భూముల్లో అక్రమం గా రొయ్యల వ్యాపారం లెక్కలన్నీ బయటకు తీస్తాం' అని హెచ్చరించారు.

పవన్ కళ్యాణ్.. మీరే తేల్చండి

'ప్రశ్నిస్తానంటున్న పవన్‌కళ్యాణ్ నిజం ఏమిటో నిగ్గు తేల్చాలి. పవన్‌కు మైత్రీ మూవీస్ వారితో పరిచయాలు ఉండి ఉంటాయి. నాకు, నా వియ్యం కుడికి అందులో ఒక్క రూపాయి పెట్టుబడి ఉన్నా బయట పెట్టాలి. నిరూపిస్తే నేను చేసిన సవాల్‌కు సిద్ధంగా ఉన్నా. లేదంటే తప్పుడు ఆరోపణలు చేస్తున్న జనసేన కార్పొరేటర్ మూర్తిపై చర్యలు తీసుకోవాలి. పదే పదే నిందలు వేస్తుండటంపై రూ.పది కోట్లకు పరువు నష్టం దావా వేస్తాం' అని బాలినేని తెలిపారు.

కోరిక తీర్చలేదని కాగుతున్న నూనె పోశాడు

- ఇంట్లో బంధించి లైంగిక దాడికి తెగబడ్డాడు
- ఇంజనీరింగ్ విద్యార్థినిపై యువకుడి ఘాతుకం
- ఏలూరు జిల్లాలో ఘటన

ఏలూరు టౌన్: ప్రేమిస్తున్నానంటూ ఇంజనీరింగ్ విద్యార్థిని వెంటపడ్డాడు. పెళ్లి చేసుకుంటానని నమ్మించి ఇంటికి తీసుకెళ్లాడు. కోరిక తీర్చాలంటూ బలవంతం చేశాడు. అందుకు ఆ యువతి నిరాకరిం చడంతో పూటుగా మద్యం సేవించి విరుచుకు పడ్డాడు. వేడివేడి నూనె తెచ్చి ఆమెపై పోసి.. ఆనక గదిలో బంధించి ఆమెపై పలుమార్లు లైంగిక దాడికి పాల్పడ్డాడు. ఏలూరు జిల్లా పెదవేగి మండలం దుగ్గిరాల గ్రామంలో చోటుచేసుకున్న ఈ ఘటన ఆదివారం వెలుగులోకి వచ్చింది. బాధితురాలు ప్రస్తుతం ఏలూరు బోధనాస్పత్రిలో చికిత్స పొందు తోంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. పెదవేగి మండలం దుగ్గిరాల గ్రామానికి చెందిన యువతి కాకినాడ జేఎన్టీయూలో ఇంజనీరింగ్ మూడో సంవత్సరం చదువుతోంది. ఆమె తండ్రి ఆటో నడుపుతుండగా.. తల్లి, సోదరి ఉన్నారు. కాగా.. అదే గ్రామానికి చెందిన సదర్ల అనుదీప్ ప్రేమిస్తున్నానంటూ నాలుగేళ్లుగా తరచూ ఆమె వెంట పడుతున్నాడు.

పెళ్లి చేసుకుంటానని నమ్మించి.. ఇంట్లో బంధించి..

ఈ నెల 9న యువతికి ఫోన్ చేసి ఆమెను పెళ్లి చేసుకుంటానని నమ్మించాడు. ఆ తరువాత కాకి నాడ వెళ్లి హాస్టల్‌లో ఉంటున్న ఆమెను తన ఇంటికి తీసుకెళ్లి బంధించాడు. రాత్రి సమయంలో తన కోరిక తీర్చాలని బలవంతం చేయటంతో ఆమె నిరా కరించింది. మరుసటి రోజు అనుదీప్ మద్యం సేవించి వచ్చి కోరిక తీర్చాలని వేధించినా.. ఆమె వినకపోవటంతో కోపంతో ఊగిపోయాడు. ఇంట్లో మరుగుతున్న నూనెను ఆమె కాళ్లు, చేతులపై పోయటంతో తీవ్రంగా గాయాలయ్యాయి. ఆ తరు వాత బంధించిన గదిలో ఆమెపై పలుమార్లు లైంగిక దాడికి పాల్పడ్డాడు. ఆదివారం ఉదయం యువతిని చంపేస్తానని బెదిరించి, గొంతు నులిమేందుకు ప్రయత్నించగా ఆమె తప్పించుకుని తండ్రికి ఫోన్ చేసి విషయం చెప్పింది. దీంతో అతడు కిశోర్ అను దీప్ ఇంటికి వెళ్లి ఆమెను విడిపించి ఏలూరు ప్రభుత్వ బోధనాస్పత్రికి తరలించాడు. చేతులు, కాళ్లపై తీవ్ర గాయాలు కావటంతో వైద్యులు ఆమెకు చికిత్స అందిస్తున్నారు. అనుదీప్ చెడు వ్యసనాలకు బానిసగా మారి.. అమ్మాయిలను ఇలా ట్రాప్ చేస్తుంటాడని స్థానికులు చెబుతున్నారు. యువతి తండ్రి ఫిర్యాదు మేరకు ఏలూరు త్రీటౌన్ సీఐ కేవీ ఎస్ వరప్రసాద్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేప ట్టారు. అనుదీప్‌ను అదుపులోకి తీసుకుని విచారణ చేస్తున్నట్టు సమాచారం.

Published and printed by V. Murali on behalf of Jagati Publications Limited, Published from Vishnu Motor Plaza,2nd Floor, 31-A, Jawaharlal Nehru Road, Ekkattuthangal, Chennai -600 032 and Printed MNS Printers Private Limited, Survey no. 76/1, Noombal Village, Velappanchavadi, Poonamallee High Road, Chennai - 600 077. Jagati Publications Limited, Survey No.172, Vegata Village, Jadigenalhalli, Hoskote Taluk,Bangaluru Rural Dist, Impression Printing & Packaging Limited, C-18-19-20, Sector -59, Noida, Uttar Pradesh-201 301, Dangat Media Pvt Ltd.,22 Dighe MIDC, Navi Mumbai, Maharashtra- 400708. Editor: V. Murali, (Responsible for selection of News under the PRB Act) RNI No:TNTEL/2008/25943 Reproduction in whole or in part without written permission of the publisher is prohibited.